ఈనాడు

విజయవాడ 4-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 114 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 4-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 114
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పౌర అణు ఇంధన రంగంలో

మరింత సహకారం

కొత్త ఒప్పందం కుదుర్చుకోనున్న భారత్, రష్యా!

నేడే పుతిన్ రాక

మోదీతో రేపు శిఖరాగ్ర సమావేశం

దిల్లీ: పౌర అణు ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని భారత్, రష్యా మరింత పెంచుకోనున్నాయి. ఇందుకోసం కొత్త ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు భారత్‌తో పౌర అణు సహకారంపై అవగాహన ఒప్పందానికి రష్యా పార్లమెంటు దిగువ సభ 'డ్యూమా' తాజాగా ఆమోదం తెలిపింది. (మిగతా 3లో)

దివ్యాంగులకు ఇంద్రధనుస్సు

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

రాయితీ రుణ పథకం పునరుద్ధరణ

బహుళ అంతస్తుల గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు

వినికిడి లోపం వారికి బాపట్లలో ప్రత్యేక డిగ్రీ కళాశాల

ఏడు వరాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు



విజయవాడలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో.. అంధ మహిళా టీ20 ప్రపంచకప్ సాధించిన క్రికెట్ జట్టు సభ్యులైన దీపికను, కరుణ కుమారిని సన్మానించిన చంద్రబాబు

ఈనాడు - అమరావతి

దివ్యాంగులపై ముఖ్యమంత్రి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. 'ఇంద్రధనుస్సు' పేరుతో 7 వరాలను ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు-పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని వెల్లడించారు. ఎన్నికల్లో ఎవరూ గెలవకపోతే ఎక్స్‌అఫీషియో మెంబర్ పదవిని కేటాయిస్తామన్నారు. వారు రాజకీయాల్లో రాణించి ప్రజాసేవ చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 'దివ్యాంగులకు ప్రత్యేక ఆర్థిక రాయితీ రుణ పథకాన్ని పునరుద్ధరిస్తాం. ఇందుకు రూ.19 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశాం. శాప్ ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, టాలెంట్ డెవలప్‌మెంట్ పథకాలను అందుబాటులోకి తీసుకొస్తాం. బహుళ అంతస్తుల ప్రభుత్వ గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఇళ్లు కేటాయిస్తాం. వినికిడి లోపం ఉన్న వారికి బాపట్లలో ప్రత్యేక డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం. గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో చదివే దివ్యాంగ విద్యార్థులకు అక్కడే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తాం. అన్ని జిల్లాలతోపాటు అమరావతిలో (మిగతా 3లో)

అమరావతికి చట్టబద్ధత



రాష్ట్ర విభజన చట్టం 2014కు సవరణ

న్యాయశాఖ ఆమోదముద్ర

కేంద్ర మంత్రివర్గ ఆమోదం తర్వాత.. పార్లమెంటు ముందుకు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ మొదలైంది. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలోని 5(2)కి సవరణ చేసేందుకు కేంద్రం కొద్దిరోజుల కిందటే చర్యలు ప్రారంభించింది. దీనికి ఇప్పటికే న్యాయశాఖ ఆమోదముద్ర లభించింది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత.. త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ ఆమోదం తర్వాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజపత్రం (గెజిట్) విడుదల చేస్తారు. విభజన తర్వాత ఏపీ రాజధానిగా అమరావతిని తెదేపా ప్రభుత్వం ఎంపికచేసింది. 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. తెదేపా ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో.. అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. 2024లో కూటమి అధికారంలోకి (మిగతా 3లో)

విద్యుత్తు ఛార్జీలు పెంచేది లేదు

- అందరి మార్గం ప్రకృతి సేద్యం కావాలి
- భూగర్భ జలాల పెంపుతోనే కరవుకు పరిష్కారం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- నల్లజర్లలో 'రైతన్నా మీకోసం' సభలో సీఎం

3లో

ఎప్పటికైనా అందరి మార్గం ప్రకృతి సేద్యం కావాలి. ఎరువులతో క్యాన్సర్ ముప్పు ఉంటుంది. రాష్ట్రంలో 49లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారు. ఏ పంటలు వేయాలి? ఏది వేస్తే ఆదాయం వస్తుంది? అంతరపంటలు ఎప్పుడు వేయాలో తెలియాలి. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తే ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా ప్రోత్సాహకాలిస్తాం.

- సీఎం చంద్రబాబు



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే వెంకటరాజు, కలెక్టర్ కీర్తి చేకూరి, మంత్రి కందుల దుర్గేష్

రూ.21 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

రాష్ట్ర ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

లోపలి పేజీలో

జనసేన 'పంచ'సూత్ర

పంచాయతీ నుంచి లోక్‌సభ స్థానం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు

- ఒకరు లేదా ఇద్దరు వీరమహిళలకు స్థానం
- పార్టీ నిర్మాణం, ఆయా ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యం
- అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్దేశం



ఈనాడు, అమరావతి: 'జనసేన నాయకులు, శ్రేణులు .. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. వారి ప్రాంత అభివృద్ధిలో, అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా శ్రేణులను ముందుకు తీసుకెళ్దాం' అని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. జనసేన కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామ, మండల, శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిల్లో ఐదుగురు సభ్యులతో కమిటీలు నియమించాలన్నారు. వారిని పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు అభివృద్ధి పనుల్లోనూ భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ప్రతి కమిటీలోనూ మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అని, ఒకరు లేదా ఇద్దరు వీరమహిళలకు స్థానం కల్పించాలని నిర్దేశించారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించామని, పనితీరును మదింపు చేసి, ఆ ప్రకారం ఇతర కమిటీలు (మిగతా 3లో)



ఎదురుకాల్పుల్లో మరణించిన జవాన్లు మోను వడాడి, దుకారు గోండె



మరణించిన కమాండర్ మొడియం వెల్ల

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్లు మృతి

మృతుల్లో పీఎల్‌జీఏ కంపెనీ నంబరు-2 కమాండర్ వెల్ల

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో బుధవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనలో ముగ్గురు డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లు సైతం మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ... "బీజాపుర్ జిల్లా గంగలూర్ పోలీసుస్టేషన్ పరిధి పశ్చిమ బస్తర్ ప్రాంతంలోని భైరమ్‌గఢ్ అడవుల్లో పెద్దసంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో రెండు జిల్లాల నుంచి డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్), కోబ్రా బృందాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు కాల్పులు జరగగా... 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు మాకు సమాచారం అందింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఎదురుకాల్పుల్లో బీజాపుర్ జిల్లా డీఆర్‌జీ జవాన్లు మోను వడాడి, దుకారు గోండె, రమేశ్ సోడి మరణించారు. సంఘటన ప్రాంతం నుంచి మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఎల్ఎంజీ మెషిన్ గన్, ఏకే-47 రైఫిల్, ఎస్ఎల్ఆర్, (మిగతా 3లో)

మద్యం లంచాల సొమ్ము

మనీ లాండరింగ్ చేసింది పల్గోట సోదరులే

అప్పట్లో వారిని సంప్రదించిన ఏపీకి చెందిన రాజకీయ నాయకులు, పలుకుబడి గల వ్యక్తులు


రూ.100 కోట్లు రూటింగ్ చేయాలని ఆదేశం

ప్రతిగా 4% కమీషన్ ● అందులో 0.25% అనిల్‌చోఖ్రాకు

ముంబయి వ్యాపారి రోణక్ రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

ఈనాడు, అమరావతి: జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో వైకాపా ముఠా కొల్లగొట్టిన లంచాల సొమ్ములో రూ.78 కోట్లు ముంబయికి చెందిన చాముండ బులియన్ యజమాని జస్‌రాజ్ పల్గోట అలియాస్ పూనం భాయ్, అతని కుమారులు చేతన్‌కుమార్ పల్గోట (ఏ-50), రోణక్‌కుమార్ పల్గోట (ఏ-51) రూటింగ్ చేశారని సిట్ దర్యాప్తులో తేలింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ నాయకులు, అత్యంత పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు మనీ లాండరింగ్ కోసం అప్పట్లో వీరిని సంప్రదించి.. అందుకు ప్రతిగా 4 శాతం కమీషన్ చెల్లించినట్లు వెల్లడైంది. పల్గోట సోదరులు ముంబయికి చెందిన అనిల్ చోఖ్రా (ఏ-49) ద్వారా పలు డొల్ల కంపెనీల ఏర్పాటు, వాటి పేరిట బ్యాంకు ఖాతాలు తెరవటం, నకిలీ ఇన్వాయిస్‌లు, బిల్లులు సృష్టించడం వంటివి చేశారని నిర్ధారణైంది. ప్రతిగా చోఖ్రాకు 0.25 శాతం కమీషన్ చెల్లించేవారని సిట్ గుర్తించింది. మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి (ఏ-1), ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ-7)ల నియంత్రణ, ఆధీనంలో నడిచిన అదాన్, లీలా, ఎస్పీవై డిస్టిలరీల నుంచి అనిల్ చోఖ్రాతో పల్గోట సోదరులు ఏర్పాటు చేయించిన డొల్ల కంపెనీల ఖాతాల్లోకి అనేక దఫాలుగా రూ.78 కోట్లు జమ కాగా.. అతను ఆ సొత్తును ఎప్పటికప్పుడు విత్‌డ్రా చేసి చేతన్, రోణక్‌కుమార్‌లకు అందజేసేవాడని, కొన్ని సందర్భాల్లో నగదుగా కాకుండా నేరుగా వారికి సంబంధించిన వివిధ బులియన్ సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము పంపించేవాడని తేల్చింది. చేతన్, రోణక్‌లు (మిగతా 3లో)

ఇదీ సంగతి!



కలిసే ఉన్నారని తెలియడానికి అనుకుంట... ఒకటే దోశను ఇద్దరూ తింటున్నారు!

గిరిజన బాలల నైపుణ్యాలను వెలికితీసే

ఉద్భవ్

ఏకలవ్య గురుకులాల్లో క్రీడలు, సంస్కృతి, కళలకూ పెద్దపీట

- ప్రభుత్వ చొరవతో ఏపీలో వేడుకలు
- కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయెల్ ఓరం



వేడుకలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జుయెల్ ఓరం. చిత్రంలో ఏపీ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, జాయింట్ కమిషనర్ బిపిన్ చంద్ర, కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: గిరిజన విద్యార్థుల నైపుణ్యాల్ని వెలికితీసేందుకే ఉద్భవ్-2025 సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయెల్ ఓరం స్పష్టంచేశారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు గిరిజన బిడ్డలకు విద్యను అందించడానికే పరిమితం కావట్లేదని, వారికి క్రీడలు, సంస్కృతి, కళలు, నృత్యం, నాటకం, తదితరాలనూ అందిస్తున్నాయని తెలిపారు. రాజధాని అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీలో బుధవారం 6వ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల సాంస్కృతిక ఉత్సవాలు (ఉద్భవ్-2025) అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేంద్రమంత్రి జుయెల్ ఓరం ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్ని ప్రారంభించారు. రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, (మిగతా 3లో)



ముగ్గురిని బలిగొన్న అతి వేగం!

తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాద దృశ్యమిది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు ఒక బాలుడు మృతి చెందారు. వారంతా కారులో సత్తుపల్లి వస్తూ మార్గమధ్యలోని కిష్టారం అంబేడ్కర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నామవరపుకోటకు చెందిన కారు పూర్తిగా దెబ్బతింది. మితిమీరిన వేగమే ప్రాణాలు తీసినట్లు భావిస్తున్నారు. - న్యూస్‌టుడే, సత్తుపల్లి

రాజీనామాను ఆమోదించకపోవడం వెనుక తాడేపల్లి పెద్దల ఆదేశాలున్నాయా?

శాసనమండలి ఛైర్మన్‌కు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రశ్న

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి తాను చేసిన రాజీనామాను ఆమోదించకుండా... రాజీనామాను వెనక్కు తీసుకోవాలని శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు సంభాషించి ఒత్తిడి చేయడం వెనుక తాడేపల్లి పెద్దల ఆదేశాలున్నాయా? అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రశ్నించారు. తన రాజీనామాను ఆమోదించకుండా ఛైర్మన్ కాలయాపన చేయడం అవమానకరంగా ఉందని బుధవారం ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "స్వయంగా ఛైర్మన్‌ను కలిసి అడిగినా ఇప్పటివరకూ రాజీనామాను ఆమోదించలేదు. రాజీనామాపై వెంటనే చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించినా.. ఛైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. శాసనమండలి ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారు. నా రాజీనామాను ఆమోదించకపోతే ఛైర్మన్‌పై న్యాయపోరాటం చేస్తా" అని ప్రకటించారు.

జగన్ పెత్తందారీ పోకడలకు నిరసనగా రాజీనామా చేశా: బల్లి కల్యాణ చక్రవర్తి

ఈనాడు, అమరావతి: జగన్ పెత్తందారీ పోకడలకు నిరసనగానే.. వైకాపా ద్వారా తనకు వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని బల్లి కల్యాణ చక్రవర్తి మరో ప్రకటనలో వెల్లడించారు. "గతేడాది ఆగస్టు 30న రాజీనామా చేస్తే శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు ఇప్పటివరకూ ఆమోదించలేదు. ఆయన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం, అవమానకరం. స్వయంగా కలిసి కోరినా ఆమోదించకుండా ఆయన జాప్యం చేస్తున్నారు. నా రాజీనామాను వెంటనే ఆమోదించి నా ఆత్మగౌరవాన్ని నిలపాలి. శాసనమండలి ఛైర్మన్ సీటుకు ఉన్న విలువను కాపాడాలని కోరుతున్నా" అని తెలిపారు.

కొత్త కానిస్టేబుళ్లు.. సైబర్ సైనికులు

- మారుతున్న నేరాలను ఎదుర్కొనేలా సరికొత్త శిక్షణ
- మాడ్యూళ్లు, సిలబస్‌లో మార్పులు చేసిన పోలీసు శాఖ
- డిసెంబరు రెండో వారం నుంచి శిక్షణ
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: కాలంతో పాటే నేరాల తీరుతెన్నులు మారిపోతున్నాయి. ఆధునిక సాంకేతికతను అడ్డుపెట్టుకుని సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త నేరవిధానాలతో మోసాలకు తెగబడుతున్నారు. ఇవే కాదు సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు, ఆర్థిక నేరాలు, బెట్టింగ్ యాప్‌లు, మాదకద్రవ్యాల సరఫరా వంటి నేరాలు సమాజానికి సవాలుగా మారుతున్నాయి. వాటిని నియంత్రించాల్సిన, ఛేదించాల్సిన పోలీసు శాఖలో క్షేత్రస్థాయి ఉద్యోగులైన కానిస్టేబుళ్లకు అందిస్తున్న శిక్షణ మాడ్యూళ్లు మాత్రం మారలేదు. ఈ సమస్యను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా గుర్తించారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని పోలీసు పరిశోధన, అభివృద్ధి సంస్థ (బీపీఆర్‌డీ), సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలు సిద్ధం చేసిన సిలబస్, మాడ్యూళ్లను అధ్యయనం చేసి రాష్ట్ర అవసరాలకు తగ్గట్లు మన సిలబస్‌లో మార్పులు చేశారు. ఆగస్టులో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై ఈ నెల రెండో వారం నుంచి శిక్షణ పొందనున్న వారికి వీటిని అమలు చేయనున్నట్లు శిక్షణ విభాగం డీఐజీ బి.సత్య ఏసుబాబు చెప్పారు.

సైబర్ నేరాలపై సమగ్ర తర్ఫీదు

✦ కానిస్టేబుళ్ల శిక్షణలో సైబర్ నేరాలు, దర్యాప్తు విధానాలపై సమగ్ర తర్ఫీదు ఇవ్వనున్నారు. దీనికోసం సైబర్ నేరాలు, సైబర్ టెర్రరిజం, సైబర్ వార్‌ఫేర్, అడ్వాన్స్‌డ్ సైబర్ నేరాలు తదితర అంశాలతో సిలబస్‌లో ప్రత్యేక సబ్జెక్టు ప్రవేశపెట్టారు.

✦ సైబర్ ఫోరెన్సిక్, డిజిటల్ ఎవిడెన్స్, డిజిటల్ ఫోరెన్సిక్, సీడీఆర్ విశ్లేషణ, టవర్ డంప్ విశ్లేషణ, డేటా సేకరణ, సైబర్ నేరాల ఫుట్‌ప్రింట్ సేకరణపై శిక్షణ ఇస్తారు.

✦ చిన్నారులు, మహిళలపై సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, వాటి దర్యాప్తుపై అవగాహన కల్పిస్తారు. కృత్రిమమేధ (ఏఐ)పైన శిక్షణ ఇస్తారు.

✦ సైబర్ హైజీన్, సైబర్ నేరాల దర్యాప్తులో ఉపయోగపడే యాప్‌ల గురించి బోధిస్తారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందగానే ఎలా స్పందించాలి? టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేసే బాధితులకు ఎలా సహకరించాలి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు.

✦ మాదకద్రవ్యాల కేసులు, ఆర్థిక నేరాల దర్యాప్తు, ప్రథమ చికిత్స, ఇంగ్లిష్ డ్రాఫ్టింగ్‌తోపాటు వ్యక్తిత్వవికాసం, ఆర్థిక నిర్వహణ, క్రమశిక్షణ, నైతిక విలువలపైనా బోధించనున్నారు.

శిక్షణతోపాటు సర్టిఫికెట్ కోర్సులు

✦ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతోపాటు సమాంతరంగా సైబర్ నేరాలు, డిజిటల్ ఫోరెన్సిక్, ఎన్‌డీపీఎస్ చట్టం, ఇంగ్లిష్ నైపుణ్యం, ఆర్థిక నేరాల దర్యాప్తు తదితర అంశాలపై సర్టిఫికెట్ కోర్సులు చేయనున్నారు. దీని కోసం జేఎన్‌టీయూ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సహా మరికొన్ని విద్య, పరిశోధన సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరేనాటికి ప్రతి కానిస్టేబుల్ కనీసం నాలుగైదు సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసి, అందులో కొంత పరిజ్ఞానం సాధించేలా చేయాలన్నది లక్ష్యం.

✦ కేంద్ర ప్రభుత్వ కర్మయోగి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించి, పోలీసుల వృత్తి నైపుణ్యాలపై క్లాసులు చెప్పిస్తారు.

భవిష్యత్తు సవాళ్లు, అవసరాలకు తగ్గట్టు శిక్షణ



-హరీశ్‌కుమార్ గుప్తా, డీజీపీ

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సగటు వయసు 22 ఏళ్లు. వీరు మరో 40 ఏళ్లపాటు సర్వీసులో ఉంటారు. ఆ మేరకు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, అవసరాలకు తగ్గట్లుగా వారికి శిక్షణ ఉండేలా సిలబస్ సిద్ధం చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా డిసెంబరు రెండో వారంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తాం. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనవారిలో 810 మంది బీటెక్, ఎంటెక్, బీసీఏ వంటి సాంకేతిక కోర్సులు చేసినవారే. మరో 230 మంది పీజీలు, 3 వేల మంది పైగా డిగ్రీలు పూర్తి చేసినవారు. వీరికి తగిన శిక్షణ ఇస్తే మెరికల్లా తయారవుతారు.

ప్రతి తుపాను గమనమూ విభిన్నమే!

- 'దిత్వా' ప్రభావంతో అత్యంత భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: వాతావరణ మార్పుల ప్రభావంతో తుపాన్ల గమనం, వేగం, లక్షణాలు మారిపోతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపాన్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అక్టోబరులో ఏర్పడిన 'మొంథా' తుపాను అంచనాలకు భిన్నంగా కదిలి వాతావరణ నిపుణులను గందరగోళానికి గురిచేసింది. తాజాగా 'దిత్వా' తుపాను కూడా అదే కోవలోకి చేరింది. శ్రీలంక భూభాగం మీదుగా కదిలిన ఈ తుపాను అదే సమయంలో కొంత బలహీనపడింది. తర్వాత సముద్రంలోకి ప్రవేశించి.. మళ్లీ బలం పుంజుకుంది. గత నెల 25న శ్రీలంక పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం.. రెండు రోజుల తర్వాత 27న తుపానుగా బలపడింది. తొమ్మిది రోజులైనా.. ఇప్పటికీ ఇది పూర్తిగా బలహీనపడలేదు.

అనూహ్యంగా అత్యంత భారీ వర్షాలు

తుపాను సమయంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. తుపానుగా తీవ్రత కొనసాగిన సమయంలో రాష్ట్రంలో పెద్దగా వర్షాలు కురవలేదు. పొడిగాలులు, గాలుల కోత కారణంగా తుపాను బలహీనపడింది. మేఘాలు చెల్లాచెదురయ్యాయి. వర్షాలు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ పరిస్థితుల ప్రభావంతో తుపాను బలహీనపడినా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందని తొలుత వాతావరణ శాఖ తెలిపింది. కానీ మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అనూహ్యంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా తిరుపతి జిల్లా వాకాడులో 28.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ స్థాయిలో వర్షం కురుస్తుందని ఎవరూ అంచనా వేయలేదు.

✦ నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం.. తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఇది పశ్చిమ దిశగా నెమ్మదిగా కదులుతూ గురువారంలోగా అల్పపీడనంగా బలహీనపడుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. తమిళనాడులో మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కొనసాగుతాయని తెలిపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు తిరుపతి జిల్లాలోని తొట్టంబేడులో 8.5 సెంటీమీటర్లు, ఏర్పేడులో 6.5 సెంటీమీటర్లు, బాలాయపల్లిలో 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలు

ప్రాంతం (జిల్లా)	వర్షపాతం (సెంటీమీటర్లలో)
వాకాడు (తిరుపతి)	28.1
వెంకటాచలం (నెల్లూరు)	24.7
చిట్టమూరు (తిరుపతి)	22.6
కోట (తిరుపతి)	18.9
మనుబోలు (నెల్లూరు)	14.5
దొరవారిసత్రం (తిరుపతి)	12.4



ముంపు నీటిలో నెల్లూరు నగరంలోని ఆర్టీసీ కాలనీ

కుండపోతతో అతలాకుతలం

ఈనాడు, నెల్లూరు, తిరుపతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. నెల్లూరు నగరంలో అయ్యప్పగుడి సెంటర్, వైఎస్సార్, చంద్రబాబునగర్, ఆర్టీసీ, సప్తగిరి, తల్పగిరి, రెవెన్యూ పోలీసు కాలనీలతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. వెంకటాచలం మండలం కసుమూరు పంచాయతీ శ్రీరామపురం దళితవాడను వరద చుట్టుముట్టింది. బుజబుజనెల్లూరు, కనుపూరు, చెముడుగుంట చెరువుల్లో నుంచి జాతీయ రహదారిపైకి నీరు చేరింది. సోమశిల జలాశయంలో 70.35 టీఎంసీల నీరు ఉండగా.. ఎగువ నుంచి 17,122 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో 4,900 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. తిరుపతి జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి నదికి వరద పోటెత్తింది. కోట, చిట్టమూరు, వాకాడు తదితర మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నాయుడుపేట, పెళ్లకూరు, తడ మండలాల పరిధిలో వరినార్లు నీట మునిగాయి.



తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం మొలకలపూడి వద్ద రోడ్డుకు పడిన గండిని పరిశీలిస్తున్న అధికారులు

పింఛనులో ఇంటి పన్ను కోత

మినహాయింపుపై లోవకొత్తూరు సచివాలయ పరిధిలో స్థానికుల ఆవేదన

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: లబ్ధిదారులకు ఇచ్చే పింఛనులో ఇంటి పన్నును మినహాయించుకోవడం చర్చనీయాంశమైంది. కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీలో మంగళవారం ఈ ఘటన వెలుగు చూడగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. సర్వేయర్ సతీష్ తన క్లస్టర్ పరిధిలో 67 మంది లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం పింఛను పంపిణీ చేస్తున్నప్పుడే వారిని ఇంటి పన్ను అడగగా 21 మంది రూ.37 నుంచి రూ.478 వరకు చెల్లించారు. అనంతరం సర్వేయర్ రసీదులు అందించారు. ఈ క్రమంలో కొందరు స్థానికులు పింఛను సొమ్ములో ఇంటి పన్ను మినహాయించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పైఅధికారులు చేయమన్నారని అతను సమాధానం చెప్పగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో మరిడయ్యను వివరణ కోరగా.. పింఛను సొమ్ములో ఇంటి పన్ను మినహాయించాలని ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. సచివాలయ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ.. పలువురు లబ్ధిదారులు పింఛను అందిన వెంటనే ఇంటి పన్ను చెల్లిస్తామని తెలిపారని, ప్రస్తుతం వారి వద్ద పన్ను విషయాన్ని సిబ్బంది ప్రస్తావిస్తున్నారని చెప్పారు. బలవంతంగా పన్ను వసూలు చేయడంలేదని స్పష్టంచేశారు. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఎంపీడీవో సాయినవీన్ తెలిపారు. దీనిపై లోవకొత్తూరుకు చెందిన పలువురు మహిళలు బుధవారం రాత్రి మాట్లాడుతూ.. తమకు పింఛను అందిన తర్వాత ఇష్టపూర్వకంగానే ఇంటి పన్ను కట్టామని, కొందరు వైకాపా నాయకులు దీనిని తప్పుగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు.



మ్యాజిక్ బాక్స్



పెట్టెలోని సామగ్రి

అ.. అభ్యాసం.. ఆ.. ఆట!

పిల్లలు ఆడుతూ పాడుతూ కొత్త విషయాలు నేర్చుకునేలా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కొత్తగా అభ్యసన పెట్టెలను పాఠశాలలకు అందించింది. 'జాదూయీ పిటారా (మ్యాజిక్ బాక్స్)' పేరుతో పిలిచే ఈ పెట్టెల్లో రూ.30 వేల విలువైన బొమ్మలు, ఆట పరికరాలున్నాయి. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆటల ద్వారా వైవిధ్యమైన అంశాలను నేర్చుకునేందుకు ఈ పెట్టెను రూపొందించారు. ఒక్కో పెట్టెలో 62 రకాల బొమ్మలు, పోస్టర్లు, పజిల్స్, కథల పుస్తకాలు, వర్క్‌షీట్లు స్థానిక సంస్కృతి ప్రతిబింబించేలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 150 ఆదర్శ పాఠశాలలు, పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్న బడులకూ ఈ బాక్సులు అందజేసినట్లు సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు తెలిపారు. మరో 150 పాఠశాలలకూ సమకూర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లోనే ఇక అనుమతులు

- అమరావతి పరిధిలోని 4 గ్రామాలు మినహా..

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి పరిధిలోని పెనుమాక, నవులూరు, నిడమర్రు, ఉండవల్లి గ్రామాలు మినహా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎంటీఎంసీ) పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు, వివిధ అభివృద్ధి పనులపై అక్కడి కమిషనర్‌కి అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్‌కి అధికారాల బదలాయింపు ప్రతిపాదనను సీఆర్‌డీఏ కార్యనిర్వాహక కమిటీ ఆమోదించడంతో ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలో పలు అనుమతులకు ఇప్పటి వరకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆమోదం తప్పనిసరి. ఇక నుంచి ఆ అధికారాలన్నీ ఎంటీఎంసీ కమిషనర్‌కే కల్పించారు.

అధికారాలివి

✦ భవన నిర్మాణాలు, లేఔట్లకు అనుమతులు ✦ క్వారీలకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ ✦ పెట్రోల్ బంకులు, ఫిల్లింగ్ స్టేషన్లకు ఎన్‌వోసీ ✦ సినిమా థియేటర్లకు ఎన్‌వోసీ జారీ ✦ ఆమోదిత లేఔట్లలో ప్లాట్ల ఉప విభజన ✦ టీడీఆర్ బాండ్లతో అదనపు అంతస్తుల ఏర్పాటు, ఇతర మినహాయింపుల కోసం వచ్చిన దరఖాస్తులు సీఆర్‌డీఏ కమిషనర్‌కు పంపాల్సిందే.

90 రోజులు ఇలా ప్రయత్నించండి



జీవితంలో మార్పు కోసం 90 రోజుల నియమాన్ని అనుసరిస్తారా? అయితే ఓ మూడు నెలలు వీటిని పాటించండి.

✦ మద్యాన్ని దూరం పెట్టండి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి.
✦ ప్రతిరోజూ వ్యాయామం చేయండి.
✦ అన్యమనస్కంగా ఉండొద్దు.
✦ జంక్‌ఫుడ్ జోలికెళ్లొద్దు.
✦ సమయానికి నిద్రపోండి.
✦ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోండి.
✦ మీ లక్ష్య సాధనకు రోజూ కృషి చేయండి.

– డాన్ గో, హెల్త్ కోచ్



తమలపాకులపై శ్రీరామ అని రాస్తున్న మహిళలు

హనుమద్ వ్రతం.. శ్రీరామ వైభవం!



పూజకు సిద్ధం చేసిన తమలపాకులు

ఆత్రేయపురం (ర్యాలి), న్యూస్‌టుడే: హనుమద్ వ్రతం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామికి బుధవారం శ్రీరామ నామం లిఖించిన లక్ష తమలపాకులతో పూజలు చేశారు. ఒక్కో ఆకుపై గంధ సింధూరంతో శ్రీరామ అని రాసి.. వాటిని స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా హనుమ నామంతో ఆ పరిసరాలు మార్మోగాయి. తొలుత స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సహస్ర దీప జ్యోతులతో ఏర్పాటు చేసిన హనుమంతుడి రూపం విశేషంగా ఆకట్టుకుంది.



పురపాలక అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్

గడువులోగా వ్యర్థాలు తొలగించని ఏజెన్సీలకు తాఖీదులు

- నెలాఖరులోగా విధిగా ప్రక్రియ పూర్తి చేయాలి
- స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్ ఆదేశం
- 'ఈనాడు' కథనంపై స్పందన

ఈనాడు, అమరావతి: నగరాలు, పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలను గడువులోగా తొలగించని కాంట్రాక్ట్ ఏజెన్సీలకు తాఖీదులిచ్చి చర్యలు తీసుకుంటామని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరించారు. వ్యర్థాల తొలగింపును రోజూ పరిశీలించడంతోపాటు ప్రతి వారం సమీక్షిస్తామని ఆయన అన్నారు. నెలాఖరులోగా అన్ని డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డుల్లో వ్యర్థాల నిల్వలపై 'ఇంకా కుప్పలు తెప్పలుగానే' అన్న శీర్షికతో 'ఈనాడు'లో బుధవారం వెలువడిన కథనంపై పట్టాభిరామ్ స్పందించి పురపాలక ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్లు, అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులతో వర్చువల్‌గా సమావేశమై మాట్లాడారు. 'డంపింగ్ యార్డుల్లో గడువులోగా లెగసీ వేస్ట్ బయో మైనింగ్ పూర్తి చేయాలి. 95 లక్షల టన్నుల వ్యర్థాలను కాంట్రాక్టు ఏజెన్సీలు ప్రాసెసింగ్ చేసినంత మాత్రాన పని పూర్తయినట్లు కాదు. ఆర్‌డీఎఫ్, ఇతర వ్యర్థాలు తరలించి వాటిని ఉద్యానాలుగా అభివృద్ధి చేయాలి. నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలి' అని పట్టాభిరామ్ ఆదేశించారు.

23న రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఈ నెల 23న నిర్వహించాలని కార్యనిర్వాహక కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న సంఘం కాలపరిమితి ఈ నెల 28తో పూర్తికానుంది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యనిర్వాహక కమిటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 11న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. 12న ఎన్నికల ప్రకటన, 15, 16 తేదీల్లో నామినేషన్ల దాఖలు, 17న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 23న ఎన్నికలు నిర్వహిస్తారు. రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల సంఘం ప్రస్తుత అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వైకాపాకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేశారనే ఆరోపణలతో ఆయన్ని సస్పెండ్ కూడా చేశారు.

గ్రహం అనుగ్రహం

4-12-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
చతుర్దశి: ఉ. 7-42, పూర్ణిమ తె. 5-21 తదుపరి బహుళ పాడ్యమి
కృత్తిక: మ. 3-12 తదుపరి రోహిణి
వర్జ్యం: తె. 6-06 నుంచి
అమృత ఘడియలు: మ. 12-58 నుంచి 2-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-59 నుంచి 10-43 వరకు తిరిగి మ. 2-23 నుంచి 3-07 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.19; **సూర్యాస్తమయం:** సా.5.20
శ్రీ దత్త జయంతి

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	27.0
రాజమహేంద్రవరం	20.0	32.0
అనంతపురం	21.5	30.5
విశాఖపట్నం	21.8	28.2
కడప	22.0	27.0
నరసాపురం	22.0	27.4
శ్రీకాకుళం	22.0	29.0
ఒంగోలు	22.3	27.8
కర్నూలు	22.3	29.4
విజయవాడ	22.6	27.6
నెల్లూరు	23.0	25.7
తాడేపల్లిగూడెం	23.0	28.2

విద్యుత్తు ఛార్జీలు పెంచేది లేదు

● నల్లజర్లలో 'రైతన్నా మీకోసం' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు-రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే-నల్లజర్ల, గోపాలపురం: భూమినే జలాశయంగా చేసి, భూగర్భజలాలు పెంచితే కరవుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ఏడాది 7వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయని, వీటిలో 200 టీఎంసీలు వాడితే రాష్ట్రంలో కరవు మాటే ఉండదన్నారు. ఎంత ఇబ్బంది అయినా విద్యుత్తు ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డిసెంబరు 18 భూగర్భ జలాలు 6.8 మీటర్ల లోతు ఉన్నాయని, ఇవి 3 మీటర్ల స్థాయికి చేరితే విద్యుత్తు రూపంలో రూ. 5వేల కోట్లు ఆదా అవుతుందని చెప్పారు. కరవు సీమగా ఉండే రాయలసీమలో (నంద్యాల) నాలుగు మీటర్లుంటే.. గోపాలపురంలో 18 మీటర్ల లోతున భూగర్భ జలాలున్నాయని చెప్పారు. ఆయన తెలిపిన విషయాలిలా ఉన్నాయి.

వినూత్న ఆలోచనలతో వస్తే ప్రోత్సాహం

రైతులు వినూత్న ఆలోచనలతో వస్తే ఆర్థిక, సాంకేతిక సహాయం అందిస్తాం. కొందరు పదుల ఎకరాల్లో ఒకే పంట వేస్తున్నారు. ఇంకొందరు ఎకరాల్లో వరి, చేపలు, ఉద్యానపంటలు వేసి రూ.2.20 లక్షలు సంపాదిస్తున్నారు. చిత్తూరులో ఓ మామిడి రైతు పండ్లకు కవర్లు పెడితే టన్ను రూ.30వేలు పలికింది. అలా కట్టిన రైతు వద్ద కిలో రూ.8కు కొనే నాథుడు లేరు.

● ఒకప్పుడు ఎడారిగా ఉన్న రాయలసీమను ఇప్పుడు ఉద్యానవన హబ్‌గా మార్చాం. అక్కడ 70-80 రకాల పంట్లు పండిస్తున్నారు. సాగుతో పాటు పాడి పరిశ్రమ ఉంటే మెరుగ్గా ఉంటుంది. ధరలు రకరకాల పరిస్థితులపై ఆధారపడతాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో ట్రంప్‌నకు కోపం రావడంతో ఆ ప్రభావం ఆక్వా రైతులపై పడింది.

● అన్నదాత అంటే పంజాబ్, ఏపీ గుర్తొస్తాయి. పంజాబ్ నుంచి రోజూ రెండు రైళ్లలో క్యాన్సర్ రోగులను దిల్లీకి తీసుకెళ్తున్నారు. ఆ పరిస్థితి రాష్ట్రానికి రావొద్దు.

నీటి భద్రతతోనే సాధ్యం: నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు వంటి 5 సూత్రాల అమలే లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో 10,800 రైతు సేవాకేంద్రాల పరిధిలో నవంబరు 24 నుంచి 29 వరకు ఇళ్ల వద్దకే సిబ్బంది వచ్చి రైతుల సూచనలు సేకరించారు.

● రిజర్వాయర్లలో ఈ ఏడాది 900 టీఎంసీలు, భూగర్భంలో 700 టీఎంసీల జలాలు ఉన్నాయి. తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు ఎక్కడా నీటికొరత లేకుండా ప్రతి నెలా సమీక్షిస్తున్నాం. ఈ బాధ్యత జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అప్పగిస్తున్నాను.

అప్పు అడిగినా ఇచ్చేవారు లేరు

వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైంది. అప్పుడు నేను నిలబడితే.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకరించి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చేశారు. భాజపా కూడా రావడంతో 57% ఓట్లతో 96% సీట్లు సాధించాం. గతంలో చేసినదానికంటే ఈ ఐదేళ్లలో మూడింతలు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చా. ఓ వైపు సూపర్‌సిక్స్ హామీలు.. మరో వైపు ఖాళీ ఖజానా.. అప్పు అడిగినా ఇచ్చేవారు లేరు. అయినా విద్యుత్తు ఛార్జీలు పెంచం. ఇంటిపైన సోలార్, పొలంలో 'కుసుమ్', సబ్‌స్టేషన్లలో ఉత్పత్తి చేయడం ద్వారా ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు తగ్గుతాయి.



విండుసేద్యం విధానాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

నాడు భూదస్త్రాలన్నీ మార్చేశారు

గత ప్రభుత్వంలో భూ దస్త్రాలన్నీ మార్చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తాం. వాళ్లకు ఇష్టం లేని వ్యక్తులు, మాటవినని వారివి, వైకాపా నేతలు కబ్జాచేసే భూములను 22ఏలో చేర్చారు. మాకు వచ్చే అర్జీల్లో 80% అవే ఉంటున్నాయి. ● ప్రస్తుతం తొలి పది రోగాల్లో మధుమేహం, రక్తపోటు ఉన్నాయి. సంజీవని ప్రాజెక్ట్ పెద్ద గేమ్‌ఛేంజర్ అవుతుంది. ● గుంతలు పడిన రోడ్లన్నింటికీ జనవరిలోగా మరమ్మతులు చేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో... రైతులతో మమేకం

హంగూ, ఆర్భాటాలు లేవు.. కూలర్లు కాదు కదా కూర్చునేందుకు కుర్చీలూ లేవు. బుధవారం నల్లజర్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో వేదిక వద్ద కనీసం టెంటు కూడా వేయలేదు. ఓ చెట్టు కింద సులకమంచాలపై సీఎం, మంత్రులు, అధికారులు కూర్చున్నారు. అల్లిక పీటలు, సాధారణ కుర్చీల్లో రైతులు కూర్చొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఆరుబయటే రెండు గంటలపాటు చర్చ సాగింది.





రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ● ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటకు చెందిన ఆదర్శ రైతు బొలిశెట్టి గోపాలకృష్ణను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జనసేన 'పంచ'సూత్ర

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో ఆయన బుధవారం పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్ర స్థాయి నుంచి కింది స్థాయి వరకు జనసేన పొందిన నామినేటెడ్ పదవులపై సమీక్ష నిర్వహించారు. మిగిలిన పోస్టుల భర్తీపై సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకెళ్లడంతో పాటు పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసిన వారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా ప్రయాణిస్తున్నామన్నారు.

11 మందితో వివాద పరిష్కార విభాగం

పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొన్న వివాదాలను పరిష్కరించే కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ వింగ్ (వివాదాల పరిష్కార విభాగం) పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పని చేయాలని పవన్ ఆదేశించారు. ఈ విభాగంలో 11 మంది సభ్యులను నియమించాలని, ఇందులో ముగ్గురు మహిళలకు స్థానం కల్పించాలని సూచించారు. వివాద తీవ్రతను బట్టి ఈ కమిటీలోని ముగ్గురు లేదా మొత్తం సభ్యులు చర్చించి పరిష్కరించాలన్నారు.

గిరిజన బాలల నైపుణ్యాలను వెలికితీసే ఉద్భవ్

(మొదటి పేజీ తరువాయి)



కేరళ కళాకారుల గిరిజన నృత్య ప్రదర్శన

నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, సహాయ కార్యదర్శి బిపిన్ చంద్ర రాథోడ్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, గురుకులాల కార్యదర్శి గౌతమి, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదాభార్గవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ 'మాజీ ప్రధాని వాజ్‌పేయీ హయాంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటైనప్పుడు ఆ శాఖకు తొలి మంత్రిని నేనే. ఇప్పుడు మూడోసారి ఆ పదవి నిర్వహిస్తున్నా. దేశవ్యాప్తంగా 740 ఏకలవ్య గురుకులాలను కేంద్రం మంజూరుచేస్తే.. 500 మాత్రమే నడుస్తున్నాయి. మొదట మేం ఈ వేడుకల్ని రాజస్థాన్‌లో పెట్టాలనుకున్నాం. కానీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పట్టుబట్టి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా చొరవ చూపారు. రాష్ట్రప్రభుత్వం ముందుకొస్తే మైదాన ప్రాంతాలకూ ఏకలవ్య గురుకులాలను మంజూరుచేస్తాం. ఉత్సవాల ఏర్పాట్లు బాగున్నాయి. మంచి వసతి కల్పించారు. ఇవి విజయవంతమవుతాయి' అని పేర్కొన్నారు.

ఓటమికి భయపడకూడదు: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

'ఉద్భవ్-2025 ఒక వేడుక మాత్రమే కాదు. ఇది గిరిజన విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది. ఏ అంశంలోనైనా గెలవడం కంటే పోటీల్లో పాల్గొనడం ద్వారా సంపాదించే అనుభవం, ధైర్యం చాలా విలువైనవి. ఓడినా భయపడి వెనుకడుగు వేయొద్దు. మళ్లీ ప్రయత్నించాలి. ఈ వేడుకల్లో 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య గురుకులాల నుంచి 1,644 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 110 మంది పిల్లలున్నారు. రాష్ట్రంలోని గిరిజన, వెనుకబడిన విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ప్రత్యేక నిధులు అందించాలి. మారుమూల గిరిజన ప్రాంతాల రహదారుల అనుసంధానానికి నిధులు ఇవ్వాలి. మైదాన ప్రాంతాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయాలి. కేంద్రసాయం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగపడుతుంది' అన్నారు.

గిరిజన సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటుతున్నాం

- అజిత్‌కుమార్ శ్రీవాత్సవ, నెస్ట్స్ కమిషనర్

గిరిజన సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందుకు ఉద్భవ్-2025 లాంటి కార్యక్రమాలు పునాదిగా నిలుస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ వేడుకల నిర్వహణ అద్భుతంగా ఉంది. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చాటేందుకు సిద్ధంగా ఉన్నారు' అని వెల్లడించారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ మాట్లాడారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని విజయంతో గెలిచారు

- దేశం గర్వపడేలా చేశారు
- అంధ క్రికెటర్లకు చంద్రబాబు ప్రశంసలు
- భారీగా నగదు ప్రోత్సాహకాలు





దివ్యాంగురాలికి వాహన కీ అందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమా, మంత్రి బాలవీరాంజనేయ స్వామి, నారాయణస్వామి, కోటేశ్వరరావు తదితరులు ● కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులు, ప్రజలు

ఈనాడు, అమరావతి: వైకల్యం ఎప్పుడూ విజయానికి అడ్డుకాదని అంధ క్రికెటర్లు దీపిక, కరుణకుమారి, అజయ్‌కుమార్‌రెడ్డి నిరూపించారని చంద్రబాబు కొనియాడారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో వారిని సత్కరించి, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కరుణకుమారి ఎంతో మందికి ప్రేరణ. ఆర్థిక పరిస్థితి బాగాలేదని తండ్రి వద్దన్నా వెనకడుగు వేయలేదు. అంధత్వాన్ని అధిగమించి, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించారు. 42 పరుగులు చేసి భారత జట్టును విశ్వవిజేతగా నిలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి, అక్కడ ఆడి ప్రపంచకప్ తెచ్చిన కరుణను చూసి గర్వపడుతున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రమాదంలో చూపు కోల్పోయిన అజయ్‌కుమార్‌రెడ్డి దేశానికి అంధుల క్రికెట్‌లో తొలి టీ20 ప్రపంచకప్ అందించడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. కెప్టెన్‌గా రెండుసార్లు ప్రపంచ కప్‌లు సాధించి పెట్టారన్నారు. ఏపీలో పుట్టి కర్ణాటక నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికనూ అభినందించారు. ప్రభుత్వం తరఫున కరుణకుమారికి రూ.15 లక్షలు, దీపికకు రూ.10 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. వీరి ప్రతిభను గుర్తించి నిబంధనల మేరకు అందే సాయం కంటే అదనంగా ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్టు సీఎం తెలిపారు. ఇద్దరికీ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. అజయ్‌కుమార్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2.50 లక్షలు, ఏసీఏ తరఫున రూ.లక్ష సాయం ప్రకటించారు. పీ4 కింద రూ.లక్ష చెక్కు ఇచ్చారు. భారత అంధ క్రికెట్ జట్టు సభ్యులకు ఏసీఏ ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును దీపికకు చంద్రబాబు అందజేశారు. కరుణకుమారికి ఏసీఏ తరఫున రూ.5 లక్షలు, గొట్టిపాటి హర్షవర్ధన్ ప్రకటించిన రూ.5 లక్షలు, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ తరఫున రూ.లక్ష చొప్పున చెక్కుల్ని అందజేశారు.

మరిన్ని విజయాలు సాధిస్తాం: దీపిక

రాష్ట్ర ప్రభుత్వం చాలా మద్దతునిచ్చింది. ఈ ప్రభుత్వమే ఉండాలి. మాలాంటి వారికి ఇలాగే మద్దతు కొనసాగిస్తే మరింత రాణిస్తాం.

చంద్రబాబు రావడం సంతోషాన్నిచ్చింది: కరుణ

ప్రపంచకప్ గెలిచినందుకు చాలా ఆనందంగా ఉంది. మాకు మద్దతుగా నిలవడానికి చంద్రబాబు ఇక్కడికి రావడం సంతోషకరం. గుడిసెలో ఉంటున్నాం. ఇల్లు మంజూరు చేయించండి.

గత పాలనలో అన్యాయం: అజయ్‌కుమార్‌రెడ్డి

దివ్యాంగ క్రీడాకారులకు గత ఐదేళ్లూ అన్యాయం జరిగింది. పతకాలు వచ్చినా 'పారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'కు గుర్తింపు లేక ఇబ్బందిపడ్డాం. కూటమి ప్రభుత్వం వచ్చాక గుర్తింపు దక్కింది. వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన నగదు ప్రోత్సాహకాలు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, ఏసీఏ, ఇతర సంస్థలు మద్దతుగా నిలుస్తున్నాయి. సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తాం. ఆంధ్ర తరఫున ఎంతో మంది అంధ క్రికెటర్లు ఆడి, పతకాలు సాధించినా క్రీడా కోటా కింద ఒక్క ఉద్యోగం కూడా రాలేదు. కనీసం ఒక్కరికైనా ఉద్యోగం ఇస్తే కొత్తతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

దివ్యాంగుల పింఛన్ చంద్రబాబు 12 రెట్లు పెంచారు

'దివ్యాంగులకిచ్చే పింఛన్‌ను సీఎం చంద్రబాబు 12 రెట్లు పెంచారు. రూ.500 నుంచి రూ.6 వేల వరకు విడతల వారీగా పెంచి అండగా నిలిచారు. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నారు. దివ్యాంగులు అభ్యసించే పాఠశాలలు, వసతి గృహాల మరమ్మతులకు నిధులిచ్చారు. అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు'.

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛను పెంపు అమలు

'ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి అమలు చేశారు. దివ్యాంగులపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి ఇది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇవ్వడం లేదు. పింఛన్‌తోపాటు ఉపకరణాలు, త్రిచక్ర వాహనాలు అందిస్తున్నాం'.

- ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఇన్సాస్, 303 రైఫిల్, పెద్దఎత్తున ఆయుధ, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి" అని వివరించారు. ఎన్‌కౌంటర్‌లో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) కంపెనీ నంబరు-2 కమాండర్ మోడియం వెల్ల ఎలియాస్ మంగు మోడియం మృతి చెందాడు. నిఘా విభాగానికి కమాండర్‌గా పనిచేస్తున్న ఈయన గంగలూరు ఏరియాలో కీలకంగా వ్యవహరిస్తూ అనేక దాడుల్లో పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు.

భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిల్లో మూతపడిన భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి స్వచ్ఛాంధ్ర సంస్థ ప్రతిపాదనలు ఆమోదిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

దివ్యాంగులకు ఇంద్రధనుస్సు

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగులకు ప్రత్యేకంగా 'దివ్యాంగ భవన్'లను ఏర్పాటు చేస్తాం. రాజధానిని దివ్యాంగులకు అనుకూలమైన నగరంగా మలుస్తాం' అని చంద్రబాబు ప్రకటించారు. దివ్యాంగుల జీవితాల్లో నిత్యం వెలుగులుండాలనే ఈ పథకాలను ప్రకటించినట్లు సీఎం వివరించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. వీరంకి శిరీషకు రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాన్ని అందించారు. మనోజ్‌కు ల్యాప్‌టాప్, గ్లోరీకి టచ్ ఫోన్‌ను పంపిణీ చేశారు. అనంతరం సీఎం మాట్లాడారు.

విశాఖలో దివ్యాంగుల క్రీడా స్టేడియం....

'విశాఖలో 23 ఎకరాల్లో నేషనల్ సెంటర్ ఫర్ డిజెబిలిటీ స్పోర్ట్స్ స్టేడియంను నిర్మిస్తాం. వారు క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తాం. దివ్యాంగులకు రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు అందిస్తాం. ఈ ఏడాది 1800 వాహనాలు పంపిణీ చేస్తాం. ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, వీల్‌ఛైర్లు 14 వేల మందికి అందిస్తాం. దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ గడువును పొడిగిస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 2260 స్పెషల్ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం' అని చంద్రబాబు వివరించారు.

దివ్యాంగ పింఛన్లకు రూ.6 వేల కోట్ల వ్యయం

'దివ్యాంగులకు సహకారం అందించేందుకు నిరంతరం పనిచేశా. వారికి అవసరమైన ప్రోత్సాహకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. దివ్యాంగులకు ఎన్టీఆర్ అప్పట్లో తొలిసారి పింఛన్లు మంజూరు చేశారు. నేను రూ.200 నుంచి రూ.6 వేల వరకు విడతల వారీగా పెంచా. దేశంలో మరే రాష్ట్రంలోనూ రూ.6 వేల పింఛను ఇవ్వడం లేదు. ఏడాదికి 7.68 లక్షల మందికి పింఛన్ల పంపిణీకిగాను రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం' అని సీఎం తెలిపారు.

వైకాపా హయాంలో కక్ష కట్టి దాడులు...

వైకాపా ప్రభుత్వ హయాంలో దివ్యాంగులకు మేలు చేసే కార్యక్రమాలు ఒక్కటి కూడా చేయలేదు. ఒక్కసారి కూడా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించలేదు. ఒక్క రూపాయి సాయం చేయలేదు. దివ్యాంగులపై వైకాపా నేతలు కక్ష కట్టి దాడులు చేశారు' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, ఎంఎస్‌రాజు, ఎమ్మెల్సీ తిప్పేస్వామి, దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణ స్వామి, తెదేపా విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి చట్టబద్ధత

(మొదటి పేజీ తరువాయి)

రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రూ.58వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు.

రాష్ట్ర విభజన చట్టంలో ఏముంది?

పార్ట్-2 కింద 5(1): నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

పార్ట్-2 కింద 5(2): సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.

అమరావతిని రాజధానిగా ఎలా నోటిఫై చేస్తారు

● ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు. ● పార్ట్ 2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట.. అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు.

పౌర అణు ఇంధన రంగంలో మరింత సహకారం

(మొదటి పేజీ తరువాయి)

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ పర్యటనలో భాగంగా ఇరు దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు తెలుస్తోంది. పుతిన్ గౌరవార్థం ప్రధాని మోదీ దిల్లీలో గురువారం ప్రైవేటు విందు ఏర్పాటుచేస్తారు. ఇరువురు నేతలు దేశ రాజధానిలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. రక్షణ, వాణిజ్య రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ప్రధానంగా చర్చిస్తారు. రష్యా ప్రభుత్వరంగ ప్రసార సంస్థకు చెందిన కొత్త భారతీయ ఛానెల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. రాజ్‌ఘాట్‌ను సందర్శిస్తారు! మొత్తం 28 గంటలపాటు భారత్‌లో ఆయన పర్యటన కొనసాగుతుందని సమాచారం.

నేడు రక్షణ మంత్రుల భేటీ: భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రష్యా రక్షణ మంత్రి ఆండ్రే బెలౌసోవ్ దిల్లీలో గురువారం భేటీ కానున్నారు. భారత్ మరిన్ని ఎస్-400 క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడం, సుఖోయ్-30 యుద్ధ విమానాల ఉన్నతీకరణ వంటి అంశాలపై వారు చర్చించే అవకాశాలు ఉన్నాయి. సుఖోయ్ ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను మన దేశానికి రష్యా సరఫరా చేసే అంశం కూడా చర్చకు రావొచ్చు.

మద్యం లంచాల సొమ్ము మనీ లాండరింగ్ చేసింది పల్గోట సోదరులే

(మొదటి పేజీ తరువాయి)

ఆ సొత్తును సంబంధిత డిస్టిలరీల ప్రతినిధులకు చేర్చే వారని, వారి నుంచి నాటి ప్రభుత్వ పెద్దలకు నగదు, బంగారం రూపంలో లంచాలు సొమ్ము చేరేదని గుర్తించింది. బంగారం, నగల వ్యాపారం ముసుగులో పల్గోట సోదరులిద్దరూ హవాలా దందా నడిపించారని పేర్కొంది. మద్యం కుంభకోణం కేసులో రోణక్‌కుమార్‌ను అరెస్టు చేసిన సిట్ అధికారులు.. బుధవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి దర్యాప్తులో తేలిన అంశాలతో రిమాండ్ రిపోర్టు సమర్పించారు. అందులోని ప్రధానాంశాలివి.

పెద్దఎత్తున బయటపడ్డ నకిలీ ఇన్వాయిస్‌లు, వే బిల్లులు

● అదాన్ డిస్టిలరీస్ నుంచి రూ.18.27 కోట్లు, లీలా డిస్టిలరీస్ నుంచి రూ.20.28 కోట్లు, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ నుంచి రూ.39 కోట్లు చొప్పున మొత్తం కలిపి రూ.77.55 కోట్లు ఓల్విక్, క్రిపాటి, నైస్నా, విశాల్ పేరిట ఏర్పాటైన డొల్ల కంపెనీల ఖాతాల్లోకి జమయ్యాయి. వాటిని అక్కడి నుంచి మరో 32 డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించారు. ఆ తర్వాత ఆయా ఖాతాల నుంచి అనిల్ చోఖ్రా సొమ్ము విత్ డ్రా చేసి.. రోణక్, చేతన్‌లకు అందజేసేవాడు. కొన్నిసార్లు వారికి సంబంధించిన చాముండ బులియన్, రాజ్ బులియన్, మహాలక్ష్మీ ట్రేడర్స్, రుచిత జ్యూయలర్స్, పాయల్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రక్ష బులియన్, సంఘవి బులియన్ ఖాతాల్లోకి నేరుగా జమ చేసేవాడు. డిస్టిలరీల నుంచి అందిన సొమ్ము మనీ లాండరింగ్ చేయటంలో రోణక్, చేతన్‌దే ప్రధాన పాత్ర.

● ఆయా డొల్ల కంపెనీల నుంచి వస్త్రాలు, ఇతర సరుకులు కొన్నట్లు చూపించి డిస్టిలరీల ప్రతినిధులు రికార్డుల్లో రాసుకునేవారు. వాటికి అనిల్‌చోఖ్రా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించేవాడు. సిట్ దర్యాప్తులో మొత్తం 114 నకిలీ ఇన్వాయిస్‌లు, వే బిల్లులు బయటపడ్డాయి. వాటిని విశ్లేషిస్తే ఆయా తేదీల్లో ఆయా నంబర్లున్న వాహనాలేవీ ముంబయి నుంచి ఏపీకి వచ్చినట్లు రికార్డు కాలేదని తేలింది. మనీ లాండరింగ్‌ను కప్పిపుచ్చేందుకు ఈ ముఠా ఈ ఎత్తుగడ అనుసరించినట్లు వెల్లడైంది.

అన్నకు నోటీసులిస్తే తమ్ముడు విచారణకు వచ్చాడు...

వైకాపా మద్యం ముఠా తరఫున లంచాలు సొమ్ము మనీ లాండరింగ్ చేయడంలో చేతన్‌కుమార్ పల్గోటది కీలక పాత్ర అని కొన్ని రోజుల కిందటే సిట్ గుర్తించింది. గత నెల 29న విచారణకు హాజరవ్వాలంటూ నోటీసులిచ్చింది. అయితే చేతన్‌కుమార్ విచారణకు రాకుండా అతని తమ్ముడైన రోణక్‌ను పంపించాడు. 'మీ అన్నను విచారణకు పిలిస్తే నువ్వెందుకు వచ్చావు?' అని సిట్ అధికారులు ప్రశ్నించగా.. తమ కుటుంబ వ్యాపారాలన్నీ తాను పర్యవేక్షిస్తుంటానని.. అందుకే వచ్చానని సమాధానమిచ్చాడు. కొన్ని లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని అడగ్గా.. రోణక్ అందుకు నిరాకరించాడు. దీంతో నవంబరు 30, ఈ నెల 1, 2 తేదీల్లో వరుసగా సిట్ అధికారులు రోణక్‌ను విచారణకు పిలిచారు. అయినా అతను దర్యాప్తునకు సహకరించలేదు. అనిల్‌చోఖ్రాతో కలిపి విచారించేందుకు ప్రయత్నించగా.. దానికి సహకరించలేదు. బుధవారం విచారణకు హాజరు కావాల్సి ఉండగా.. దర్యాప్తు అధికారులకు చెప్పాపెట్టకుండా ముంబయికి పారిపోయేందుకు గన్నవరం విమానాశ్రయానికి వెళ్లిపోవటంతో అతన్ని అరెస్టు చేశారు. అనిల్‌చోఖ్రాతో డొల్ల కంపెనీలు ఏర్పాటు చేయించి, మనీ లాండరింగ్ నెట్‌వర్క్ నిర్వహణలో చేతన్, రోణక్‌లే కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వ్యక్తుల నుంచి రూ.100 కోట్ల వరకూ సొత్తు జమవుతుందని, దాన్ని మనీ లాండరింగ్ చేసేందుకు డొల్ల కంపెనీలు, వాటి పేరిట బ్యాంకు ఖాతాలు సిద్ధం చేయాలని అనిల్‌చోఖ్రాను పల్గోట సోదరులే ఆదేశించారు.

చేతన్‌ను అరెస్టు చేసేందుకు ముంబయికి ప్రత్యేక బృందాలు..

విచారణకు హాజరుకాకుండా తప్పించుకోవటమే కాకుండా.. మనీ లాండరింగ్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన చేతన్ పల్గోటను అరెస్టు చేసేందుకు సిట్ బృందాలు ముంబయికి వెళ్లాయి. అతని కదలికలపై సిట్ అధికారులు నిఘా పెట్టారు. చేతన్‌ను అరెస్టు చేసి విచారిస్తే.. అతన్ని మనీ లాండరింగ్ కోసం సంప్రదించిన రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వ్యక్తుల వివరాలు బయటపడే అవకాశముంది. చేతన్, రోణక్‌లకు సంబంధించిన చాముండ బులియన్ సంస్థ ఖాతాలోకి కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.375 కోట్లు, న్యూమౌంట్ గోల్డ్ నుంచి రూ.143 కోట్లు, మలిష్క గోల్డ్ నుంచి రూ.135 కోట్లు, ట్రిప్పుర్ నుంచి రూ.124 కోట్లు జమయ్యాయి. ఇవి కూడా.. మనీ లాండరింగ్ కోసం వచ్చినవేనని సిట్ తేల్చింది. చేతన్, రోణక్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, డీఆర్‌ఐల్లో అనేక కేసులున్నాయి.

ఈనాడు

మాయమాటలు నమ్మకండీ!

కుదిరితే ఆశపెడతారు... లేకపోతే భయపెడతారు... వలలో పడినవారి ఖాతాలను క్షణాల్లో ఖాళీచేసేస్తారు... ఇదే పద్ధతిలో సైబర్ నేరగాళ్లు ఇప్పుడు అడ్డూఅదుపూ లేకుండా చెలరేగిపోతున్నారు! రూపాయికి పదింతలు లాభం పొందాలనే పేరాశతో కొంతమంది ఆ కేటుగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ వైద్యుడు ఇలాగే రూ.14కోట్లకు పైగా పోగొట్టుకున్నారు. ఎవరో ఫోన్ చేసి ఏదో నేరంతో మీకు సంబంధం ఉంది, డిజిటల్ అరెస్టు చేస్తున్నామనగానే మరికొందరు బెదిరిపోతున్నారు. ఉన్నదంతా ఊడ్చి మరీ ఆ సైబరాసురుల చేతుల్లో పోస్తున్నారు. నెల్లూరులో ఓ వ్యవసాయ శాస్త్రవేత్త, కడపలో విశ్రాంత ఎంఈవో, తిరుపతిలో న్యాయవాది... గత కొద్ది రోజుల్లోనే అనేకమంది ఇలా లక్షలాది రూపాయలు కోల్పోయారు. సైబర్ నేరాల బాధితుల్లో 60శాతం మంది ఉన్నత విద్యావంతులేనని తెలంగాణ పోలీసులు చెబుతున్నారు. ఏ పుట్టలో ఏ పాముందోనని సందేహించకుండా ముసుగు మనుషుల మాయమాటలకు విద్యాధికులూ మోసపోతుండటం బాధాకరం. డిజిటల్ అరెస్టు అనేది పచ్చి అబద్ధమని గుర్తుపెట్టుకుంటే సైబర్ చోరుల ఆటలు ఎవరి దగ్గరా సాగవు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ఎవరైనా ఎరేస్తే- అసలు అదెలా సాధ్యమని కాస్త విచక్షణతో ఆలోచించగలిగితే, మన ఖాతాలోని సొమ్ము సురక్షితంగా ఉంటుంది!

ఎక్కడెక్కడో నక్కిఉండి దేశవ్యాప్తంగా తమ నేరసామ్రాజ్యాన్ని విస్తరించిన సైబర్ మోసగాళ్లు- ప్రజల అవగాహనారాహిత్యాన్ని, భయాందోళనలను విపరీతంగా సొమ్ముచేసుకుంటున్నారు. కోర్టులు, దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వ విభాగాల పేర్లను దుర్వినియోగం చేస్తూ జనాన్ని ఏమార్చి కోట్లకు కోట్లు దండుకుంటున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టుల నయవంచనలనేవి వ్యవస్థల మీద ప్రజావిశ్వాసాన్ని హరించి వేసే తీవ్ర నేరాలు. వాటి మీద ఉక్కుపాదం మోపాలన్న సుప్రీంకోర్టు నిర్దేశాలు అవశ్యం ఆచరణీయాలు. దేశవ్యాప్తంగా సామాన్య జనం గుండెల్లో దడపుట్టిస్తున్న డిజిటల్ అరెస్టులపై లోతుగా దర్యాప్తు జరిపి బాధ్యులను బోనెక్కించే బాధ్యతను 'సుప్రీం' తాజాగా సీబీఐకి అప్పగించింది. నేరగాళ్ల మోచేతినీళ్లు తాగుతున్న బ్యాంకుల్లోని ఇంటిదొంగల గుట్టునూ పసిగట్టాలని న్యాయపాలిక ఆదేశించింది. సైబర్ మాయగాళ్లకు మ్యూల్ ఖాతాలను సమకూర్చడం, వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని ఆ బందిపోట్లకు చేరవేయడం, రుణాలకోసం దరఖాస్తు చేసిన వారి వివరాలతో దొంగ అకౌంట్లు తెరిచి నేరగాళ్లకు అప్పగించడం వంటి మహాపరాధాల్లో పలువురు బ్యాంకర్ల ప్రమేయం ఇప్పటికే బయటపడింది. ప్రజాధనానికి కాపలాదారులైన బ్యాంకర్లలోనే కొద్దిమంది ఇలా దారితప్పి చోరులతో చేతులుకలపడం క్షమార్హం కాదు. అలాంటివారిని ఉపేక్షించనేకూడదు!

డిజిటల్ ఇండియా పురోగతికి సైబర్ నేరాలు శరాఘాతాలవుతున్నాయి. 2023లో భారతీయుల నుంచి ఏడువేల కోట్ల రూపాయలకు పైగా కొల్లగొట్టిన సైబర్ నేరమూకలు- నిరుడు సుమారు రూ.23వేల కోట్ల వరకు దోచేశాయి. ఈ దగాపర్వాలను అడ్డుకోవాలంటే- కేంద్రం, అన్ని రాష్ట్రాలు, బ్యాంకులు, పేమెంట్ సంస్థలు కలిసి పనిచేయాల్సిందే. చాలా సైబర్ మోసాల మూలాలు విదేశాల్లో ఉంటున్నాయి. వాటిని దర్యాప్తు చేసి అసలు నేరగాళ్లకు సంకెళ్లు వేయాలంటే అంతర్జాతీయ సహకారం తప్పనిసరి! వివిధ దేశాల నడుమ అలాంటి బాంధవ్యం నెలకొల్పడానికి ఉద్దేశించిన ఐరాస ఒప్పందానికి ఆమోదం తెలిపే విషయాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఇటీవలే సూచించింది. జాతీయ ప్రయోజనాలకు, పౌరుల ఆర్థిక భద్రతకు మేలుచేసే అంశంలో వెంటనే తగిన నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం!




నాగరిక సమాజంలో హింస, తీవ్రవాదాలకు చోటు ఉండకూడదు... మరీ ముఖ్యంగా అహింసకు పుట్టినిల్లయిన మన దేశంలో. భారత ప్రజలు ప్రజాస్వామ్య, శాంతియుత విధానాలమీద నమ్మకముంచుతారు. దాన్ని జాగ్రత్తగా కాపాడటం ప్రభుత్వాల బాధ్యత.

– ఆర్.వెంకట్రామన్

కోరికల కోతులు

ఆధ్యాత్మికత అంటే కేవలం పుస్తకాల జ్ఞానమే కాదు. అది హృదయాన్ని తాకే అనుభవం. ఈ సత్యాన్ని రామకృష్ణ పరమహంస సులభమైన ఉపమానాల ద్వారా, సాధారణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పేవారు. ఆయన మాటల్లో గంభీరమైన తత్త్వం కూడా పసిపిల్లలకి సైతం అర్థమయ్యేలా ఉండేది.

ఒకసారి రామకృష్ణ పరమహంస శిష్యులకు బోధ చేస్తూ ఇలా చెప్పారు... 'మనిషి ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నప్పుడు, మనసు తరచూ చెదిరిపోతుంది. దానికి కారణం వాసనలు, కోరికలు. అవి మనిషిని వెంబడించే కోతుల్లాంటివి' అన్నారు. అదెలాగో వివరిస్తూ ఒక కథ కూడా చెప్పారాయన. 'ఓ చెట్టు మీద కోతుల గుంపు కూర్చుంది. ఒక కోతిని బలవంతంగానో బెదరగొట్టో తరిమేస్తే, మిగతావన్నీ కూడా అక్కడనుంచి దూకి పారిపోతాయి. కానీ మళ్లీ కాసేపటికే తిరిగి వచ్చేస్తాయి. అలాగే



మన మనసు కూడా కోతులతో నిండిన చెట్టులాంటిది. ఒక కోతిని తరిమితే కాసేపటికే మరో కోతి వస్తుంది. అదే కోరికల స్వభావం కూడా. కష్టపడి ఒక కోరికను వదిలించుకుంటే, వెంటనే మరో కోరిక మొగ్గ తొడుగుతుంది. అందుకే మనిషి జీవితం అంతా విషయ వాంఛలతో పోరాటంలోనే గడుస్తుంది' అని చెప్పారు పరమహంస. నిజమేకదా, మనిషికి జీవితమంతా ఒకదానివెంట ఒకటిగా వచ్చే కొత్త కొత్త కోరికలను నెరవేర్చుకోవడంతోనే సరిపోతుంది. ఉదాహరణకు- మొదట కాస్త డబ్బు ఉంటే చాలనుకుంటాం. ఆ డబ్బుతో అవసరాలు తీరాక విలాసాలకు వెళ్తాం. అవీ వచ్చాక పేరు కావాలి, పేరు వచ్చిన తరవాత అధికారం కావాలి. ఇక వాటికి అంతం అంటూ ఉండదు. ఇవన్నీ వరసగా వచ్చే కోతుల్లాంటివే.

అంతర్యామి

అంతమాత్రాన కోరికలను వదిలించుకోవడం మన వల్ల కాదని రామకృష్ణ పరమహంస చెప్పలేదు. వాటినెలా గెలవాలో బోధించారు. కోటానుకోట్ల కోరికలను అదుపు చేయాలనే ప్రయత్నంలో సమయాన్ని వృథా చేయవద్దన్నారు. 'ముందుగా ఒకే ఒక్క కోరిక - భగవంతుడి గురించి ఏర్పరచుకోవాలి. ఆ ధ్యాసలోకి ఎప్పుడైతే మనసు మళ్లుతుందో అప్పుడు మిగతా కోరికలన్నీ తామరాకుపై నీటి బిందువుల్లా వాటంతటవే జారిపోతాయి' అని చెప్పేవారు. గొప్ప ఆధ్యాత్మిక సత్యం ఇది. మనసు భగవంతుడి పైన నిలిచినప్పుడు ఇహలోక వాంఛలు మనసులోకి ఎలా రాగలుగుతాయి?

ఈ మాటలు మన దైనందిన జీవితానికి కూడా అన్వయించుకోవచ్చు. కుటుంబం, ఉద్యోగం, సంపాదన- ఇవన్నీ అవసరమే. కానీ మనసంతా అవే నిండిపోకూడదు. ఒక నిశ్చల ఆధ్యాత్మిక కేంద్రం మనిషికి అవసరం. అది లేకపోతే కోరికల కోతులు మనల్ని ఎప్పటికీ ప్రశాంతంగా ఉండనివ్వవు. రోజులో కొంత సమయం భగవన్నామస్మరణ, ప్రార్థన, ధ్యానానికి కేటాయిస్తే, మనసు ప్రశాంతమవుతుంది.

రామకృష్ణ పరమహంస చెప్పినట్లు, కోరికల నుంచి విముక్తం కావడానికి ఉన్న ఒకే ఒక్క మార్గం- ఆ పరమాత్మను ఆశ్రయించడం. మనసా వాచా కర్మణా ఆయనపై నిలిచిన మనసే నిజమైన శాంతిని, అసలైన ఆనందాన్ని అనుభవిస్తుంది.

– మాపూరు విజయలక్ష్మి

చిరకాల బంధానికి కొత్త చివుళ్లు!

రష్యా అధ్యక్షుడు పుతిన్ దాదాపు నాలుగేళ్ల తరవాత నేడు దిల్లీకి వస్తున్నారు. ఇరవై మూడో ఇండియా-రష్యా వార్షిక శిఖరాగ్ర భేటీలో భాగంగా ప్రధాని మోదీతో ఆయన సమావేశం కానున్నారు. ఆంక్షలను తోసిరాజని రష్యా చమురును భారత్ కొంటుండటంపై అమెరికా గుర్రుగా ఉంది. పైగా, తమ సరకులు, రక్షణ సామగ్రికి తలుపులు బార్లా తెరవాలని ఇండియాపై ఒత్తిడి తెస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పుతిన్ భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.



ఇంధనం, రక్షణ, దౌత్యం అనే మూడు స్తంభాలపై రష్యాతో ఇండియా బంధం అనాదిగా ముడిపడి ఉంది. ఇందులో ఇంధనం ఇరు దేశాల సంబంధాల్లో కీలకంగా నిలుస్తోంది. ఇండియా చమురు దిగుమతుల్లో దాదాపు 35శాతం వాటా రష్యాదే. 2021లో మాస్కో నుంచి 230 కోట్ల డాలర్ల విలువైన చమురును ఇండియా కొంది. 2024లో అది 5,270 కోట్ల డాలర్లకు చేరింది. రాయితీపై లభిస్తున్న చమురును పెద్దమొత్తంలో తెప్పించుకోవడం ఇండియా ఇంధన భద్రతకు అక్కరకొస్తోంది. రక్షణ రంగంలోనూ ఇరు దేశాల సంబంధాలు బలంగా ఉన్నాయి. ఫైటర్ జెట్లు, జలాంతర్గాములు, ట్యాంకులు, గగనతల రక్షణ వ్యవస్థలు తదితరాలను భారత్‌కు రష్యా సరఫరా చేస్తోంది. వాటికి సంబంధించిన సేవలను అందిస్తోంది. బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ, తూర్పు ప్రాంత ఆర్థిక మండలి తదితర బహుళ పక్ష వేదికలకు తోడు అణుశక్తిలో సహకారం, అంతరిక్ష అన్వేషణ, ఎరువులు, అనుసంధాన ప్రాజెక్టులు వంటి వాటితో ఇరు దేశాల దౌత్య సంబంధాలు అల్లుకుపోయాయి. అమెరికా, బెల్జియం, జపాన్ తదితరాలతో బంధాన్ని ఇండియా పటిష్ఠం చేసుకుంటున్నా, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి పరంగా మాస్కోతో మైత్రికి విశేష ప్రాధాన్యమిస్తోంది.

నమ్మకమైన నేస్తం

పుతిన్‌తో భేటీలో మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ వ్యవస్థలు, విడిభాగాలు, సైనిక సామగ్రి నవీకరణల గురించి భారత్ చర్చించవచ్చు. ఎస్‌యూ-57 ఫైటర్ యుద్ధ విమానాల గురించి మంతనాలు సాగించవచ్చు. అమెరికా ఆంక్షలకు గురికాని రష్యన్ సంస్థల నుంచి దీర్ఘకాలిక చమురు కాంట్రాక్టులను ఇండియా కుదుర్చుకునే అవకాశం ఉంది. రష్యన్ ఇంధన ప్రాజెక్టుల్లో ఇండియా పెట్టుబడుల పునరుద్ధరణ, అణుసహకార పురోగతి తదితరాలపైనా చర్చలు సాగవచ్చు. అలాగే క్రిటికల్ మినరల్స్, తయారీలో సహకారం, రష్యా ఫార్ ఈస్ట్ విధానంతో ఇండియాను భాగంచేసే సముద్ర అనుసంధానత పైనా మాటామంతీ జరగవచ్చు. మారుతున్న భౌగోళిక రాజకీయాల్లో రష్యాతో బంధాన్ని ఇంకా బలోపేతం చేసుకోవడం ప్రధాన అంశం. ఇందులో భాగంగా రక్షణ రంగ సరఫరాలు, నిర్వహణ కాంట్రాక్టులు, యుద్ధ విమానాలు, ట్యాంకులు, జలాంతర్గాములకు సంబంధించిన సాంకేతికల నవీకరణపై ప్రధానంగా దృష్టి సారించవచ్చు. ఇంకో పక్క, సహజ వాయు (ఎస్ఎల్‌జీ) క్షేత్రాల్లో ఇండియా పెట్టుబడులను పునరుద్ధరించడం, అణుశక్తి కర్మాగారాల నిర్మాణాన్ని వేగవంతం చేయడం తదితరాలపైనా రష్యా దృష్టి సారించవచ్చు. దిర్హమ్‌ను ఉపయోగించి లేదా భారత రూపీ వ్యవస్థతో రష్యా ఎస్‌పీఎఫ్‌ఎస్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా నూతన చెల్లింపుల చట్రానికి ఆమోదం తెలిపే అవకాశమూ ఉంది. ఈ పరిణామం ఇరు దేశాల సంబంధాల స్థిరీకరణకు తోడ్పడుతుంది. ఉమ్మడిగా రక్షణ పరికరాల తయారీ, చెన్నై-వ్లాదివోస్తాక్ నడవా, అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా నడవా లాంటి అంశాలూ చర్చకు రావచ్చు.

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా పాకిస్థాన్‌కు వంత పాడింది. 1971 యుద్ధంలో దానికి ఆయుధ సాయమూ చేసింది. ఆ సమయంలో సోవియట్ యూనియన్ మనకు కీలకమైన రక్షణ సామగ్రి అందించింది. ఐరాసలో దౌత్యపరంగా దన్నుగా నిలిచింది. చైనాతో 1962 యుద్ధం తరవాత మాస్కో దిల్లీ వెంట నిలిచింది. కశ్మీర్ విషయంలో ఎన్నోసార్లు అంతర్జాతీయ వేదికలపై భారత్ తరఫున వకాల్తా పుచ్చుకుంది. 1998లో ఇండియా అణు పరీక్షల దరిమిలా అమెరికా ఆంక్షలు విధించింది. ఆ తరవాత కూడా రక్షణ భాగస్వామిగా రష్యా కొనసాగింది. దశాబ్దాలుగా పాశ్చాత్య దేశాలు ఇండియాకు నిరాకరించిన వ్యూహాత్మక సాంకేతికతలను రష్యా నిస్సంకోచంగా సరఫరా చేసింది. ఇప్పటికీ భారత్ వినియోగిస్తున్న రక్షణ సామగ్రిలో 70శాతం దాకా రష్యా నుంచి అందినవే. కేవలం వాణిజ్య కోణంలో కాకుండా కష్టకాలంలో ఆదుకున్న ఇరు దేశాల భాగస్వామ్యం వృద్ధిచెందింది.

భారీ వాణిజ్య లోటు

రష్యాతో భారత్ వాణిజ్యం చాలా లోటులో కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రష్యాకు ఇండియా ఎగుమతుల విలువ 430 కోట్ల డాలర్లు. తరవాతి ఏడాది అది 490 కోట్ల డాలర్లకు చేరింది. కానీ, 2023-24లో రష్యా నుంచి 6,320 కోట్ల డాలర్ల విలువైన సరకులను ఇండియా తెప్పించుకుంది. తరవాతి సంవత్సరం అవి 6,380 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఇంధన భద్రత, ఇతర అవసరాలకోసం రష్యాపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది. మన ఎగుమతులకేమో ఆటంకాలు ఉంటున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య వృద్ధికి ఇది అవరోధంగా నిలుస్తోంది. కాబట్టి మన ఎగుమతులను పెంచాల్సి ఉంది. అంతర్జాతీయ నగదు బదిలీ వ్యవస్థ అయిన స్విఫ్ట్ నుంచి పాశ్చాత్య దేశాలు రష్యాను తప్పించిన తరవాత చెల్లింపులు బహుళ కరెన్సీలలో జరుగుతున్నాయి. చమురు కొనుగోలు కోసం ఇండియా చెల్లించిన రూ.60 వేల కోట్లు ఇప్పటికే భారతీయ ఖాతాల్లో వృథాగా పడిఉన్నాయి. ఈ నేపథ్యంలో తేలిగ్గా ఖర్చు పెట్టడానికి లేదా మార్పుకోవడానికి అవకాశం ఉన్న యూఏఈ దిర్హమ్‌లలో చెల్లింపులకు రష్యా మొగ్గు చూపుతోంది. పుతిన్‌తో భేటీలో ఇదీ చర్చకు రావచ్చు.

ప్రస్తుత పుతిన్ పర్యటన ప్రచ్ఛన్న యుద్ధకాలపు దౌత్యనీతికి చెందింది కాదు. పొంచి ఉన్న విపత్తులు, అనిశ్చితమైన సరఫరా గొలుసులు, ఆర్థిక గందరగోళ పరిస్థితులపై చర్చలకు ఇది ఉపకరిస్తుంది. చర్చలు కొద్దిమేర ఫలవంతమైనా చమురు, రక్షణ పరంగా దన్ను లభిస్తుంది. చర్చల్లో మరింత పురోగతి నెలకొంటే, ఆసియా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలను పునర్వ్యవస్థీకరిస్తుంది. అంతిమంగా పుతిన్ పర్యటన భాగస్వామ్య పక్షాలను ఎంచుకోవడానికి ఉద్దేశించింది కాదు- చీలికలుపీలికలైన ప్రస్తుత ప్రపంచంలో మనకు తోడుగా నిలిచేవారితో బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి తలపెట్టింది.



అజయ్ శ్రీవాస్తవ
వ్యవస్థాపకులు, గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ)

72 వేలమందిని చదివించారు!

కుడి చేత్తో ఇచ్చేది ఎడమ చేతికి తెలియకూడదంటారు పెద్దలు. ఇవ్వడాన్ని గొప్పగా చెప్పుకొంటే ఆ వచ్చే పొగడ్తలు మనిషిని మార్చేస్తాయని కాబోలు మనవాళ్లు ఇలాంటి మాటలతో గుప్తదానాల్ని ప్రోత్సహించేవారు. ప్రచారం కోసం కాకపోయినా, మరొకరికి స్ఫూర్తినివ్వడానికీ, సేకరించిన విరాళాల మొత్తం పారదర్శకంగా ఉండటానికీ... ఈరోజుల్లో చేసిన దానాల లెక్క చెప్పుకోక తప్పడం లేదు. అయితే ఇప్పటికీ మన మధ్య అలా గుప్తదానాలు చేసేవారు ఎందరో ఉన్నారు. ప్రఖ్యాత టీవీ ప్రెజెంటర్ ఓప్రా విన్‌ఫ్రే అలాంటివారే. ఆమె ఇప్పటివరకూ దాదాపు 4,450 కోట్ల రూపాయలను సేవాకార్యక్రమాలకు వినియోగించారు. వాటిలో ఎక్కువ మొత్తం బాలికల చదువు, ఆరోగ్యం, వారిలో నాయకత్వ ప్రతిభను పెంపొందించడం... వంటి వాటికే ఖర్చు చేస్తున్నారు.



ఓప్రా పేరు చెప్పగానే గుర్తొచ్చేది ఆమె టీవీ షోనే. అమెరికా జాతీయ టెలివిజన్‌లో తొలి ఆఫ్రికన్- అమెరికన్ టీవీ వ్యాఖ్యాతగా తన పేరుతోనే ఒక షోను పాతికేళ్ల పాటు నిరంతరాయంగా నిర్వహించిన ఘనత ఆమెది. పెద్ద పెద్ద సెలబ్రిటీలు సైతం ఓప్రా షోలో పాల్గొనడాన్ని గొప్పగా భావించే స్థాయి ఆ కార్యక్రమానికి తెచ్చారు.

ఓప్రా పేదరికంలో పుట్టారు. ఆమె పసిబిడ్డగా ఉన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోయారు. దాంతో అమ్మమ్మ, నాన్న, అమ్మల దగ్గర వంతులవారీగా పెరిగిన ఆమె లైంగిక వేధింపులు సహా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. అయితే వాటి ప్రభావం తన చదువుమీద పడకుండా చూసుకున్న ఓప్రా చిన్నప్పటినుంచి బాగా చదివేవారు. ఆ చదువే తన జీవితాన్ని మేలిమలుపు తిప్పిందంటారామె. స్వయంకృషితో పైకి వచ్చి నటిగా, రచయిత్రిగా, వ్యాఖ్యాతగా, మల్టీమీడియా కంపెనీ సీఈవోగా... భిన్నరంగాల్లో పేరు తెచ్చుకున్న ఓప్రా ఒంటిచేత్తో వందలకోట్ల రూపాయల విలువ చేసే వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించారు. టైమ్ మేగజైన్ ఏటా వెలువరించే వందమంది ప్రభావశీలుర జాబితాలో ఆమె పేరు పదిసార్లు చోటుచేసుకుంది. ఓప్రా విజయం మరెందరికో స్ఫూర్తినివ్వాలని భావించిన యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయ్ 'ఓప్రా విన్‌ఫ్రే, ద టైకూన్' పేరుతో ఒక సబ్జెక్టునే ప్రారంభించింది. అయితే ఎంత ఎదిగినా మూలాలను మర్చిపోలేదామె. తాను పడ్డ కష్టాలు ఇంకే ఆడపిల్లా పడకూడదని తన సంపాదనలో అధిక మొత్తాన్ని సేవాకార్యక్రమాల వైపు మళ్లించారు. 'ఓప్రా విన్‌ఫ్రే చారిటబుల్ ఫౌండేషన్' పెట్టారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల విద్య, మహిళా సాధికారత, పిల్లలపట్ల లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పనిచేసే పలు లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలకు నిధులు అందిస్తున్నారు. ఓప్రా ఫౌండేషన్ ఉపకార వేతనాల సాయంతో 72 వేల మంది ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. ఏడున్నర కోట్ల భోజనాలూ అందించారు. మరెందరికో ఇళ్లు కట్టించి నిలువనీడ ఏర్పాటుచేశారు. సమాజంలోనూ ఇచ్చే అలవాటును ప్రోత్సహించాలని 'ఓప్రాస్ ఏంజెల్ నెట్‌వర్క్'ని ప్రారంభించారు. ఈ సంస్థ దానధర్మాలను స్వీకరించి ఒంటరి మహిళలకోసం షెల్టర్లను నిర్మిస్తుంది. ఎంత సంపాదించామన్నది కాదు- సమాజానికి ఎంత తిరిగిచ్చామన్నదే ఓప్రా జీవన సందేశం!

– విస్మయ



ఇంధన స్నేహం

ఎనిమిదేళ్ల కిందట ఇండియా మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా రెండు శాతం కన్నా తక్కువగానే ఉండేది. ఉక్రెయిన్ మీద కయ్యానికి కాలుదువ్విన రష్యాపై పాశ్చాత్య దేశాలు పెను ఆంక్షలు విధించాయి. ఆ క్రమంలో అది రాయితీకి చమురు అమ్మడం ప్రారంభించింది. దాంతో, 2022లో రష్యా నుంచి ఇండియా క్రూడ్ ఆయిల్ దిగుమతులు ఒక్కసారిగా పెరిగాయి. తరవాతి కాలంలో అవి మరింత అధికమయ్యాయి. ఆ వివరాలు...

సం॥	రష్యా నుంచి చమురు దిగుమతులు (కోట్ల డాలర్లలో)	మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా (శాతాల్లో)
2017	131	1.6
2018	122	1.1
2019	146	1.4
2020	0.92	1.4
2021	231	2.2
2022	2,550	14.7
2023	4,860	34.6
2024	5,270	37.3
2025 (ఏప్రిల్–సెప్టెంబర్)	3,350	31.8

(ఆధారం: యూఎన్ కామ్‌ట్రేడ్ డాటాబేస్, జీటీఆర్ఐ నివేదిక)

దూరవిద్యా దార్శనికుడు

దేశ ప్రజలందరికీ 'ఎడ్యుకేషన్ ఎట్ యువర్ డోర్ స్టెప్' నినాదంతో దూరవిద్యను దరిచేర్చడం వెనక ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి కృషి ఎనలేనిది. ఆయన కరీంనగర్ జిల్లా, మైలారం గ్రామంలో కాంతమ్మ, కృష్ణారెడ్డి దంపతులకు 1929, డిసెంబరు 4న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం కరీంనగర్‌లోనే కొనసాగింది. తన గ్రామం నుంచి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన మొదటి వ్యక్తిగా మన్ననలు అందుకున్నారు. 1949లో హైదరాబాద్ వచ్చి నిజాం కళాశాలలో చేరారు. అక్కడే పీయూసీ, బీఏ పూర్తిచేశారు. 1957లో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ అందుకున్న

ఉన్నత చదువులను దూరవిద్య రూపంలో దేశ ప్రజలందరికీ దరిచేర్చిన ఘనత ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డిదే. సామాజిక, ఆర్థిక, మతపరమైన కారణాలవల్ల పెద్ద చదువులకు దూరమైన వారెందరికో ఈ విద్యావిధానం ఎంతో అక్కరకు వస్తోంది. భారతదేశ దూరవిద్యా పితామహుడిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ రామ్‌రెడ్డి జయంతి నేడు.

రామ్‌రెడ్డి- నల్గొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. అయితే, ఆ ఏడాదిలోనే ఆయన ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చేరి, ఎమ్మెస్సీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు.

మలుపు తిప్పిన లండన్ చదువు...

లండన్‌లో గడిపిన సమయం రామ్‌రెడ్డి జీవితంలో అనేక మార్పులకు కారణమైంది. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకున్న ఆయన అద్భుతమైన మేధోమథనం చేసేవారు. విద్యా బోధనలో నైపుణ్యాలను మెరుగుపరచుకున్నారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడానికి లండన్ వాతావరణం ఆయనకు ఎంతగానో దోహదపడింది. హెరాల్డ్ లాస్కీ, లియోనెల్ రాబిన్స్ వంటి దిగ్గజ పరిశోధకులతో పరిచయం రామ్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని బాగా ప్రభావితం చేసింది. 1959లో లండన్ నుంచి తిరిగి వచ్చిన ఆయన- ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఉపన్యాసకుడిగా చేరారు. తరవాత వివిధ హోదాల్లో సేవలు అందించి, 1977లో అదే యూనివర్సిటీ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలోనే, సార్వత్రిక (దూర)విద్యా విధానాన్ని ప్రారంభించాలన్న ఆలోచన వచ్చిందాయనకు. ఈ విషయమై విశేష అధ్యయనం సాగించిన రామ్‌రెడ్డి- ప్రపంచ ప్రఖ్యాత బ్రిటిష్ ఓపెన్ యూనివర్సిటీ పనితీరును పరిశీలించి మన పరిస్థితులకు తగ్గట్లు విధివిధానాలు రూపొందించారు. ఆయన కృషి ఫలితంగానే, దేశంలోనే మొదటిసారిగా 1982లో హైదరాబాద్‌లో 'ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటీ' ఏర్పాటైంది. అదే నేటి 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ'!




ప్రొఫెసర్ రామ్‌రెడ్డి ప్రయత్నాన్ని గమనించిన నాటి ప్రధాని రాజీవ్ గాంధీ, 1985లో నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపనకు బ్లూప్రింట్ సిద్ధం చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఆ క్రమంలోనే ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయ(ఇగ్నో) స్థాపనకు పార్లమెంటు ఆమోదం లభించింది. దాంతో అదే ఏడాది నవంబరులో ప్రొఫెసర్ రామ్‌రెడ్డి వ్యవస్థాపక ఉపకులపతిగా ఇగ్నో సేవలు అందుబాటులోకి వచ్చాయి. తరవాత ఆయన వివిధ రాష్ట్రాల్లో ఇగ్నో ప్రాంతీయ, అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశారు. ప్రపంచంలోని ప్రముఖ ఓపెన్ యూనివర్సిటీల పనితీరును పరిశీలించి, సార్వత్రిక విశ్వవిద్యాలయ వ్యవస్థకు ఒక చక్కని నమూనాను రూపొందించారు. దాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంతర్జాతీయ సదస్సులో ఆవిష్కరించడంతో, పలు దేశాల్లో ఓపెన్ యూనివర్సిటీల స్థాపనకు మార్గం సుగమమైంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ రామ్‌రెడ్డిని సలహాదారుగా నియమించింది. ఆసియా ఓపెన్ యూనివర్సిటీస్ అసోసియేషన్ మొదటి సెక్రటరీ జనరల్‌గానూ ఆయన సేవలు అందించారు. మరోవైపు అంతర్జాతీయ దూరవిద్యా మండలి క్రియాశీలక సభ్యుడిగా ఉంటూనే, కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్(సీవోఎల్) ఏర్పాటులో కీలక భూమిక పోషించారు.

ఎన్నో పురస్కారాలు...

కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ రామ్‌రెడ్డిని 1991లో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) ఛైర్మన్‌గా నియమించింది. యూజీసీ పనితీరును మెరుగుపరచేందుకూ, ఆ సంస్థను మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు ఆయన చాలా కృషి చేశారు. ముఖ్యంగా ఉన్నత విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్)ను స్థాపించారు. విద్యా రంగానికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ప్రొఫెసర్ రామ్‌రెడ్డిని ఎన్నో పురస్కారాలు వరించాయి. 1995 జూన్‌లో 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్' అవార్డు అందుకున్న ఆయన, అదే ఏడాది జులై రెండో తేదీన లండన్‌లోని ఒక స్నేహితుడి ఇంటిలో తీవ్రమైన గుండె పోటుతో మరణించారు. 2035 కల్లా దేశంలోని ఉన్నత విద్యా కోర్సుల్లో యువతీ యువకుల చేరికలను (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను) 50శాతానికి పెంచి, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా భారత్‌ను తీర్చిదిద్దడమే ప్రొఫెసర్ రామ్‌రెడ్డికి మనం ఇవ్వగలిగిన నిజమైన అక్షర నీరాజనం.



డాక్టర్ రాజు బోళ్ల
రీజినల్ డైరెక్టర్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, హైదరాబాద్



ఈనాడు అమరావతి
ఎన్టీఆర్
గురువారం డిసెంబరు 4, 2025

సీఎం ఆదేశించారు.. ఆహ్లాదకరంగా మార్చారు!



సచివాలయ ఆవరణలో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయడంపై మంగళవారం గమనించిన సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. ఆవరణలో ఎక్కడా బారికేడ్లు పెట్టవద్దని, సచివాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడకూడదని.. ఆహ్లాదకర అనుభూతిని వారికి కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు. దీంతో బుధవారం ఉదయం బారికేడ్లు తొలగించి.. అన్ని బ్లాకులు ముందు రంగురంగుల పూల మొక్కల కుండీలు, మొక్కలను ఏర్పాటు చేశారు. సీఎం బ్లాకు ప్రవేశమార్గం వద్ద అందమైన పూలమొక్కల కుండీలను వరుసగా ఉంచారు. - ఈనాడు అమరావతి

పవిత్ర సంగమం.. నిర్వహణ ఘోరం..



ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న పవిత్ర సంగమం ఘాట్ వద్ద నిర్వహణ లోపంతో ఆ పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఘాట్ల పరిసరాలు, మెట్లు ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా బురదమయంగా మారాయి. దీనిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మట్టితో నిండిపోయింది. పర్యాటకులు వచ్చినా ఇక్కడి పరిస్థితి చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

- ఈనాడు, అమరావతి

కలశజ్యోతుల ఊరేగింపు నేడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భవానీ దీక్షల విరమణను పురస్కరించుకొని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో కలశజ్యోతుల ఊరేగింపు సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రం నుంచి గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో శీనానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యే పూజ నిర్వహించిన అనంతరం అలంకరించిన వాహనంలో ఊరేగింపు నిర్వహిస్తారని చెప్పారు.

7న జూడో జట్ల ఎంపికలు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: కండ్రిక లోని ఏఆర్ స్పోర్ట్స్ అకాడమీలో ఈ నెల 7వ తేదీన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల క్యాడెట్, జూనియర్ బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా జూడో సంఘం కార్యదర్శి ఎన్.పవన్ సందీప్, కృష్ణా జిల్లా జూడో సంఘం కార్యదర్శి వెంకట్ నామిశెట్టి తెలిపారు. వివరాలకు 83338 23118, 73862 25278 నంబర్లను సంప్రదించాలన్నారు.

కళల భారతం.. కమనీయ భరితం..

పాల్గొన్న రాష్ట్రాలు: 22
పోటీల్లో రకాలు: 18
హాజరైన విద్యార్థులు 1800 మంది

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తాడేపల్లి

సంస్కృతి పరిఢవిల్లింది.. సంప్రదాయం ఉట్టిపడింది... జానపదం ఝల్లుమనగా.. గిరిపుత్రుల జీవన వైవిధ్యం గుండెను తాకింది. దేశభక్తిని ప్రేరేపించే నృత్యాలు ఓ వైపు.. దైవభక్తితో ఉత్తేజపరిచే ప్రదర్శనలు మరోవైపు... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశం నలుమూలల నుంచి వచ్చిన ఏకలవ్య గురుకుల మోడల్ పాఠశాలల విద్యార్థులు వారి వారి ప్రాంత వేషధారణలతో సందడి వాతావరణం నెలకొంది. ఇందుకు అమరావతిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణం వేదికగా నిలిచింది. ఇక్కడ బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆరో జాతీయ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల సాంస్కృతిక ఉత్సవాలు (ఉద్భవ్-2025) ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమాలను కేంద్ర మంత్రి జువల్ ఓరమ్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి లాంఛనంగా ప్రారంభించారు.

కేఎల్‌యూ వేదికగా ఘనంగా ప్రారంభమైన ఉద్భవ్-2025 వేడుకలు

కినారి నృత్యం



హిమాచల్‌ప్రదేశ్ సాంస్కృతిక వారసత్వంలో ముఖ్యమైనది కినారి నృత్యం. దీన్నే కిన్నౌరీ నాటి అని కూడా పిలుస్తారు. పంట కోతలు, పండగలు, నూతన సంవత్సర వేడుకల్లో అక్కడి గిరిజనులు ఆడిపాడే నృత్యమిది. నెమ్మదిగా.. లయబద్ధమైన కదలికలతో నాట్యం చేస్తారు. ఒకప్పుడిది పురుషులకే పరిమితమయ్యేది. ఇప్పుడు మహిళలు కూడా ఆడిపాడుతున్నారు.

థారు తెగ హోలీ



ఉత్తరప్రదేశ్‌లోని నేపాల్ సరిహద్దు ప్రాంతాలతోపాటు ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో నివసించే థారు తెగ ప్రజలు హోలీ వేడుకలు చేస్తారు. వీటిని వారు ఖండీ హోలీ అని పిలుస్తారు. ఈ నృత్యం హోలీకి ఎనిమిది రోజుల ముందు మొదలై.. హోలీ రోజున పతాకస్థాయికి చేరుకుంటుంది.

గఢ్వాలి భంగిమ



ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ ప్రాంతానికి చెందిన నృత్యమిది. పండగలు, వివాహాలు, సామాజిక సమావేశాల్లో ప్రదర్శిస్తుంటారు. ఇందులో చోలియా అనే యుద్ధనృత్యం కూడా ఉంది. పురుషులు ఆయుధాలతో దీన్ని ప్రదర్శిస్తారు.

పోనుంగ్ భళా..



అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆది తెగ ప్రజలు ప్రదర్శించే నృత్యమిది. పంట కోత కాలానికి ముందు జరిగే సోలుంగ్ పండగ సందర్భంగా మంచి దిగుబడులు రావాలని, సమాజం బాగుండాలని కోరుకుంటూ నృత్యం చేస్తారు. యువతులు, వివాహితలు ఒకరి భుజంపై ఒకరు చేతులు వేసుకుని వలయాకారంలో తిరుగుతూ చేస్తారు. దీనికి నాయకత్వం వహించే వ్యక్తిని మిరి అని పిలుస్తారు. ఇతను కత్తిలాంటి వాయిద్యపరికరం పట్టుకుని కదిలిస్తూ లయబద్ధంగా శబ్దం చేస్తాడు.

నిధులు మెక్కేశారు.. నివేదిక తొక్కేశారు..

- వైకాపా పాలనలో పంచాయతీల్లో భారీ అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన

ఈనాడు, అమరావతి

పల్లె ప్రగతికి వైకాపా పాతరేసింది. నిధులు తెచ్చింది లేకున్నా ఉన్న నిధులను స్థానిక నాయకులు, అధికారులు కుమ్మక్కై స్వాహా చేశారు. కూటమి వచ్చాక పంచాయతీలపై విచారణ చేపట్టినా ఫలితం లేదు. కాలం గడిచిపోతున్నా విచారణలు పూర్తి కావు. నివేదికలు వచ్చినా బాధ్యులపై చర్యలు, స్వాహా చేసిన సొమ్ము తిరిగి రాబట్టడంలో వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి.



పెనుగంచిప్రోలులో అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు (పాతచిత్రం)

పెనుగంచిప్రోలు పంచాయతీలో చేసిన పనులకు కొత్తగా బిల్లులు చేసుకోవడం, పారిశుద్ధ్య కార్మికులను హరిత రాయబారులుగా చూపి సర్పంచి, కార్యదర్శి రూ.కోటికి పైగా దోచుకున్నారని పంచాయతీ వార్డు సభ్యుడే ఫిర్యాదు చేశారు. నివేదిక ఇవ్వడానికి తాత్సారం చేస్తున్నారు. విచారణ ఆలస్యం చేయించి ఫైళ్లలో లోపాలు సరి చేసుకుంటున్నారని తాజాగా స్పందనలో మరోసారి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సైతం వారం రోజుల్లో విచారణ కొలిక్కి తేవాలని డీపీవోకి చెప్పారు. ఇప్పటికీ పురోగతి లేదు.

జగ్గయ్యపేట మండలం ముక్త్యేశ్వరపురంలో వైకాపా పాలనలో రూ.6కోట్లు దోచేశారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చేసుకున్నారు. సర్పంచి భర్త, కార్యదర్శి బాధ్యులని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జులైలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టినా నివేదిక ఊసే లేదు. ఉపముఖ్యమంత్రి చెప్పినా లెక్కలేదు.

కోడూరు పంచాయతీలో వైకాపా పాలనలో చేయని పనులకు బిల్లులు పెట్టినట్లు, దాదాపు రూ.34లక్షల వరకు దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ పూర్తి చేసినట్లు చెబుతున్నా నివేదిక వెలుగు చూడడం లేదు.

గన్నవరం పంచాయతీలో వైకాపా సమయంలో కుంభకోణం జరిగింది. పారిశుద్ధ్య పనుల్లో యంత్రాల వినియోగం, ఇంటి పన్నుల సొమ్ము జమ చేయకపోవడం..వంటి విషయాల్లో రూ.1.5కోట్లు స్వాహా చేశారు. విచారణ నివేదిక వచ్చినా స్వాహా చేసిన సొమ్ము మాత్రం ఏళ్లు గడుస్తున్నా రికవరీ చేయలేదు.


ప్రభుత్వం మారినా పట్టదా..

పంచాయతీలకు వచ్చే కాస్తో కూస్తో ఆదాయాన్ని సైతం వైకాపా హయాంలో స్వాహా చేశారు. అప్పుడు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారాక చర్యలు తీసుకుంటారని..దోచేసిన సొమ్ము తిరిగి కట్టిస్తారనుకున్నవారికి నిరాశే మిగులుతోంది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ విచారణ పట్టాలెక్కడం లేదు. ఉన్నతాధికారుల నుంచి విచారణ అధికారుల వరకు నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోంది. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు విచారణల గురించి సదరు జిల్లా అధికారిణికి ఫిర్యాదుదారులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించడం లేదు. దీంతో కార్యాలయానికి వెళ్లినా కలవడం గగనమే. ★ కృష్ణా, ఎన్టీఆర్ కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ మాట్లాడుతూ.. వేగంగా విచారణలు పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైకాపా పాలన పోయినా.. ఇంకా పాత వాసన వదల్లేదు

కృష్ణా జిల్లాలో 'వైఎస్సార్ ఆర్‌బీకే' పేరుతో రసీదులు


కంకిపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా వైకాపా వాసన పోలేదని.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జారీ చేస్తున్న రసీదులు స్పష్టం చేస్తున్నాయి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే) పేరును ఏడాది కిందట 'రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే)'గా అధికారికంగా మార్చిన విషయం తెలిసిందే. కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఇంకా పాత పేరుతోనే ధాన్యంలో తేమ శాతాన్ని సూచించే రసీదులు జారీ అవుతున్నాయి. గతేడాది ఖరీఫ్, రబీలోనే పలువురు రైతులు ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాఫ్ట్‌వేర్ ఇంకా అప్‌డేట్ కాలేదని.. వచ్చే ఖరీఫ్‌నకు మారుతుందని సమాధానమిచ్చారు. గత నెల రోజులుగా కృష్ణా జిల్లావ్యాప్తంగా పాత పేరుతోనే రసీదులు జారీ అవుతుండటంతో రైతులు మరోసారి అధికారులకు తెలిపారు. దీంతో 'రసీదులు ఇవ్వవద్దని.. అవసరమైతే 'స్క్రీన్‌షాట్'ను సంబంధిత రైతులకు వాట్సప్ చేయాలని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని జిల్లా అధికారులు మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది.


Dr. Y.S.R. RBK
GOVT. OF A.P.

M. No.:
Date : 03/12/25
Time : 17:07:06
Comm. : PADDY (SHORT)
Moist.: 24.3 %
Tamp. : 24.2 deg.C
Depos.:

కోలవెన్ను ఆర్‌ఎస్‌కేలో జారీ చేసిన రసీదు

కుండీలో మొక్క.. నిచ్చెనలా ఎంచక్కా



హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కడియాల సాంబశివరావు, శిరీషా దంపతులకు మొక్కల పెంపకమంటే బాగా ఆసక్తి. ఈ క్రమంలోనే తమ ఇంటి ఆవరణలోనూ, భవనంపైనా అనేక రకాల మొక్కలు పెంచుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ నర్సరీ ప్రారంభానికి వెళ్లిన వీరు క్రోటన్ జాతి మొక్కగా భావించి ఒకదాన్ని కొనుగోలు చేశారు. ఆ మొక్కను ఇంటికి తీసుకొచ్చి చిన్నపాటి కుండీలో నాటారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా అదే కుండీలో ఈ మొక్క బాగా పెరుగుతూ ఇప్పుడు దాదాపు 15 అడుగుల ఎత్తు ఎదిగింది. చూపరుల్ని ఆకట్టుకునే విధంగా పెరిగిన ఈ మొక్క యూఫోర్బియా జాతికి చెందినదని, దీన్ని 'ఆఫ్రికన్ మిల్క్' అంటారని మండల ఉద్యానాధికారి జోసెఫ్ సుందరం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కొన్ని మొక్కలు ఇలా అసాధారణ ఎత్తుకు పెరుగుతాయని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

పేపరు కర్మాగారాల సిండికేట్

- సుబాబుల్ ధర తగ్గింపు
- రైతుల ఆగ్రహం

నందిగామ, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

పేపరు కర్మాగారాలు సిండికేట్ అయ్యాయి. సుబాబుల్ ధర తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నాయి. టన్నుకు రూ.700 ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కర్మాగారాలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి తగ్గిన ధరను అమలు చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 75 వేల ఎకరాల్లో సుబాబుల్ తోటలు ఉన్నాయి. గత మూడేళ్ల నుంచి ధర బాగుండడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపారు. దీనివల్ల సాగు గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో కర్ర దిగుబడి పెరగడంతో కర్మాగారాలు మళ్లీ దోపిడీకి తెరలేపాయి. కొద్దికొద్దిగా ధర తగ్గిస్తూ ఇప్పటి వరకు ఏకంగా టన్నుకు రూ.వెయ్యి వరకు తగ్గించాయి.

జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సుబాబుల్ వేశారు. ప్రతి రెండు, మూడేళ్లకోసారి కర్ర కోతకు వస్తుంది. ఎకరానికి 30 నుంచి 40 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గత నెల వరకు వర్షాలు విపరీతంగా ఉండడం వల్ల కర్ర నరికి విక్రయించడం రైతులకు వీలుకాలేదు. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో అమ్మకాలు చేస్తున్నారు. ఒకేసారి కర్ర కర్మాగారాలకు చేరుతుండడంతో యాజమాన్యాలు దోపిడీకి తెర తీశాయి. గతంలో టన్ను రూ.6500లకు కొనుగోలు చేశారు. తర్వాత రూ.6300 నుంచి రూ.6200లకు కొన్నారు. ఇప్పుడు మళ్లీ కోత పెట్టి టన్నుకు కేవలం రూ.5500 ఇస్తున్నారు. కేవలం ఒక కర్మాగారం మినహా మిగిలినవన్నీ సిండికేట్‌గా మారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయి. సుబాబుల్ కర్ర క్రయ, విక్రయాలపై మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.



లారీకి కర్ర లోడింగ్ చేస్తున్న కూలీలు

వర్షాలు తగ్గడంతో విక్రయాలకు అనువు

గతంలో మార్కెట్ యార్డుల అధీనంగా డంపింగ్ యార్డుల ద్వారా కర్మాగారాలు కర్ర కొనుగోలు చేసేవి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్(ఆర్సీ)పై స్థానిక వ్యాపారులు, దళారుల ద్వారా నేరుగా కర్మాగారాలు కొనుగోలు చేస్తుండడం రైతులకు శాపంగా మారింది. తమకు కర్ర అవసరమైనప్పుడు ధర పెంచడం లేకపోతే తగ్గించడం అలవాటుగా మార్చుకున్నారు. వీరికి కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో మరింత దోపిడీ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

142 రోజులు.. 1,652 టీఎంసీలు

కడలిలో కలిసిన వరద నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రస్తుత ఖరీఫ్ సీజనులో కృష్ణా నది నీరు పంటల సాగుకు వినియోగం కన్నా.. సముద్రంలో విలీనం అయినదే ఎక్కువగా ఉంది. జూన్ నుంచి ఇప్పటి వరకు నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు మొత్తం 142 రోజుల పాటు వరద నీరు ప్రవహించింది. ఈ నేపథ్యంలో కృష్ణా నది నుంచి మొత్తం 1,652.09 టీఎంసీలు కడలిలో కలిసిపోయింది. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువ ద్వారా కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు 87.76 టీఎంసీలు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువ నుంచి గుంటూరు, బాపట్ల తదితర జిల్లాలకు 58.21 టీఎంసీల నీటిని వ్యవసాయ అవసరాలకు వినియోగించారు. ఖరీఫ్ పనులు ఆరంభ తరుణంలో కృష్ణా పరివాహకంలో నీటి ఎద్దడి కారణంగా ఈ సీజనులో పట్టిసీమ నుంచి గోదావరి జలాలు 8.45 టీఎంసీలు తీసుకున్నారు.

రూ.50 కోట్ల విలువైన భూమి విక్రయానికి యత్నం

- ఫోర్జరీ సంతకాలు, నకిలీ అగ్రిమెంట్ల సృష్టి
- బేరం పెట్టిన భూమిలో ఓ ఎమ్మెల్యేకు చెందిన ప్లాట్.?

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం చినకాకానిలో రూ.50 కోట్ల విలువైన భూమిని ఫోర్జరీ సంతకాలు, వంద రూపాయల స్టాంప్ పేపర్లపై ఫోర్జరీ సంతకాలతో నకిలీ అగ్రిమెంట్ పత్రాలను సృష్టించి విక్రయానికి ప్రయత్నించిన వ్యక్తిని మంగళగిరి గ్రామీణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన రౌడీ షీటర్ షేక్ జలీల్ చినకాకానిలోని 12 మంది రైతులకు చెందిన 10.25 ఎకరాలు భూమిని విక్రయించేందుకు కొంత మంది వ్యక్తులతో రూ.14 కోట్లకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.70 లక్షల వరకు అడ్వాన్స్ తీసుకున్నాడు. ఇందులో రైతుల వద్ద భూములను కొనుగోలు చేసినట్లు ఆరుగురు రైతులకు చెందిన భూములకు సంబంధించి వారి సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ అగ్రిమెంట్లు తయారు చేశారు. మరో ఆరుగురు రైతులకు చెందిన అగ్రిమెంట్లపై సంతకాలు లేవు. నాలుగు రోజుల కిందట విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు అనే వ్యక్తి భూమిని చదును చేస్తుండగా గమనించిన రైతులు అడ్డుకున్నారు. జలీల్ అనే వ్యక్తి వద్ద భూములు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నానని, కొలతలు వేసేందుకు భూమి చదును చేస్తున్నట్లు ఆయన చెప్పడంతో నిర్ఘాంతపోయిన రైతులు.. తమ భూములను ఎవరికీ అమ్మలేదని స్పష్టం చేశారు. దీంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకుంది. జరిగిన ఘటనపై రైతులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇందులో రైతు సంఘం నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అంకినీడు ప్రసాద్, సాంబశివరావు, శివన్నారాయణ, నరసింహారావులకు చెందిన సంతకాలను ఫోర్జరీ చేసినట్లు ఉంది. మిగిలిన ఆరుగురికి చెందిన పత్రాలపై సంతకాలు లేనట్లు గుర్తించారు. ఇందులో జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు 45 సెంట్ల భూమి ఉన్నట్లు తెలిసింది. 2012లో ఇక్కడ సదరు భూమిని ఆయన కొనుగోలు చేసినట్లు సమాచారం. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని జలీల్‌ను పెదవడ్లపూడిలో బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు. నిందితుడికి మంగళగిరి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. మంగళగిరి, గుడివాడ, నల్లపాడు తదితర చోట్ల అతడిపై కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

నకిలీ మద్యం కేసులో.. సిద్ధమవుతున్న ప్రాథమిక ఛార్జిషీట్

ఈనాడు, అమరావతి

ఇందులోనే జోగి సోదరుల పాత్ర, కుట్రపై ప్రస్తావన



ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం వ్యవహారంపై సిట్, ఎక్సైజ్ అధికారులు ఈ వారంలో ప్రాథమిక ఛార్జిషీట్ దాఖలుకు కసరత్తు చేస్తున్నారు. అక్టోబరు 6న భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఇప్పటివరకు సాగిన దర్యాప్తు ఆధారంగా ఎక్సైజ్ కోర్టులో అభియోగపత్రం వేయనున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 25 మందిని నిందితులుగా చేర్చారు. మూతలు సరఫరా చేసిన మనోజ్‌కుమార్, ధారబోయిన ప్రసాద్, సీసాలు సమకూర్చిన సెంథిల్ తదితరులు అరెస్టు కావాల్సి ఉంది. చట్ట ప్రకారం పదేళ్లలోపు శిక్ష పడే కేసులకు 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్‌ను ఫైల్ చేయాల్సి ఉంది. దీంతో డిసెంబరు 6వ తేదీలోగా అభియోగపత్రం దాఖలు చేయాలన్న ఆలోచనలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు. ములకలచెరువు కేసులో ఉన్న పలువురు నిందితులను కస్టడీకి తీసుకుని విచారించాల్సి ఉంది. ఇంకా కొందరు అరెస్టు కావాల్సి ఉంది. తొలుత ప్రాథమిక ఛార్జిషీట్ వేసి, ఆ తర్వాత అనుబంధ పత్రాలు దాఖలు చేయాలని తలపోస్తున్నారు.

దొరికిన ఆధారాలు..

మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాము పాత్ర గురించి ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. సెప్టెంబరు 23న జనార్దనరావు ఆఫ్రికా వెళ్లే ముందు జోగి రమేష్‌ను అతని ఇంట్లో కలిసినట్లు ఆధారాలు లభించాయి. జనార్దనరావు చెప్పిన సమయానికి.. జోగి రమేష్ ఇంటి సమీపంలో తిరిగినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను తీసుకుని ప్రతి లావాదేవీని పరిశీలించారు. జోగి సోదరులకు మూడేళ్లలో విడతలవారీగా రూ.70లక్షలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడించారు. వీటికి సంబంధించి కీలక ఆధారాలు దొరికినట్లు తెలిసింది. 2022లో అక్టోబరు 25న జనార్దనరావు యూపీఐ ఖాతా నుంచి జోగి రాముకు నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. ఇటీవల కాలంలో జోగి రాము, జనార్దనరావు మధ్య 18 ఫోన్ కాల్స్ ఉన్నట్లు బయటపడింది. జోగి సోదరుల పాత్ర, కుట్రలో వీరి ప్రమేయంపై తొలి ఛార్జిషీట్‌లో పొందుపర్చనున్నారు.

ఫోరెన్సిక్ విశ్లేషణలో..

ములకలచెరువులో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులు తమ ఫోన్లలో చెరిపేసిన ఆధారాలను ఫోరెన్సిక్ నిపుణులు తిరిగి రాబట్టారు. నిందితుల మధ్య సాగిన యూపీఐ చెల్లింపులు, వాటి తాలూకా స్క్రీన్‌షాట్లు, పలు ఫొటోలు బయటపడ్డాయి. తిరుమలశెట్టి శ్రీనివాసరావు నుంచి తలారి రంగయ్యకు వెళ్లిన వాట్సాప్ ఛాట్స్‌లో లేబుళ్లకు సంబంధించి ఫొటోలు ఉన్నాయి. రవి, అల్లాబక్ష్, చెక్కా సతీష్ మధ్య జరిగిన వాట్సాప్ ఛాట్స్‌లో ఆధారాలు వెలికి తీశారు. జనార్దనరావు, మనోజ్, ధారబోయిన ప్రసాద్‌ల మధ్య మూతల సరఫరా కోసం సాగిన బేరసారాలు, లావాదేవీలు, చెల్లింపుల వివరాలు ఉన్నాయి. వీటన్నింటితో రెండు, మూడు రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు.

శత శాతం సాధనకు.. వంద రోజుల ప్రణాళిక

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్షల విధానంలో కూటమి ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నవంబరు 30 నాటికి సిలబస్ పూర్తి అయింది. దీంతో ఈ నెల ఆరవ తేదీ నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలని చూస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 వరకు ఒక్కో సబ్జెక్టును బోధించనున్నారు. అదే రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దానిపై పరీక్ష నిర్వహించనున్నారు. ఈ వంద రోజుల ప్రణాళికలో ఉపాధ్యాయుల బాధ్యతలు, విద్యార్థులు పాటించాల్సిన విషయాలు పొందుపరిచారు.

ఉపాధ్యాయుల బాధ్యతలు

విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి సీడీ గ్రేడుల్లో ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కొందరిని దత్తత తీసుకుని అవసరమైన విద్యా సామగ్రి అందించాలి. రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పిరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాలి. ప్రతి రోజూ పాఠ్యాంశ నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో నుంచి తీసుకుని విద్యార్థులతో పరీక్షలు రాయించాలి. మార్చిలో జరిగే తుది పరీక్షల వరకు ప్రీఫైనల్, గ్రాండ్ టెస్ట్‌లు పెట్టాలి. అంతర్గత పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తల్లిదండ్రులకు అందజేయాలి.

విద్యార్థులు పాటించాల్సినవి

ప్రతి రోజు తెల్లవారుజామున అయిదు గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. గతంలో జరిగిన పబ్లిక్ పరీక్షల పత్రాలు చదివి సాధన చేయాలి. ఆ ప్రశ్నలను చూడకుండా వేగంగా రాసే అలవాటు చేసుకోవాలి. ప్రతి సబ్జెక్టును రెండు మూడు భాగాలుగా విభజించుకుని పరీక్ష గడువును బట్టి పునశ్చరణ చేయాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం చూపకూడదు. పాఠ్యాంశాల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. రోజు 20 నిమిషాల పాటు ధ్యానం చేస్తే మేలు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 519 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 27,797 మంది విద్యార్థులు మార్చి 16 నుంచి 140 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడున్న వసతులపై విద్యా శాఖ అధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.


గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

పురోగతి తెలుసుకుంటాం

ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా లక్ష్యం పెట్టుకున్నాం. వంద రోజుల ప్రణాళికను పగడ్బందీగా అమలు చేస్తాం. వారాంత, మాసాంత పరీక్షలు నిర్వహించి వారి పురోగతి తెలుసుకుంటాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.
- సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి

గృహాల తొలగింపులో తీవ్ర ఉద్రిక్తత

ప్రతిఘటించిన 42 ప్లాట్ల యజమానులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: జోజి నగర్‌లోని 42 ప్లాట్లను ఖాళీ చేయించేందుకు లక్ష్మీ రామా కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు భారీ పోలీసు బందోబస్తు నడుమ పొక్లెయిన్లు తీసుకు రావడంతో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. ప్లాట్ల రిజిస్ట్రేషన్లు అయ్యి, బ్యాంకుల్లో రుణాలు తీసుకుని చెల్లిస్తున్న పేద గృహాలను కూల్చివేయడంతో ప్లాట్ల యజమానులు, కుటుంబ సభ్యులు సితార సెంటర్ సమీపంలోని బైపాస్ రోడ్డుపై నిరసన తెలిపారు. ఒక యువకుడు పెట్రోల్ మీద పోసుకుని ఆత్మహత్యాయత్నానికి దిగడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఏసీపీ దుర్గారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు బాధిత కుటుంబాలను అక్కడి నుంచి పంపించి ట్రాఫిక్‌ను సుగమం చేశారు.


కూల్చివేసిన భవనం


యజమానులు నిరసన వ్యక్తం చేయడంతో నిలిచిన ట్రాఫిక్


పెట్రోల్ పోసుకొంటున్న యువకుడిని అడ్డుకుంటున్న స్థానికులు

అసలు జరిగింది ఇది

ఐదారేళ్ల కిందట ప్లాట్ల యజమాని మజిద్ లక్ష్మీరామా కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యులకు అగ్రిమెంట్ రాశారు. వారు రిజిస్ట్రేషన్ చేయించుకోక పోవడంతో తర్వాత వాటిని 42 మందికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై సొసైటీ సభ్యులు పదేళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రెండు నెలల కిందట సొసైటీకి అనుకూలంగా ఆర్డర్ ఇవ్వడంతో పోలీసు బందోబస్తు మధ్య 42 ఇళ్లను కూల్చేందుకు రాగా స్థానిక రాజకీయ నాయకులు అడ్డుపడి నెల సమయం అడిగారు. తర్వాత వారు ఈ విషయంపై మరి కొంత సమయం కావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు పోలీసు సహకారంతో కోర్టు ఉత్తర్వులను అమలు చేసేందుకు బుధవారం వచ్చి 16 ఇళ్లను కూల్చేశారు. అయితే సాయంత్రానికి ఈ నెల 31 వరకు ఇళ్ల తొలగింపు ప్రక్రియను నిలిపేయాలని సుప్రీం కోర్టు నుంచి ఆర్డర్ వచ్చింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన సంఘం నగర శాఖ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఐదు దశాబ్దాలుగా ఉద్యోగుల పక్షాన పోరాడుతున్నది ఏపీ ఎన్జీవో సంఘానిదే అన్నారు. పీఆర్సీ కమిషనర్ నియామకం విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీఎం ప్రకటించడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యదర్శి పి. రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 11వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. నగర అధ్యక్షుడు సి.వి.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే నగర శాఖ ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కోశాధికారి ఎ.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజబాబు, డి.విశ్వనాథ్, కె. శ్రీలత, వి.రాజశేఖర్, డీఎస్ఎన్ శ్రీనివాస్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో కానుకల లెక్కింపు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.81,03,052, అమెరికా డాలర్లు 21, కెనడా డాలర్లు 5 వచ్చాయి. అదే విధంగా బంగారం 57 గ్రాములు, వెండి మూడు కిలోల 200 గ్రాములు కానుకలుగా వచ్చాయని ఆలయ ఈవో కిశోర్ కుమార్ తెలిపారు. దేవాలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.


పర్యవేక్షిస్తున్న ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిశోర్ కుమార్

చేదెక్కుతున్న చెరకు

- ఏటా సాగుకు దూరమవుతున్న రైతులు
- కేసీపీలో నేడు క్రషింగ్ ప్రారంభం

ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం	8167 (ఎకరాలు)
గానుగ ఆడే అంచనా	3.10 లక్షల టన్నులు
సరాసరి దిగుబడి	36 టన్నులు (ఎకరాకు)
వచ్చే సీజన్ విస్తీర్ణం సుమారు	11,500 (ఎకరాలు)
గానుగ లక్ష్యం	4 లక్షల టన్నులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే

ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారంలో 2025-26 క్రషింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుత సీజన్‌లో రైతులకు చెరకు ధర టన్ను రూ.3,690గా (రూ.400 బోనస్‌తో) యాజమాన్యం ప్రకటించింది. కేసీపీ కర్మాగారానికి గుంటూరు, ఉమ్మడి కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు చెరకు అందించే అనుమతులున్నాయి. అయినా ఈ ఏడాది కూడా చెరకు సాగు ఆశాజనకంగా లేదు.

వరి, స్వల్పకాలిక పంటల వైపే దృష్టి.. : చెరకు సాగు దీర్ఘకాల పంటగా ఉన్నందున, రైతులు స్వల్పకాలిక పంటల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. ఒకానొక సమయంలో కేసీపీ కర్మాగారం పరిధిలో 25 వేల మంది రైతులు 35 వేల ఎకరాల్లో చెరకు పండించారు. అప్పుడు కర్మాగారంలో 12 లక్షల టన్నుల చెరకు గానుగాడింది. ప్రస్తుతం 230 గ్రామాల్లో 2,898 మంది రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు.

నాలుగు లక్షల టన్నులు లక్ష్యం : రాష్ట్రంలో ఇప్పటికే పలు కర్మాగారాలు మూతబడ్డాయి. ప్రస్తుత సీజన్‌లో చిత్తూరు, ఉయ్యూరు, శ్రీకాకుళంలోని కర్మాగారాల్లోనే చెరకు గానుగాడుతోంది. ఆంధ్రా షుగర్స్(తాడ్వాయి)లో క్రషింగ్ నిలిచిపోవడంతో ఈ సీజన్‌లో అక్కడి నుంచి 60 వేల టన్నుల చెరకు ఉయ్యూరు కేసీపీకి రానుంది. వచ్చే సీజన్‌కు లక్ష టన్నులు రప్పించాలనే ప్రయత్నం జరుగుతోంది. మొత్తంగా కేసీపీ పరిధిలోనే సాగు విస్తీర్ణాన్ని పెంచి కనీసం నాలుగు లక్షల టన్నులు చెరకు గానుగాడే లక్ష్యంతో యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది.

అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించండి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు. చిత్రంలో తిరుపతిరావు, నాయుడు, సభ్యులు


విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం విజయవాడలో ఆవేదన దీక్షలు ప్రారంభించారు. తొలుత విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి ఏడాదిన్నర గడుస్తున్నా.. ఇప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఒక్క రూపాయి చెల్లించకుండా.. సీఐడీ అటాచ్ చేసిన ఆస్తులను విక్రయించి బాధితులందరికీ న్యాయం చేయవచ్చన్నారు. బాధితులు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నారని తెలిపారు. ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు నేటికీ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని గుర్తు చేశారు. సీఐడీ వద్ద అటాచ్‌లో ఉన్న ఆస్తులను కోర్టు అనుమతితో రిలీజ్ చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి.. నేడు విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి బాధితులందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. స్పందించని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.వి.నాయుడు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, వివిధ రాష్ట్రాలు, జిల్లాల బాధితులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్‌తో వీధి దీపాల నియంత్రణ


ప్రారంభ కార్యక్రమంలో పుల్లారెడ్డి తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వీధి దీపాలను స్మార్ట్ మీటర్ ద్వారా నియమిత సమయంలో ఆన్/ఆఫ్ చేయవచ్చని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గుణదలలోని ఏపీసీపీడీసీఎల్ ఐటీ కార్యాలయం నుంచి స్మార్ట్ మీటర్ల ద్వారా వీధి దీపాలు వెలిగించడం, ఆఫ్ చేసే విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటలకు ఆటోమెటిక్‌గా వీధి దీపాలు వెలుగుతాయని.. ఉదయం 6 గంటలకు అవి ఆగిపోతాయని తెలిపారు. వీటి వల్ల మనుష్యులపై పని ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, జీఎం (ఐటీ) యోగానంద్, ఎన్టీఆర్ జిల్లా విద్యుత్తు ఎస్ఈ హనుమయ్య, గుణదల ఈఈ పరిమి హరిబాబు, ఈఈ (ఐటీ) సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముసిరిన చీకటి..



విజయవాడ-గుంటూరు నగరాలను కలిపే ఎంతో కీలకమైన వారధి ఇది. దీనిపై రాత్రిపూట సగానికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. వెలగని దీపాలను తక్షణమే బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
- ఈనాడు, అమరావతి

అమ్మ దర్శనం అపురూపం


వినాయకుడి గుడి నుంచి బ్రాహ్మణ వీధి వరకు క్యూలైన్లు


మున్సిపల్ కార్పొరేషన్ ఎదురుగా నిర్మాణంలో షెడ్డు

భవానీ దీక్షల విరమణ కోసం ఇంద్రకీలాద్రిపైన ఘాట్ రోడ్డులోను, కొండ కింద క్యూలైన్లు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. క్యూలైన్లలో వెళ్లే వారికి వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా పైన టార్పాన్లు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా పెద్ద ఎత్తున భవానీలు వచ్చినప్పుడు వారిని విడతల వారీగా వదిలేందుకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పెద్ద షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఇతరత్రా పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి. - ఈనాడు, అమరావతి

5 నుంచి ఫల, పుష్ప ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఫల, పుష్ప ప్రదర్శన నిర్వహించనున్నట్లు రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు సూరపనేని ఉషారాణి అన్నారు. ప్రదర్శన జరిగే చోట బుధవారం కార్యక్రమ గోడప్రతులు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చే పూలు, పండ్ల మొక్కలకు వందకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొక్కలపై విద్యార్థులకు ఆసక్తి కలిగించాలనే లక్ష్యంతో పాఠశాల విద్యార్థులకు నాలుగు రోజులు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, 5వ తేదీ ఉదయం ఫల, పుష్ప ప్రదర్శనను రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, వి.అనిత ప్రారంభిస్తారని తెలిపారు. సొసైటీ కార్యదర్శి ఘంటసాల లక్ష్మి, స్వామి, పద్మప్రియ, సీతా మహాలక్ష్మి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో..

కస్టడీ పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుల రెండో విడత కస్టడీపై ఎక్సైజ్ కోర్టులో వాదనలు ముగిశాయి. నిందితులు బాదల్ దాస్, ప్రదీప్‌దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, రమేష్‌బాబు, అల్లాభక్ష్, సతీష్‌లను రెండో విడత విచారించాలని ఎక్సైజ్ అధికారుల పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. హాజీ, రాజు, మిథున్ దాస్, అంత దాస్‌లను కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్లపై వాదనలు ముగిశాయి. వీటిపై తీర్పు నిమిత్తం న్యాయాధికారి ఈనెల 8వ తేదీకి వాయిదా వేశారు.

విచారణకు జోగి సోదరుల కుమారులు హాజరు


విచారణకు వస్తున్న రాజీవ్, రోహిత్, అవినాష్ తదితరులు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న జోగి సోదరుల కుమారులు రాజీవ్, రోహిత్, రామ్మోహన్, రాకేష్‌లు ఎక్సైజ్ అధికారుల ఎదుట హాజరయ్యారు. బుధవారం వీరు.. విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చారు. 3వ తేదీ ఎక్సైజ్ స్టేషన్‌కు రావాలని పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు వీరు వచ్చారు. జోగి సోదరులను అరెస్టు చేసిన సమయంలో వారి నివాసాల నుంచి నాలుగు ల్యాప్‌టాప్‌లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి పాస్‌వర్డ్‌లు గురించి అడిగితే జోగి రమేష్, రాము చెప్పలేదు. వాటిని తాము ఉపయోగించమని, తమ కుమారులు వాడుతుంటారని చెప్పారు. దీంతో వీరి కుమారులకు నోటీసులిచ్చి పిలిపించారు. వీరితో నాలుగు ల్యాప్‌టాప్‌లను తెరిపించారు. అనంతరం వాటిని విశ్లేషణ నిమిత్తం ఫోరెన్సిక్ బృందానికి అప్పగించారు. అవసరమైనప్పుడు తిరిగి విచారణకు పిలుస్తామని, రావాల్సి ఉంటుందని చెప్పి వారిని పంపించారు. నిపుణుల విశ్లేషణ తర్వాత నివేదికను సిట్, ఎక్సైజ్ పోలీసులకు ఇవ్వనున్నారు.

✤ అనంతరం ఎక్సైజ్ స్టేషన్ వెలుపల జోగి రాజీవ్ మీడియాతో మాట్లాడారు. కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తమను సిట్ అధికారులు పిలిపించారని, తమ తండ్రిని కూడా అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇంత వరకు తమకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలను పోలీసులు సంపాదించలేకపోయారని విమర్శించారు.

వైద్య విద్య బలోపేతమే లక్ష్యం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ చంద్రశేఖర్, వెంకటేశ్వర్ తదితరులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రోగి భద్రతను మెరుగుపర్చడం, వైద్య విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో అనస్తీషియా డ్రగ్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 'అనస్తీషియా డ్రగ్ ఎర్రర్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా వెబెక్స్ ద్వారా వర్చువల్‌గా జరిగిన కార్యక్రమానికి అమెరికాలోని ఐపార్కోవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వెంకటేశ్వర్ కరుపర్తి, ఐయోవా యూనివర్సిటీ హెల్త్ సైన్సెస్ మాజీ అనస్తీషియా ప్రొ.డాక్టర్ రాబర్ట్ ఎం.రాలు ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 250లకు పైగా వైద్య సంస్థలు పాల్గొన్నారు. అనస్తీషియా డ్రగ్ ఎర్రర్స్ పుస్తకం భారతీయ పాఠకులకు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎల్‌యూఎల్‌యూ.కామ్'లో అందుబాటులో ఉంటుందని వీసీ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 144, 153, 164 చికెన్ విత్ స్కిన్ - 274 చికెన్ స్కిన్‌లెస్ - 284.

సంజయ్ బెయిల్ పిటిషన్ విచారణ 5వ తేదీకి వాయిదా


సంజయ్‌ను జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: అగ్నిమాపక శాఖ, సీఐడీ డీజీగా పని చేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు పొడిగించింది. బుధవారంతో రిమాండ్ గడువు ముగియనుండడంతో ఏసీబీ అధికారులు నిందితుడిని న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. రిమాండ్‌ను ఈనెల 17వ తేదీ వరకు పొడిగించారు. బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు కోసం 5వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ✤ ఇదే కేసులో నిందితుడైన కొండలరావు (ఏ4) కస్టడీ బుధవారం ముగిసింది. విచారణ అనంతరం ఏసీబీ అధికారులు నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. రిమాండ్ గడువు కూడా బుధవారంతో ముగియనుండడంతో ఈ నెల 17వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు.

'పెంచలయ్య హత్యపై ప్రభుత్వ స్పందన సరికాదు'



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠాల ఆగడాలు.. పెంచలయ్య హత్యోదంతంపై ప్రభుత్వ స్పందన సరిగా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరు ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి, హోమ్ శాఖ మంత్రులు స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. కందుకూరులో రాజకీయ హత్య జరిగితే భారీ పరిహారాన్నిచ్చిన ముఖ్యమంత్రి.. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తి హత్యకు గురైతే కనీస సాయం చేయలేరా అని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. గంజాయి మాఫియాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలో చేరుతున్నాయని ఆరోపించారు. తెదేపా, వైకాపాలు స్పందించి తమ తమ పార్టీల్లో ఉన్న గంజాయి వ్యాపారులు, సరఫరాదారులను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. పది వైద్య కళాశాలల టైటిల్ బోర్డు మాత్రమే ప్రభుత్వం చేతిలో ఉంటుందని, పెత్తనం ప్రైవేటు కంపెనీల వద్ద ఉంటుందని చెప్పారు. జీవో 847, 107, 108లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేరెంట్ టీచర్స్ సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చొద్దని సూచించారు. పాఠశాలల ఆవరణలో రాజకీయాలకు, విద్యార్థి సంఘాలకు అవకాశం లేదని ఇటీవల జీవో ఇచ్చి.. ఇప్పుడు తెదేపా కార్యకర్తలు పీటీఎంలకు వెళ్లాలని చెప్పడం విద్యా వ్యవస్థను చెడగొట్టడమేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని పంటలకు మద్దతు ధరలు తగ్గాయని, రైతులను కాపాడకుండా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రకటలను చేయడం సరికాదన్నారు. ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

పటమట, న్యూస్‌టుడే: పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేసిన నలుగురు మావోయిస్టులకు విజయవాడ జిల్లా కోర్టు రిమాండ్ పొడిగించింది. బుధవారం వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో వారిని పోలీసులు హాజరుపర్చారు. విచారణ అనంతరం వారి రిమాండ్‌ను డిసెంబర్ 16 వరకు పొడిగించారు. ప్రస్తుతానికి వీరు నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఉరుసు నిర్వహణకు సహకరిస్తాం

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి షాబుఖారీ దర్గా ఉరుసు నిర్వహణకు అన్ని విధాలా సహకరిస్తామని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు తెలిపారు. కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న షాబుఖారీ దర్గాను ఎన్టీటీపీఎస్ ఇంజినీర్లతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్లాంట్ కోసం ట్రాక్ పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ట్రాక్‌పై నుంచి దర్గాకు వెళ్లే కాలినడక వంతెన పిల్లర్ వద్ద కూడా ఈ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే ఈనెల 30న దర్గా ఉరుసు జరగనున్న నేపథ్యంలో వంతెనకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉరుసు పూర్తయ్యే వరకూ ట్రాక్ పనులు నిలిపి సహకరిస్తామని దర్గా అభివృద్ధి కమిటీకి తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అల్తాఫ్ రజా, ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకులు జంపాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను వెంటాడుతున్న తుపాను భయం

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు చేసిన రైతులను తుపాను భయం ఇంకా వెంటాడుతూనే ఉంది. ప్రస్తుతం దిత్వా తుపాను రైతులను కలవరపెడుతోంది. బుధవారం కూడా మబ్బులు కమ్మి అక్కడక్కడ చిరుజల్లులు కురవడంతో సాగుదారులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు పరుగులు తీశారు. వడ్లలో తేమ తగ్గేందుకు ఆరబెట్టగా వాతావరణంలో మార్పులు చూసి హడావుడిగా పరదాలు కప్పారు. యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని వేగంగా సురక్షిత ప్రాంతానికి ట్రాక్టర్లతో తరలించారు. పలు గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని హమాలీలతో గోనె సంచుల్లో నింపి భద్రపరిచారు. మరికొందరు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించగా కాటాలు వేసుకుని లారీల్లో తీసుకెళ్లారు. నియోజకవర్గంలో వరి సాగు చేసిన రైతులను గత నెలలో వచ్చిన మొంథా తుపాను, ప్రస్తుత దిత్వా తుపాను కంటి మీద కునుకులేకుండా చేశాయి. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ఇంకా నూర్పిడి చేయాల్సిన వరి పంట 20వేల ఎకరాల్లో ఉంది. డిసెంబరు నెలాఖరు వరకు వరి కోతలు, నూర్పిడులు కొనసాగుతాయి. పక్షం రోజుల పాటు తుపానుల బెడద లేకుండా వాతావరణం అనుకూలిస్తే రైతులు గట్టెక్కుతారు.

ఉపన్యసించి.. బహుమతులు సాధించి



విజేతలతో ఎస్‌కేఎస్ పాఠశాల కరస్పాండెంట్ భావన, ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే: వర్తమాన అంశాలపై అనర్గళంగా ఉపన్యసించిన విద్యార్థులు బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బి.ఇషిత, పి.మాధుర్యగాంధీ, బి.జోషితలు వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ జి.భావన, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, ఎ.రేవతీదేవిలు బహుమతులు అందజేశారు.



విస్సన్నపేట: విజేతలతో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రారెడ్డి, అధ్యాపకుడు వెంకటేశ్వరరావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలోని శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాలలో బుధవారం ఈనాడు - ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'కృత్రిమ మేధ(ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో కళాశాల బాలికలు రామిశెట్టి తేజస్వి, అత్తులూరి పూజిత, గురిజాల జ్యోతి ప్రతిభ కనబరిచి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కళాశాల డైరెక్టర్ ఎం.పూర్ణ చంద్రారెడ్డి విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, బి.హరి, ఎం.పుల్లారావు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

జి.కొండూరు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇరిగేషన్ ఎస్ఈ రామ్మోహన్‌రావు కోరారు. స్థానిక సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఆయన ప్రత్యేకాధికారి హోదాలో బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుజాత చేతుల మీదుగా విద్యార్థులు చలికి తట్టుకునేందుకు మంకీ క్యాప్‌లను అందజేశారు. అనంతరం పండ్లను పంచి పెట్టారు.

ప్రతిజ్ఞ.. పరిణితి

విద్యార్థుల్లో ఉత్తేజం నింపుతున్న ప్రత్యేక కార్యక్రమాలు



మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాస్

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

విద్యార్థులు నిత్యం చదువు, అనుబంధ కార్యక్రమాలతో ఒత్తిడికి గురవుతున్నారు. ఈ తరుణంలో వారిలో మానసిక, శారీరక వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రోజూ ఉదయం వేళ జాతీయగీతం, మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాడించడం, భారతదేశం నా మాతృభూమి అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే వారిలో సామాజిక బాధ్యత, దేశభక్తి పెంచడానికి నూతనంగా ప్రతి మంగళవారం రహదారి భద్రత, బుధవారం పాఠశాల భద్రతపై ప్రతిజ్ఞ, శుక్రవారం ప్రకృతి ప్రార్థన చేయిస్తున్నారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని 13 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సుమారు 15 వేల మందికి పైగా విద్యార్థులను ఈ దిశగా నడిపిస్తున్నారు. ఈ ప్రక్రియ విద్యార్థుల్లో మంచి ప్రభావం చూపుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విజ్ఞతతో వ్యవహరిస్తామంటూ.. రహదారి నాగరికతకు చిహ్నం, ప్రయాణం ప్రగతికి సంకేతం, యుగ వారసులమైన మనకు ప్రయాణం ఒక తప్పని అవసరం. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసులను గౌరవిస్తూ వివేచనతో వాహనాలు నడపడం మన కర్తవ్యం. రహదారులు పచ్చని చెట్లతో నిండి ఉండాలి కానీ.. రక్తపు మరకలతో తడిచిపోకూడదని చెబుతూ.. విజ్ఞతతో వ్యవహరిస్తానని ఆత్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. .అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

పరిసరాల ఆకళింపుతో.. మేము అనగా.. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులం. .మా పాఠశాల అందరికీ సురక్షితమైంది. సంతోషకరమైన లోగిలి.. అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి బడి పరసరాలను ఆకళింపు చేసుకుంటున్నారు.

ప్రకృతికి ప్రణామం.. కిలకిలారావాలతో ప్రభాతగీతం పాడే పక్షిజాతికి, ప్రాణవాయువు ఇచ్చే వృక్షాలకు వినమ్రతతో సమస్కరిస్తున్నాను. చిట్టి చీమలతో శ్రమజీవన సౌందర్యాన్ని, కాకుల గుంపుతో ఐక్యతా సందేశాన్ని ఉపదేశిస్తున్న ఓ ప్రకృతి మాతా నీకు పాదాభివందనం అని ప్రార్థన చేస్తూ పంచభూతాల గురించి తెలుసుకుంటున్నాం.

మంచి ప్రభావం కనిపిస్తోంది..

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రతిజ్ఞలను విద్యార్థులతో చేయిస్తున్నాం. రోజూ పాఠశాలల్లో చేస్తున్న ప్రార్థన, ప్రతిజ్ఞ మంచి ప్రభావం చూపుతున్నాయి. పాఠశాలలో ఎలా ఉండాలి.. ఎలా ఉండకూడదో విద్యార్థులకు తెలుస్తోంది. దేశభక్తి, సామాజిక బాధ్యతలు కూడా అలవాటవుతున్నాయి.

-శ్రీనివాస్, అశోక్, వ్యాయామోపాధ్యాయులు, మూలపాడు, గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలు

అనధికార దారులు మూసేసిన పోలీసులు



డివైడర్‌పై తొలగించిన రెయిలింగ్ స్థానంలో తాత్కాలికంగా తాళ్ల బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిలో ఇబ్రహీంపట్నం-కొండపల్లి గ్రామాల మధ్య తొలగించిన రెయిలింగ్ స్థానంతో తాత్కాలికంగా బారికేడ్ తాడులు ఏర్పాటు చేసి అనధికార దారులను ట్రాఫిక్ పోలీసులు బుధవారం మూసేశారు. కొందరు జాతీయరహదారి డివైడర్లపై ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగ్‌లను తొలగించి అనధికార దారులు ఏర్పాటు చేసుకున్నారు. పాదచారులు ఈ అనధికార దారుల గుండా జాతీయ రహదారిని దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నట్లు 'ఈనాడు'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర పోలీసు కమిషనర్ పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ విభాగం ఏడీసీ కృష్ణ, ఏసీపీ లక్ష్మణరావులను ఆదేశించారు. దీంతో వారు జాతీయ రహదారి నిర్వహణ పర్యవేక్షిస్తున్న మైలవరం సమీపంలోని బాడవ టోల్‌గేట్ అధికారులకు సమస్య వివరించారు. వారు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో రెయిలింగ్ తొలగించిన ప్రదేశాల్లో తాత్కాలిక బారికేడ్ తాడులను ఏర్పాటు చేసి అనధికార దారులను మూసేశారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలికంగా అనధికార దారులను మూసేసి ప్రమాదాలను నివారించడంతోపాటు వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో ఐరన్ రెయిలింగ్ ఏర్పాటు చేసేలా పర్యవేక్షిస్తామన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతాలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక రామకృష్ణ కాలనీలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో, నూజివీడు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇరుముడుల కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం శివారు ఎన్టీఆర్ కాలనీలోని సంకటహర హనుమాన్ విగ్రహం వద్ద నాగేశ్వరరావు సేవా ఫౌండేషన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, రామాయణ పఠనం, అష్టోత్తర శతనామావళి, తమలపాకుల పూజ నిర్వహించారు. గంపలగూడెం సీతారామచంద్ర ఆలయంలో బుధవారం సువర్చల ఆంజనేయ స్వామి విగ్రహానికి అర్చకులు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పారిశ్రామికవాడలోని లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో విశ్వక్షేణ పూజలను బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహాసంప్రోక్షణ జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ పూజలను ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి, రంగస్వామి, దీపక్‌కుమార్, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్టపై దాసాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమాన్ దీక్షల విరమణ అనంతరం హనుమత్ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజతో హోమ పూజలను ప్రారంభించారు. హోమ పూర్ణాహుతితో పూజలు ముగించి ఆలయకమిటీ దాతల సహకారంతో భక్తులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు.



మైలవరం: వ్రతంలో భక్తులు



గంపలగూడెం: హనుమాన్ ఆలయంలో ..



కొండపల్లిలో పూజలు

ఫుట్‌బాల్ విజేత వీఆర్ సిద్ధార్థ



సిద్ధార్థ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

మైలవరం, న్యూస్‌టుడే: కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలోని అంతర కళాశాలల సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ పోటీలు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్సాహంగా జరిగాయి. బుధవారం ఈ పోటీలు నిర్వహించగా, కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు కళాశాల గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ కె.అప్పారావు తదితరులు బహుమతులు అందజేశారు.

నేత్ర దానం



కంచర్ల భిక్షావతి

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెంకు చెందిన కంచర్ల భిక్షావతి(82) బుధవారం మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి చొరవతో నేత్రదానం ఆవశ్యకతను వివరించగా కుటుంబ సభ్యులు అంగీకరించారు. వైద్యులు గంపలగూడెం వచ్చి ఆమె కళ్లలోని కార్నియాలను సేకరించారు.

దుమ్ము ఎగసి.. ధూళి కమ్మేసి..



విజయవాడ పశ్చిమ బైపాస్ మీదకు వెళ్లే వాహన చోదకులు దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా గొల్లపూడి నల్లకుంట సమీపంలోని సర్వీసు రోడ్డులో నుంచి పశ్చిమ బైపాస్ మీదకు వాహనాలు వెళ్తుంటాయి. అక్కడ రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు గుత్తేదారు సంస్థ దృష్టి సారించక పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, గొల్లపూడి

పత్తి కొనుగోలు ఒకరోజుతో సరా..!?

న్యూస్‌టుడే, గంపలగూడెం



గంపలగూడెంలో ఒక రైతు వద్ద పత్తి నిల్వ

భారత పత్తి సంస్థ (సీసీఐ) గంపలగూడెం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ఒకరోజే మురిపించింది. తాము ఉత్పత్తి చేసిన దూదిని ఇక్కడి కేంద్రంలో కొనుగోలు చేయడం లేదని పత్తి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పత్తి సాగుకు వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండగా, దిగుబడిగా వచ్చిన కొద్ది మొత్తం దూదిని కూడా కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 12న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధికారులతో కలిసి సీసీఐ కేంద్రం ప్రారంభించారు. అదే నెల 21న రైతుల నుంచి 400 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అప్పుడు కూడా తేమ ఉందని క్వింటాల్‌కు రూ.300కు పైగా కోత విధించారు. ఆతరువాత సదరు సీసీఐ బయ్యర్ ఈ కేంద్రం వైపు కన్నెత్తి చూడలేదు. మరోవైపు సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పత్తి విక్రయాలకు తమ పేర్లు నమోదు చేసుకున్నా.. సీసీఐ అధికారులు స్లాట్‌లో ఆమోదించడం లేదని రైతులు వాపోతున్నారు.

క్వింటాలుకు రూ. 1500 నష్టంతో..

తిరువూరు నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. వాతావరణం అనుకూలించక దిగుబడి సగానికి తగ్గింది. ఈ పరిమిత పత్తిని మద్దతు ధరకు(క్వింటాలు రూ. 8,110) అమ్ముకోవాలన్నా అధికారులు సహకరించడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ సీసీఐ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు రైతుల కష్టం, ఆవేదన దృష్టిలో పెట్టుకుని రోజూ పత్తి కొనుగోలు చేయాలని కోరారు. అయినా ఒక్కరోజు మాత్రమే కొనుగోలు చేశారు. తమ ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని, స్లాట్ బుకింగ్ జరగడం లేదని, ఫలితంగా దళారులకు తక్కువ ధరకు విక్రయించి.. క్వింటాల్‌కు రూ. 1500 వరకు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇక్కడ నవంబరు 21వ తేదీ తరువాత మళ్లీ పత్తి కొనుగోలు ఎప్పుడు జరుగుతుందో ప్రకటిస్తామని తెలిపిన మార్కెటింగ్ శాఖ అధికారులు ఆ విషయాన్ని విస్మరించారు.

పాల సొసైటీలో వివాదాలపై విచారణ

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెం పాలకేంద్రంలో డైరెక్టర్ల ఎన్నిక విషయంలో జరిగిన వివాదానికి సంబంధించిన ఫిర్యాదుపై బుధవారం ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్(ఏపీడీడీసీఎఫ్‌ఎల్) నియమించిన అధికారులు బుధవారం సంఘ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అక్రమ పద్ధతుల్లో డైరెక్టర్లను ఎన్నుకుంటున్నారంటూ అభ్యంతరాలు వ్యక్తం కాగా, గతంలో రెండు పర్యాయాలు ఘర్షణకు దారి తీసింది. చివరికి అభ్యంతరాల నడుమ ఎన్నిక నిర్వహించగా, అధ్యక్షుడి ప్రత్యర్థి శిబిరం ఆ ఎన్నికను బహిష్కరించడంతో, ఇద్దరు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా, అక్రమంగా ఎన్నిక నిర్వహించారంటూ ఏఎంసీ మాజీ ఛైర్మన్, తెదేపా సీనియర్ నాయకుడు వజ్రాల కుమార్‌రెడ్డి, తదితరులు ఏపీడీడీసీఎఫ్‌ఎల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సంస్థ తరఫున ఎం.వెంకటసిద్ధులు, పి.గంగాధర్‌లను విచారణ అధికారులుగా నియమించగా బుధవారం వారు క్షేత్ర స్థాయి విచారణ ప్రారంభించారు.

ఎన్ఎంయూకు గుర్తింపు హర్షణీయం

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఎన్ఎంయూ(నేషనల్ మజ్దూర్ యూనిటీ)కి సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో స్థానం కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించిందని యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, శేషగిరి, శంకర్, కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు: మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి సాంబశివరావు



జి.కొండూరు: బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, ఇందిరాప్రియదర్శిని తదితరులు.



విస్సన్నపేట: విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాట్నాలు, ఎంఈవో సుధాకర్ తదితరులు

లక్ష్య సాధనకు వైకల్యం అడ్డుకాదు

కొండపల్లి, న్యూస్‌టుడే: లక్ష్యానికి అంగవైకల్యం అడ్డుకాదన్న విషయాన్ని యశ్వంత్ నిరూపించాడని కొండపల్లి క్రాంతి పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రాంతి పాఠశాల పూర్వ విద్యార్థి, క్రికెటర్ యశ్వంత్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యశ్వంత్ ఇండియా టీమ్‌లోకి వెళ్లాలన్న లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ దిశగా చిన్నతనం నుంచే శ్రమించాడన్నారు. ఇండియా తరఫున అనేక మ్యాచ్‌లలో ఆడి సత్తా చాటాడని చెప్పారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని రాష్ట్ర ఐఈడీ కో-ఆర్డినేటర్ వనజ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఐఈడీ కో-ఆర్డినేటర్ నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త కె.నారాయణ, ఎంఈవోలు పుష్పలత, మాలిని పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

మైలవరం: స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు మదర్‌థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎం.లలితశ్రీ, చక్రధరరావు, రత్నమాల, ఝాన్సీ లక్ష్మీబాయిల వితరణతో కేంద్రంలో చిన్నారుల ఫిజియోథెరఫీకి అవసరమైన న్యూరో బ్లడ్ స్టిములేషన్ పరికరాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.రాజు, ఎల్.బాలు, ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ, కొప్పు సత్యనారాయణ, శ్రీపద్మ తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లి: క్రికెట్ క్రీడాకారుడు యశ్వంత్‌తో ఉపాధ్యాయులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సహితవిద్య అధికారులు, ఉపాధ్యాయులు



మైలవరం: విజేతలతో ఎంఈవోలు, నిర్వాహకులు

ధాన్యం రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఎ.కొండూరు: కోడూరులో ధాన్యం రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిన నేపథ్యంలో ధాన్యం రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కె.మాధురి సూచించారు. మండలంలోని కోడూరులో బుధవారం పర్యటించిన ఆమె రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. సదరు రైతులు తేమ శాతం నిబంధనల మేరకు ఉంటే వెంటనే తూకం వేసి ఎంపిక చేసిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. హమాలీల సమస్య ఉంటే సమీప గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి కాటాలు వేయించాలన్నారు. వర్షం కురిసి ధాన్యం తడిచే పరిస్థితి ఉంటే వ్యవసాయాధికారుల నుంచి టార్పాలిన్లు తీసుకోవాలని తెలిపారు. కోడూరులో చౌకధరల దుకాణం, పోలిశెట్టిపాడులో పెట్రోలు బంకును ఆమె తనిఖీ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏఈ రమేష్‌బాబు

మైలవరం, న్యూస్‌టుడే: పునరుత్పాదక ఇంధన వనరైన సోలార్ పవర్‌ను ఇళ్లపై ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ జి.రమేష్ బాబు, ఈఈఈ ప్రొఫెసర్ ఉమావాణి పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని మొర్సుమిల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం అక్కడి పాఠశాలలో విద్యార్థులకు వికసిత్ భారత్, సోలార్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటిపై సోలార్ పలకల ఏర్పాటుకు రాయితీలు ఇస్తోందని వివరించారు. ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్, హెచ్ఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం విజయవంతం చేయాలి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఈనెల 5న మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)ను జయవంతం చేయాలని ఎంఈవో-2 వీరాస్వామి కోరారు. మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని హెచ్ఎంలకు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని, విద్యాకిట్లు, స్పోర్ట్ కిట్లను ప్రదర్శించి ప్రభుత్వ బడుల్లో విదార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: ఈనెల 5న నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) విజయవంతం చేయాలని ఎంఈవో ఎల్.బాలు సూచించారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల చదువు పురోగతి, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలతో పాటు అందరికీ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

జీతాల సమస్య త్వరగా పరిష్కరించండి



ఎంఈవో పి.రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయుల జీతాల సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎంఈవో పి.రమేష్‌బాబుకు ఎస్టీయూ రెడ్డిగూడెం మండలశాఖ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కొన్ని పాఠశాలలకు సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలు అందలేదని, వెంటనే అందజేయాలని, సేవాపుస్తకాలు నవీకరణ తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వై.మోహన్ కృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెలగలేరు శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం శిబిరంపై దాడి చేశారు. అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,450 నగదు, ఒక కోడి పుంజు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

◆ తిరువూరు 8వ వార్డులో నివాసగృహాల మధ్య పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరిగాయని స్థానికుడు ప్రశాంత్ సమస్యను 'ఈనాడు మీతోడుగా' ద్వారా మున్సిపల్ శానిటరి అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మున్సిపల్ సిబ్బందిని పంపి పిచ్చిమొక్కలను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

◆ విస్సన్నపేట: తాతకుంట్ల గ్రామం ప్రధాన రహదారి వెంట పిచ్చిచెట్లు పెరిగి, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నవరత్న సంస్థ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.. మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 08 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01.08.2025 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: రూ.40,000- రూ.1,40,000.
దరఖాస్తు ఫీజు: ఓబీసీలకు రూ.1000, ఎస్సీ, ఎస్టీ, విశ్రాంత సైనికులు, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తులు: 06.12.2025 నుంచి 20.12.2025 వరకు స్వీకరిస్తారు.
వెబ్‌సైట్: https://rcfltd.com/hrrecruitment/recruitment-1

సీబీఎస్ఈలో 124 పోస్టులు

సెంట్రల్ బోర్డు ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ).. వివిధ హోదాల్లో 124 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.



● అసిస్టెంట్ సెక్రటరీ: 08
● అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్స్/ట్రైనింగ్/స్కిల్ ఎడ్యుకేషన్): 27
● అకౌంట్స్ ఆఫీసర్: 02
● సూపరింటెండెంట్: 27
● జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: 09
● జూనియర్ అకౌంటెంట్: 16
● జూనియర్ అసిస్టెంట్: 35

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంఏ, ఐసీడబ్ల్యూఏ. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వయసు: పోస్టులను అనుసరించి 27 ఏళ్ల నుంచి 35 ఏళ్లు ఉండాలి. ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎం/ మహిళలకు అప్లికేషన్ ఫీజు లేదు. వీరు రూ.250 ప్రాసెసింగ్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు గ్రూప్-ఏ పోస్టులకు రూ.1750. గ్రూప్-బీ, సీ పోస్టులకు రూ.1050.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 22.
ఎంపిక: స్క్రీనింగ్ పరీక్ష, ప్రధాన పరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్టులతో.
వెబ్‌సైట్: https://www.cbse.gov.in/cbsenew/cbse.html

సమన్వయమే.. విజయానికి కీలకం



కార్పొరేట్ సంస్థల్లో చేరిన యువ ఉద్యోగులు జూనియర్స్, సీనియర్స్, ఇతర విభాగాలలో ఉండే వారిని సమన్వయం చేసుకోవడం ఎంతో ముఖ్యం. భిన్న వ్యక్తిత్వాలు, మనస్తత్వాలున్న వారితో పనిచేస్తున్నప్పుడు ఏదో ఒక సందర్భంలో అక్కడి అంతర్గత రాజకీయాల ప్రభావానికి గురికాక తప్పదు. యువ ఉద్యోగులు 'పని చేసుకుపోతుంటే సరిపోతుంది కదా' అనుకుంటారు. కానీ సంస్థల్లో మిత్రులు, ప్రత్యర్థులు, తటస్థులను గుర్తించి వారి మధ్య సమతుల్యత పాటిస్తూ పని సంస్కృతిని అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. ఇలాచేస్తేనే ఉద్యోగంలో విజయం సాధించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు వీలవుతుంది. లిఖించని నియమాలతో కార్పొరేట్ రాజకీయాలు నడుస్తుంటాయి. వీటిని ఆకళింపు చేసుకోవడం ద్వారా విజయావకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.

మిత్రులతో ఇలా...

రమేష్ ఒక సాఫ్ట్‌వేర్ డెవలపింగ్ సంస్థలో ట్రెయినీగా చేరాడు. విద్యార్థిగా కోడింగ్‌లో కొన్ని ప్రాజెక్టులు సమన్వయం చేసినట్లు ఇంటర్వ్యూలో చెప్పాడు. దీంతో ఒక క్లిష్టమైన కోడింగ్ ప్రాజెక్ట్‌లో అతడికి పని కేటాయించారు. అక్కడ రమేష్‌కు ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. ఒక దశలో ప్రాజెక్ట్ విఫలం అవుతుందని ఆవేదనకూ గురయ్యాడు. పురోగతి గురించి సీనియర్ ఇంజినీర్ సమాచారం కోరినప్పుడు తన పరిస్థితి వివరించి



అతడు ఆవేదన చెందాడు. తన సామర్థ్యానికి ఇది చాలా చిన్న సమస్యగా భావించిన అతడు ఈ ప్రాజెక్టు చేస్తున్నప్పుడు సహోద్యోగుల నుంచి ఎదురయ్యే ప్రతిబంధకాలను ఊహించలేదు. ఈ పని సులభంగా చేయగలననుకున్నాడు. సమస్యను అర్థం చేసుకున్న సీనియర్ ఇంజినీర్ ప్రకాష్ ఇతర సభ్యులతో ఎదురయ్యే ఇబ్బందులను రమేష్‌కు వివరించి, బృందంతో ఎలా మెలగాలో తెలిపాడు. సహోద్యోగులను బృంద సభ్యులుగానే కాకుండా మిత్రులుగా భావించి సహాయం తీసుకుంటే వృత్తిలో వేగంగా ఎదగగలమని, కార్పొరేట్ విజయానికి ఇతరుల సహకారం శక్తిమంతమైన ఆయుధమని ఈ సంఘటనతో రమేష్ అర్థం చేసుకున్నాడు. ఎంతటి విషయ పరిజ్ఞానం ఉన్నప్పటికీ ఇతరులతో మమేకం కావాలని తెలుసుకోవడంతో అతడు ప్రకాష్‌కు మంచి స్నేహితుడయ్యాడు.

ప్రత్యర్థులు

ఒక మార్కెటింగ్ సంస్థలో సేల్స్ బృందంలో చేరిన స్వప్న టీమ్ లీడర్ కావాలన్న దృఢ సంకల్పంతో పని చేస్తోంది. తనలాగే ప్రయత్నిస్తున్న ఉదయ్ స్వప్న తనకు పోటీగా ఉందని భావించాడు. ఆమె చేసే ప్రతి పనిలోనూ ఆటంకాలు కలిగిస్తూ, ఆమెకు లీడర్ అయ్యే లక్షణాలు లేవన్న అభిప్రాయం కలిగించి, ఆమె సరైన అభ్యర్థి కాదనేలా చేయాలనుకున్నాడు. చివరకు యాజమాన్యం స్వప్ననే టీమ్ లీడర్‌గా పదోన్నతి కల్పించింది. దీంతో ఉదయ్‌కు నిరాశే మిగిలింది. ఎన్ని పొరపాట్లు చూపినప్పటికీ యాజమాన్యం స్వప్నను ఎలా ప్రమోట్ చేసిందో అర్థం చేసుకోలేకపోయాడు. అయితే అతడు సృష్టించిన ప్రతి అవరోధాన్ని స్వప్న సలహాగా తీసుకుంది. తనను తాను సరి చేసుకుంటూ, ప్రాజెక్టును మెరుగ్గా తయారు చేసుకుంది. దాన్ని క్లయింట్‌కు అందించే సమయానికి ఎలాంటి లోపాలూ లేని ఒక మంచి ప్రాజెక్టుగా రూపొందించింది. దీంతో ఆమె ప్రతిభను సంస్థ గుర్తించి, పదోన్నతి కల్పించింది. ప్రతిచోటా ప్రత్యర్థులు ఉంటారు. అయితే వారిని గుర్తించి, వాళ్లు చేసిన వ్యాఖ్యలు, విమర్శలు, సవాళ్లను సలహాలుగా తీసుకుని, తనను తాను సరి చేసుకుంటే విజయం సాధించవచ్చు.

తటస్థులు

✦ కొన్ని సవాళ్లతో కూడిన అంశాలను చర్చించే క్రమంలో ఉద్యోగుల మధ్య అభిప్రాయ భేదాలు రావడం సాధారణమే. యువ ఉద్యోగుల్లో సహజమైన వాద ప్రతివాదనలు, విజయం సాధించాలన్న తపన సంఘర్షణలకు మూల కారణమవుతాయి.

✦ రవి ఒక బహుళ జాతి సంస్థలో ట్రెయినీగా చేరాడు. బృందంలో సీనియర్ ఉద్యోగులుగా ఉన్న రాము, రాజేష్‌లు ప్రతి అంశంలోను ఏదోలా సమస్య సృష్టించి ఘర్షణ పడేవారు. ఎవరికి వారు రవిని తమ వాదనకు మద్దతుగా మాట్లాడించే ప్రయత్నం చేసేవారు. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న అతడు ఇద్దరికీ సమాన దూరం పాటిస్తూ, సమయస్ఫూర్తితో వారిని బ్యాలెన్స్ చేస్తూ, సయోధ్య కుదర్చడానికి ప్రయత్నించేవాడు.

✦ ఒక క్లయింట్‌ను సంస్థకు పరిచయం చేసే క్రమంలో వారిద్దరూ పోటీపడ్డారు. సరైన సమయంలో రవి చొరవ తీసుకుని.. రాజేష్ తన సత్సంబంధాలతో క్లయింట్‌ను సంపాదించినట్లు, రాము ధరకు సంబంధించిన సవాళ్ళను అధిగమించినట్లు ఇద్దరికీ ఆమోదయోగ్యమైన వాతావరణాన్ని సృష్టించాడు. దీంతో వాళ్ల సంస్థకు ఒక విలువైన కస్టమర్‌ను తీసుకువచ్చేలా చేశాడు. రవిలో విభేదాలను పరిష్కరించగల సామర్థ్యం గమనించిన యాజమాన్యం అతడిని టీమ్ లీడర్‌గా ప్రమోట్ చేసింది.

కార్పొరేట్ సంస్థల్లో చేరాలని ఆశించే యువ ఉద్యోగార్థులు ప్రతి కార్యాలయంలోనూ అదృశ్య రాజకీయాలు ఉంటాయని అర్థం చేసుకోవాలి. వీటిని ఎవరూ చెప్పరు, పుస్తకాల్లో రాసి ఉండవు. కానీ అవి ప్రతి చోటా ఉంటాయి. వీటిని అర్థం చేసుకున్నవారే విజయం సాధించగలరు. మనం ఎవరికి అనుకూలంగా ఉండాలన్నది ముఖ్యం కాదు. రాజకీయాలకు అతీతంగా ఎలా ప్రవర్తిస్తే కెరియర్‌లో విజయవంతంగా ముందుకు సాగగలమన్న కోణంలో ఆలోచించాలి. ఇలాంటి ఉద్యోగులే సంస్థల్లో మంచి ఫలితాలను సాధించగలరని గుర్తుంచుకోవాలి.



– దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

మేనేజర్లు

భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్, బెంగళూరు.. ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● డిప్యూటీ జనరల్ మేనేజర్: 03
● అసిస్టెంట్ మేనేజర్: 03

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు డీజీఎంకు రూ.90,000 - రూ.2,40,000; ఏజీఎంకు రూ.80,000 - రూ.2,40,000.
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, ధ్రువపత్రాల పరిశీలనలతో.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.12.2025.
వెబ్‌సైట్: https://www.bemlindia.in/

ఏఎన్ఆర్ఎఫ్‌లో సైంటిస్టులు

అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్).. సైంటిస్ట్-సీ, డీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● సైంటిస్ట్-సీ: 05 ● సైంటిస్ట్-డీ: 02

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు సైంటిస్ట్-డీకు రూ.78,800- రూ.2,09,200; సైంటిస్ట్-సీకు 67,700- రూ.2,08,700.
వయసు: సైంటిస్ట్-డీకు 40 ఏళ్లు; సైంటిస్ట్-సీకు 35 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తుకు చివరి తేదీ: ప్రకటన వెలువడిన 45 రోజుల్లోగా(ప్రకటన వెలువడిన తేదీ: 17.11.2025) ఆఫ్‌లైన్ దరఖాస్తులను స్పీడ్‌పోస్ట్‌లో పంపాలి.
చిరునామా: డైరెక్టర్, అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్, నాలుగో అంతస్తు, బ్లాక్-II, టెక్నాలజీ భవన్, న్యూ మెహ్రౌలీ రోడ్, న్యూదిల్లీ.
వెబ్‌సైట్: https://serb.gov.in/

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో
బిజినెస్ ఆపరేషన్స్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్ **నైపుణ్యాలు:** అటెన్షన్ టు డిటెయిల్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, గూగుల్ వర్క్‌స్పేస్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, టైమ్ మేనేజ్‌మెంట్ **స్టైపెండ్:** రూ.8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/pe945

టూర్ గైడ్

సంస్థ: నైన్ టవర్స్ **నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.10,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 31
☛ https://shorturl.at/amE2D

హైదరాబాద్, విజయవాడల్లో
మార్కెటింగ్

సంస్థ: శశాంక్ మద్దూరి **నైపుణ్యాలు:** ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం **స్టైపెండ్:** రూ.6,000-15,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/JeViW

ఫీల్డ్ సేల్స్

సంస్థ: వాల్‌స్టోరీ **నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటీరియర్ డిజైన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్
స్టైపెండ్: రూ.13,000-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 31
☛ https://shorturl.at/2UoAs

విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడల్లో
బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: గోనెల మధుసూదన్
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, నెట్ వర్కింగ్ **స్టైపెండ్:** రూ.6,500-9,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 21
☛ https://shorturl.at/8rzeN

విజయవాడలో
హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)

సంస్థ: సినెక్టిఫై సొల్యూషన్స్ ప్రై.లి. **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఆఫీస్, ఆపరేషన్స్, రిక్రూట్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్ **స్టైపెండ్:** రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 17
☛ https://shorturl.at/5T4Cj

విశాఖపట్నంలో
ట్రావెల్ అండ్ టూరిజం

సంస్థ: ఫ్రాన్సిస్కో ఇమ్మిగ్రేషన్ అండ్ అబ్రాడ్ సర్వీసెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హాలిడే ప్యాకేజ్ డిజైన్, ట్రావెల్ ఐటినెరరీ మేకింగ్, ట్రావెల్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-11,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 7
☛ https://shorturl.at/tEmHW

ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్

సంస్థ: కార్డియల్ సొల్యూషన్స్ **నైపుణ్యాలు:** కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం **స్టైపెండ్:** రూ.5,000-7,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/GsvOg

యాక్చూరియల్ సైన్స్‌లోకి.. ఏసెట్ దారి



మేటి అవకాశాలకు దారిచూపే కోర్సుల్లో యాక్చూరియల్ సైన్స్ ఒకటి. ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. యాక్చూరియల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏసెట్) ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నారు. ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆ వివరాలు...

బీమా, అనుబంధ రంగాలు, ఆర్థిక, మదింపు సంస్థల్లో ఉన్నత కెరియర్ ఆశించేవారంతా యాక్చూరియల్ సైన్స్‌తో ఆశయాలను నెరవేర్చుకోవచ్చు. అంకెలపై ఆసక్తి, గణితంపై పట్టు, తర్క పరిజ్ఞానం ఉన్నవారు ఈ కోర్సులో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ప్రస్తుతం ఈ కోర్సు మొత్తం పూర్తిచేసుకున్నవారి సంఖ్య చాలా పరిమితంగా ఉంది. అందువల్ల రాణించినవారు ఆకర్షణీయ వేతనంతో, విశ్వవ్యాప్తంగా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. బీమా పాలసీలు, ఎంప్లాయీ బెనిఫిట్, సోషల్ సెక్యూరిటీ, పెన్షన్ బెనిఫిట్, ప్రభుత్వ స్కీమ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్లు... మొదలైనవాటికి ప్రమాణాలు, ప్రీమియం నిర్ణయించడంలో యాక్చూరీ నిపుణులు ముఖ్య పాత్ర వహిస్తారు.

పరీక్ష ఇలా..

ఏసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇందులో 70 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున సెక్షన్-ఏలో 45 ప్రశ్నలు అడుగుతారు. సెక్షన్-బీలో 20 ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నకు రెండేసి మార్కులు కేటాయించారు. సెక్షన్-సీలో 5 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కోదానికి 3 మార్కులు. ప్రశ్నపత్రంలో సబ్జెక్టులవారీ.. మ్యాథ్స్ 30, స్టాటిస్టిక్స్ 30, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 15, ఇంగ్లిష్ 15, లాజికల్ రీజనింగ్ 10 మార్కులు కేటాయించారు. రుణాత్మక మార్కులు లేవు. పరీక్షలో అర్హత సాధించడానికి కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఈ పరీక్షకు సంబంధించిన సిలబస్, చదవాల్సిన రిఫరెన్స్ పుస్తకాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. స్కోరు మూడేళ్లు చెల్లుతుంది. ఈ వ్యవధిలోగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చురీస్ ఆఫ్ ఇండియా (ఐఏఐ)లో సభ్యత్వాన్ని పొందవచ్చు. ఇలా చేరినవాళ్లు యాక్చూరియల్ సైన్స్ కోర్సులో వివిధ పేపర్లను పూర్తిచేసుకోవడానికి వీలవుతుంది.

13 పేపర్లు...

ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినవారు యాక్చూరీ ఫెలో కావడానికి వివిధ దశల్లో 13 పేపర్లు పూర్తిచేయాలి. స్టేజ్-1 కోర్ ప్రిన్సిపల్స్‌లో 7, స్టేజ్-2 కోర్ ప్రాక్టీసెస్‌లో 3 పేపర్లు అందరికీ ఉమ్మడిగా ఉంటాయి. ఈ రెండు దశలనూ పూర్తిచేసినవారిని అసోసియేట్‌గా పరిగణిస్తారు. స్టేజ్-3 స్పెషలిస్ట్ ప్రిన్సిపుల్స్‌లో 8 పేపర్లు ఉంటాయి. వీటిలో నచ్చిన రెండింటిని ఎంపిక చేసుకుని పూర్తిచేయాలి. స్టేజ్-4 స్పెషలిస్ట్ అడ్వాన్స్‌డ్‌లో ఏదైనా ఒక పేపర్ పూర్తిచేయాలి. నాలుగు దశలూ (13 పేపర్లు) పూర్తిచేసుకుంటే ఫెలోగా వ్యవహరిస్తారు. వీటిలో స్టేజ్-1 పాసైనా అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. మొత్తం 13 పేపర్లూ పూర్తిచేసుకున్నవారు సుమారు రూ.5 లక్షల వేతనం అందుకోవచ్చు. వీరికి ఇన్స్యూరెన్స్, రీ ఇన్స్యూరెన్స్, ఫైనాన్స్, అకడమిక్, రెగ్యులేటరీ.. తదితర సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

అర్హత: ఇంటర్మీడియట్/ప్లస్2.
రిజిస్ట్రేషన్లు: డిసెంబరు 24 సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారు.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.500.
పరీక్ష తేదీ: జనవరి 10.
ఫలితాలు: జనవరి 17న ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://actuariesindia.org/

కొలువు వేటలో.. అభిరుచుల బాట



'రెగ్యులర్ క్లాసులు, స్పెషల్ క్లాసులు, ట్యూషన్లు, పరీక్షలు.. వీటికే సమయం సరిపోవడం లేదు. ఇక హాబీలు కూడానా' అని అనుకుంటున్నారా? అయితే పొరబడినట్టే. ఎందుకంటే ఇవి మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఎంతగానో సాయపడతాయి. నలుగురిలో మిమ్మల్ని ప్రత్యేకంగానూ నిలబెడతాయి. ఒత్తిడిని తగ్గించి, ఎంతో సంతోషాన్నీ అందిస్తాయి. అంతేకాదు.. భవిష్యత్తులో ఈ హాబీలనే కెరియర్‌గానూ మలచుకోవచ్చు కూడా.

ఉన్నత చదువుల కోసం యూనివర్సిటీలో చేరారనుకుందాం. అక్కడంతా కొత్తగా అయోమయంగా అనిపించొచ్చు. అలాంటప్పుడు పుస్తక పఠనం మీ హాబీ అయితే లైబ్రరీకి వెళతారు. అక్కడ ఉండే మీలాంటి పుస్తక ప్రేమికులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇలా కొత్త ప్రదేశంలో నలుగురితో కలవడానికి హాబీలు తోడ్పడతాయి.

● మీకు ఆటలంటే ఇష్టమనుకుందాం. మీలాంటి ఆసక్తి ఉన్నవారితో కలిసి బృందంగా ఏర్పడి హాయిగా ఆడుకోవచ్చు. దీంతోపాటు వివిధ పోటీల్లోనూ పాల్గొనవచ్చు. ఇక్కడ హాబీ అనేది.. క్రీడాకారుడిగా ఎదగడానికి మీకో నిచ్చెన అవుతుంది. అలాగే ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, కథలు రాయడం.. ఇలా మీ హాబీ ఏదైనా కావచ్చు. వాటిలో రాణిస్తే.. అదే కెరియర్‌గానూ మారిపోవచ్చు. చేతిలో ఉన్న అదనపు నైపుణ్యం అవసరమైనప్పుడు దివ్యాస్త్రంగా మారుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఏదో ఒక హాబీని ఎంచుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

ఇతర నైపుణ్యాలకు...

● విద్యార్థిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ హాబీల కోసం కొంత వ్యవధి కేటాయించడం వల్ల సమయ నిర్వహణపై పట్టువస్తుంది. అలాగే అందుబాటులో ఉన్న సమయాన్ని వివిధ పనులకు సర్దుబాటు చేయడమెలాగో కూడా తెలుసుకోగలుగుతారు.

● తరగతులు, వివిధ అసైన్‌మెంట్లను పూర్తిచేసే క్రమంలో విద్యార్థులు సాధారణంగా ఎంతో ఒత్తిడికి గురవుతుంటారు. దాన్నుంచి ఉపశమనానికి అభిరుచులు ఎంతగానో తోడ్పడతాయి.

● చిత్రలేఖనం మీ అభిరుచి అనుకుందాం. ఒక చిత్రం పూర్తయ్యి.. దానికి రంగులు దిద్ది, తుది మెరుగులు అద్దడం అనేది క్షణాల్లో జరిగిపోయే పనికాదు. కొన్ని రోజులు కూడా పట్టొచ్చు. ఓపిగ్గా, శ్రద్ధగా పనిచేయగలిగే నైపుణ్యం ఈ అభిరుచితో అలవడుతుంది.

● పర్యటనాసక్తి ఉన్నవారు తరచూ కొత్త ప్రాంతాలను చుట్టేస్తుంటారు. ఆ అనుభవాలను వివరిస్తూ వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయొచ్చు కూడా. దీంతో కళ్లతో చూసిన ప్రకృతి అందాలను మాటల్లో చెప్పగలిగే భావవ్యక్తీకరణ నైపుణ్యమూ అలవడుతుంది.

● అభిరుచులు ఉన్నవాళ్లలో కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. దీంతో పనిని మూసధోరణిలో కాకుండా కాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నించే అవకాశం ఉంటుంది.

● విద్యార్థి దశలోనే కాదు.. ఉద్యోగార్థిగానూ వీటికి ప్రాధాన్యముంటుంది. కొన్ని ముఖ్యమైన ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో సాధారణంగా హాబీలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతుంటారు. వీటికి మీరిచ్చే సమాధానాల ద్వారా మీ మీద ఎంతో కొంత సానుకూలత వ్యక్తమవుతుంది. దీంతో మీరు ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశాలు మెరుగవుతాయి. అందుకే విద్యార్థులూ, ఉద్యోగార్థులూ ఏదో ఒక వ్యాపకాన్ని కల్పించుకుని, అందులో కృషిచేస్తే ఎన్నో విధాలుగా ప్రయోజనం పొందవచ్చు.

ఉద్యోగ, వ్యాపారాలకు.. ఎంబీఏ ఏ స్పెషలైజేషన్?

బీటెక్ (సీఎస్ఈ) పూర్తిచేశాను. బ్యాంకింగ్ లోన్స్ డిపార్ట్‌మెంట్‌లో టీమ్ లీడర్‌గా ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాను. ఇప్పుడు ఎంబీఏ చేయాలనుంది. భవిష్యత్తులో బిజినెస్ చేయాలనే ఆలోచన కూడా ఉంది. ఏ స్పెషలైజేషన్ తీసుకుంటే ఉద్యోగం, బిజినెస్‌లకు అనువుగా ఉంటుందో చెప్పండి? - రాశి

■ బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్) పూర్తిచేసి, బ్యాంకింగ్ రంగంలో ఆపరేషన్స్ విభాగంలో ఏడు సంవత్సరాల అనుభవాన్ని సొంతం చేసుకున్న తర్వాత ఎంబీఏ చేయాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ప్రస్తుత ఉద్యోగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, భవిష్యత్తులో సొంత వ్యాపారం ప్రారంభించాలన్న మీ ఉద్దేశం దృష్ట్యా అత్యంత జాగ్రత్తగా ఎంబీఏ స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. ఎందుకంటే, ఎంబీఏలో ప్రతి స్పెషలైజేషన్ మీ కెరియర్ లక్ష్యాలపై ప్రత్యేకమైన ప్రభావం చూపుతుంది.

◗ మీ ప్రస్తుత బ్యాంకింగ్ అనుభవానికి ఫైనాన్స్ స్పెషలైజేషన్ బాగా ఉపయోగపడుతుంది. రిస్క్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ అనాలిసిస్, క్రెడిట్ అప్రైజల్, ఇన్వెస్ట్‌మెంట్ ప్లానింగ్, ట్రెజరీ ఆపరేషన్స్ వంటి విభాగాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలకు ఫైనాన్స్ స్పెషలైజేషన్ ఉపయోగకరం. అంతేకాకుండా భవిష్యత్తులో మీరు సొంత వ్యాపారం ప్రారంభించినా, మూలధన వినియోగం, నగదు నిర్వహణ, లాభ నష్ట విశ్లేషణ, పెట్టుబడి నిర్ణయాలు వంటి అంశాల్లో ఫైనాన్స్ పరిజ్ఞానం అందులో విజయానికి కీలకం అవుతుంది.



వ్యాపారంపై ఆసక్తి ఉన్నవారికి మార్కెటింగ్ స్పెషలైజేషన్ అత్యంత ఉపయోగకరం. మార్కెట్ ధోరణులు, వినియోగదారుల ప్రవర్తన, బ్రాండ్ నిర్మాణం, డిజిటల్ మార్కెటింగ్, విక్రయ వ్యూహాలు వంటి అంశాల్లో లోతైన అవగాహన కలిగించడం ద్వారా వ్యాపారాన్ని విస్తరించడానికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఉద్యోగ రంగంలో కూడా మార్కెటింగ్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, సేల్స్ హెడ్ వంటి వివిధ అవకాశాలు ఉంటాయి.

◗ మీ అనుభవానికి అత్యంత దగ్గరగా ఆపరేషన్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ ఉంటుంది. ఆపరేషన్స్ విభాగంలో పనిచేస్తున్నందున ప్రాసెస్ ఆప్టిమైజేషన్, వ్యయ నియంత్రణ, నాణ్యత పరిరక్షణ, సప్లయ్ చెయిన్ కోఆర్డినేషన్ వంటి అంశాల్లో నైపుణ్యాల్ని పెంపొందించుకోవడానికి ఇది ఉత్తమ మార్గం. ఏ వ్యాపారంలో అయినా కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించడానికి కావలసిన నైపుణ్యాలు ఈ స్పెషలైజేషన్ ద్వారా పొందవచ్చు.



◗ భవిష్యత్తులో సొంత వ్యాపారం ప్రారంభించే ఉద్దేశం ఉంది కాబట్టి, ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్పెషలైజేషన్ కూడా మంచి ఎంపికే. కొత్త వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం, మార్కెట్‌ను అంచనా వేయడం, వ్యాపార ప్రణాళిక రూపొందించడం, స్టార్టప్ నిర్వహణ వంటి అంశాల్లో ఇది బలమైన పునాది వేస్తుంది.

◗ అవకాశం ఉంటే.. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లేదా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పూర్తిచేస్తే మీ కెరియర్ మరింత ఉన్నత స్థాయికి వెళ్తుంది. ఈ సంస్థల నుంచి పొందే డిగ్రీలు.. నెట్‌వర్కింగ్‌కు, వృత్తి అభివృద్ధికి, భవిష్యత్తులో వ్యాపార ప్రణాళికలకు ఉపయోగకరంగా ఉంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

వసుంధర

vasundhara@eenadu.in



ఛాయ

'ఆడపిల్ల, మృదుస్వభావి, కంగారు ఎక్కువ, ఒత్తిడిని తట్టుకోలేదు... కేసులో అన్ని ఆధారాలూ సరిగ్గా ఉంటేనే పరిష్కరించడం సాధ్యం కాదు. అలాంటిది ఎలాంటి ఆధారాల్లేని కేసుని ఎలా ఛేదిస్తుంద'న్నారంతా. కట్ చేస్తే... దేశాన్ని కుదిపేసిన కేసులెన్నో పరిష్కరించారీమె. తనే ఐపీఎస్ అధికారిణి ఛాయా శర్మ. ప్రస్తుతం దిల్లీలో బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఐజీగా కొనసాగుతున్నారు. "మెక్ కెయిన్ ఇన్‌స్టిట్యూట్ అవార్డ్ ఫర్ కరేజ్"ని అందుకున్న తొలి భారతీయురాలు. తాజాగా ఈమె ప్రయాణం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'ఆమె' కేసులెన్నో ఛేదించారు!

అది 2012 డిసెంబరు... గాఢ నిద్రలో ఉన్న దిల్లీ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 23 ఏళ్ల యువతి, వివస్త్రగా రోడ్డుపై రక్తపు మడుగులో నిస్సహాయ స్థితిలో పడిఉన్న వీడియోలు మీడియాలో చక్కర్లు కొట్టాయి. తనని ఆస్పత్రికి పంపినప్పట్నుంచీ... జరిగిన ప్రతి విషయం అప్‌డేట్ వస్తోంది. తలచుకున్నా ఒంట్లో వణుకు పుట్టించేంత క్రూరంగా ఆమెను అత్యాచారం చేశారని వార్తల్లో చెబుతున్నారు. ఓ పక్క మహిళా సంఘాల నిరసన, మరో పక్క యువత ర్యాలీలు... న్యాయం కోరుతూ ప్రజలు చేసిన ధర్నాలు కేసుని మరింత కీలకం చేశాయి. ఈ ఘటన జరిగింది దక్షిణ దిల్లీలో. అది డీసీపీ ఛాయా శర్మ పరిధిలోనే ఉంది. కేస్ టేకప్ చేసినప్పుడు 'నిందితుల్ని పట్టుకోవడానికి సరైన ఆధారాలు లేవు. ఇదొక బ్లైండ్ కేసు. పరిష్కరించడం చాలా కష్టం అన్నా'రంతా. కానీ, ఛాయ పట్టు వదల్లేదు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ యువతికి న్యాయం జరగాల్సిందేనని నిశ్చయించుకున్నారు. రేయింబవళ్లు అవిశ్రాంతంగా పనిచేసి ఐదురోజుల్లోనే కేసుని ఛేదించారు. నిందితులని అరెస్టు చేసి, 18 రోజుల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇదొక్కటే కాదు... దీని తర్వాత ఇలాంటి చాలా కేసుల్ని ఛేదించారు ఛాయ. ఆడపిల్లలకి పోలీసు ఉద్యోగం అవసరమా అన్నవారందరి నోళ్లూ మూయించారామె.



ఛాయ పుట్టి పెరిగింది హరియాణలో. తండ్రి ప్రభుత్వోద్యోగి. దిల్లీ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్(ఆనర్స్)లో డిగ్రీ పూర్తిచేశారీమె. 'నాన్నకు నన్ను పోలీస్‌గా చూడాలని కోరిక. అందుకే డిగ్రీ పూర్తయ్యాక యూపీఎస్సీ శిక్షణ తీసుకున్నా. 1999లో ఏజీఎమ్‌యూటీ కేడర్‌లో ఐపీఎస్‌గా ఎంపికయ్యా. పలుచోట్ల విధులు నిర్వర్తించిన తర్వాత 2010లో డీసీపీగా దిల్లీలో పోస్టింగ్ వచ్చింది. అప్పుడు ఎదురైన అనుభవాలు నాకింకా గుర్తే. నా ముందు చాలామంది సీనియర్ అధికారులు కూర్చున్నారు. అందులో ఒకరు 'అర్జునుడి గాండీవాన్ని ఎవరు తీసుకోవాలి?' అన్నారాయన. ఆ ప్రశ్న నాకు అవమానంగానూ, భయంగానూ అనిపించింది. ఎందుకంటే ఆ ప్రశ్న ఈ ఉద్యోగంలోని గడ్డు పరిస్థితుల గురించి హెచ్చరించినట్లు, నీ వల్ల అవుతుందా? అని ప్రశ్నించినట్లు అనిపించింది. అప్పుడు నేను కాస్త తడబడ్డా. అలాంటి క్లిష్ట సమయాల్లో నా భర్తే ధైర్యం చెప్పేవారు.. తను కూడా ఐపీఎస్ అధికారి కావడంవల్ల ఈ వృత్తిలో ఉండే లోటుపాట్లు అన్నీ ఆయనకి బాగా తెలుసు. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు ఆయనే నా బలాన్ని నాకు గుర్తు చేసేవార'ంటారీమె. నిర్భయ కేసు జరిగిన ఎనిమిదేళ్ల తర్వాత ఆమె ధైర్యసాహసాలను ప్రపంచానికి తెలియజేస్తూ 'దిల్లీ క్రైమ్' పేరుతో వెబ్‌సిరీస్‌ను కూడా రూపొందించారు.

వాళ్ల భద్రతే ముఖ్యం...

నేరపరిశోధన, స్త్రీ, శిశు సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు ఛాయ. నిర్భయ కంటే ముందు 'బేబీ పలక్ కేసు'ను ఛేదించారీమె. 'రెండున్నరేళ్ల పాప ఒంటినిండా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరింది. చిన్నారి అక్రమ రవాణా, శారీరక హింసకు సంబంధించిన కేసు అది. కానీ దాన్ని ఓ ప్రమాదంగా చిత్రీకరించారు. అందరి దృష్టి నేరస్థుడిని పట్టుకోవడం మీదే. కానీ నేను మాత్రం మొత్తం నెట్‌వర్క్‌ను పట్టుకోవాలనుకున్నా' అనే ఛాయ ఈ కేసులో 8 మందికిపైగా నేరస్థులని అరెస్టు చేశారు. దాంతో చైల్డ్ ట్రాఫికింగ్ రాకెట్ మొత్తం బయటపడింది. ఇవన్నీ స్థానిక మీడియాలో కథనాలుగా వచ్చాయి. ఛాయ ధైర్య సాహసాల్ని మెచ్చుకున్నారంతా. జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ), కేంద్ర విజిలెన్స్ విభాగంలో డీఐజీగా అందించిన సేవలకు ఎన్నో అవార్డులూ, రివార్డులూ అందుకున్నారీమె. 'పోలీసంటే చట్టం కాదు, మనుషుల ప్రాణాలు. మన పని ప్రజల భద్రత కోసమే' అనే ఛాయ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



స్త్రీల క్యాన్సర్ చికిత్స కోసమే ఈ ఆస్తి!

దశాబ్దాలుగా వేలమంది మహిళలకు చికిత్సనందించారు ఒడిశాకు చెందిన డా.లక్ష్మీబాయి. తన జీవిత కాలమంతా నిరుపేద రోగుల సంరక్షణకోసమే పనిచేశారామె. పదవీ విరమణ తర్వాతా ఆమె ఆలోచనలన్నీ వారికోసమే. తాజాగా తన 100వ పుట్టినరోజు సందర్భంగా ఈ వృద్ధ డాక్టరమ్మ మహిళల క్యాన్సర్ చికిత్స కోసం రూ.3.40 కోట్లను ఎయిమ్స్ భువనేశ్వర్‌కు విరాళంగా ప్రకటించారు. తన జీవిత కాలంలో సంపాదించిన ఈ మొత్తాన్ని సమాజానికి తిరిగి ఇవ్వడంలోనే తనకు సంతృప్తి ఉంటుందంటారామె. ఒడిశా తొలి మహిళా గైనకాలజిస్టుల్లో ఈమె ఒకరు. లక్ష్మీబాయిది బ్రహ్మపుర. మద్రాస్ మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేశారు. ఆపై సుందర్‌గఢ్ జిల్లా ఆసుపత్రిలో వైద్యవృత్తిని ఆరంభించారు. 1986లో ఎంకేసీజీ మెడికల్ కాలేజీ నుంచి పదవీ విరమణ చేసే వరకు వేల మంది మహిళలకు, ముఖ్యంగా పేదలకు ఉచిత చికిత్స అందించారు. దేశంలోనే తొలి మహిళా వైద్యురాలిగా యూకేలో ల్యాప్రోస్కోపీ విభాగంలో శిక్షణ తీసుకున్న ఆమె... కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో చేసిన కృషికి అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా సత్కారమూ అందుకున్నారు. ఆ తర్వాత ఆమె చేసిన వందలాది ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్సలు ఆ కాలంలోనే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుగా నిలిచాయి. ఇప్పటికే లక్ష్మీ భారత్ జ్యోతి, బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా వంటి అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు. వీటన్నింటిలోనూ ఈ విరాళమే... తనకు తాను ఇచ్చుకున్న అతి పెద్ద బహుమతి అంటారామె. సంపాదనకోసం పరుగులు పెట్టే ఈ తరానికి ఈ డాక్టరమ్మ ఇస్తోన్న స్ఫూర్తి ఆదర్శనీయం.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



మహిళల కెరియర్ నిర్మాణంలో సందేహాలు... నిపుణుల సలహాలు ఈనాడు వెబినార్!

ఈనాడు వసుంధర

కెరియర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఏ మహిళకు ఉండదు? కానీ ఆ ప్రయాణంలో అతివలకు అడుగడుగునా సవాళ్లే. అవకాశాల కొరత, వేతనాల్లో వ్యత్యాసం, పదోన్నతుల్లో పక్షపాతం, నిత్యం మారే సాంకేతికత... ఇలాంటివెన్నో! కుటుంబ బాధ్యతలు, సామాజిక ఒత్తిళ్లు వీటికి అదనం. అలాగని రాజీపడుతూ కూర్చోలేం కదా! ముందడుగు వేయాల్సిందే. అందుకోసం ఏం చేయాలనేదే మీ సందేహమా?

అయితే, **'ఈనాడు- వసుంధర'** ఆధ్వర్యంలో డిసెంబరు 7న(ఆదివారం) ఉదయం 11 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకూ నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొనండి. తమకు ఎదురైన సవాళ్లను అధిగమించి కెరియర్‌ను విజయవంతంగా నిర్మించుకున్న మహిళల నుంచి అమూల్యమైన సలహాలూ, సూచనలూ అందుకోండి. కెరియర్ ప్రారంభ, మధ్య దశలో ఉన్న ఉద్యోగినులకీ... డిగ్రీ చేస్తున్న, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవాళ్లకీ ఇది అద్భుత అవకాశం.

07.12.2025 (ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/0f8f2cf2 వెబ్‌లింకు ఓపెన్ చేయండి.
జూమ్ ఐడీ: 953 2585 8501
పాస్‌కోడ్: 352258
తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.

అడగడమూ... ఓ కళే!



'ఈ రోజంతా బాగా అలసిపోయా. ఇంకా నా కోసం కడగాల్సిన గిన్నెలు ఎదురు చూస్తున్నాయి'... అంటూ శ్రీవారితో పంచుకుంటాం. ఇలా అన్నప్పుడు మనసులో ఎక్కడో ఆశ! 'నువ్వు రెస్ట్ తీసుకో. ఈరోజుకి నేను కడిగేస్తాలే' అంటారేమో అని. కానీ అలా జరగదు. మనం చెప్పింది కామ్‌గా విని తన పని తను చేసుకుంటారాయన. లేదంటే రేపు చూసుకోవచ్చులే పడుకో అనేస్తారు. 'ఛ... ఏం మనిషో! అస్సలు అర్థం చేసుకోడు' అని రుసరుసలాడుకుంటూ తిరిగి మనమే పని చేసుకోవాలి. పోనీ నేరుగా 'ఈరోజుకి గిన్నెలు కడిగిపెట్టవా? నాకు అస్సలు ఓపిక లేదు' అని అడుగుతామా? అస్సలడగం. ఎక్కడ కోప్పడతారో, ఇంటి పని చేయడాన్ని అవమానంగా భావిస్తారోనన్న భయం. ఇందుకు మనం పెరిగిన వాతావరణమూ కారణమై ఉండొచ్చు. అందుకే ఇలా ఏదైనా చీకట్లో బాణం వేసినట్లుగా అడుగుతాం. దీన్నే 'డ్రై బెగ్గింగ్' అంటారు.

ఎదుటివాళ్లకి మన ఉద్దేశమేంటో అర్థమవదు కదా! దీంతో వాళ్లూ విని ఊరుకుంటారు. మరి మనం? మావారికి నా మీద ప్రేమ లేదు, నా మనసు అర్థం కాదని బాధపడుతూ ఉంటాం. ఇది ఇంతటితో పోయేదా? ఇలాంటి అసంతృప్తులన్నీ పోగై... మనసులో కొండలా పోగవుతాయి. దీంతో కోపం, చిరాకు, ఆందోళన వంటివి పెరుగుతాయి. అవి నెమ్మదిగా ఆలుమగల మధ్య కమ్యూనికేషన్‌ను తగ్గిస్తూ పోయి... చివరకు ప్రేమనే హరించేస్తాయి. కాబట్టి, 'నా మనసులో ఏముందో కనుక్కో' అన్నట్లుండే ఈ డ్రై బెగ్గింగ్‌ని వదిలేయమంటారు రిలేషన్‌షిప్ నిపుణులు. అవతలివాళ్లు చేస్తారా చేయరా అన్నది పక్కన పెడితే... ముందు నేరుగా నోరు తెరిచి అడిగేయమంటున్నారు. దీనివల్ల ఇంకా బోలెడు లాభాలున్నాయి. చక్కగా సమస్య ఏదైనా మనసు విప్పి మాట్లాడటం అలవాటవుతుంది. ఒకరికొకరు బాగా అర్థమవుతారు. కాబట్టి, మీ మనసు తెలుసుకోవాలి, చదవాలన్న ఆరాటం మాని నోరు విప్పండి. మార్పు కనిపిస్తుంది. ప్రయత్నిస్తారుగా మరి?



ఎన్నెన్నో అందాలు... అన్నింట్లో ప్రత్యేకం!

ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కోసం... మొక్కల్ని పెంచండి. యోగా, వ్యాయామాలు చేయండి. అంటూ బోలెడు సలహాలు. ఇవన్నీ మంచిదే. వాటితోపాటూ ప్రస్తుతాన్నీ ఆనందించండి అంటున్నారు నిపుణులు. అందుకు చాలానే చిట్కాలు, సలహాలు, సూచనలు చెబుతున్నారు కూడా. అయితే వాటి వల్ల ప్రయోజనం చేకూరడానికి వేచిచూడాల్సిందే. కానీ, ఈ చిట్కాలో కాలయాపన అసలే ఉండదు. తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇదేంటంటే... బాల్కనీలోంచి కిందకో, పక్కకో చూడండి చాలు. ఎందుకు అంటారా... మైండ్‌ఫుల్‌నెస్‌కి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆడుకుంటున్న పిల్లలూ... వాకింగ్ చేసేవాళ్లూ... చిరుగాలితో సయ్యాటలాడే చెట్ల కొమ్మలూ... వాటితో ఆటలాడుతున్నట్లుండే సీతాకోకచిలుకలూ... ఒకటా రెండా ఇలా ఎన్ని అందాలో. వీటిల్లో కొన్ని మనల్ని గతంలోకి తీసుకెళ్లి ఆపాత మధురాల్ని గుర్తుచేస్తే... కొన్ని ప్రస్తుతాన్ని ఎలా ఆస్వాదించాలో నేర్పుతాయి. ధ్యాసను మళ్లించి, దృష్టిని వేరే వాటిపై కేంద్రీకరించే వ్యాయామం లాంటిదే ఇది కూడా. సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పుడు... మనసుకు సాంత్వనగా అనిపించాలంటే ఇలా ప్రయత్నించి చూడండి మరి!

సైనస్ ఉంది... కివీ తినకూడదా!

మా పాపకి 12ఏళ్లు. సైనస్ ఉంది. శీతకాలం వచ్చిందంటే రోగనిరోధక శక్తి బాగా తగ్గిపోతుంది. ఈ సమయంలో తను కివీ తింటే జలుబు చేస్తుందని విన్నాను నిజమేనా? ఇమ్యూనిటీ పెరగాలంటే తనకి ఏయే పండ్లు పెట్టొచ్చు? – రమణి, ఏలూరు.

చలికాలంలో కివీ, బత్తాయి, జామ పండ్లు తింటే జలుబు చేస్తుందనేది అపోహ మాత్రమే. అయితే కుటుంబంలో తల్లి/తండ్రికి వీటితో సమస్య ఉంటే కొంతమేర వచ్చే ఆస్కారం ఉంటుందే తప్ప ఇవి తింటే పిల్లలకి జలుబు చేయదు. శీతకాలంలో పిల్లలకి రోగనిరోధక శక్తి తగ్గడం సహజం. ఇది పెరగడానికి పండ్లతో పాటూ వివిధ రకాల పోషకాలను అందించాల్సి ఉంటుంది. పాపకి పెట్టే ఆహారంలో విటమిన్ సి తప్పక ఉండాలి. ఇది తెల్లరక్త కణాల ఉత్పత్తినీ, వాటి పనితీరునీ ప్రేరేపిస్తుంది. ఇందుకు సిట్రస్ పండ్లు... నారింజ, జామ, ఉసిరి, స్ట్రాబెర్రీ, బొప్పాయి వంటివి పెట్టాలి. వీటితోపాటు విటమిన్ ఎ, బీటా కెరోటిన్ ఉండే కాయగూరలు... క్యారెట్, చిలగడదుంప, పాలకూర, బ్రాకలీ, గుమ్మడి వంటివి తన ఆహారంలో భాగం చేయాలి. పాలకూరతో స్మూతీ లేదా పరోటా చేసి ఉదయం అల్పాహారంగా ఇవ్వొచ్చు. విటమిన్-ఇ, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే బాదం, వాల్‌నట్, పల్లీ, సన్‌ఫ్లవర్, గుమ్మడి గింజల్ని చిరుతిండిగా ఇవ్వొచ్చు. తను తినే ఆహారంలో ప్రొటీన్ సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి. ప్రొబయాటిక్స్ ఎక్కువగా ఉంటే గట్ హెల్త్‌ను మెరుగుపరుస్తాయి. ప్రాసెస్ చేసిన, చక్కెర పదార్థాలకి దూరంగా ఉంచాలి. రోజూ తగినన్ని నీళ్లు తాగాలి, వేళకు నిద్ర, శారీరక శ్రమ ఉండాలి.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

'కెరియర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలి' అని ఆలోచించని మహిళలూ, అమ్మాయిలూ ఉంటారా? అయితే దీనికి ఎలాంటి మార్గాల్ని అనుసరిస్తున్నారనే దానిమీదా మీ విజయం ఆధారపడి ఉంటుంది అంటున్నారు కెరియర్ నిపుణులు. అందుకు ఈ మూడు 'ఐ'లని తప్పక తెలుసుకోమంటున్నారు.

ఈ మూడు 'ఐ'ల గురించి తెలుసా?



పట్టించుకోకపోవడం(ఇగ్నోర్): ఓ స్థాయికి చేరుకున్నాక... ఇతరుల మాటల్నీ, సలహాలూ-సూచనల్నీ, ఫీడ్‌బ్యాక్‌నీ పట్టించుకోరు చాలామంది. అంతా వాళ్లకే తెలుసన్న భావనలో ఉంటారు కొందరు. అవతలి వాళ్లు ఎప్పుడూ ఇంతే... వంకలు పెడుతూ ఉంటారని పరిస్థితుల్నీ మాటల్నీ పట్టించుకోరు ఇంకొంతమంది. వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో మనం చేసే అతి పెద్ద తప్పు ఇది. ఎవరేం చెప్పినా స్వీకరించే స్థితిలో ఉండాలి. అది మన ఎదుగుదలకు సహాయపడుతుంది అనుకుంటే... పాటించాలి. లేదంటే వదిలేయాలి. అంతేకానీ విషయాల్ని ఎప్పుడూ పెడచెవిన పెట్టే పనులు చేయకూడదట. ఇదే చెబుతుంది మొదటి ఐ.

అనుకరించడం(ఇమిటేట్): చిన్నా పెద్దా ఎవరి దగ్గర్నుంచి అయినా పనిలో మెలకువలు నేర్చుకునేందుకు సిద్ధంగా ఉండాలి. అంతేకానీ, అవతలి వాళ్లని అనుకరించడానికి ప్రయత్నించకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్ల పని విధానాల్ని మీవిగా మార్చుకోకూడదు. అది మీకు మంచి చేసేది, అవసరం అయినది అయితే... సారాన్ని అందిపుచ్చుకోవాలే తప్ప, మూసధోరణిలో కొట్టుకుపోకూడదు.

అతి జోక్యం(ఇంట్రప్ట్): ఏ స్థాయిలో ఉన్నవాళ్లైనా సహోద్యోగుల అభిప్రాయాల్ని గౌరవించాలి. తప్పయితే తీర్చిదిద్దడానికి ప్రయత్నించాలి. అవసరం అయితే సలహాలూ, సూచనలూ ఇవ్వాలి. అంతేతప్ప దాన్నే అదనుగా తీసుకుని వారిని కించపరిచేలా మాట్లాడకూడదు. వాళ్లు మాట్లాడే ప్రతి మాటలో కలుగజేసుకోకూడదు.

ఈ మూడు 'ఐ'లని ఎంత పక్కాగా పాటిస్తే... అంత మంచి ప్రొఫెషనల్‌గా పేరు తెచ్చుకుంటారు. వీటికి అతీతంగా నడుచుకుంటే చెడ్డ పేరు తప్ప మిగిలేదేమీ ఉండదు. పాటిస్తారుగా మరి!

బంగారం - వెండి



3న ముగింపు


	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,33,270	1,20,100	1,84,950
విజయవాడ	1,28,815	1,19,700	1,85,500
ప్రొద్దుటూరు	1,27,900	1,17,670	1,78,000
రాజమహేంద్రవరం	1,30,580	1,19,700	2,01,000
విశాఖపట్నం	1,30,100	1,19,700	1,90,000
తమిళనాడు	-----	1,20,600	2,01,000

అందాల బంతిపై రంగుల సీతాకోక చిలుక!

రంగు రంగుల పూబంతులు, వాటిపై వాలే అందమైన సీతాకోక చిలుకలతో అల్లియం పూల మొక్క తెచ్చే ఆకర్షణ అంతా ఇంతాకాదు. దీన్ని ఎలా పెంచుకోవాలో తెలుసుకుందామా!







ఇంటి తోట


అల్లియం మొక్కది వేల సంవత్సరాల చరిత్ర. ముఖ్యంగా ఈజిప్ట్, మెసపొటేమియా నాగరికత కాలంలో వీటిని ఆహారం కోసం పండించారట. కాలక్రమంలో దీనికి ఉండే ఆకర్షణతో అలంకరణ మొక్కల జాబితాలో చేరిపోయింది. ఉల్లి, వెల్లుల్లి, షాలోట్, స్కాలియాన్, చైవ్స్.. వంటివన్నీ ఈ జాతికి చెందినవే. ఇది సుమారు నాలుగు అడుగుల ఎత్తువరకూ ఎదుగుతుంది.

చిన్న చిన్న నక్షత్రాల్లాంటి పూలు... గుండ్రటి బంతి ఆకృతిలో విచ్చుకుంటాయి. ఇవి నీలం, గులాబీ ఊదా, తెలుపు, పసుపు వర్ణాల్లో కనువిందు చేస్తాయి. సీతాకోక చిలుకల్ని ఆకర్షిస్తాయి.

సంరక్షణ ఇలా...

అల్లియం కఠినమైన వాతావరణ పరిస్థితుల్ని తట్టుకోగలదు. దీన్ని కుండీల్లోనే కాదు... బోర్డర్లు, రాక్ గార్డెన్స్‌లోనూ పెంచుకోవచ్చు. దీన్ని నాటేందుకు పూర్తిగా ఎండ తగిలే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. మట్టి, నీరు నిలవని సారవంతమైనది అయ్యి ఉండాలి. కుండీల్లో నాటుకునేటప్పుడు కంపోస్ట్‌ని కూడా చేర్చాలి. అల్లియం దుంప పరిమాణానికి రెండింతలు గొయ్యి తవ్వి నాటుకోవాలి. ఒక్కోదానికీ కనీసం 15 సెం.మీ.ల దూరం ఉండేలా చూసుకోవాలి. మొలకలు కనిపించాక నేలను కొద్దిగా తేమగా ఉంచాలి. అంతేకాదు, పూల మొగ్గలు వచ్చాక ప్రతి రెండు వారాలకోసారి సమాన నిష్పత్తిలో ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందించాలి. తేమను నిలపడానికీ, కలుపుని నివారించడానికి ఒక పొరను మల్చింగ్ చేస్తే సరి. సన్నగా, పొడవుగా ఎదిగే అల్లియంలు గాలికి పడిపోకుండా ఆధారం అందిస్తే మేలు. వీటిని ఒక్కసారి నాటుకుంటే చాలు... ఏళ్లపాటు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ మొక్కకు చీడపీడల సమస్య తక్కువే. అయితే, నీరు ఎక్కువైతే మాత్రం దుంప కుళ్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే, అతిగా నీళ్లు పెట్టొద్దు.





ఇంటి పని తగ్గించే సలహాలివి!

ఉదయాన్నే ఇంటి పనులన్నీ చక్కబెట్టి ఆఫీసుకి వెళ్లే హడావుడి. ఏ వస్తువూ ఓ పట్టాన దొరకదు. దీంతో అలసట, అసహనం. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే మనం కాస్త ఆర్గనైజ్డ్‌గా ఉండాలి. అప్పుడే అనవసర శ్రమ ఎదురుకాదు. ఒత్తిడి లేకుండా పనులూ పూర్తవుతాయి.

- సరిగ్గా ఆఫీసుకి బయలుదేరే సమయంలోనే బండి తాళం కనిపించదు. హడావుడిగా ఊరెళ్లేటప్పుడు ఇంటికి వేసే కీ దొరకదు. ఎక్కడ పెట్టామో కూడా ఓ పట్టాన గుర్తురాదు. మీదీ ఇదే పరిస్థితా? ఈ ఇబ్బందికి చెక్ చెప్పాలంటే... గోడకి ఓ కీ హోల్డర్ బాక్స్‌ని ఏర్పాటు చేసుకోండి. లోపలికి రాగానే తాళాల్ని దానికి తగిలిస్తే సరి. అలానే, ఛార్జర్లు, వాటి కేబుళ్లను ఇలానే వెతుక్కుంటాం. ప్లగ్‌లకే వదిలేస్తే ఆ వైర్లూ పాడవుతాయి. అలా కాకూడదంటే వాల్‌మౌంట్ హోల్డర్లను వాడండి.



- రబ్బరు బ్యాండ్లు, క్లిప్పులు, హెయిర్ పిన్నులు వంటివి ఎన్ని కొన్నా అవసరానికి ఒక్కటీ కనపడదు. మీకూ అంతేనా? ఏ డ్రాలోనో అన్నీ కలిపి పెట్టిన వాటిని వేటికవే విడదీయండి. స్క్రంచీలను భద్రపరచడానికి గొట్టాల్లాంటి హోల్డర్లు, క్లిప్పులను తగిలించడానికి ట్రెస్ మాదిరి ఉండే ఆర్గనైజర్లు... చాలానే వచ్చాయి. మీకున్న స్థలాన్ని బట్టి వాటిల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ఇయర్ రింగ్స్, రింగ్స్ లాంటివి దాచడానికి ఏ కంపార్ట్‌మెంట్ దానికే ఉండేలా షెల్ఫ్ ఆర్గనైజర్స్‌ని ఎంచుకుంటే గందరగోళం ఉండదు.



- చెప్పుల్ని సర్దడం అంటే పెద్ద పని. అన్నీ కలిపి ఓ కుప్పలా పెట్టేస్తారు చాలామంది. ముందు అవసరం లేనివి తీసేయండి. ఎప్పుడో ఒకసారి వాడతామనుకునే వాటిని శుభ్రం చేసి బాక్సుల్లో సర్దేయండి. లేదంటే వీటికోసం పారదర్శకంగా ఉండే ఫోల్డబుల్ షూ ర్యాక్ కంటైనర్స్ వస్తున్నాయి. వీటిల్లో పెడితే, దుమ్ము పడకుండా, పాడవకుండా ఉంటాయి. పైన మూత పెట్టేయొచ్చు.



- వంటగదిలో వాడే ప్రతి వస్తువుకీ లేబుల్ వేయండి. సరకుల్ని నిల్వ చేసేందుకు, వాడేందుకు అంటూ ప్రతిదానికో సమూ రెండు పరిమాణాల్లో తీసుకోండి. అలానే వీలైనంతవరకూ అవన్నీ పారదర్శకంగా ఉండేలా చూసుకోండి. అప్పుడు వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. అలాలే దనుకుంటే అందులోని సరకు పేరుతో లేబుల్స్ వేసేయండి. ఎంత ఒత్తిడిలో ఉన్నప్పుడైనా సులువుగా తీసుకోగలుగుతారు.





- ఆహారాన్ని ఫ్రిజ్‌లో భద్రపరచడానికి పెద్ద బాక్సులను వాడొద్దు. ఇవి స్థలాన్ని ఎక్కువ ఆక్రమిస్తాయి. బదులుగా చిన్న చిన్న డబ్బాల్లో సర్దితే... వేటికవే తీసుకోవచ్చు. పదే పదే బయటకు తీస్తే... పాడవుతాయన్న బాధ ఉండదు.

బెంగాల్ టీచర్ల నియామకాల రద్దు చెల్లదు

ఏకసభ్య ధర్మాసనం నిర్ణయాన్ని కొట్టివేస్తూ డివిజన్ బెంచ్ తీర్పు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర వివాదానికి కారణమైన ఉపాధ్యాయుల నియామకాల్లో కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ బుధవారం కీలక నిర్ణయం వెలువరించింది. ముప్పై రెండు వేల మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల నియామకాలను రద్దు చేసిన ఏకసభ్య ధర్మాసనం తీర్పును కొట్టివేసింది. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన కొద్ది మంది మొత్తం వ్యవస్థను స్తంభింపజేయడాన్ని అనుమతించబోమని వ్యాఖ్యానించింది. టెట్ పరీక్ష ద్వారా 2016లో 32వేల మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణ



సీబీఐ దర్యాప్తు జరిపింది. కేవలం 264 మంది విషయంలోనే ఒక మార్కు ఎక్కువ వేసి నియామకాలు ఇచ్చారని తేల్చింది. అయితే వారి జోక్యం వల్లనే ఇలా అదనంగా ఒక మార్కు కలిపారనడానికి ఆధారాలు కనిపించలేదని సీబీఐ తెలిపింది. పరీక్ష ఫలితాలు వెలువడిన తొమ్మిదేళ్ల తరవాత నియామకాలను రద్దు చేయడం ఉపాధ్యాయులకు, వారి కుటుంబాలకు తీరని వ్యథ కలిగిస్తుందని హైకోర్టు డివిజన్ బెంచ్ పేర్కొంది. ఈ తీర్పుపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మరికొన్ని నెలల్లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా వెలువడిన ఈ తీర్పు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వానికి భారీ ఉపశమనం కలిగించింది.

సాటి దివ్యాంగులు 200 మందికి ఉచిత విద్య, వసతి

రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌కు చెందిన హుకుమారామ్ భాటీ (29) తాను దివ్యాంగుడైనా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం లేకున్నా 200 మంది వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వదిలేసి.. దివ్యాంగ విద్యార్థులకు ఉచిత విద్య, ఆశ్రయం కల్పిస్తున్నారు. వీరిలో పలువురు క్రీడాకారులుగా రాష్ట్ర, జాతీయస్థాయిలో బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఇప్పటిదాకా 29 మంది దివ్యాంగులైన అమ్మాయిల పెళ్లిళ్లు కూడా చేశారు. తాను స్థాపించిన సత్యమేవ కరుణ సంస్థకు దాతల నుంచి అందుతున్న సహాయ సహకారాలతోనే ఇవన్నీ చేయగలుగుతున్నట్లు హుకుమారామ్ తెలిపారు. రూ.5 కోట్లతో స్థలం కొని, విద్యార్థుల కోసం ఐదు అంతస్తుల హాస్టలు భవనం కట్టారు. కుంటుతూ నడిచే తనకు విద్యార్థి దశలో జోధ్‌పుర్‌లో అద్దెగది, హాస్టలు వసతి కూడా దొరక్క శ్మశానవాటికలో ఉండి చదువుకున్నారు. తనలాంటి దివ్యాంగులను ఆదుకోవాలని ఆనాడే సంకల్పం చేసుకొన్నట్లు ఆయన వెల్లడించారు.



ఈటీవీ భారత్

ఎగిరే సంకల్పం ఉంటే చాలు వైకల్యం అవరోధం కాదు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రముఖ దివ్యాంగ క్రీడాకారుడు డాక్టర్ విజయ్ తాప్లస్ పారామోటార్‌లో 3,000 అడుగుల ఎత్తున విహంగ విన్యాసం చేశారు. మహారాష్ట్రలోని లోనావాలాలో గల ఎంపీ వ్యాలీ విమానాశ్రయంలో ఈ విన్యాసాన్ని పూర్తి చేశారు. ఈ సాహసయాత్రకు కెప్టెన్ విజయ్‌సేథీ మార్గదర్శనం చేశారు. వైకల్యం మన శక్తి సామర్థ్యాలను అడ్డుకోలేదని, వైకల్యం లేదా ఇతర సవాళ్లను ఎదుర్కొంటున్న దివ్యాంగులకు ఇది స్ఫూర్తి అని ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ఆయనను అభినందించారు.



సంచార్ సాథీ యాప్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం

- కొత్త ఫోన్లలో తప్పనిసరనే ఉత్తర్వుల ఉపసంహరణ

దిల్లీ: కొత్తగా విక్రయించే ఫోన్లలో డిఫాల్ట్‌గా సంచార్ సాథీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలన్న వివాదాస్పద నిర్ణయం నుంచి కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. విపక్షాలతోపాటు సాంకేతిక నిపుణుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. 'సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలన్న నిబంధనను ఉపసంహరించుకుంటున్నాం' అని బుధవారం కమ్యూనికేషన్ల శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే యాప్ స్టోర్లలో అది అందుబాటులో ఉంటుందని, డౌన్‌లోడ్ చేసుకోవడం స్వచ్ఛందమేనని స్పష్టం చేసింది. సైబర్ నేరాల నుంచి రక్షణ, చోరీకి గురైన ఫోన్లను గుర్తించేందుకు ఈ యాప్‌ను అన్ని ఫోన్లలో తప్పనిసరి చేస్తూ నవంబరు 28వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే పౌరుల కాల్స్‌ను వినడానికి, ఎస్సెమ్మెస్‌లను చూడటానికే ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకొచ్చిందని ప్రతిపక్షాలు, వ్యక్తిగత గోప్యత కోసం పోరాడేవారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఫోన్ల తయారీదారులైన శాంసంగ్, యాపిల్ సంస్థలూ తమకున్న పరిమితులను ప్రభుత్వానికి విన్నవించాయి. 'సంచార్ సాథీ యాప్‌నకు భారీ స్పందన లభిస్తోంది. ఒక్క రోజులో 6 లక్షల డౌన్‌లోడ్లు నమోదయ్యాయి. ఇది కేవలం సైబర్ నేరాల నుంచి పౌరుల భద్రతకు ఉద్దేశించినదే. అయితే ప్రజల నుంచి స్వచ్ఛందంగా స్పందన వస్తున్నందున తప్పనిసరి చేయడం లేదు' అని మంత్రిత్వశాఖ వివరించింది.

గూఢచర్యం ఉండదు: సంచార్ సాథీ యాప్ ద్వారా ప్రజలపై గూఢచర్యం సాధ్యమే కాదని, అలాంటిదేదీ దీని ద్వారా జరగదని కమ్యూనికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టంచేశారు. బుధవారం కాంగ్రెస్ సభ్యుడు దీపేందర్ సింగ్ హుడ్డా లోక్‌సభలో అడిగిన అనుబంధ ప్రశ్నకు మంత్రి ఈ స్పష్టత ఇచ్చారు. ప్రజల రక్షణే యాప్ ఉద్దేశమని, వాడాలా వద్దా అనేది ఎంపిక చేసుకునే అవకాశాన్ని వారికే ఇచ్చామని చెప్పారు. యాప్‌లో రిజిస్టరు కాకపోతే అది ఆ ఫోన్లో పని చేయదని, అవసరమైతే దానిని తొలగించేందుకూ ఆస్కారం ఉంటుందని తేల్చి చెప్పారు.

కుదరని సయోధ్య

- పుతిన్‌తో 5 గంటలపాటు ట్రంప్ రాయబారుల భేటీ
- శాంతి ప్రణాళికపై చర్చ
- కొన్ని అంశాలపై రష్యా అభ్యంతరం



మాస్కోలో అమెరికా ప్రతినిధులతో భేటీ అయిన రష్యా అధ్యక్షుడు పుతిన్

కీవ్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ఇప్పట్లో తెరపడే అవకాశాలు కనిపించడం లేదు! సుదీర్ఘంగా సాగుతున్న ఈ మారణహోమానికి తెరదించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాయబారులు తాజాగా జరిపిన చర్చలు ఆశించిన ఫలితాన్నివ్వలేదు. చర్చలు ఫలప్రదంగా సాగాయని అంటూనే.. చేయాల్సిన పని ఇంకా చాలా ఉందని పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ స్పష్టం చేశారు. ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జేర్డ్ కుష్నర్.. రష్యా అధ్యక్షుడితో మాస్కోలో మంగళవారం రాత్రి భేటీ అయ్యారు. ప్రతిపాదిత శాంతి ప్రణాళికపై ఆయనతో ఐదు గంటలపాటు సమాలోచనలు జరిపారు. "చర్చలు ఉపయోగకరంగా, నిర్మాణాత్మకంగా, అర్థవంతంగా సాగాయి. అయితే భూభాగాల విషయంలో రాజీ ఏదీ కుదరలేదు. అలాంటివి కుదరనంత వరకు ఈ సంక్షోభానికి పరిష్కారం దొరకదు. అమెరికా ప్రతిపాదనలు కొన్ని ఆమోదయోగ్యంగానే ఉన్నాయి. కానీ వాటిపై చర్చ జరగాల్సి ఉంది. ప్రతిపాదనల్లోని కొన్ని పదాలు మాకు నచ్చేలా లేవు. మాకు అంగీకారయోగ్యం కాని కొన్ని అంశాలు కూడా ప్రణాళికలో ఉన్నాయి. కాబట్టి చర్చలు కొనసాగుతాయి" అని ఉషకోవ్ పేర్కొన్నారు. ప్రతిపాదిత ప్రణాళికలోని కొన్ని అంశాలను పుతిన్ విమర్శించినట్లు ఆయన తెలిపారు. తాజా చర్చల పూర్తి వివరాలను బయట పెట్టేందుకు అమెరికాగానీ, రష్యాగానీ ముందుకు రాలేదు.

నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం: జెలెన్‌స్కీ

పుతిన్‌తో ట్రంప్ రాయబారులు జరిపిన చర్చలపై సత్వర నివేదిక కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. అమెరికా నుంచి వచ్చే సంకేతాలపైనే తమ తదుపరి అడుగులు ఆధారపడి ఉంటాయని ఐర్లాండ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు.

పూర్తి వివరాలు www.eenadu.netలో..

పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం

- ముడి పొగాకుపై 60-70% విధింపు
- వెయ్యి చుట్టలపై 25%.. లేదా రూ.5,000
- వెయ్యి సిగరెట్లపై రూ.2,700 నుంచి రూ.11,000
- బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: పొగాకు, దానితో తయారైన ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధించేందుకు ఉద్దేశించిన 'సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు-2025'కు మూజువాణి ఓటుతో లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. జీఎస్టీ పరిహార సెస్సు ముగిసిన తర్వాత నుంచి చట్టం అమలయ్యేలా బిల్లును ప్రతిపాదించారు. సిగరెట్లు, చుట్టలు, హుక్కా, జర్దా, నమిలే పొగాకుపై ప్రస్తుతం 28% జీఎస్టీతో పాటు వేర్వేరు రేట్లతో సెస్సు ఉంది. త్వరలో ముడి పొగాకుపై 60-70 శాతం ఎక్సైజ్ డ్యూటీ పడనుంది. సిగరెట్లు, చుట్టలపై 25% ఉంటుంది. లేదంటే ప్రతి వెయ్యి చుట్టలకు రూ.5,000 చొప్పున పడుతుంది. పొడవు, ఫిల్టర్ ఆధారంగా ప్రతి వెయ్యి సిగరెట్లకు రూ.2,700 నుంచి రూ.11,000 వరకు విధిస్తారు. నమిలే పొగాకు విషయంలో ఇది కిలోకు రూ.100 ఉంటుంది.

ఇది సెస్సే.. అదనపు పన్ను కాదు: కేంద్రం



నిర్మలా సీతారామన్

బిల్లుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. "పరిహార సెస్సు ఖాతా కింద చెల్లించాల్సిన రుణ బాధ్యతలు తీరిపోయాక సెస్సు ముగుస్తుంది. కొవిడ్ సమయంలో పడిపోయిన ఆదాయ భర్తీకి రాష్ట్రాలు తీసుకున్న రుణాలన్నీ మరో రెండువారాల్లో తీరిపోతాయి. అప్పుడు పరిహార సెస్సు ఉండదు. అందువల్ల మునుపటిలా ఎక్సైజ్ మాకు రావాలని అనుకుంటున్నాం. ఇలా వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని రాష్ట్రాలతో పంచుకుంటాం. ఇది సెస్సే తప్ప, అదనపు పన్ను కాదు. ఈ డబ్బును కేంద్రం తీసుకుపోదు. ఇది జీఎస్టీకి ముందూ ఉంది" అని ఆమె వివరించారు. పరిహార సెస్సు ముగిశాక కూడా అయోగ్య వస్తువులపై (డీమెరిట్ గూడ్స్‌పై) పన్ను కొనసాగుతుందని చెప్పారు. "గరిష్ఠంగా 40% చొప్పున జీఎస్టీ ఉంటుంది. ఒకవేళ ఎక్సైజ్ సుంకం వేయకపోతే పొగాకు ఉత్పత్తులపై నికర పన్ను ఇప్పుడున్న స్థాయి నుంచి తగ్గిపోతుంది. అలా జరగకుండా చూడటమే బిల్లు ఉద్దేశం" అని తెలిపారు.

రైతుల ప్రయోజనాలూ ముఖ్యమే: పురందేశ్వరి

పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచడం మంచిదే అయినా ఆ పంట సాగుమీద ఆధారపడినవారిపై పడే ప్రభావాన్నీ దృష్టిలో పెట్టుకోవాలని మరికొందరు సూచించారు. చర్చను దగ్గుబాటి పురందేశ్వరి (భాజపా) ప్రారంభిస్తూ.. పొగాకుపై 60 లక్షల మంది రైతులు, రెండు కోట్ల మంది కూలీలు ఆధారపడ్డారని చెప్పారు. పన్నుల్లో మార్పులు చేసేటప్పుడు రైతుల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు రైతులు విముఖం కాదని చెప్పారు.



శారీరక ఇబ్బందులతో మానసిక సమస్యలు

ఒక్కోసారి తలెత్తే మానసిక సమస్యలకు శారీరక ఇబ్బందులూ కారణం కావచ్చు. ఆందోళన, ఏ అంశంపైనా దృష్టి నిలపలేకపోవడం, చిరాకు వంటి మనోదౌర్బల్యాలకు రక్తంలో చక్కెరశాతం పెరగడం, డీహైడ్రేషన్, ఖనిజలవణాల లోపం, నిద్రలేమి, దీర్ఘకాల ఒత్తిడి కారణం కావొచ్చు. వీటిని అధిగమిస్తే మానసిక సమస్యల నుంచి బయటపడొచ్చు.

– గ్యారీ బ్రెకా, జీవశాస్త్రవేత్త

ఐవీఎఫ్ ద్వారా ఒకే కాన్పులో నలుగురి జననం



ఈటీవీ భారత్: ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన మహిళ.. నలుగురికి జన్మనిచ్చిన అరుదైన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ధార్ రోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రిలో షబ్నం మన్సూరీ అనే మహిళ ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డకు జన్మనిచ్చారు. బరువు తక్కువగా ఉండటంతో వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే షబ్నం గర్భం దాల్చిన తొలి నాళ్లలోనే.. 7 నెలల కిందట ఆమె భర్త సయ్యద్ మన్సూరీ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయినా గర్భాన్ని కొనసాగించేందుకే ఆమె నిర్ణయించుకున్నారు. తాజాగా సిజేరియన్ ద్వారా నలుగురు బిడ్డలకు జన్మనిచ్చారు. పిల్లలు 1.4, 1.068, 1.09, 1.365 కేజీల బరువున్నారు.

అవి మరణదండన ఉత్తర్వులే...

- ఆరావళి పర్వతాలపై కేంద్రం చర్యలను ఎండగట్టిన సోనియా



దిల్లీ: ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యావరణంపై నిరంకుశత్వ ధోరణిని కొనసాగిస్తోందని, ఆరావళి పర్వతాలకు దాదాపు 'మరణదండన ఉత్తర్వు'లను జారీ చేసిందని ఆరోపించారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే సోనియాగాంధీ రాసిన వ్యాసాన్ని ఓ జాతీయ పత్రిక ప్రచురించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసిన అటవీ సంరక్షణ చట్టం (1980), అటవీ సంరక్షణ నియమం(2022)ను వెంటనే ఉపసంహరించుకోవాలని సోనియా డిమాండు చేశారు. ''గుజరాత్, రాజస్థాన్, హరియాణా, దిల్లీల్లో విస్తరించి ఉన్న ఆరావళి పర్వతాలకు దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర ఉంది. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా.. మోదీ ప్రభుత్వం వాటికి దాదాపు మరణదండన ఉత్తర్వులను జారీ చేసింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది ఆరావళి శ్రేణిలోని 90 శాతం భాగాన్ని నాశనం చేయడానికి మాఫియాకు బహిరంగంగా ఆహ్వానించినట్లే. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై కొనసాగుతున్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలి" అని సోనియా డిమాండు చేశారు. ఆరావళి చివరి భాగంలో ఉన్న దిల్లీ మరోసారి గాలి కాలుష్యాన్ని ఎదుర్కొంటుందని, దుమ్ము, పొగ, కాలుష్య కణాలు కోట్లాది మంది ప్రజలను నెమ్మదిగా చంపుతున్నాయని తెలిపారు. పది నగరాల్లో సంవత్సరానికి 34,000 మరణాలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయన్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ నిబంధనలు అమలుచేసే సంస్థగా కాకుండా... వాటిని బలహీనపరిచే కేంద్రంగా మారిందని ఆరోపించారు.

ఫ్యాన్సీ నంబర్‌కు ఆన్‌లైన్ వేలం రూ.కోటికి పైగా పాడి.. మౌనం

ఇంటర్నెట్ డెస్క్: హరియాణాలో వాహన ఫ్యాన్సీ నంబరు 'హెచ్‌ఆర్88 బీ8888'కు హిసార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైనులో ఏకంగా రూ.1.17 కోట్లకు వేలం పాడి.. సోమవారంతో గడువు దాటినా ఆ మొత్తాన్ని చెల్లించలేకపోయాడు. ప్రారంభ ధర రూ.50 వేలుగా నిర్ణయించిన ఈ వేలానికి అత్యధికంగా 45 మంది వాహనదారులు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అనిల్ విజ్ స్పందిస్తూ.. ఆ వ్యక్తి ఆదాయమెంత?.. అంత డబ్బు కట్టే స్తోమత ఉందా? ఆరా తీయాలంటూ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఈ తరహా వ్యవహారాలను నివారించేందుకు సమగ్ర దర్యాప్తునకు ఆదాయపు పన్ను శాఖకు రాతపూర్వక విజ్ఞప్తి పంపుతామని తెలిపారు. పై నంబరుకు మరోసారి వేలం వేయనున్నట్లు సమాచారం.



గాజాలో 54 జంటలకు సామూహిక వివాహం

టెల్‌అవీవ్: ఇజ్రాయెల్‌తో యుద్ధంలో తీవ్రంగా దెబ్బతిన్న గాజాలో మెల్లమెల్లగా పరిస్థితులు చక్కబడుతున్నాయి. రెండేళ్లుగా తూటా శబ్దాలు, ఆకలి చావులు వినిపించిన ఆ ప్రాంతం తాజాగా ఓ సామూహిక వివాహ వేడుకకు వేదికైంది. యుద్ధంలో దెబ్బతిన్న ఖాన్ యూనస్‌లో శిథిలాల మధ్యనే జరిగిన ఓ వేడుకలో 54 జంటలు ఒక్కటయ్యాయి. ఈ వివాహాలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన సంస్థ 'అల్ ఫారెస్ అల్ షాహిమ్' నిధులు సమకూర్చింది. కొత్త జంటలకు కొంత డబ్బు, ఇతర సామగ్రిని కూడా అందించింది.

చివరి మృతదేహాన్నీ అప్పగించిన హమాస్

జెరూసలెం: గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశ దాదాపు ముగిసేలా కనిపిస్తోంది. తమ దగ్గర ఉన్న మిగిలిన చిట్టచివరి బందీ మృతదేహాన్ని సైతం హమాస్ బుధవారం ఇజ్రాయెల్‌కు అప్పగించింది. మరోవైపు ఈజిప్టు, గాజా సరిహద్దులో ఉన్న రఫా క్రాసింగ్‌ను తెరుస్తామని ఇజ్రాయెల్ పేర్కొంది. ఎప్పటిలోగా దీనిపై నిర్ణయం వెలువడుతుందన్న విషయంపై స్పష్టతివ్వలేదు. ఈ క్రాసింగ్ తెరుచుకుంటే గాజాలోని 16,500కు పైగా రోగులను వైద్య సాయం కోసం ఈజిప్టునకు తరలించే అవకాశం ఉంది.

లేబర్ కోడ్‌లపై విపక్షం అభ్యంతరం

- పార్లమెంటు వద్ద నిరసన ప్రదర్శన
- ఇది కార్మిక వ్యతిరేక సర్కారు: ఖర్గే



ఆందోళనలో పాల్గొన్న విపక్ష నేతలు రాహుల్‌గాంధీ, కనిమొళి, సోనియాగాంధీ, ప్రియాంక, ఖర్గే తదితరులు

దిల్లీ: కార్మిక చట్టాల్లో నూతన నియమావళుల్ని (కోడ్‌లను) రద్దుచేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కేంద్ర సర్కారు కార్మిక వ్యతిరేకి అని, ఆశ్రిత పెట్టుబడిదారులకు మాత్రం అనుకూలమని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు బుధవారం పార్లమెంటు సముదాయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మకర ద్వారం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో డీఎంకే, తృణమూల్, వామపక్ష సభ్యులు కూడా పాల్గొన్నారు. ఖర్గే అక్కడ మాట్లాడారు. తర్వాత 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. "కొత్త కోడ్‌ల వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఉంది. చాలా ఉద్యోగాలు పోతాయి. 300 కంటే తక్కువ మంది ఉన్న కర్మాగారాలకు లేఆఫ్ ఉత్తర్వులు వర్తించవు. అంటే దేశంలో 80% కర్మాగారాలు ఇప్పుడు ప్రభుత్వ ఆమోదం లేకుండానే లేఆఫ్‌లు ప్రకటించవచ్చు, కార్మికులకు ఉద్వాసన పలకవచ్చు. స్వల్పకాలానికి కార్మికుల్ని నియమించుకుని, దీర్ఘకాల ప్రయోజనాలను తప్పించుకునేందుకు కంపెనీలకు వీలు లభిస్తుంది. రోజుకు 8 గంటల పని అని పత్రాల్లో చూపించినా పరస్పర అంగీకారం పేరిట రాష్ట్రాలు దానిని 12 గంటల వరకు అనుమతించేందుకు అవకాశం ఉంది. అధిక శ్రమ వల్ల భద్రతే ప్రశ్నార్థకం అవుతుంది. సమ్మె చేయాలంటే 60 రోజులు ఆగాలి. ఆ తర్వాత మరో 14 రోజులు నిరీక్షించాలి. చిన్న యూనియన్లకు ఎలాంటి పాత్ర ఉండదు. నిబంధనల ఉల్లంఘనకు యాజమాన్యాలు కొంత రుసుం కట్టి బయటపడే వీలు కల్పించడం వల్ల జవాబుదారీతనం తగ్గిపోతుంది' ' అని ఖర్గే ఆందోళన వెలిబుచ్చారు.

హక్కుల్ని కేంద్రం లాక్కొంది: ప్రియాంక

ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ- కార్మిక చట్టాలను సరళతరం చేసే పేరిట తెచ్చిన కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కుల్ని కేంద్రం లాక్కొందని విమర్శించారు. ఇవి దోపిడీ చట్టాలని, వీటిని దేశం ఆమోదించే పరిస్థితిలో లేదని అన్నారు. ఈ చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు.



పార్లమెంటు హౌస్‌లో ప్రధాని మోదీతో పశ్చిమబెంగాల్‌కు చెందిన కేంద్ర సహాయ మంత్రి సుకాంతా మజుందార్, ఆ రాష్ట్ర నేతలు

బెంగాల్ ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉండండి

- ఎస్ఐఆర్ పారదర్శకంగా ఉండేలా చూసుకోండి
- రాష్ట్ర ఎంపీలకు మోదీ కీలక సూచనలు

దిల్లీ: పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. విపక్షాల ఉచ్చులో చిక్కుకోవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావిస్తూ.. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, 2021 నాటికి ఆ సంఖ్య 65కు చేరిందని గుర్తుచేశారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

చరిత్రను భాజపా వక్రీకరిస్తోంది

- నెహ్రూపై రాజ్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్

దిల్లీ: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ డబ్బుతో అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మించాలనుకున్నారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బుధవారం మండిపడింది. చరిత్రను భాజపా వక్రీకరిస్తోందని ఆరోపించారు. సర్దార్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని వడోదర సమీపంలోని సధ్లీ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో బాబ్రీ మసీదునే నిర్మించాలన్న నెహ్రూ ఆలోచనలను సర్దార్ పటేల్ వ్యతిరేకించారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ స్పందిస్తూ, చర్చించాల్సిన ముఖ్య సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ వ్యాఖ్యల లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ..''ఆయన చెప్పినంత మాత్రాన ఎవ్వరూ నమ్మరు, సర్దార్ పటేల్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్)ను నిషేధించే చర్యలు తీసుకున్నట్లు సాక్ష్యాలున్నాయి. నెహ్రూ దేశాభివృద్ధికి మార్గం వేశారు. ఆయన సాంకేతిక ఆలోచనలను పెంపొందించారు'' అని పేర్కొన్నారు. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా రాజ్‌నాథ్ వ్యాఖ్యలను ఖండించాయి.

బెలూన్ల వల్ల మూతపడిన విమానాశ్రయం

విల్నియస్(లిథువేనియా): ఐరోపాలోని బెలారస్, లిథువేనియా దేశాల మధ్య వాతావరణ బెలూన్లు ఉద్రిక్తతలు రేపుతున్నాయి. బెలారస్ నుంచి వస్తున్న బెలూన్ల కారణంగా తమ ప్రధాన విమానాశ్రయాన్ని(విల్నియస్) గత కొన్ని వారాలుగా పదే పదే మూసివేయాల్సి వస్తోందని లిథువేనియా పేర్కొంది. సిగరెట్ల అక్రమ రవాణాకు ఈ బెలూన్లను బెలారస్ వినియోగిస్తోందని ఆరోపించింది. ఇటీవల 60 బెలూన్లు వచ్చాయని, వాటిలో నలభై.. విమాన భద్రతకు అత్యంత కీలకమైన ప్రాంతంలోకి



చొచ్చుకొచ్చాయని వెల్లడించింది. తమ ఆర్థికవ్యవస్థ, వైమానిక భద్రతలను లక్ష్యంగా ఏర్పరచుకుని చేస్తోన్న హైబ్రిడ్ దాడిగా దీన్ని పేర్కొంది.

ఉక్రెయిన్‌కు సముద్రంతో సంబంధాలు తెంచేస్తాం

రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: నల్ల సముద్రంలో రష్యా 'షాడో ఫ్లీట్' ట్యాంకర్లపై తరచూ డ్రోన్ దాడులు జరుగుతుండటంపై ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దాడులకు కారణమైన ఉక్రెయిన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. "దీనికి పరిష్కార మార్గం.. సముద్రంతో ఉక్రెయిన్‌కు ఉన్న సంబంధాలను తెంచేయడమే..! అప్పుడే ఈ దాడులు ఆగుతాయి" అని పుతిన్ ఓ ప్రసంగంలో స్పష్టం చేశారు. కీవ్‌కు ఏ విధంగా సముద్ర మార్గాన్ని మూసేయనున్నారన్న విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఉక్రెయిన్ నౌకలపై దాడులను మరింత పెంచుతామని ఆయన హెచ్చరించారు. కీవ్‌కు సాయం చేసే దేశాల ట్యాంకర్లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. దక్షిణ, తూర్పు ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాలను మాస్కో ఇప్పటికే స్వాధీనం చేసుకుంది. అయితే, ఒడెసా సహా ప్రధాన పోర్టులన్నీ ఇంకా కీవ్ అధీనంలోనే ఉన్నాయి.

భారత్‌తో యుద్ధానికి మునీర్ ఆరాటపడుతున్నాడు

ఇమ్రాన్‌ఖాన్ సోదరి

దిల్లీ: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి అలీమా ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో యుద్ధం కోసం పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. తన సోదరుడు మాత్రం పొరుగు దేశంతో స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నాలు చేశారన్నారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అలీమా ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మేలో భారత్- పాక్ మధ్య యుద్ధానికి గల కారణం గురించి ప్రశ్న ఎదురవగా.. ఆమె మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఆసిమ్ మునీర్ ఇస్లామిక్ ఛాందసవాది. అందుకే అతడు భారత్‌తో యుద్ధం కోసం ఆరాటపడుతున్నాడు. ఇమ్రాన్ పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాలకు ప్రయత్నాలు చేశారు. సందర్భం వచ్చినప్పుడల్లా మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడు. ఇది భారత్‌తో పాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమే' అని అన్నారు.



దిల్లీలో కాలుష్యాన్ని నిరసిస్తూ బుధవారం రెస్పిరేటరీ మాస్కుతో పార్లమెంటుకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడ్డా, ఇతర ఎంపీలు

ఆస్టియోఆర్థరైటిస్ వ్యాధికి సిప్లా మూలకణ చికిత్స

ఆస్టియోఆర్థరైటిస్ వ్యాధి వల్ల కీళ్ల నొప్పులతో బాధపడే వారి కోసం సిప్లోస్టెమ్ అనే మూలకణ చికిత్సను సిప్లా లిమిటెడ్ అందించనుంది. దీని కోసం స్టెంప్యూటిక్స్ రీసెర్చ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ చికిత్సా విధానాన్ని స్టెంప్యూటిక్స్ రీసెర్చ్ అభివృద్ధి చేసింది. తాజా ఒప్పందం ద్వారా, ఆర్థో బయోలాజిక్ ఔషధాల విభాగంలోకి సిప్లా అడుగుపెట్టినట్లు అవుతోంది. మనదేశంలో ఆస్టియోఆర్థరైటిస్ వ్యాధితో బాధపడే వారి సంఖ్య 5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం దీనికి నొప్పి నివారణ మందులు, ఫిజియోథెరపీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ తాత్కాలిక పరిష్కారం మాత్రమే. సిప్లోస్టెమ్ అనేది నిర్ధారిత మూలకణ చికిత్స కనుక, నొప్పి బాగా అదుపులోకి వస్తుందని, ఈ రోగులు చాలా వరకూ సాధారణ జీవితాన్ని గడపొచ్చని సిప్లా ముఖ్య వైద్య అధికారి జైదీప్ గొగ్టే వివరించారు.

ఈనాడు బిజినెస్

ఓఎన్‌జీసీ ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు



అరుణ్ కుమార్ సింగ్

దిల్లీ: ఓఎన్‌జీసీ ఛైర్మన్‌గా అరుణ్ కుమార్ సింగ్ పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించారు. ఇది అరుదైన విషయం. ఆయన నాయకత్వంలో కంపెనీ తన లాభాలను స్థిరీకరించుకోవాలని ప్రభుత్వం భావించి ఉండొచ్చని తెలుస్తోంది. 2026 డిసెంబరు 6 వరకు సింగ్(63) కొనసాగేలా ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు ఒక అధికారిక ఉత్తర్వు వెలువడింది. 2022లో అరుణ్ ఓఎన్‌జీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 60 ఏళ్లకు సమీపంలో ఉన్న అధికారిని, ఒక బ్లూచిప్ ప్రభుత్వ రంగ సంస్థకు ఛైర్మన్‌గా నియమించడం అదే తొలిసారి. తాజాగా ఇంకో సంచలన నిర్ణయంతో ఆయన పదవీ కాలాన్ని 64 ఏళ్లకు పొడిగించడం విశేషం. ఓఎన్‌జీసీ ఛైర్మన్ పదవి కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నా, వారినెవరినీ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెలక్షన్ బోర్డు(పీఈఎస్‌బీ) ఎందుకు ఇంటర్వ్యూ చేయలేదో తెలియరాలేదు. ఓఎన్‌జీసీ తర్వాత గెయిల్ ఛైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పీఈఎస్‌బీ ఇంటర్వ్యూ చేసి, ఎంపిక చేసింది కూడా.

డాలర్.. రూ.90 నాటౌట్!

● ఎఫ్ఐఐలు.. దిగుమతిదార్ల నుంచి అమెరికా కరెన్సీకి అమిత గిరాకీ

● భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం ఆలస్యం వల్లే



క్రికెట్‌లో 90 పరుగులకు చేరినప్పుడు బ్యాటర్‌లో ఆందోళన పెరుగుతుంది. సెంచరీ (100) మైలురాయిని చేరతానా? ఆ లోపే అవుట్ అవుతానా? అని. దీనిని 'నెర్వస్ నైంటీస్'గా చెబుతుంటారు. 90 నుంచి ఒక్కో పరుగు పెరిగే కొద్దీ బ్యాటర్ ఆందోళన తగ్గుతూ ఉంటుంది.

రూపాయితో పోలిస్తే అమెరికా డాలరు విలువ కూడా రూ.90ను మించింది. ఇది దేశీయులందరికీ ఆందోళన కలిగించేదే. ఇక్కడ మాత్రం డాలర్ విలువ రూ.90 నుంచి ఒక్కో పైసా పెరిగే కొద్దీ, ఎన్నో రంగాలకు ఆ ఆందోళన పెరుగుతూ ఉంటుంది.

అక్కడేమో సెంచరీ చేరితే బ్యాటర్‌కు ఉపశమనం.. ఇక్కడేమో డాలర్ విలువ రూ.90 కంటే ఎంత కిందకు వస్తే ఆర్థిక వ్యవస్థకు అంత ఊరట.

కొన్ని వారాలుగా అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువలో క్షీణత స్థిరంగా కొనసాగుతోంది. తరచూ కొత్త జీవనకాల కనిష్ఠాలను నమోదుచేస్తూ.. బుధవారం కీలక స్థాయైన 90 ఎగువన నిలదొక్కుకుంది. క్రితం ముగింపుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 19 పైసలు తగ్గి 90.15 వద్ద ముగిసింది. ఏడాదికాలంలో రూపాయి మారకపు విలువ 6.57% క్షీణించింది.

ఇవే పడేస్తున్నాయి

● కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతోంది.

● వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదార్లు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

● భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఆలస్యం అవుతుండటం కూడా రూపాయి ప్రతికూలతకు దారితీస్తోంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

డాలర్ విలువ రూ.92కూ వెళ్లొచ్చు

● రూపాయి విలువకు 90.50ను తదుపరి కీలక స్థాయిగా కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇలాగే కొనసాగితే, డాలర్ విలువ రూ.92కు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషిస్తున్నారు.

● 2026 చివరికి డాలర్ విలువ రూ.91.5గా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ అంచనా వేస్తోంది. అయితే అమెరికా డాలరు విలువ 4-5% క్షీణించొచ్చని తెలిపింది.

● అమెరికా- భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై సానుకూల వార్తలు వెలువడితే.. రూపాయి క్షీణత ఆగిపోవడమే కాకుండా, పుంజుకునే అవకాశం ఉంటుందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేర్కొంది.

● రూపాయి విలువ మరింత క్షీణించడం అనివార్యమని కోటక్ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన నీలేశ్ షా చెబుతున్నారు. మన వాణిజ్య భాగస్వామ్య దేశాలతో పోలిస్తే, ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటం, ఉత్పాదకత తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఆయన వివరించారు.

మంచి ఉంది.. చెడూ ఉంది..

● బలహీన రూపాయితో దిగుమతుల బిల్లు భారం పెరుగుతుంది. విదేశాలపై అధికంగా ఆధారపడిన చమురు, ఎరువులతో పాటు బంగారం, వెండి వంటి కీలక రంగాలపై ఈ ప్రభావం కనిపించవచ్చు.

● దిగుమతుల వ్యయ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తే.. ఇంధనం, కొన్ని రకాల ఆహార ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ ధరలు పెరుగుతాయి.

● రూపాయి క్షీణతతో ఎగుమతిదార్లకు ప్రయోజనమే. అంతర్జాతీయ విపణుల్లో తక్కువ ధరకే మన ఉత్పత్తులు లభిస్తాయి. తద్వారా పోటీపరమైన అనుకూలత పొందే వీలుంటుంది. ముఖ్యంగా జౌళి, దుస్తులు, చేనేత వంటి రంగాలకు ప్రయోజనం కలుగుతుంది. డాలర్లలో ఆర్జిస్తుండటంతో ఐటీ సేవలు, సాఫ్ట్‌వేర్, బీపీఓ సంస్థల ఆదాయాలు మరింతగా పెరుగుతాయి. డాలర్లలో రుణాలు తీసుకున్న కంపెనీలకు వ్యయభారం పెరుగుతుంది.

● ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడతారు.

ఆర్థిక వ్యవస్థపై..

రూపాయి విలువ క్షీణించినప్పుడు, ఆర్థిక వ్యవస్థ వృద్ధి మందగిస్తున్న దశలో కూడా.. ద్రవ్యోల్బణంపై బలహీన రూపాయి ప్రభావం ఎలా ఉండొచ్చనే విషయానికి ఆర్‌బీఐ ప్రాధాన్యం ఇవ్వొచ్చు. దిగుమతుల భారం పెరుగుతుండటంతో.. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉంది. ఒకవేళ కఠిన విధాన నిర్ణయాలను ఆర్‌బీఐ తీసుకోవాల్సి వస్తే.. ఆ పరిణామం ఆర్థిక వ్యవస్థ నెమ్మదించేందుకు దారితీస్తుంది.

ముమ్ముందు ఎలా..

● విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) తిరిగి మన మార్కెట్లలో కొనుగోళ్లు చేపడితేనే, డాలర్లకు డిమాండు తగ్గి.. రూపాయి విలువకు స్థిరత్వం వస్తుంది. ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగితే, రూపాయి విలువ మరింత అధ్వానంగా మారొచ్చు.

● అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగితే దేశ దిగుమతి బిల్లు మరింత పెరుగుతుంది. దీంతో వాణిజ్య లోటు అధికమై.. రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతుంది.


● భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సాధ్యమైనంత త్వరగా కుదరాలి. ఈ ఒప్పందంపై అనిశ్చితి కొనసాగినంత వరకు రూపాయి విలువకు గండమే.

ఆర్‌బీఐ జోక్యం ఏమైంది?

రూపాయి పతనాన్ని నిరోధించేందుకు ఆర్‌బీఐ ఇటీవల తన జోక్యాన్ని పెంచింది. డాలర్లను అమ్మడం, ఫార్వర్డ్ పొజిషన్లను తీసుకోవడం లాంటి చర్యలను చేపట్టినా.. ప్రయోజనం లేకపోయింది. రూపాయి విలువలో అధిక ఒడుదొడుకుల నియంత్రణకు మినహా, విలువలో స్థిరత్వాన్ని తీసుకొచ్చే దిశగా ఆర్‌బీఐ ప్రయత్నించడం లేదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. రూపాయి విలువ క్షీణత నియంత్రణకు ఆర్‌బీఐ తరఫున జోక్యం చేసుకుంటే, విదేశీ మారకపు నిల్వలు తగ్గే ప్రమాదమూ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

'రూపాయి క్షీణతపై ప్రభుత్వం అప్రమత్తంగానే ఉన్నా, తీవ్ర ఆందోళన చెందడం లేదు. ద్రవ్యోల్బణం/ ఎగుమతులపై దీని ప్రభావం ఉంటుంది. వచ్చే ఏడాది రూపాయి పుంజుకోవచ్చని భావిస్తున్నాం'

- వి.అనంత నాగేశ్వరన్, ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ)



కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	645
విశాఖపట్నం	640
చిత్తూరు	663

నొవో నార్డిస్క్‌పై డాక్టర్ రెడ్డీస్ పైచేయి

సెమాగ్లుటైడ్ ఉత్పత్తి, ఎగుమతులకు దిల్లీ హైకోర్టు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: అధిక బరువు, ఊబకాయం, చక్కెర వ్యాధి ఔషధాల విభాగంలో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఎంతో విజయవంతమైన సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధం ఉత్పత్తి, ఎగుమతులకు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌ను దిల్లీ హైకోర్టు అనుమతించింది. ఈ మందుపై తనకు పేటెంట్ ఉందని డెన్మార్క్ కంపెనీ నొవో నార్డిస్క్ వాదించినా, న్యాయస్థానం దీన్ని ఆమోదించలేదు. డాక్టర్ రెడ్డీస్ వాదనకే న్యాయమూర్తి జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ ఒప్పుకున్నారు. సెమాగ్లుటైడ్ ఫార్ములేషన్లను మనదేశంలో ఉత్పత్తి చేసి, నొవో నార్డిస్క్‌కు పేటెంట్ లేని దేశాలకు ఎగుమతి చేయడానికి అనుమతించడంతో ఈ ఔషధానికి తలుపులు తెరుచుకున్నట్లు అవుతోంది.

అధిక గిరాకీ: సెమాగ్లుటైడ్‌ను వెగోవీ బ్రాండుతో నొవో నార్డిస్క్ మనదేశంలో ఈ ఏడాది జూన్ నుంచి విక్రయిస్తోంది. మొదటి నెలలోనే రూ.70 కోట్ల అమ్మకాలు సాధించింది. ఒక నెల డోసుకు రూ.17,500-26,000 ధర ఉన్నా, అధిక అమ్మకాలు జరగడం చూస్తుంటే.. అధిక బరువు/ఊబకాయం మనదేశంలో ఎంత పెద్ద సమస్యగా ఉన్నదీ స్పష్టమవుతోంది. సెమాగ్లుటైడ్ జనరిక్ మందును విక్రయించడానికి పలు దేశీయ ఫార్మా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్, నాట్కో ఫార్మా దీనిపై న్యాయపోరాటాలు చేస్తున్నాయి. సిప్లా, లుపిన్, జైడస్ లైఫ్... తదితర కంపెనీలు కూడా, అనుమతి వచ్చిన వెంటనే ఈ మందు విడుదల చేయటానికి సిద్ధంగా ఉన్నాయి. 2026 మార్చిలో దీనిపై మనదేశంలో పేటెంట్ గడువు తీరనుంది. అప్పటి నుంచి దేశీయ ఫార్మా కంపెనీలు తమ జనరిక్ ఔషధాలను విడుదల చేయొచ్చు.

ధర తగ్గిస్తున్న నొవో నార్డిస్క్: దేశీయ కంపెనీల యత్నాలు గమనిస్తున్న నొవో నార్డిస్క్.. న్యాయస్థానాల్లో పోరాటం చేస్తూనే, తన బ్రాండ్ వెగోవీ ధరను కొంత తగ్గించడంతో పాటు స్థానికంగా ఎమ్‌క్యూర్ ఫార్మాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఫలితంగా సెమాగ్లుటైడ్ ఔషధాన్ని పొవిజ్‌ట్రా అనే బ్రాండు పేరుతో ఎమ్‌క్యూర్ ఫార్మా దేశీయంగా విక్రయిస్తుంది. వచ్చే మార్చిలోపు మరికొన్ని భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం ద్వారా, తమ ఔషధమే అధికంగా విక్రయించేందుకు నొవో నార్డిస్క్ ప్రయత్నిస్తోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

10-12 తేదీల్లో నెఫ్రోప్లస్ ఐపీఓ

ఈనాడు, హైదరాబాద్: డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 10న ప్రారంభమై, 12న ముగియనుంది. ఈ నెల 9న యాంకర్ బిడ్డింగ్ నిర్వహిస్తారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీ, ఈ ఇష్యూలో రూ. 353.4 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేస్తుంది. ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద మరో 1.12 కోట్ల షేర్లు విక్రయిస్తారు. కంపెనీ సమీకరించే రూ. 353.4 కోట్లలో రూ. 129.1 కోట్లను కొత్తగా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి వెచ్చిస్తారు. అప్పు తీర్చేందుకు రూ. 136 కోట్లు వినియోగిస్తారు.

అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 3 రెట్లు



అమెరికాకు మనదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు మూడింతలయ్యాయి. ఈ ఏడాది అక్టోబరులో 1.47 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.13,230 కోట్ల) విలువైన ఫోను ఎగుమతి అయ్యాయని, 2024 అక్టోబరులో ఇవి 0.46 బి. డాలర్లు (రూ.4140 కోట్లు) అని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరులో అమెరికాకు 10.78 బి.డా. (సుమారు రూ.97,000 కోట్ల) స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేశాం. 2024 ఇదే సమయంలో వీటి విలువ 3.6 బి. డాలర్లే (సుమారు రూ.32,400 కోట్లే). మనదేశంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు అమలవ్వడం, వెండార్లతో అనుబంధం, అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ దిగ్గజాల పెట్టుబడులు కొనసాగడం వంటి కారణాలతో ఎగుమతుల్లో సానుకూల వృద్ధి సాధించగలిగామని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

✦ ప్రపంచవ్యాప్తంగా భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2025 ఏప్రిల్-అక్టోబరులో 15.95 బి. డాలర్ల (దాదాపు రూ.1.41 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. 2024 ఇదే సమయంలోని 10.68 బి. డాలర్ల (సుమారు రూ.95,000 కోట్ల)తో పోలిస్తే ఇవి 49.35% అధికం.

అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు(బి.డాలర్లలో)

	2025	2024
ఏప్రిల్	1.65	0.66
మే	2.29	0.76
జూన్	1.99	0.59
జులై	1.52	0.49
ఆగస్టు	0.96	0.39
సెప్టెంబరు	0.88	0.26
అక్టోబరు	1.47	0.46

ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి

● వృద్ధి రేటు 7-9% ఉండొచ్చు

● కోటక్ మహీంద్రా ఏఎంసీ ఎండీ నీలేష్ షా



ఈనాడు, హైదరాబాద్: అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకెళ్తోందని కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నీలేష్ షా అన్నారు. ఈక్విటీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయంలో ఆశాజనక ధోరణి ఉందన్నారు. స్థూల ఆర్థిక పరిస్థితులు, అనుకూల వడ్డీ రేట్లున్నా.. ప్రైవేటు మూలధన వ్యయాలు ఇప్పటికీ బలహీనంగా ఉండటమే ఆందోళనకరమన్నారు. 'మార్కెట్ ఔట్‌లుక్ 2026'ను బుధవారం విడుదల చేసిన సందర్భంగా ఆయన పలు అంశాలను వివరించారు.

✦ దేశీయ పెట్టుబడులతో ఈక్విటీ మార్కెట్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ అస్థిరతల మధ్య, దేశీయ పెట్టుబడులు మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తాయి.

✦ 2025తో పోలిస్తే, 2026లో వడ్డీ రేట్ల కోతలు కాస్త తక్కువగా ఉండొచ్చు. సులభంగా డబ్బు సంపాదించే సమయం ముగిసింది. సాధారణ రాబడులనే ఆశించాలి.

✦ రుణాల జారీలో వృద్ధి కనిపిస్తోంది. ఇందువల్ల బ్యాంకుల లాభదాయకత పెరిగే వీలుంది.

✦ ఆదాయాల పెరుగుదల, జీఎస్‌టీ సంస్కరణల వంటివి వినియోగాన్ని బలంగా పునరుద్ధరించేందుకు దోహదం చేస్తున్నాయి. గ్రామీణ ప్రజల తలసరి ఆదాయం పెరుగుతోంది. ద్విచక్ర వాహనాలు, కార్లకు గిరాకీ అధికమవుతోంది.

✦ దేశంలో ఇ-కామర్స్ మార్కెట్ మార్చి చివరకు 12-13% పెరగనుంది. ఎలక్ట్రానిక్స్, బ్యూటీ, వ్యక్తిగత సంరక్షణ విభాగాల్లో ఈ వృద్ధి కనిపించనుంది.

✦ కంపెనీలు సొంతంగా విస్తరణకు బదులు, ఇతర కంపెనీలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దేశీయ పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్‌లో క్రమానుగత పెట్టుబడి విధానంలో దీర్ఘకాలిక పెట్టుబడులు కొనసాగించాలని సూచించారు.

యాపిల్ ఇంటెలిజెన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా అమర్

యాపిల్ తన కృత్రిమ మేధ(ఏఐ) విభాగమైన యాపిల్ ఇంటెలిజెన్స్‌కు కొత్త వైస్ ప్రెసిడెంట్‌గా అమర్ సుబ్రమణ్యను నియమించింది. బెంగళూరులో జన్మించిన సుబ్రమణ్యకు మెషీన్ లెర్నింగ్, లార్జ్ స్కేల్ ఏఐ సిస్టమ్స్‌లో రెండు దశాబ్దాల అనుభవం ఉంది. వచ్చే ఏడాది పదవీ విరమణ చేయనున్న జాన్ జియానాండ్రియా నుంచి అమర్ బాధ్యతలను స్వీకరించనున్నారు. యాపిల్ ఫౌండేషన్ మోడల్స్, మెషీన్ లెర్నింగ్ రీసెర్చ్, ఏఐ సేఫ్టీ అండ్ ఎవల్యూయేషన్‌లకు అమర్ నేతృత్వం వహించాల్సి ఉంటుంది. మైక్రోసాఫ్ట్‌లో ఏఐ వైస్ ప్రెసిడెంట్‌గా కొంత కాలం పనిచేసిన సుబ్రమణ్య, అంతక్రితం 16 ఏళ్ల పాటు గూగుల్‌లో ఉన్నారు. రీసెర్చ్ సైంటిస్ట్ నుంచి వైస్ ప్రెసిడెంట్(ఇంజినీరింగ్) స్థాయికి అక్కడ ఎదిగారు. 2001లో బెంగళూరు యూనివర్సిటీలో బీటెక్ (ఈసీఈ) చేసిన అమర్, 2009లో యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో పీహెచ్‌డీ(కంప్యూటర్ సైన్స్) పూర్తిచేశారు.

పాన్ మసాలా ప్యాకెట్లపై రిటెయిల్ ధర తప్పనిసరి

అన్ని పాన్ మసాలా ప్యాకెట్లపై రిటెయిల్ విక్రయ ధర (ఆర్ఎస్‌పీ), ఇతర వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని కేంద్ర వినియోగదారు వ్యవహారాల విభాగం ఆదేశించింది. 2011 లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమొడిటీస్) నిబంధనల ప్రకారం.. పరిమాణం లేదా బరువుతో సంబంధం లేకుండా వీటిని ముద్రించాలని పేర్కొంది. 2026 ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా తయారీదార్లు, ప్యాకర్లు, దిగుమతిదార్లు ఈ నిబంధనలను అమలు చేయాల్సి ఉంటుంది.

ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశాలు ప్రారంభం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సమావేశ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రకటించనున్నారు. ఈ సారి కీలక రేట్లలో 0.25% కోత విధించొచ్చన్న అంచనాలున్నాయి. రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో, కీలక రేట్లను యథాతథంగా కొనసాగించొచ్చని మరికొంత మంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ప్రభుత్వ వాటా 73.6 శాతానికి

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 6% ప్రభుత్వ వాటా విక్రయానికి అధిక స్పందన లభించింది. ఈ వాటా విక్రయం ద్వారా ప్రభుత్వం రూ.2,492 కోట్లు సమీకరించింది. షేర్ల కేటాయింపు తర్వాత, సెబీ కనీస ప్రజా వాటా నిబంధనలను బ్యాంక్ అందుకుంది. వాటా విక్రయంతో బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 79.6% నుంచి 73.6 శాతానికి చేరింది.

మార్కెట్లకు రూపాయి భయాలు

సెన్సెక్స్ ▼ 31 85107

నిఫ్టీ ▼ 46 25986

మళ్లీ 26000 దిగువకు నిఫ్టీ



దేశీయ సూచీల నష్టాలు నాలుగో రోజూ కొనసాగాయి. అమెరికా డాలర్ విలువ రూ.90ని మించడంతో మదుపర్ల సెంటిమెంట్ దెబ్బతింది. బుధవారం మరో 19 పైసలు తగ్గిన రూపాయి విలువ, జీవనకాల కనిష్ఠమైన 90.15 వద్ద ముగిసింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడంతో నిఫ్టీ 26000 పాయింట్ల దిగువకు చేరింది. బ్యారెల్ ముడిచమురు 0.99% లాభంతో 63.07 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.2.79 లక్షల కోట్లు తగ్గి రూ.469.67 లక్షల కోట్లు (5.20 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 12 పాయింట్ల (క్రితం ముగింపు 85,138.27) లాభంతో 85,150.64 వద్ద ప్రారంభమైంది. అనంతరం నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 84,763.64 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడింది. చివరకు 31.46 పాయింట్లు మాత్రమే తగ్గి 85,106.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.20 పాయింట్ల నష్టంతో 25,986 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,891- 26,066.45 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. బీఈఎల్ 2.13%, టైటన్ 1.86%, ఎం అండ్ ఎం 1.79%, ఎన్‌టీపీసీ 1.72%, ఎస్‌బీఐ 1.69%, టీఎంపీవీ 1.40%, ఎల్ అండ్ టీ 1.08% నష్టపోయాయి. టీసీఎస్ 1.41%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.37%, ఇన్ఫోసిస్ 1.12%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.06%, యాక్సిస్ బ్యాంక్ 0.91% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. యంత్ర పరికరాలు, మన్నికైన వినిమయ వస్తువులు, వాహన, విద్యుత్, పరిశ్రమలు, సేవలు, వినియోగ, యుటిలిటీస్ 1.31% వరకు కుదేలయ్యాయి. ఫోకస్డ్ ఐటీ, ఐటీ, టెక్, టెలికాం, బ్యాంకింగ్ రాణించాయి.

✦ మధ్యప్రదేశ్‌లో కొత్త తయారీ ప్లాంట్ కోసం రూ.3000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సన్‌ఫార్మా అనుబంధ సంస్థ సన్‌ఫార్మా లేబొరేటరీస్ తెలిపింది.

✦ జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌తో కలిసి సంయుక్త సంస్థను ఏర్పాటు చేసేందుకు రూ.15,750 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు జేఎఫ్ఈ స్టీల్ కార్పొరేషన్ ప్రకటించింది.

✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ (ఐజీఎక్స్) బోర్డు అనుమతి ఇచ్చినట్లు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్) వెల్లడించింది.

✦ రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ ప్రెసిడెంట్, సీఈఓగా జెయంద్రన్ వేణుగోపాల్ నియమితులయ్యారు.

✦ బ్యాంక్ ఆఫ్ అమెరికా భారత కార్యకలాపాల విభాగానికి కొత్త సీఈఓగా విక్రమ్ సాహు బాధ్యతలు చేపట్టనున్నారు.

✦ ఫ్లిప్‌కార్ట్‌లో బోర్డు సభ్యుడిగా డాన్ నియరీ నియమితులయ్యారు.

ఐపీఓ సమాచారం

✦ ఔషధ సంస్థ కరోనా రెమిడీస్ ఐపీఓ ఈనెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.1008- 1062ను నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.655.37 కోట్లు సమీకరించనుంది. యాంకర్ మదుపర్లకు 5న షేర్లు కేటాయించనున్నారు. ఐపీఓ కోసం కంపెనీ విలువను దాదాపు రూ.6,500 కోట్లుగా పరిగణిస్తున్నారు. ఈ నెల 15న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ కంపెనీ షేర్లు నమోదయ్యే అవకాశం ఉంది.

✦ విద్యా వైర్స్ ఐపీఓ మొదటి రోజు 2.89 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,33,34,009 షేర్లను జారీ చేయనుండగా, 12,50,41,536 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ ఏక్వస్ ఐపీఓ ఐపీఓ మొదటి రోజు 3.42 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 4,20,26,913 షేర్లను ఆఫర్ చేయగా, 14,36,44,200 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.

✦ మీషో ఐపీఓ మొదటి రోజు 2.35 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 27,79,38,446 షేర్లను ఆఫర్ చేయగా, 65,40,18,165 షేర్లకు బిడ్లు వచ్చాయి.

సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే హుండీల లెక్కింపు

- రీజనల్, జిల్లా అధికారులు ఇదంతా పరిశీలించాలి
- దేవాదాయ కమిషనర్ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: అన్ని ఆలయాల్లో హుండీ లెక్కింపు సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరగాలని, ఇందులో పాల్గొనే సిబ్బంది తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు లెక్కింపును తప్పనిసరిగా పరిశీలించాలని దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. హుండీ లెక్కింపులో పాటించాల్సిన నిబంధనలపై గతంలో ఉన్న ఆదేశాలను మరోసారి తెలియజేస్తూ బుధవారం అన్ని ఆలయాల ఈవోలు, దేవాదాయ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

అందులోని ముఖ్య వివరాలివి..

- హుండీ లెక్కింపు జరిపే తేదీని ఐదు రోజుల ముందుగా సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేయాలి.
- లెక్కింపు ప్రక్రియ అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరగాలి. ఇందులో పాల్గొనే సిబ్బంది మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తే ఆ మార్గంలో కూడా సీసీ కెమెరాలు ఉండాలి.
- సంయుక్త కమిషనర్, ఉప, సహాయ కమిషనర్ కేడర్ కలిగిన ఆలయాల్లో లెక్కింపును ఆర్జేసీ పర్యవేక్షించాలి. రూ.15-50 లక్షల వార్షికాదాయం ఉన్న ఆలయాల్లో ఉప కమిషనర్, రూ.15 లక్షల్లోపు వార్షికాదాయం ఉండే ఆలయాల్లో జిల్లా దేవాదాయ అధికారి పర్యవేక్షించాలి.
- సెంట్రలైజ్డ్ సీసీ కెమెరా సిస్టమ్ ఏర్పాటు చేయాలి. లెక్కింపు ప్రక్రియను ఆర్జేసీ, డీసీ, ఏసీ, డీఈవో కార్యాలయాల నుంచి కూడా పరిశీలించేలా ఉండాలి.
- లెక్కింపు సమాచారాన్ని ధర్మకర్తల మండలి, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులకు ముందే తెలియజేయాలి. పోలీసులు, సెక్యూరిటీ గార్డులు, ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కింపు జరగాలి.
- లెక్కింపు ద్వారా వచ్చిన నగదు, విదేశీ నగదు, బంగారం, వెండి వస్తువుల వివరాలన్నీ హుండీ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. నగదును బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. హుండీలో వచ్చిన ఆభరణాలు ఫొటోలు తీసి, బ్యాంకు లాకర్లలో దాచాలి.

ముంబయి వ్యాపారి రోణక్‌కు రిమాండ్

5 వరకు విధించిన ఏసీబీ కోర్టు



రోణక్ కుమార్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాం నాటి మద్యం ముడుపుల సొమ్ము లాండరింగ్‌లో కీలక పాత్ర పోషించిన రోణక్ కుమార్ (ఏ51)కు కోర్టు రిమాండ్ విధించింది. మంగళవారం అరెస్టు అయిన నిందితుడిని విచారణ అనంతరం బుధవారం సాయంత్రం విజయవాడలోని ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. న్యాయాధికారి భాస్కరరావు ఛాంబర్‌లో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్ స్పెషల్ పీపీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసి వీటి ద్వారా పెద్ద మొత్తంలో మద్యం ముడుపుల సొమ్ము రూటింగ్‌లో రోణక్ కుమార్ క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. ముడుపుల సొమ్మును వివిధ రూపాల్లో బంగారం, కొంత నగదు రూపంలో నాటి ప్రభుత్వ పెద్దలకు అందజేసినట్లు ఆధారాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో నిందితుడికి రిమాండ్ విధించాలని కోరారు. ఇరుపక్షాల వాదనల అనంతరం నిందితుడికి న్యాయాధికారి ఈ నెల 5వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం రోణక్ కుమార్‌ను గుంటూరు కారాగారానికి తరలించారు.

మా యజమాని మయూర్ దీపక్‌ది కీలక పాత్ర

- నేను ఉద్యోగిని మాత్రమే.. ఆయన చెప్పినట్లు చేయడమే విధి
- న్యాయాధికారి ఎదుట మద్యం కేసు నిందితుడు అనిల్ చోఖ్రా

ఈనాడు, అమరావతి: 'నేను సంస్థలో ఉద్యోగిని మాత్రమే. మా యజమాని మయూర్ దీపక్ చౌదా. ఆయన చెప్పినట్లు నడుచుకోవడమే నా విధి. ఇందులో ఆయనదే కీలకపాత్ర. ఆయన చెప్పింది చేయడం తప్ప నా పాత్ర ఏమీ లేదు. విచారణలో యజమాని పేరును సిట్ అధికారులకు చెప్పా. అయినా నన్ను అరెస్టు చేశారు' అని మద్యం కేసులో నిందితుడైన అనిల్ చోఖ్రా న్యాయాధికారికి వెల్లడించారు. మూడురోజుల కస్టడీ తర్వాత వైద్యపరీక్షలు నిర్వహించి.. ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా న్యాయాధికారి నిందితుడిని కస్టడీలో ఇబ్బందులేమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. అనంతరం చోఖ్రాను విజయవాడ కారాగారానికి తరలించారు.

ఇప్పుడు రాలేను.... మూడు వారాల తర్వాత వస్తా

విచారణాధికారికి పీవీ సునీల్‌కుమార్ సమాచారం

ఈనాడు, అమరావతి: రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో హింసించిన కేసులో విచారణకు ఇప్పుడు రాలేనని, మూడు వారాల గడువు కావాలని పీవీ సునీల్‌కుమార్ కేసు విచారణాధికారికి సమాచారం ఇచ్చారు. సునీల్‌కుమార్ డిసెంబరు 4న విచారణకు రావాలని విచారణాధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ నోటీసులు ఇచ్చారు. కుటుంబసభ్యులు అనారోగ్యంతో ఉన్నందున రెండు వారాల గడువు కావాలని విచారణకు ఒక్క రోజు ముందు పీవీ సునీల్‌కుమార్ కోరారు. దీనిపై దర్యాప్తు అధికారి దామోదర్‌ను 'ఈనాడు' వివరణ కోరగా సునీల్‌కుమార్ గడువు కోరిన మాట వాస్తవమేనన్నారు. న్యాయసలహా తీసుకుని తదుపరి నోటీసులు ఇచ్చే విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు.


భక్తులకు మెరుగైన సేవల్లో ఈవోలు విఫలం

- దర్శనాలు, వసతులపై 60-70 శాతం దాటని సంతృప్తస్థాయి
- కొన్ని ఆలయాల్లో 40-50 శాతమే భక్తుల సంతృప్తి
- ప్రధాన ఆలయాల్లో చివరిలో దుర్గగుడి
- ముఖ్య దేవాలయాల్లో పెనుగంచిప్రోలుకు ఆఖరి స్థానం
- సమీక్షలో సీఎం ఆగ్రహం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే- అన్నవరం: భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రధాన, ముఖ్య ఆలయాల అధికారులు విఫలమవుతున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం వేగంగా, బాగా జరిగేలా చూడటం, ప్రసాదం రుచికరంగా అందించడం, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ప్రభుత్వం ఫోన్లు చేసి అభిప్రాయాలు తీసుకుంటే సగటున 60-70 శాతమే సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆలయాల్లో ఇది 40-50 శాతమే ఉంటోంది. ఈ విషయంలో మార్పు రావాలని ప్రభుత్వం పదేపదే చెప్పినా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదు.

చివరి స్థానంలో కనకదుర్గమ్మ ఆలయం

■ గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది నవంబరు వరకు ప్రతి నెలా భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. దర్శనం సంతృప్తికరంగా జరిగిందా? తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు బాగున్నాయా? ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అనే ప్రశ్నలతో భక్తుల ఫీడ్‌బ్యాక్ సేకరించారు.




■ ఇందులో ప్రధాన ఆలయాల్లో శ్రీకాళహస్తి మొదటి స్థానంలో నిలిచింది. నాలుగు అంశాల్లో 72.7 శాతం సంతృప్తి స్థాయి వచ్చింది. ఆ తర్వాత స్థానాల్లో ద్వారకా తిరుమల (71.5%), శ్రీశైలం (70.4%), కాణిపాకం (70%), సింహాచలం (68.8%), అన్నవరం (67.8%) నిలిచాయి. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి 66% సంతృప్తితో చివరి స్థానం వచ్చింది.

■ ఉపకమిషనర్ కేడర్ కలిగిన 14 ముఖ్య ఆలయాలకు వచ్చిన భక్తుల నుంచి కూడా అభిప్రాయాలు తీసుకున్నారు. ఇందులో మోపిదేవి ఆలయం 70.2 శాతం సంతృప్త స్థాయితో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత వరుసగా నిడదవోలు కోటసత్తెమ్మ (70.2%), ఉరుకుంద (69.5), పెంచలకోన (67.5), చౌడేపల్లి (66.7), వాడపల్లి (66.5), విశాఖ కనకమహాలక్ష్మి (65.7), అరసవిల్లి (63.7), తలుపులమ్మలోవ (63.6), కదిరి (63.5), పెదకాకాని (63.4), బేతంచెర్ల (62.3), కసాపురం (60.3) వచ్చాయి. 52.7 శాతం సంతృప్తితో పెనుగంచిప్రోలు ఆఖరు స్థానంలో ఉంది.

'పెనుగంచిప్రోలు' ఈవో తొలగింపునకు సీఎస్ ఆదేశం

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో వివిధ సేవలపై భక్తులు ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనాల్లో 44.4 శాతం, తాగునీరు, మౌలిక సదుపాయాల్లో 45.5 శాతం, పారిశుద్ధ్యంలో 42.9 శాతం మాత్రమే సంతృప్తిస్థాయి వ్యక్తమైంది. 'పింఛన్ల పంపిణీ, వివిధ పథకాలు అమల్లో 90 శాతానికిపైగా లబ్ధిదారులు, ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఆలయాల విషయంలో మాత్రం భక్తుల నుంచి కేవలం 70 శాతంలోపే సంతృప్తస్థాయి ఉంటోంది. ఏడాదిగా ఎన్నిసార్లు చెప్పినా మార్పు రావడం లేదు. భక్తులందరూ సంతృప్తి చెందేలా తగిన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారు?' అంటూ దేవాదాయశాఖ అధికారులు, ఆలయాల ఈవోలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్ష జరిపినప్పుడు ఆలయాల అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా ఆలయాల ఈవోలతో సమీక్ష జరపాలని సీఎస్‌ను ఆదేశించారు. దీంతో దేవాదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్, ఏడు ప్రధాన ఆలయాలు, 14 ముఖ్య ఆలయాల ఈవోలతో సీఎస్ విజయానంద్ బుధవారం సచివాలయంలో సమీక్షించారు. ఈవోల తీరుపై మండిపడ్డారు. భక్తుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైన పెనుగంచిప్రోలు ఆలయ ఈవోను వెంటనే తొలగించాలని సీఎస్ ఆదేశించారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వొద్దని ఆదేశించినట్లు తెలిసింది. ప్రధాన, ముఖ్య ఆలయాల ఈవోలంతా భక్తుల నుంచి సంతృప్తస్థాయి 90 శాతానికిపైగా వచ్చేలా ఎటువంటి చర్యలు చేపడతారో 10 రోజుల్లో ప్రణాళిక ఇవ్వాలన్నారు. వాటిని సీఎంకు అందజేస్తానని, తర్వాత కూడా సంతృప్త స్థాయి పెరగకపోతే సహించేది లేదని హెచ్చరించారు.



సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయిన అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ. చిత్రంలో మంత్రి లోకేశ్, అదానీ కుమారుడు కరణ్ అదానీ తదితరులు

సీఎంను కలిసిన గౌతమ్ అదానీ

మౌలిక సదుపాయాలు, భవిష్యత్ పెట్టుబడులపై చర్చ

ఈనాడు-అమరావతి: అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ బుధవారం రాత్రి సీఎం చంద్రబాబును క్యాంపు కార్యాలయంలో కలిశారు. రాష్ట్రంలో అదానీ సంస్థ చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భవిష్యత్తులో పెట్టబోయే పెట్టుబడులపై ఈ భేటీలో చర్చించారు. గౌతమ్ అదానీ ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి నేరుగా సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. మంత్రి లోకేశ్, అదానీ కుమారుడు కరణ్ అదానీ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

ఉప్పాడ మత్స్యకారుల సమస్య పరిష్కారానికి ప్రణాళిక

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'ఉప్పాడ మత్స్యకారుల సమస్య పరిష్కారానికి కృషి కొనసాగుతోంది. మత్స్యకారుల జీవితాన్ని మరింత బంగారుమయం చేసేందుకు ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న పద్ధతులను అవలంబించాలి. ఇందుకు ఉప్పాడ మత్స్యకారుల నుంచి కొన్ని బృందాలను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపుతున్నాం. అక్కడ పరిస్థితులు అవగాహన చేసుకుని అదనపు ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉప్పాడ మత్స్యకారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. కార్యాచరణ ప్రణాళికలోని అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇవి..

● 'ఉప్పాడ తీర ప్రాంత కాలుష్యానికి అసలు కారణాలు తెలుసుకుని శాస్త్రీయ పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాం. ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) రీజినల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడాన్ బృందంతో ఉప్పాడ తీరప్రాంతంలోని 20 ప్రాంతాల్లో ప్రత్యేక పరిశోధనలు, పరిష్కార మార్గాలు చూపేలా కృషి సాగుతోంది.

● 200 నాటికల్ మైళ్ల వరకు చేపలు పట్టుకునేందుకు అనుమతితో మత్స్యకారులకు అదనపు ఆదాయం దక్కుతుంది.

● 50 వేల పండుగప్ప చేప పిల్లలను సముద్రంలో విడిచిపెట్టాం. తమిళనాడులో అమలు చేస్తున్న కృత్రిమ పగడపు దిబ్బలను ఉప్పాడ ప్రాంతంలోనూ ఏర్పాటు చేస్తాం. సముద్రపు నాచు వ్యవసాయం అనే కొత్త పద్ధతితో మత్స్యకారుల ఆదాయానికి కొత్తమార్గాలు చూపిస్తాం. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్ర రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లతో ప్రతిపాదనలు. పిఠాపురంలో ప్రత్యేకంగా నిర్మించబోయే 5 అంతస్తుల వాణిజ్య సముదాయంలో మత్స్యకారుల కోసం ప్రత్యేక కేటాయింపు. మత్స్యకార యువత ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక అకాడమీ ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు.



ఉప్పాడ మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

పాత ప్రభుత్వంలో ప్రణాళిక లేని ఖర్చులు

జగన్ ప్రభుత్వంలో ప్రణాళిక, పద్ధతి లేకుండా చేసిన ఖర్చుల వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విమర్శించారు. ఉప్పాడలో మత్స్యకారుల జెట్టీ సరైన డిజైన్ లేకుండా నిర్మించడం, పోలవరంలో డయాఫ్రం వాల్ దెబ్బతినడం ఈ కోవలోకి వస్తాయన్నారు.

ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కిజాకుడాన్, మత్స్య శాఖ అదనపు సంచాలకులు చంద్రశేఖర్, సముద్రమత్స్య విభాగం అదనపు సంచాలకులు సురేష్, కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులు గోగన ఆదిశేషు, శెట్టివారి రఘులతో కలిసి కేక్ కోస్తున్న పవన్ కల్యాణ్

దివ్యాంగులతో ముచ్చటించిన పవన్‌కల్యాణ్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులు గోగన ఆదిశేషు, శెట్టివారి రఘులతో ముచ్చటించారు. వారి కుటుంబ జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారిద్దరూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛను మొత్తాన్ని పెంచడం వల్ల తమ జీవనానికి ఒక వెసులుబాటు దొరికిందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి వారికి జ్ఞాపికలు అందించారు.

అప్రూవర్లుగా మారతామన్న వారితో కెసిరెడ్డి పోల్చుకోలేరు

- నిందితులను ఎలా చూడాలన్నది దర్యాప్తు సంస్థ విశేషాధికారం
- మద్యం పాలసీ రూపకల్పన, లంచాల వసూళ్లలో రాజ్‌కెసిరెడ్డిది కీలకపాత్ర
- ఆయన బెయిలు పిటిషన్‌ను కొట్టేయండి
- హైకోర్టులో సీఐడీ వాదన

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితులు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్(ఏ-3) అప్రూవర్లుగా మారతామంటున్నారని, అలాంటివారితో ప్రధాన నిందితుడు కెసిరెడ్డి రాజశేఖరరెడ్డి పోల్చుకోవడానికి వీల్లేదని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. 'ఈ కేసులో చాలామందిని అరెస్టు చేశాం. వారెవరూ అప్రూవర్లుగా మారతామనలేదు. కీలక నిందితులైన వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ను అరెస్టు చేయకుండా సీఐడీ వారిపట్ల ప్రత్యేకంగా వ్యవహరిస్తోందన్న కెసిరెడ్డి వాదనల్లో అర్థం లేదు. నిందితులను ఎలా చూడాలన్నది దర్యాప్తు సంస్థకున్న విశేషాధికారం. దాన్ని ప్రశ్నించలేరు. మద్యం పాలసీ రూపకల్పన, అమలు, లంచాలిచ్చిన కంపెనీలకు మద్యం ఆర్డర్లు ఇవ్వడంలో కెసిరెడ్డిది కీలకపాత్ర. విదేశాలకు పారిపోతుండగా విమానాశ్రయంలో కెసిరెడ్డిని సీఐడీ అరెస్టు చేసింది. కెసిరెడ్డికి లంచాలిచ్చినట్లు మద్యం కంపెనీల వారు వాంగ్మూలాలిచ్చారు. వాటిని సీల్డ్‌కవర్లో కోర్టుకు అందజేశాం. ఈ అంశాల దృష్ట్యా బెయిలు పిటిషన్‌ను కొట్టేయండి' అని లూథ్రా కోరారు.

విచారణ ఇప్పట్లో ముగిసేలా లేదు.. బెయిలివ్వండి

కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'సీల్డ్ కవర్లో ఇచ్చిన వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేయడం లేదా తిరస్కరించడానికి వీల్లేదు. కేసులో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నాయనే దిగువ కోర్టు రిమాండ్ విధించింది. ప్రాథమిక ఆధారాలను కారణంగా చూపుతూ బెయిలు తిరస్కరించాలని సీఐడీ కోరలేదు. నిందితుడు విదేశాలకు పారిపోయే ప్రమాదం ఉందా? లేదా? సాక్షులను బెదిరించే, ఆధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉందా? లేదా? అనే అంశాలను బట్టి బెయిలివ్వాలి. ఈ కేసులో విచారణ ఇప్పట్లో ముగిసేలా లేదు. నిందితులను నిరవధికంగా జైల్లో ఉంచడం ప్రాథమిక హక్కులను హరించడమే. పిటిషనర్ విదేశాలకు పారిపోయే ప్రమాదం లేదు. అప్రూవర్లుగా మారతామన్న వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లను అరెస్టు చేస్తే దిగువ కోర్టులో విచారణ ముగిసేవరకు వాళ్లు జైల్లో ఉండాలి. అందుకే వారిని అరెస్టు చేయట్లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కెసిరెడ్డికి బెయిలివ్వండి' అని కోరారు.

● బుధవారం జరిగిన విచారణలో కెసిరెడ్డి బెయిలు పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు ముగిశాయి. వాదనలను రాతపూర్వకంగా కోర్టుకు సమర్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి న్యాయవాదులకు సూచించారు.

ట్రాఫిక్ సిగ్నల్‌లో హృదయం మెరిసెనె!



హృదయాకారంలో రెడ్ సిగ్నల్



ఈనాడు, చెన్నై: చెన్నై నగరవ్యాప్తంగా ప్రముఖ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లలోని ఎరుపు రంగు లైటుకు హృదయాకార స్టిక్కర్లు అతికించారు. రెడ్ సిగ్నల్ పడగానే ఎరుపు లైటు వెరైటీగా హృదయాకారంలో కనిపిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో భాగంగానే గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు ఈ యత్నం చేశారు. ఇతర నగరాలతో పోల్చితే చెన్నైలో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య ఎక్కువ. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2022లో 1,043, 2023లో 1,110 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం 'జీరో యాక్సిడెంట్ డే' కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించండి' అని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. అవగాహన కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లోనూ విస్తరించారు. ఈ కార్యక్రమాలు ఫలిస్తున్నాయని పోలీసులు తెలిపారు.

పెంచలయ్య కుటుంబానికి రూ.10 లక్షల సాయం

- సొంత నిధులు అందజేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- మృతుడి పిల్లల బాధ్యత తన కుమార్తెలు చూస్తారని హామీ



రూ.10 లక్షల నగదును పెంచలయ్య కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. పక్కన నాయకులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ రౌడీల చేతుల్లో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పెంచలయ్య ఇంటికెళ్లి సొంత నిధులు రూ.పది లక్షలు మృతుడి భార్యకు అందించారు. ఈ సందర్భంగా తాము ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్నది మా నాన్న కోరిక అని, అండగా నిలిస్తే బాగా చదివి సమాజానికి ఉపయోగపడతామని పెంచలయ్య కుమారులు ఎమ్మెల్యేకు చెప్పారు. వెంటనే ఆయన స్పందిస్తూ తన కుమార్తెలు హైందవి, వైష్ణవిలకు ఫోన్ చేసి పెంచలయ్య ఇద్దరి పిల్లల బాధ్యత చెరొకరు తీసుకోవాలని కోరారు. వీరిద్దరి ఉన్నత చదువుల బాధ్యతను తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. పదో తరగతి వరకు ఉచితంగా చదివిస్తామని మాట ఇచ్చిన మైథిలి స్కూల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ కాలనీలో వసతుల కోసం వారం రోజుల్లో రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పెంచలయ్య గంజాయికి వ్యతిరేకంగా చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తి అని, ఆయన విగ్రహాన్ని కాలనీలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. హంతకులకు కఠిన శిక్ష పడే విధంగా తనవంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంత్వన చెక్కులు పంపిణీ చేసిన మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: అనారోగ్యంతో మరణించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించింది. బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు సాంత్వన పథకాన్ని అమలు చేసింది. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.9 లక్షలను(చెక్కులను) సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తాడేపల్లిలోని గురుకుల కార్యాలయంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంత్వన పథకానికి రూ.5 కోట్లతో నిధి ఏర్పాటు చేశామన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ పేద విద్యార్థుల కోసం ఇలాంటి పథకం లేదని తెలిపారు.

వివేకా హత్య కేసులో సునీత పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టాలంటూ ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి హైదరాబాద్ సీబీఐ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును వాయిదా వేసిన కోర్టు ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలంటూ నర్రెడ్డి సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి టి.రఘురాం బుధవారం విచారణ చేపట్టారు. నిందితుల తరఫు న్యాయవాదుల వాదనలు పూర్తికావడంతో సునీతారెడ్డి తరఫున సమాధానం చెప్పడానికి అవకాశం ఇవ్వాలని న్యాయవాది ఎస్.గౌతం కోరారు. కోర్టు సమయం ముగిసినందున ఏవైనా వాదనలు చెప్పాలంటే శుక్రవారంలోగా కోర్టుకు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చంటూ న్యాయమూర్తి సూచించారు.

దక్షిణ కోస్తా రైల్వేజోన్ జీఎం కార్యాలయం సిద్ధం

ఉద్యోగుల విభజన కసరత్తు ఆరంభం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా ఏర్పడిన 'దక్షిణ కోస్తా' రైల్వే జోన్ జనరల్ మేనేజర్ తాత్కాలిక కార్యాలయం దాదాపు సిద్ధమైంది. నగరంలోని సిరిపురంలో ఉన్న 'డెక్' భవనంలో జోనల్ కార్యాలయానికి రెండు అంతస్తులను లీజు ప్రాతిపదికన తీసుకున్నారు. వీటిలో ఒక అంతస్తును జీఎం కోసం సిద్ధం చేశారు. జీఎం గది, సమావేశ మందిరం, ఇతర అధికారులకు గదులు, ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. పలు విభాగాల జోనల్ స్థాయి అధికారులకు రెండో అంతస్తు సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో ఉద్యోగుల ఎంపికపై కసరత్తు ఆరంభించాలని రైల్వే శాఖ తాజాగా ఆదేశాలిచ్చింది. జోనల్ కార్యాలయంతో పాటు కొత్తగా ఏర్పడిన రాయగడ డివిజన్‌లో పనిచేయడానికి ఆసక్తి ఉన్న నాన్ గెజిటెడ్ ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు తీసుకోవాలని ఉత్తర్వులిచ్చింది. వారు జోన్ ప్రధాన కార్యాలయం, తూర్పుకోస్తా జోన్ పరిధి రాయగడ డివిజన్‌లో ఎందులో చేరతారో తెలియజేయాలి.

● సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే, భువనేశ్వర్‌లోని తూర్పు కోస్తా జోన్ ప్రధాన కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు దక్షిణ కోస్తా జోన్ ప్రధాన కార్యాలయంలో పనిచేయడానికి ఐచ్ఛికం ఇస్తే వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ● విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు మినహా దక్షిణ మధ్య రైల్వేలోని మిగిలిన ఉద్యోగులకు ద్వితీయ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తూర్పుకోస్తాలో వాల్తేరు డివిజన్ మినహా మిగిలినవారూ ఈ కేటగిరీ కిందకి వస్తారు. ● భారతీయ రైల్వేలో ఎక్కడ పనిచేసిన వారైనా తృతీయ ప్రాధాన్యం లభిస్తుంది. ● రాయగడ డివిజన్‌లో చేరేందుకు వాల్తేరు డివిజన్‌లో పనిచేస్తున్న వారిని మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటారు. తూర్పు కోస్తా జోన్‌లో పనిచేసే వారికి రెండో ప్రాధాన్యం, భారతీయ రైల్వే ఉద్యోగులను మూడో ప్రాధాన్యం ఉంటుంది. 15 రోజుల్లో రైల్వే బోర్డుకు ఈ వివరాలు పంపనున్నారు.

సినీ అవకాశాల పేరుతో బాలికపై లైంగిక దాడి

కో-డైరెక్టర్, కెమెరామెన్, మరో మహిళ అరెస్ట్

హైదరాబాద్, న్యూస్‌టుడే: టీవీ సీరియల్స్, సినీ అవకాశాల పేరుతో ఓ బాలికను నమ్మించి లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో ఫిల్మ్‌నగర్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం. .ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో నివసించే ఓ బాలికకు అత్త వరస అయ్యే ఆంధ్రప్రదేశ్ భీమవరానికి చెందిన మచ్చ అరుణ(33) టీవీ సీరియల్స్, సినిమా అవకాశాలు ఇప్పిస్తానని నమ్మించింది. అవకాశాలు దక్కాలంటే కొందరు చెప్పినట్లు వినాలని బాలికకు చెప్పింది. బాలికను నగరంలో నివసించే కో-డైరెక్టర్ ఎం.వెంకట శివారెడ్డి(43), కెమెరామెన్ పెనికేలపాటి అనిల్(40)లకు పరిచయం చేసింది. అవకాశాల పేరుతో బాలికపై వారు కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోషం కేసు నమోదు చేసి..విచారణ జరిపి నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.




ఆర్థిక క్రమశిక్షణకు అవసరమైన అలవాట్లు

- ప్రతి రూపాయి ఖర్చును పరిశీలించాలి.
- వ్యాపార అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదువుతుండాలి.
- మీ క్రెడిట్ స్కోర్‌ను ప్రతి నెలా గమనించుకోవాలి.
- మీ ఆర్థిక లక్ష్యాలను ప్రతి ఆదివారం సమీక్షించుకోవాలి.
- మీకు ఆనందం కలిగించని ఖర్చులకు కోతపెట్టాలి.
- మిమ్మల్ని ప్రభావితం చేసే వ్యక్తులతో తరచూ భేటీ కావాలి.
- ఆర్థిక వ్యవహారాల్లో మీ కంటే జ్ఞానం కలిగినవారిని అనుసరించాలి. - మైక్ హాఫ్‌మాన్, ఆర్థిక నిపుణుడు

స్కూల్లో మాస్టారు చెప్పిన పాఠాలు ఇంటికొచ్చేసరికి మర్చిపోతారు..
ఓ చోట పెట్టిన వస్తువు.. ఇల్లంతా వెతికినా ఎక్కడ పెట్టారో ఓ పట్టాన గుర్తుకురాదు..
ఏమైనా సరకులు తెమ్మంటావా అంటూ శ్రీమతిని అడుగుతారు..
తీరా బజారుకు వెళ్లాక చెప్పింది మర్చిపోయి మళ్లీ కాల్‌చేసి ఆరా తీస్తారు..
'తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా'.. చాలా మంచిది ఇదే పరిస్థితి.
దీనికి కారణం మెదడు చురుకుదనం తగ్గి.. మతిమరుపు పెరుగుతుండడమే.
రోజుకు అరగంట నడకకు కేటాయిస్తే చాలు.. మతిమరుపు సమస్యకు చెక్ పెట్టొచ్చు.

అడుగడుగులో జ్ఞాపకం!



నడక... లాభాలు..

- శారీరక సామర్థ్యానికే కాదు.. రోగనిరోధక శక్తిని పెంచి రకరకాల జబ్బులబారిన పడకుండా నడక కాపాడుతుంది.
- రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. చెమట ద్వారా మలినాలను బయటకు పంపుతుంది.
- చెడు కొలెస్ట్రాల్ తగ్గి.. మంచి కొలెస్ట్రాల్ మెరుగుపడుతుంది.
- గుండె సమర్థంగా పనిచేసేలా చూస్తుంది. గుండె పోటు ప్రమాదం తగ్గుతుంది.
- కీళ్లు, ఎముకలు ధృడంగా మారతాయి.

నడకతో మెదడుకు మేత..

ఫోన్‌కు సిమ్, మెమొరీ కార్డు.. కంప్యూటర్‌కు చిప్, హార్డ్‌డిస్కు ఎంత ముఖ్యమో.. శరీరానికి మెదడు అంతే కీలకం. బుర్ర చురుగ్గా ఉంటే మనం భద్రంగా ఉంటాం. జీవనశైలిలో ఉదయపు అలవాట్లు మెదడుపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. రోజూ కనీసం 30 నిమిషాలు ఏదో ఒక సమయంలో నడక, యోగా, ఏరోబిక్ లాంటి వ్యాయామాల వల్ల మెదడుకు రక్త ప్రసరణ మెరుగవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- ఈనాడు, అమరావతి

అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే..?

రోజూ నడకతో కేవలం శారీరక ఆరోగ్యమే కాదు.. మెదడుకూ బోలెడు ప్రయోజనాలున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనం ప్రకారం దేశంలో దాదాపు 54.40 శాతం మంది శారీరక శ్రమ లేకుండా ఉన్నారని తేలింది. యువకులు స్మార్ట్‌ఫోన్లు, ఆన్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అలవాటు పడి నడక, ఇతర వ్యాయామాలకు దూరమవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

- వృద్ధుల్లో నడక తగ్గిపోవడం వల్ల మెదడు పరిమాణం, జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్లు 'ఎయిమ్స్' అధ్యయనంలో వెల్లడైంది.
- పన్నెండు వారాలపాటు.. వారానికి నాలుగు రోజులు చొప్పున వృద్ధులను ట్రెడ్ మిల్లుపై నడిపిస్తే.. వారి మెదడులో నాడీ సంబంధాలు బలపడి, జ్ఞాపకశక్తి మెరుగుపడినట్లు అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ మేరీ ల్యాండ్' అధ్యయనంలో గుర్తించారు.
- మధ్య వయసులోనే తీవ్ర నడక ప్రారంభించిన వారు వృద్ధాప్యానికి చేరేసరికి ఎపిసోడిక్ మెమొరీ బలంగా ఉన్నట్లు 'బీఎంసీ అల్జీమర్స్ రీసెర్చ్ అండ్ థెరపీ' అధ్యయనంలో తేలింది.
- ఆహ్లాదకరమైన వాతావరణంలో నడిస్తే మనసుకు ప్రశాంతత చేకూరి సానుకూల భావాలు మెరుగుపడతాయని, నగరంలో అయినా సరే నడిస్తే చాలు ఏకాగ్రత మెరుగుపడుతోందని 'నేచురల్ సైంటిఫిక్' నివేదిక తేల్చింది.
- మొబైల్- హెల్త్ యాప్ ద్వారా వృద్ధులకు రోజువారీ నడక లక్ష్యాలు పెడితే 12 నుంచి 24 వారాల్లో రోజువారీ అడుగులు పెరిగి, మెదడు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడినట్లు వెల్లడయ్యిందని 'జేఎంఐఆర్ ఏజింగ్ జర్నల్' పేర్కొంది.

● రోజుకు 7 వేల అడుగుల నడిస్తే మరణ ముప్పు 47 శాతం తగ్గుతుందని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. మతిమరుపు 38 శాతం, కుంగుబాటు 22 శాతం మేర తగ్గుతుందని తెలిపింది.


- ఉదయం నడకతో సూర్యరశ్మి ద్వారా శరీరానికి విటమిన్- డి అందడంతో పాటు.. మానసిక ఉల్లాసం, శారీరక సామర్థ్యం పెరిగి మెదడు ప్రశాంతంగా ఉంటుంది.
- రోజువారీ నడకతో మెదడుకు రక్తప్రసరణ పెరుగుతుంది. మెదడు కణాల మధ్య అనుసంధానం బలపడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- నడక.. డోపమైన్, సెరటోనిన్ లాంటి న్యూరోకెమికల్స్ విడుదలను ప్రేరేపిస్తుంది. ఇవి మానసిక స్థితిని మెరుగుపరిచి, ఆందోళనను తొలగిస్తాయి.
- వయసు పెరిగే కొద్దీ మెదడు పనితీరులో మార్పులు తప్పనిసరి. రోజూ నడకతో మతిమరుపు సమస్య కొంతమేర దూరం చేయవచ్చు.

నడకతో మతిమరుపు సమస్య దూరం

నడకతో రక్తప్రసరణ పెరిగి మెదడుకు ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. న్యూరల్ కనెక్షన్ల (న్యూరో ప్లాస్టిసిటీ) సామర్థ్యం పెరుగుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు ఒత్తిడి దూరం అవుతుంది. అల్జీమర్స్ సమస్యను నడకతో దూరం చేసుకోవచ్చు. అందరూ వారానికి ఐదు రోజులపాటు.. కనీసం రోజుకు 20 నుంచి 30 నిమిషాలైనా నడవడం మేలు.

– డాక్టర్ అడబాల గోపీకృష్ణ, డీఎం న్యూరాలజీ, కాకినాడ

భీముడు పెట్టిన రాయి..



అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం కొండదిబ్బపుట్టు వెళ్లే మార్గంలో ఓ కొండ అంచున ఈ రాయి ఉంది. దీనిని పాడేరి గ్రామం నుంచి చూడవచ్చు. మహాభారత కాలంలో భీముడు ఓ జంతువును వేటాడుతుండగా అది కనిపించకుండా పోయింది. దీంతో ఈ రాయిని కొండ చివర పెట్టి దానిపై ఎక్కి చూశాడని గిరిజనులు చెబుతుంటారు. అందుకే ఈ రాయి ఉన్న కొండను భీముడి పర్వతంగా పిలుచుకుంటారు. తుపాన్లు, భీకర గాలులు ఎన్ని వచ్చినా ఈ రాయి జారి పడకుండా అలాగే ఉందని స్థానికులు వివరించారు.

–న్యూస్‌టుడే, హుకుంపేట

బతుకు 'బండి' లాగాల్సిందేగా!





ఏదైనా సమస్య ఎదురైతే డీలా పడకుండా వినూత్నంగా ఆలోచించి ముందుకెళ్లాలన్న పాలసీకి సరైన ఉదాహరణగా నిలుస్తున్నారు జాకీర్ హుస్సేన్. గుంటూరుకు చెందిన ఆయన.. గతంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌పై స్టాంప్ రైటర్‌గా ఉపాధి పొందేవారు. ట్రాఫిక్ పోలీసులు తమ విధుల్లో భాగంగా ఫుట్‌పాత్‌లపై ఉన్న బల్లలు, కుర్చీలు తొలగిస్తుండటంతో పని ఆగిపోయేది. కొన్నిరోజులు ఉపాధీ పోయేది. శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించిన హుస్సేన్.. రూ.20 వేలు వెచ్చించి చక్రాలతో నడిచే బాక్స్ తయారు చేయించారు. అందులో కంప్యూటర్, ప్రింటర్, బ్యాటరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ బాక్స్‌ను బైక్‌కు తగిలించుకుని రోజూ ఉదయం బయలుదేరతారు. ఎక్కడ కంప్యూటర్ సేవలు అవసరమైతే అక్కడ బండి ఆపుతారు. అడిగిన వారికి స్టాంప్ రైటింగ్, నోటరీ, కంప్యూటర్ సేవలు అక్కడికక్కడే అందించి.. బండిని తీసుకుని వెళ్లిపోతారు.

– ఈనాడు, గుంటూరు

అపార్టుమెంట్‌లో కృత్రిమ వర్షం



దిల్లీలో వాయు కాలుష్యం ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఆ ప్రభావం ఉంటోంది. దీనిని కొంతైనా తగ్గించుకునేందుకు ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో (ఎన్‌సీఆర్ పరిధి) ఉన్న ఒక అపార్టుమెంట్ వాసులు కృత్రిమ వర్షాన్ని ఆశ్రయించారు. పై అంతస్తుల నుంచి నీటిని వర్షంలా కురిపించారు. దీనికోసం అగ్నిమాపక పైపులను వినియోగించారు. 13వ అంతస్తు నుంచి ఇలా నీటిని చల్లడంతో కాలుష్య స్థాయి కొంతవరకు తగ్గింది. దీంతో చాలా రోజుల తర్వాత స్వచ్ఛమైన గాలిని పీల్చుకోగలిగామని అపార్టుమెంటు వాసులు తెలిపారు.

–ఈటీవీ భారత్

ఈకలే అందం.. శ్వేత నెమలి చందం



నెమలిలా పురి విప్పినట్లు ఉండి ఆకట్టుకుంటున్న ఈ పావురం.. హైదరాబాద్ నాంపల్లి బజార్‌ఘాట్ రోడ్డులో పెంపుడు పక్షులు విక్రయించే ఓ దుకాణంలో కనిపించింది. దీని ప్రత్యేకతలను దుకాణదారు వివరించారు. 'దీని విలక్షణ గుణం ఫ్యాన్ ఆకారపు తోక. దీంతో ఫ్యాన్ టైల్ పావురం అంటారు. మన దేశంలో నెమలి పావురం, మసక్కలీ, లకా కబూతర్ అని పిలుస్తుంటారు. పెంపుడు పక్షుల్లో ఇది ఒకటి. సాధారణంగా పావురానికి 12-14 వరకు ఈకలు ఉంటాయి. మసక్కలీ, పావురాల్లో ఈకలు 30 నుంచి 40 వరకు ఉంటాయి. వీటి కాలి గోర్లపైనా ఈకలు ఉంటాయి. ఈకలే వీటికి అందం" అని తెలిపారు.

–ఈనాడు, హైదరాబాద్

ఈ ఎమ్మెల్యే గోల్డ్ మెడలిస్ట్

నిత్యం ఆటోలో అసెంబ్లీకి..



రబ్బరు చెప్పులు, సాధారణ దుస్తులు ధరించి ఆటోలో ఓ ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళుతుండడం ఈ రోజుల్లో ఆశ్చర్యపరిచే అంశమే. బిహార్‌లోని సహర్సా జిల్లా మహిషీ స్థానంలో ఆర్‌జేడీ తరఫున విజయం సాధించిన గౌతమ్ కృష్ణ అదేపనిచేస్తూ ఆకట్టుకుంటున్నారు. అంతేనా.. నిరుపేద రైతు కుటుంబంలో పుట్టిన గౌతమ్ పట్నా వర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఓటింగు సరళిపై పీహెచ్‌డీ చేశారు. అన్నా హజారే ప్రభావంతో రాజకీయాలపై ఆసక్తి పెంచుకొన్నారు. వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడు ఎమ్మెల్యే కాగలిగారు.

–ఈటీవీ భారత్

రాష్ట్ర రాజ్‌భవన్ ఇక లోక్‌భవన్

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచనతో పేరు మార్పు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర రాజ్‌భవన్ పేరును 'లోక్‌భవన్'గా మార్చేందుకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. లోక్‌భవన్‌గా పేరు మారుస్తూ గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు..రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా, తెలంగాణ రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చిన విషయం తెలిసిందే.

రిజర్వేషన్ కౌంటర్లలో తత్కాల్ టికెట్లకు ఓటీపీ విధానం

పూర్తిస్థాయిలో అమలుకు రైల్వేశాఖ చర్యలు

ఈనాడు, హైదరాబాద్: తత్కాల్ టికెట్ల బుకింగ్‌లో పారదర్శకత పెంచేందుకు రైల్వేశాఖ చర్యలు చేపడుతోంది. రిజర్వేషన్ కౌంటర్లలో ఓటీపీ ఆధారిత తత్కాల్ టికెట్ బుకింగ్ విధానాన్ని కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్టు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. 2025 జులైలో ఆన్‌లైన్ తత్కాల్ టికెట్లకు ఆధార్ ధ్రువీకరణను, అక్టోబరులో రిజర్వేషన్లకు ఓటీపీ విధానాన్ని అమలు చేసింది. నవంబరు 17 నుంచి నేరుగా వెళ్లి కౌంటర్లలో తీసుకునే తత్కాల్ టికెట్లకు ఓటీపీ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ విధానాన్ని 52 రైళ్లలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. ఇక పూర్తిస్థాయిలో అమలుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది.

2 ఏళ్లకే 5 కాయలు!



సాధారణంగా పనస చెట్టు నాలుగేళ్లు దాటాకే కాస్తుంది. తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలోని ఓ నర్సరీలో రెండేళ్లకే కాతకొచ్చింది. వియత్నాం నుంచి తెచ్చిన ఈ మొక్కను ప్రత్యేక శ్రద్ధతో కుండీలోనే పెంచారు. 'వియత్నాం ఎర్లీ జాక్'గా పిలిచే మొక్క ప్రస్తుతం 5 కాయలు వేసింది. 'సాధారణంగా దేశవాళీ మొక్కలు చెట్లుగా మారితేనే కాయలు కాస్తాయి. గ్రాఫ్టింగ్ పద్ధతిలో పెంచడం వల్ల తక్కువ కాలానికే కాతకు వస్తాయి' అని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, కడియం

బూతులు మాట్లాడినవారు అసెంబ్లీకి రాలేదు

- రాజకీయాల్లో వారసత్వం కాదు.. జవసత్వం ముఖ్యం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు
- భాజపా కార్యకర్తల ఆత్మీయ సమావేశం



జ్యేష్ఠ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వందేమాతరం ఆలపిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు. చిత్రంలో మంత్రి సత్యకుమార్, సోము వీర్రాజు, బండారు దత్తాత్రేయ, పి.వి.ఎన్. మాధవ్, టి.వేణుగోపాలరెడ్డి, శ్యాంప్రసాద్

ఈనాడు, అమరావతి: 'రాజకీయ నాయకులు సభల్లో మాట్లాడేటప్పుడు భాష, సంస్కృతి చాలా ముఖ్యం. గతంలో బూతులు మాట్లాడినవారెవ్వరూ మళ్లీ అసెంబ్లీకి రాలేదు. బూతులు మాట్లాడినవారికి ప్రజలు బూత్‌లో ఓట్ల రూపంలో సమాధానం చెప్పారు' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా కంకిపాడులో భాజపా రాష్ట్రశాఖ బుధవారం నిర్వహించిన 'కర్మణ్యే.. జ్యేష్ఠ కార్యకర్తల ఆత్మీయ సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'మొదట దేశం, తర్వాత పార్టీ, ఆ తర్వాతే మనం. రాజకీయ వ్యవస్థలో వారసత్వం కాదు.. జవసత్వం ముఖ్యం. సీనియర్ల అనుభవాలు నేటి తరానికి మార్గదర్శకం కావాలి' అని సూచించారు.

ఆపరేషన్ సిందూర్ 2.0 కూడా ఉంటుంది

'ఇటీవల బిహార్ ఎన్నికల్లో ఓటుచోరీ నినాదం చేసినవారంతా ఫలితాలు వచ్చాక ఏమయ్యారో మీరు చూశారు. 'సర్' వివాదంపై అవగాహన పెంచుకోవాలి. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిరం నిర్మాణం.. ట్రిపుల్ తలాక్ రద్దు, కాశీవిశ్వనాథ మందిరం లాంటివి సాకారమయ్యాయి. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని రూపుమాపాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ పూర్తికాలేదు.. 2.0 కూడా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

బతికుండగా భాజపా అధికారంలోకి వస్తుందా అన్నారు: దత్తాత్రేయ

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. 'ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నవారంతా అనేక విజయాలకు పునాదులుగా నిలబడ్డారు. అందుకే గొప్ప ఫలితాలు వస్తున్నాయి. నేను భాజపాలో చేరినప్పుడు మీరు బతికుండగా పార్టీ అధికారంలోకి వస్తుందా అని ఒక సీఎం అడిగారు. కచ్చితంగా వస్తామని చెప్పాను. ఇప్పుడు 20 రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉంది' అని తెలిపారు.

పార్టీ, కార్యకర్త వేరు కాదు: మాధవ్

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 'పార్టీలోని ప్రస్తుత తరం తమ వద్దకు రావట్లేదనే వెలితి సీనియర్ కార్యకర్తల్లో ఉంది. నేటి తరానికి జ్యేష్ఠ కార్యకర్తలే స్ఫూర్తి. సీనియర్ కార్యకర్తల కృషిని గుర్తించడానికే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశాం. పార్టీ, కార్యకర్త వేరుకాదని ప్రధాని మోదీని చూస్తే అర్థమవుతుంది' అన్నారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే భాజపా డీఎన్ఏ: మంత్రి సత్యకుమార్

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ 'సుదీర్ఘ పోరాటం తర్వాత భాజపా అతిపెద్ద రాజకీయ పార్టీగా ఏర్పడింది. వికసిత్ భారత్‌వైపు పడుతున్న అడుగుల వెనుక నాలుగు దశాబ్దాల కార్యకర్తల కృషి ఉంది. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే భాజపా డీఎన్ఏ. అధికారం నిలబెట్టుకున్నామంటే ప్రజల విశ్వాసం చూరగొంటున్నామనే అర్థం' అని పేర్కొన్నారు.

◆ భాజపా రాష్ట్ర సంఘటన పూర్వ ప్రధానకార్యదర్శి పి.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పనిచేస్తే ప్రజానాయకులుగా ఎదుగుతారన్నారు.

◆ సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో సీనియర్లు భాగస్వాములు కావాలన్నారు.

◆ శాసనమండలి భాజపాపక్ష నాయకుడు సోము వీర్రాజు మాట్లాడుతూ భాజపా కార్యకర్తలు ప్రేరణతో పనిచేసి.. సొంతంగా అధికారంలోకి రావాలని ఆకాంక్షించారని, అదే నెరవేరుతోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

నూరేళ్ల దీవెన.. ఆనందబాష్పాల స్పందన



తన గురించి బండారు దత్తాత్రేయ చెబుతుంటే చెమర్చిన కళ్లను తుడుచుకుంటున్న భాజపా సీనియర్ నాయకురాలు జూపూడి హైమావతి

సమావేశంలో భాజపా సీనియర్ నాయకురాలు 92 సంవత్సరాల జూపూడి హైమావతిని సత్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ ఆమె గురించి వేదికపై వివరిస్తూ.. 1967లో విజయవాడలో నిర్వహించిన భారతీయ జనసంఘ్ కార్యక్రమానికి మహిళా కన్వీనర్‌గా వ్యవహరించారని, నేటికీ భాజపాతోనే కొనసాగుతున్న హైమావతి సెంచరీ కొట్టాలని, మరో ఎనిమిదేళ్లు ఇదే ఉత్సాహంతో పార్టీతో నడిచి నిండు నూరేళ్లూ ఉండాలని అంటుండగా.. ఆమె ఆనందబాష్పాలను తుడుచుకున్నారు.

–ఈనాడు, అమరావతి

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

- బాధితురాలికి రూ.10.50 లక్షల చెల్లింపునకు ఆదేశం



నిందితుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కదులుతున్న రైలులో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కడప పోక్సో కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలికి రూ.10.50 లక్షలు పరిహారం చెల్లించాలని గుంతకల్లు డీఆర్ఎంను ఆదేశించారు. 2019 జనవరి 27న సాయంత్రం ఆరు గంటల సమయంలో తల్లిదండ్రులు ఎనిమిదేళ్ల బాలికతో కలిసి తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఈ క్రమంలో బాలిక రైలులో ఉన్న మరుగుదొడ్డికి ఒంటరిగా వెళ్లింది. ఆ సమయంలో కడపకు చెందిన గాలి రామ్‌ప్రసాద్‌రెడ్డి (28) అదే రైలులో ప్రయాణిస్తున్నాడు. బాలిక ఒంటరిగా వెళుతుండటాన్ని గమనించి బలవంతంగా బాత్‌రూం లోపలికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో వెంటనే తల్లిదండ్రులు వెళ్లి తలుపు తట్టగా నిందితుడు పారిపోయేందుకు యత్నించాడు. అతనిని పట్టుకుని రైల్లో ఉన్న టీటీఐకి అప్పగించారు. రైలు కడపకు చేరుకున్న తరవాత నిందితుడు రైలు నుంచి దూకి పరారయ్యాడు. అప్పట్లో బాలిక తల్లిదండ్రులు సికింద్రాబాద్‌లో ఆర్పీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదైంది. అప్పటి రైల్వే డీఎస్పీ రమేష్ ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడు గాలి రామ్‌ప్రసాద్‌రెడ్డిని 2019 ఫిబ్రవరి 5న అరెస్టు చేశారు. ఈ కేసు బుధవారం కడప పోక్సో కోర్టులో వాయిదాకు రాగా జడ్జి సి.ప్రవీణ్‌కుమార్ తీర్పునిచ్చారు. ఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న టీటీఐలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది.

శ్మశానవాటికల ఏర్పాటు..

సౌకర్యాల కల్పన బాధ్యత ప్రభుత్వానిదే

- స్పష్టం చేసిన హైకోర్టు
- అంతిమ సంస్కారాలు గౌరవంగా, హుందాగా ఉండాలని వ్యాఖ్య
- భవిష్యత్తు అవసరాల కోసం కొత్త వాటికలు గుర్తించాలని సీఎస్‌కు ఆదేశం

ఈనాడు, అమరావతి: భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు శ్మశానవాటికల ఏర్పాటు, వాటిలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. మృతదేహాలకు అంతిమ సంస్కారాలు గౌరవంగా, హుందాగా ఉండాలని స్పష్టం చేసింది. రాజమహేంద్రవరంలో రహదారిపై ఓ మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించడం చూస్తుంటే రాష్ట్రంలో శ్మశానవాటికల దయనీయ స్థితి, కొరత తీవ్రతను తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ సమర్పించిన ఫొటోలను పరిశీలిస్తే.. కొన్ని ప్రాంతాల్లో శ్మశానవాటికలు ఆక్రమణలకు గురై, ముళ్లపొదలతో నిండిపోయి, ప్రహరీలు లేక పశువులకు ఆవాసాలుగా ఉన్నాయని పేర్కొంది. శ్మశానవాటికల నిర్వహణ విషయంలో గతంలో జీఓలు ఇచ్చినా.. అవి అమలు కావడం లేదని, కాగితాలకే పరిమితమయ్యాయని తెలిపింది. ఆ జీఓల ప్రకారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేసింది. శ్మశానాల నిర్వహణకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం ఎందుకంత నిరాసక్తత చూపుతోందని ప్రశ్నించింది. శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని (సీఎస్) ఆదేశించింది. రాబోయే రెండు దశాబ్దాల అవసరాలను తీర్చేందుకు ఖనన, దహన వాటికలు గుర్తించాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశిస్తూ.. విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

◆ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీల పరిధిలోని శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విజయవాడకు చెందిన పి.ప్రమోద్ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చాలాచోట్ల శ్మశానవాటికల కొరత తీవ్రంగా ఉందన్నారు. ◆ పురపాలక శాఖ తరఫు న్యాయవాది శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. శ్మశానాల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 2008, 2009లో జీఓలు జారీ చేసిందన్నారు. వాటికల నిర్వహణ బాధ్యత స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలదేనన్నారు. ఆ జీఓల ప్రకారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉందని, బడ్జెట్ కేటాయించాల్సి ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

ఎవరికీ పట్టని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల

- 32 పోస్టులకు ఒక్కరే రెగ్యులర్ అధ్యాపకురాలు
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు ఉన్నా కేంద్ర నిధులు తెచ్చుకోలేని దుస్థితి

ఈనాడు, అమరావతి: ఒకప్పుడు ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఆలిండియా సర్వీసు అధికారులను అందించిన నాగార్జున సాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను పట్టించుకునే నాథుడు కరవయ్యారు. పాఠశాల విద్య పరిధిలో ఉన్న ఈ కళాశాలను ఉన్నత విద్యలోకి మార్చేందుకు గత ఏడాది అక్టోబరులో కమిటీ ఏర్పాటు చేసినా ఇంత వరకు అతీగతీ లేకుండా పోయింది. కమిటీ నివేదిక సమర్పించినా దీనికి సంబంధించిన చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. డిగ్రీ కళాశాల కావడంతో పాఠశాల విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. పాఠశాల విద్యలో ఉన్నందున తమకు సంబంధం లేదన్నట్లు ఉన్నత విద్యాశాఖ వ్యవహరిస్తోంది.

ఒక్కరే రెగ్యులర్ అధ్యాపకురాలు

డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టులు 32 ఉండగా.. ఇక్కడ రెగ్యులర్ అధ్యాపకురాలు నయీం బాను ఒక్కరే ఉన్నారు. ఓడీపైన వచ్చిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులు నలుగురు ఉండగా.. ఒప్పంద, ఇతర అతిథి అధ్యాపకులు మరో నలుగురు ఉన్నారు. వీరికి జీతాలూ సకాలంలో అందడం లేదు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ కింద ఈ కళాశాల కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మిగులు అధ్యాపకులు ఉన్నా పూర్తి స్థాయిలో నియమించలేని పరిస్థితి ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వ నిధులకూ సమస్యే

గత రెండేళ్లుగా ఎన్ఐఆర్ఎఫ్‌లో 201-300 ర్యాంకుల్లో ఈ కళాశాల నిలుస్తోంది. దీంతో పీఎం ఉషా కింద నిధులు తెచ్చుకునే అవకాశం ఉంది. గతంలో పని చేసిన ప్రిన్సిపల్ చొరవతో రూసా రెండో విడతలో రూ.2 కోట్లు వచ్చాయి. ఆ తర్వాత ఈ కళాశాల ప్రతిపాదనను ఉన్నత విద్యాశాఖ సకాలంలో పంపలేదు. దీంతో నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం మూడేళ్లకు కలిపి 536 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ప్రథమ సంవత్సరానికి మంజూరైన సీట్లు 220 ఉండగా.. ఈ ఏడాది వందశాతం భర్తీ అయ్యాయి. ఈ కళాశాలను సక్రమంగా నిర్వహిస్తే వసతిగృహంలో ఉండి డిగ్రీ పూర్తి చేయాలనుకునే పేదవర్గాల విద్యార్థులకు మరింత అక్కరకు వస్తుంది.

8 వరకు శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనం నిలిపివేత


శ్రీశైల మల్లికార్జునస్వామి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహా క్షేత్రంలో ఈ నెల 8 వరకు శ్రీమల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం నిలిపివేస్తున్నట్లు బుధవారం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్తికమాసంలో శివదీక్షలు స్వీకరించిన భక్తులు శ్రీశైలంలో దీక్షా విరమణలు చేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం శ్రీశైలంలో శివదీక్షా భక్తుల రద్దీ అధికంగా ఉన్నట్లు చెప్పారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 50 కిలోల వెండితో పానవట్టం


వెండితో తయారు చేసిన మండపం, పానవట్టం

మోపిదేవి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన రావి వీరరాఘవ చౌదరి (ఆర్.వి.ఆర్. చౌదరి), సౌభాగ్యలక్ష్మి దంపతులు 50 కిలోల వెండితో తయారు చేసిన పానవట్టాన్ని విరాళంగా అందించారు. పానవట్టానికి మండపమూ ఉండటం విశేషం. గురువారం ఉదయం పూజల అనంతరం ఆలయంలో దీన్ని అలంకరించనున్నారు. రూ.కోటి వెచ్చించి, హైదరాబాద్‌లో నిపుణులతో తయారు చేయించినట్లు దాతల ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్రంలో 'నక్షా'కు రూ.125 కోట్లు

ఈనాడు, దిల్లీ: జీఐఎస్ ఆధారిత సమీకృత పట్టణ భూరికార్డుల తయారీ కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్ (నక్షా) కింద ఏపీకి రూ.125 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఇందులో కుప్పానికి రూ.5 కోట్లు, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, తిరుపతిలకు రూ.20 కోట్ల చొప్పున కేటాయించినట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వడ్డీ లేని రుణాలు: ఆచంట సునీత

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం పావలా వడ్డీ రుణాల్ని రూ.5 లక్షలకు పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తోందని తెదేపా డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షురాలు ఆచంట సునీత తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు.

పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: కోనసీమ పచ్చదనానికి తెలంగాణ వారి దిష్టి తగిలిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర, తెలంగాణ మధ్య మళ్లీ ప్రాంతీయ విద్వేషాలు నింపొద్దు. కోనసీమ కొబ్బరిచెట్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. రూ.3,500 కోట్లు కేటాయించి, ఉప్పునీటి ముప్పు తప్పించే పనులు మొదలుపెట్టాలి' అని కోరారు.

10 నుంచి 'అటల్ సుశాసన్ సంకల్ప్ - మోదీ సిద్ధి యాత్ర'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో డిసెంబరు 10 నుంచి 25 వరకు 'అటల్ సుశాసన్ సంకల్ప్ - మోదీ సిద్ధి యాత్ర' నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ధర్మవరంలో ప్రారంభించనున్న ఈ యాత్ర డిసెంబరు 25న అమరావతిలో ముగుస్తుందని పేర్కొన్నారు.

రూ.21 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

- రాష్ట్ర ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- 2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ.21 వేల కోట్లతో ప్రతిపాదించిన గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీనిపై కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖతో ఇటీవల దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చించారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను 2026-27 బడ్జెట్‌లో కేటాయించేందుకు కేంద్ర ఇంధన శాఖ అంగీకరించింది. ఈ కారిడార్ ఏర్పాటుతో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల మధ్య 1,200 సర్క్యూట్ కిలోమీటర్ల హెచ్‌టీ విద్యుత్ లైన్లు వేస్తారు. ఈ ప్రతిపాదనకు దక్షిణ ప్రాంత విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ), కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) ఇప్పటికే అనుమతించాయి. కేంద్రం నుంచి అనుమతులు రావడంతో ప్రాజెక్టు అమలుకు ఇప్పుడు మార్గం ఏర్పడింది. దీనివల్ల 10 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. గ్రీన్ ఎనర్జీ కారిడార్ మొదటి దశ కింద అనంతపురం నుంచి రామాయపట్నం వరకు రూ.21,800 కోట్లతో 9,700 సర్క్యూట్ కి.మీ. విద్యుత్ లైన్ల పనులను 2015లో చేపట్టారు. మొదటి దశ మాదిరిగానే రెండో దశలోనూ ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం నిధులను గ్రాంటుగా ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. కేంద్రం 30 శాతం ఇవ్వాలని భావిస్తుండటంతో. .అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

కారిడార్ ఏర్పాటుతో తగ్గనున్న ఆర్థిక భారం

రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు 80,798 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వం 2019-24 మధ్య 10,247 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిలో 7,500 మెగావాట్ల సామర్థ్యమున్న ప్రాజెక్టులు మాత్రమే గ్రౌండయ్యాయి. కూటమి ప్రభుత్వం జూన్ నుంచి సౌర, పవన, పీఎస్‌పీ ప్రాజెక్టుల ఏర్పాటుకు 38 సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. మెజారిటీ ప్రాజెక్టులు వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లోనే ఉన్నాయి. ఇప్పటికే సీమలో ఉన్న 5 వేల మెగావాట్ల యూనిట్లతోపాటు.. మరో 15 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంగల ప్రాజెక్టులు రానున్న మూడేళ్లలో ఉత్పత్తిలోకి వస్తాయని అంచనా. ఆ విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 17 వేల మెగావాట్ల సరఫరా నెట్‌వర్క్‌ను వినియోగించుకోవాలి. దీనివల్ల రాష్ట్రం భారీ మొత్తంలో వీలింగ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కారిడార్ ఏర్పాటుతో ఆ భారం తగ్గనుంది.

వివిధ క్యాటగిరీ ప్రాజెక్టుల పరిస్థితి (మెగావాట్లలో)

క్యాటగిరీ	మొత్తం సామర్థ్యం	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి	నిర్మాణం ప్రారంభించాల్సినవి
సౌర	30,761	5,006	4,267	21,488
పవన	24,997	4,380	3,928	16,689
పీఎస్‌పీ	25,040	----	3,530	21,500
	80,798	9,386	11,725	59,677

కొత్త సబ్‌స్టేషన్ల అనుసంధానం

పీజీసీఐఎల్‌కు చెందిన ఓర్వకల్లు, గనిలోని 765 కేవీ సబ్‌స్టేషన్లతోపాటు ట్రాన్స్‌కోకు చెందిన ఆస్పరి, కృష్ణపట్నం, పొదిలి, రామాయపట్నం, సత్తెనపల్లి, వేమగిరి, గుడివాడ, కాకినాడ, గంగవరం, నక్కపల్లి కలిపి.. ఇప్పటికే ఉన్న 17 (400 కేవీ) సబ్‌స్టేషన్లను కారిడార్‌కు అనుసంధానిస్తారు. వాటితో పాటు అనంతపురం, కర్నూలు, ప్రకాశం, అనకాపల్లి జిల్లాల్లో కొత్తగా ప్రతిపాదించిన సబ్‌స్టేషన్లనూ కారిడార్‌కు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనివల్ల ఏదైనా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతం నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుంటుంది.

★ విశాఖ జిల్లా పూడిమడక దగ్గర ఎన్టీపీసీ, జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ పార్కును అభివృద్ధి చేస్తున్నాయి. కాకినాడలో గ్రీన్‌కో సంస్థ గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు అవసరమైన విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది.

కొండంత దీపం!



తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కొండపై బుధవారం సాయంత్రం 6 గంటలకు కార్తిక దీపం వెలిగించారు. 2,668 అడుగుల ఎత్తైన కొండపై ఈ మహాదీపం 11 రోజులపాటు వెలుగుతుంది. లోహపు పాత్రలో వెయ్యి కిలోల స్వచ్ఛమైన నెయ్యితో 350 మీటర్ల వస్త్రంతో దీపపు వత్తి తయారు చేసి వెలిగిస్తారు. మహాదీపోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– తిరువణ్ణామలై, న్యూస్‌టుడే

అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమిపై కౌంటర్ వేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు విచారణ జరిపి, పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించింది. కేంద్ర స్త్రీ, శిశు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల కార్యదర్శులు, రాష్ట్ర సీఎస్, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులకు నోటీసులిచ్చింది. విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల లేమిని ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కేతినీడు అఖిల్ శ్రీగురు తేజ హైకోర్టులో పిల్ వేశారు. ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆహార భద్రత చట్టం ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 7,432 చోట్ల మరుగుదొడ్లు, 3,700 చోట్ల విద్యుత్తు సరఫరా, 826 కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం లేవని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

డ్రోన్ల ద్వారా ఆసుపత్రులకు మందుల సరఫరా

ప్రయోగాత్మకంగా పాడేరు కేంద్రంగా నిర్వహించేలా ప్రణాళిక

ఈనాడు, అమరావతి: వైద్యసేవల్లో డ్రోన్ల వినియోగం దిశగా వైద్యారోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక వైద్యశాలలు, ప్రాంతీయ ఆసుపత్రులు, రక్తనిధి కేంద్రాలకు డ్రోన్ల ద్వారా మందులు, రక్తం యూనిట్లు, వ్యాక్సిన్లను పంపేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రభుత్వ సేవల్లో డ్రోన్ల వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. తొలుత అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ప్రయోగాత్మకంగా డ్రోన్లను వినియోగించాలని భావిస్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో డ్రోన్ల ద్వారా మందులు, వ్యాక్సిన్లు, బ్లడ్ యూనిట్లు పంపుతున్న ఓ సంస్థ ఉచితంగా తొమ్మిది నెలలపాటు రాష్ట్రంలో సేవలు అందించేందుకు ముందుకు వచ్చిందని.. ఆ సంస్థతో చర్చలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

★ పాడేరు కేంద్రంగా మూడు, నాలుగు డ్రోన్లను వినియోగించాలన్నది యోచన. ఒక్కో డ్రోన్ ద్వారా రెండు కిలోల బరువున్న సామగ్రిని పంపే వీలుంది. పాడేరు పరిధిలోని 60-80 కి.మీ. దూరంలో ఉన్న ఆసుపత్రులకు మందులను ఈ తరహాలో పంపుతారు. ఆసుపత్రి చేరే డ్రోన్ అక్కడి నుంచి పాడేరు ఆసుపత్రిలో పరీక్షించాల్సిన రక్త, మల, మూత్ర నమూనాలు తిరుగు ప్రయాణంలో తీసుకొచ్చేలా చూడాలని భావిస్తున్నారు.

★ అత్యవసర కేసులు పాడేరు నుంచి 115 కి.మీ. దూరంలో ఉన్న విశాఖలోని కేజీహెచ్‌కు తరలిస్తున్నారు. రోడ్డు మార్గంలో రోగులు రావాలన్నా, సిబ్బంది, మందులు తరలించాలన్నా కాలయాపనే. ఈ క్రమంలో ప్రభుత్వ అనుమతి లభిస్తే భవిష్యత్తులో విశాఖ నుంచి పాడేరుకు డ్రోన్ల సేవల వినియోగంపైనా కసరత్తు ప్రారంభిస్తారు.

★ మలేరియా తీవ్రత ఎక్కువగా ఉన్న అల్లూరి జిల్లాలో సిబ్బంది వెళ్లలేని ప్రదేశాల్లో ఇప్పటికే డ్రోన్ల ద్వారా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నారు.

అమెరికాలో ఏపీ మహిళ హత్య కేసులో

సమాచారం ఇస్తే 50 వేల డాలర్లు: ఎఫ్‌బీఐ

- నిందితుడు హమీద్‌ను అప్పగించాలని భారత్‌కు వినతి

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలో 2017లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా తన కుమారుడితోపాటు హత్యకు గురైన కేసులో నిందితుడు నజీర్ హమీద్ ఆచూకీ తెలిపిన వారికి 50 వేల డాలర్ల పారితోషకం ఇస్తామని యూఎస్‌ఏకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ప్రకటించింది. ఈ హత్యలు జరిగిన ఆరు నెలల తరవాత హమీద్ భారత్‌కు పరారైనట్లు అక్కడి అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతడు భారత్‌లో ఉన్నాడని.. అరెస్టుకు వారంట్‌ను జారీ చేసినట్లు ఎఫ్‌బీఐ తెలిపింది. ఈ హత్యకుగల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు వివరించారు. ఈ హత్య కేసుపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో బాధితురాలి భర్త హనుమంతరావు కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు బర్లింగ్టన్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది.

హమీద్ అప్పగింతకు లేఖ

భారత్‌లో ఉన్న హమీద్‌ను తిరిగి అమెరికాకు తీసుకొచ్చేందుకు ఆ దేశ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా ఇటీవల న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ యూఎస్‌లోని భారత రాయబారి వినయ్ క్వాత్రాకు లేఖ రాశారు. హమీద్ అప్పగింతకు భారత ప్రభుత్వ సహాయం కోరారు.

★ ఏపీకి చెందిన నర్రా హనుమంతరావు భార్య శశికళ(40), కొడుకు అనీష్ సాయి(7)తో కలిసి న్యూజెర్సీలో నివసించేవారు. 2017 మార్చిలో హనుమంతరావు విధులు ముగించుకొని వచ్చేసరికి.. వారి అపార్ట్‌మెంట్‌లో భార్య, కొడుకు రక్తపు మడుగులో ఉన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యలకు పాల్పడింది భర్త నర్రా హనుమంతరావేనని మృతురాలి బంధువులు ఆరోపించారు. అతడికి ఓ కేరళ మహిళతో వివాహేతర సంబంధం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, డీఎన్‌ఏ పరీక్షల్లో అతడి ప్రమేయం లేదని తేలడంతో వదిలిపెట్టారు. కాగా సహోద్యోగి అయిన హమీద్‌తో హనుమంతరావుకు భేదాభిప్రాయాలు ఉన్నట్లు విచారణలో గుర్తించారు. హత్య కేసులో అతడి పాత్రపై దర్యాప్తు చేస్తుండగా..హమీద్ భారత్‌కు పారిపోయినట్లు తేలింది. హమీద్ ల్యాప్‌టాప్ నుంచి సేకరించిన డీఎన్‌ఏ హత్య జరిగిన ప్రాంతంలోని డీఎన్‌ఏతో సరిపోలడంతో.. అతడే నిందితుడని ఇటీవల అమెరికా పోలీసులు ప్రకటించి పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు.


శంషాబాద్ విమానాశ్రయంలో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

100కు పైగా ఇండిగో విమానాల రద్దు

- ఒక్క శంషాబాద్‌లోనే 40..
- మరో 48 గంటలపాటు ఇబ్బందే..

దిల్లీ, ఈనాడు–హైదరాబాద్: దేశవ్యాప్తంగా బుధవారం విమాన సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. దేశంలోనే అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో.. 100కు పైగా విమానాలను రద్దు చేసింది. ఒక్క శంషాబాద్ నుంచే 40 విమాన సర్వీసులను నిలిపివేశారు. దీంతో ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన వారిలో చాలా మంది రైళ్ల కోసం పరుగులు తీశారు. ముందస్తు సమాచారం లేకుండా కొచ్చిన్ విమానాన్ని రద్దు చేశారని.. అయ్యప్ప భక్తులు బుధవారం ఆందోళనకు దిగడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భద్రతాధికారులు జోక్యం చేసుకుని రీషెడ్యూల్ చేసిన సర్వీసుల్లో గమ్యస్థానాలకు పంపిస్తామని సముదాయించడంతో ప్రయాణికులు శాంతించారు. రానున్న 48 గంటల్లోనూ పలు విమాన సేవలకు అంతరాయం కలగనున్నట్లు తెలిసింది. గురువారం కూడా శంషాబాద్ నుంచి 36 విమానాలు రద్దు చేసినట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. పైలట్ల విధుల నియంత్రణపై ఇటీవల డీజీసీఏ విధించిన నిబంధనలతోపాటు రాత్రి విమానాల ల్యాండింగ్‌ను తగ్గించడం వల్లే ఈ సమస్యలు తలెత్తాయని వివరించింది. 'స్వల్ప సాంకేతిక సమస్యలు, శీతాకాలం కారణంగా షెడ్యూల్‌లో మార్పులు, ఏవియేషన్ వ్యవస్థలో పెరిగిన రద్దీ, సిబ్బంది రోస్టర్ నిబంధనల అప్‌గ్రేడ్‌తో తలెత్తిన ఇబ్బందులూ కారణమే' అని తెలిపింది.

ప్రాజెక్టుల ధరలు పెంచుతూపోతే.. డీపీఆర్‌లెందుకు?

- అధికారులను ప్రశ్నించిన ప్రజాపద్దుల కమిటీ

ఈనాడు, అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రారంభించాక వాటి ధరలు పెంచుతూపోతే...వాటిని ప్రతిపాదిస్తూ ముందుగా రూపొందించే డీపీఆర్‌లకు విలువేముంటుంది? అని ప్రజాపద్దుల కమిటీ అధికారులను ప్రశ్నించింది. పట్టిసీమ, గాజులదిన్నె, గుంటూరు ఛానల్, వేదవతి తదితర ప్రాజెక్టుల పనులపై 'కాగ్' లేవనెత్తిన అభ్యంతరాలను ఈ కమిటీ బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశమై సమీక్షించింది.

వ్యయం ఎందుకు పెరుగుతోంది?

'ప్రాజెక్టుల డీపీఆర్‌లు రూపొందించినప్పుడు అందులో ప్రతీ పని సమగ్ర వివరాలూ నమోదు చేస్తారు కదా? అయినా ప్రాజెక్టు చేపట్టాక మళ్లీ అంచనాలు ఎందుకు పెరుగుతున్నాయి? పట్టిసీమ చాలా ఉపయోగకరమైన ప్రాజెక్టు..అందులో పైపుల ధరలు పెరగడం పట్ల కాగ్ అభ్యంతరం తెలిపింది. అలా ఎందుకు జరిగింది' అని కమిటీ అధికారులను ప్రశ్నించింది. గుంటూరు ఛానల్‌ను విస్తరించడంతోపాటు, ఆధునికీకరించాలని అలా కాకుండా కేవలం విస్తరిస్తే ఉపయోగం ఉండదని కమిటీ అభిప్రాయపడింది.

వేదవతి అత్యావసరం

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ప్రాంతంలో 235కుపైగా గ్రామాలకు తాగునీరందించే వేదవతి ప్రాజెక్టును ప్రాధాన్యక్రమంలో పూర్తి చేయాలని కమిటీ నిర్దేశించింది. ఈ ప్రాజెక్టు భూసేకరణకు రూ.60కోట్లు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేసింది. ఆయా ప్రాజెక్టులపై కాగ్ అభ్యంతరాలను ఒక్కొక్కటిగా సంబంధిత అధికారులతో కమిటీ చర్చించింది. కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, ముత్తుముల అశోక్ రెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, కోళ్ల లలితకుమారి, పి.విష్ణుకుమార్ రాజు, మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ హాల్ టికెట్ల జారీ

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్ టికెట్లను విడుదల చేశామని, అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి సూచించారు. ఈ నెల 10 నుంచి ఈ పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ధనవంతులుగా కనిపించాలనుకోవద్దు



ధనవంతులుగా కనిపించేందుకు చాలా మంది తాహతుకు మించి ఖరీదైన వస్తువులను కొంటుంటారు. వాస్తవానికి అటువంటి చర్యలు వారిని పేదరికం దిశగా నెడతాయి. ఎలాగంటే..విలాసవంతమైన కారు కొంటే దాని విలువ తగ్గుతూనే ఉంటుంది. డిజైనర్ దుస్తుల నుంచి ఎటువంటి రాబడి ఉండదు. ఖరీదైన వాచీతో అదనపు ప్రయోజనం ఏమీ ఉండదు. ఏటా కొత్త ఐ ఫోన్ కొనుగోలుతో డబ్బు వృథా అవుతుంది. విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ఈఎంఐ గుదిబండలా మారుతుంది. కాబట్టి డాబుసరిపై కాక సంపద సృష్టిపై దృష్టి పెట్టడం ఉత్తమం.

– లోగన్ వీవర్, పెట్టుబడుల సలహాదారు

ఇంటర్ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు


ఐఐటీ, నీట్, ఏపీఈఏపీ సెట్‌కు సన్నద్ధమయ్యేందుకు పేద పిల్లలకు పంపిణీ


ఇంటర్ విద్యార్థులకు ఇస్తున్న పుస్తకాలు

ఈనాడు, ఒంగోలు: పేద కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో మాదిరి ఐఐటీ, నీట్‌లో ప్రతిభ చూపేందుకు రోజువారీ పాఠ్యాంశాలతోపాటు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నవారికి పోటీ పరీక్షల పుస్తకాలను విద్యా సంవత్సరం ఆరంభంలో పంపిణీ చేశారు. నిపుణులతో రూపొందించిన గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, బయాలజీ పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందించారు. వీరికి ప్రత్యేక తరగతుల్లో వీటిని బోధించడంతోపాటు వారానికోసారి ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తున్నారు. తాజాగా మొదటి సంవత్సరం చదువుతున్న వారికి కూడా ప్రత్యేక మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నారు. ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన మెటీరియల్‌ను ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అందిస్తున్నామని, త్వరలోనే పంపిణీ పూర్తి చేస్తామని ప్రకాశం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆంజనేయులు పేర్కొన్నారు.

సీఎం సార్.. నా కుటుంబాన్ని కాపాడండి

అప్పుల బాధతో లేఖ రాసి వృద్ధుడి ఆత్మహత్య


సూరిబాబు

కొత్తవలస, న్యూస్‌టుడే: 'అప్పులు చేసి కుమార్తెలకు వివాహం చేశాను. అప్పులోళ్ల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నా. సీఎం సార్ నా కుటుంబాన్ని కాపాడండి..' అంటూ లేఖ రాసి ఓ వృద్ధుడు ప్రాణాలు తీసుకున్నాడు. విజయనగరం జిల్లా కొత్తవలసలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన సిద్ధాల సూరిబాబు (70) పదేళ్ల క్రితం కుటుంబంతో సహా వచ్చి విజయనగరం జిల్లా కొత్తవలస శివాజీనగర్‌లో ఉంటున్నారు. స్థానికంగా అల్పాహార దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రెండు బ్యాంకుల నుంచి రూ.4 లక్షల వరకు అప్పు తీసుకున్నారు. అది తీర్చాలని ఒత్తిడి పెరగడంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. సూరిబాబుకు భార్య, కుమారుడు, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

EENADU Vol: 52, Issue: 114 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

'మన శంకరవరప్రసాద్ గారు' ఎన్నో జ్ఞాపకాలు ఇచ్చారు – వెంకటేశ్



చిరంజీవి, అనిల్ రావిపూడి, వెంకటేశ్

అగ్రహీరో చిరంజీవి ప్రధాన పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఇందులో వెంకటేశ్ ఓ కీలక పాత్రలో మెరనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ ముగిసినట్లు తెలియజేస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు వెంకటేశ్. 'నాకెంతో ఇష్టమైన చిరంజీవితో కలిసి నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. అది ఇన్నాళ్లకు ఈ సినిమాతో సాధ్యమైంది. ఈ చిత్రం ఎన్నో జ్ఞాపకాలను అందించింది. 2026 సంక్రాంతిని ఈ సినిమాతో థియేటర్లలో సెలబ్రేట్ చేసుకునేందుకు ఎదురు చూస్తున్నా" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. "మై డియర్ బ్రదర్ వెంకీ.. ఈ సినిమాలో నటించినందుకు ధన్యవాదాలు. మీరు ఈ చిత్రానికి ప్రత్యేకత తీసుకొచ్చారు. మనం కలిసి పనిచేసిన ఈ పది రోజుల్లో ప్రతి క్షణాన్ని ఆస్వాదించాన"ని అంటూ వెంకటేశ్ పోస్టుపై స్పందించారు చిరంజీవి.

ప్రభాస్ సరసన ప్రియాంక చోప్రా?



ప్రభాస్



ప్రియాంక చోప్రా

సినిమా మొదలు కావడానికి ఇంకా సమయం పట్టేలా సంకేతాలు వస్తున్నాయి. దర్శకుడు, ఇతర చిత్రబృందం పూర్వ నిర్మాణ పనుల్లో తలమునకలై ఉన్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యమున్న చిత్రం కావడంతో అందుకు సంబంధించిన పనులపైనే ప్రధానంగా దృష్టిపెట్టారు. ప్రభాస్ కూడా ఇతర సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇదంతా ఒకవైపు అయితే, మరోవైపు సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమాలోని నాయకానాయికల జోడీపై సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది. ప్రభాస్ కథానాయకుడిగా రూపొందనున్న 'కల్కి2'కి సంబంధించిన చర్చే ఇదంతా. విజయవంతమైన 'కల్కి 2898 ఎ.డి' సినిమాకి కొనసాగింపుగా 'కల్కి 2' రూపొందనున్న సంగతి తెలిసిందే. తొలి చిత్రంలో ప్రభాస్‌కి జోడీగా దీపికా పదుకొణె నటించారు. అయితే ఈ మధ్యే కొనసాగింపు చిత్రంలో దీపిక భాగం కావడం లేదంటూ చిత్రబృందం స్పష్టం చేసింది. అప్పట్నుంచి తదుపరి చిత్రంలో ప్రభాస్‌కి జోడీగా ఎవరు నటిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. తాజాగా ప్రియాంక చోప్రా పేరు ప్రచారంలోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న ప్రియాంక ఇందులో నటించే అవకాశాలు ఉన్నాయని, చిత్రబృందం ఆమెని ఎంపిక చేసుకోవడంపైనే ఆసక్తిగా ఉందని సమాచారం. బాలీవుడ్ వర్గాలు కూడా ఇదే విషయాన్నే మాట్లాడుకుంటున్నాయి.



వై.జి. మహేంద్రన్, బోయపాటి శ్రీను, బాలకృష్ణ, విజి చంద్రశేఖర్, కోటి

తెలంగాణ కర్మభూమి... ఆంధ్రప్రదేశ్ ఆత్మభూమి

– బాలకృష్ణ


చిత్ర పరిశ్రమకు తాను వచ్చి యాభయ్యేళ్లు పూర్తి కావడం, కథానాయకుడిగానే కొనసాగుతుండడం గర్వంగా ఉందన్నారు అగ్ర కథానాయకుడు బాలకృష్ణ. వరుసగా నాలుగు సినిమాలతో విజయాల్ని సాధించానని, 'అఖండ 2' ఆ వరుసలో చేరే మరొక చిత్రమని చెప్పారు. ఆయన కథానాయకుడిగా... బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'అఖండ 2: తాండవం'. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఎమ్. తేజస్విని నందమూరి సమర్పకులు. ఈ రోజు ప్రత్యేక ప్రదర్శనలతోనే ఈ సినిమా సందడి మొదలు కానుంది. పాన్ ఇండియా స్థాయిలో శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమా ప్రచారంలో భాగంగా బుధవారం చెన్నై వెళ్లింది చిత్రబృందం. అక్కడ నిర్వహించిన వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ "మద్రాస్ నాకు జన్మభూమి అయితే, తెలంగాణ కర్మభూమి. ఆంధ్రప్రదేశ్ నా ఆత్మభూమి. మా నాన్న నా గురువు, దైవం. ఆయన పురాణాలు, సామాజిక కథలు, ఫాంటసీ... ఇలా భిన్నమైన చిత్రాలు చేశారు. ఆయన బాటలోనే నడుస్తున్నాను. 'అఖండ 2: తాండవం'తో భవిష్యత్ తరాలు సనాతన ధర్మం గురించి తెలుసుకుంటారు" అన్నారు. ఇది ప్రాంతీయ సినిమా కాదనీ, భారతీయ సినిమా అని... ప్రేక్షకుల్ని ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుందని చెప్పారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ కార్యక్రమంలో విజి చంద్రశేఖర్, నటుడు వై.జి.మహేంద్రన్, సహ నిర్మాత కోటి పరుచూరి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, చెన్నై

కొనసాగింపుగా 'జై అఖండ'?

'అఖండ' ప్రపంచం ఇక్కడితో ఆగదని, కొనసాగుతూనే ఉంటుందని ఇప్పటికే చిత్రబృందం పలు సందర్భాల్లో చెప్పింది. ఈ చిత్ర సంగీత దర్శకుడు తమన్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఓ ఫొటో కూడా 'అఖండ 2: తాండవం'కి కొనసాగింపు ఉంటుందనే సంకేతాన్నే ఇచ్చింది. సినిమా పనులన్నీ పూర్తయ్యాయని, ఇక శివ తాండవాన్ని ఆస్వాదించడానికి సిద్ధం కావాలని ప్రేక్షకులకు పిలుపునిస్తూ చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి స్టూడియోలో తీసుకున్న ఓ ఫొటోని పంచుకున్నారు తమన్. అందులో తెరపైన 'జై అఖండ' అని రాసి ఉంది. దాన్నిబట్టి తదుపరి చిత్రం 'జై అఖండ' పేరుతోనే రూపొందుతుందనే ఓ అంచనాకి వచ్చారు అభిమానులు, పరిశ్రమ వర్గాలు.

జపాన్‌లో పుష్ప 2



'పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్ అంటూ గతేడాది బాక్సాఫీసు వద్ద రికార్డులు సృష్టించింది 'పుష్ప 2:ది రూల్' చిత్రం. అగ్ర హీరో అల్లు అర్జున్, రష్మిక జంటగా సుకుమార్ తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పటికే పలు భాషల్లో విడుదలై విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. గీక్ పిక్చర్స్, షోచికు స్టూడియోలతో కలిసి జపాన్ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమాల వేదికగా జపనీస్ భాషలో ట్రైలర్‌ను విడుదల చేసింది. దీన్ని 'పుష్ప కున్రిన్' పేరుతో జనవరి 16న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు తెలిపింది.

టాప్ టెన్ తారలు

- ఐఎండీబీ జాబితాలో మొదటి, రెండో స్థానాల్లో 'సైయారా' తారలు
- రష్మిక, రుక్మిణీలకు చోటు



అహాన్ పాండే



అనీత్ పడ్డా

'సైయారా' సినిమాతో సినీప్రియుల మనసుల్ని గెల్చుకున్నారు బాలీవుడ్ యువకథానాయకుడు అహాన్ పాండే, అనీత్ పడ్డా. తొలి అడుగులోనే యువతను విశేషంగా ఆకట్టుకున్న వీరిద్దరూ తాజాగా మరో ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ.. 2025వ సంవత్సరానికి గానూ అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సినీతారల జాబితాను ప్రకటించింది. ఇందులో అహాన్ పాండే మొదటి స్థానంలో, అనీత్ పడ్డా రెండో స్థానంలో నిలవడం విశేషం. వీరితో పాటు ఆమిర్ ఖాన్, ఇషాన్ ఖట్టర్, లక్ష్య, రష్మిక, కల్యాణి ప్రియదర్శన్, త్రిప్తి డిమ్రీ, రుక్మిణీ వసంత్, రిషబ్ శెట్టి తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సినీతారలతో పాటు ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ దర్శకుల జాబితాను కూడా విడుదల చేసినట్లు ఐఎండీబీ ఇండియా హెడ్ యామిని పటోడియా తెలిపారు. ఈ జాబితాలో 'సైయారా' సినిమాకు దర్శకత్వం వహించిన మోహిత్ సూరి మొదటి స్థానంలో నిలిచి మరోసారి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఇక రెండో స్థానంలో ఆర్యన్‌ఖాన్(ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్) నిలిచారు. ఆయన తర్వాత లోకేశ్ కనగరాజ్(కూలీ), అనురాగ్ కశ్యప్ (నిశాంచి), పృథ్వీరాజ్ సుకుమారన్ (ఎల్2:ఎంపురాన్) తదితరులు దర్శకుల జాబితాలో చోటు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా అహాన్ మాట్లాడుతూ.. "నా తొలి చిత్రంతోనే '2025ఐఎండీబీ అత్యంత ప్రజాదరణ గల భారతీయ తారల' జాబితాలో మొదటి స్థానంలో నిలవడం నిజంగా ఒక కల. ఈ గుర్తింపు నా వృత్తి పట్ల నాకున్న బాధ్యతను మరింత గుర్తు చేస్తోంది. దర్శకుడు మోహిత్ సూరికి కృతజ్ఞతలు" అని అన్నాడు. "ఈ జాబితాలో నేను రెండో స్థానంలో నిలవడం ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. 'సైయారా' నా జీవితాన్ని ఎన్నో విధాలుగా మార్చేసింది. ఆ మార్పును నేను ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నా. ప్రేక్షకుల ఆదరణే ఈ విజయాన్ని నాకు సాధ్యమయ్యేలా చేసింద'ని సంతోషాన్ని వ్యక్తం చేసింది అనీత్.



రుక్మిణీ వసంత్

రష్మిక

పతాక సన్నివేశాలకే రూ.20 కోట్లు!



విరాట్ కర్ణ

అత్యంత ఖరీదైన పతాక సన్నివేశాలతో తమ 'నాగబంధం' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని తెలిపారు అభిషేక్ నామా. ఆయన దర్శకత్వంలో, విరాట్‌కర్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమిది. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. పురాణాలతో ముడిపడిన ఓ యాక్షన్ కథతో, పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. అందుకోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఓ మహాద్వారం సెట్‌ని నిర్మించారు. ఆ నేపథ్యంలోనే థాయ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా ఖాంఫాక్‌డీ నేతృత్వంలో పతాక సన్నివేశాల చిత్రీకరణ సాగుతోంది. సినిమాలో అత్యంత కీలకమైన ఈ ఘట్టం కోసమే రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు సినీ వర్గాలు చెప్పాయి. భారతదేశంలోని ప్రాచీన విష్ణు ఆలయాలు, అక్కడి నేలమాళిగలు, రహస్యాల చుట్టూ సాగే కథతోనే ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆధ్యాత్మిక, సంప్రదాయాలు ఈ కథలో కీలకం. అత్యున్నత ప్రమాణాలతో, కళ్లు చెదిరే విజువల్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, తెలుగుతోపాటు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని సినీ నిర్మాణ వర్గాలు స్పష్టం చేశాయి. జగపతి బాబు, జయప్రకాశ్, మురళీశర్మ, బి.ఎస్.అవినాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అబే, జునైద్ కుమార్, కూర్పు: ఆర్.సి.ప్రణవ్, ఛాయాగ్రహణం: సౌందర్‌రాజన్.ఎస్.

అమరగానం... అసామాన్య జీవితం



మృదుల, కృష్ణచైతన్య

దిగ్గజ గాయకులు, సంగీత దర్శకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందిన 'ఘంటసాల ది గ్రేట్' ఈ నెల 12న రానుంది. సీహెచ్ రామారావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. ఘంటసాల పాత్రలో కృష్ణచైతన్య నటించగా, ఆయన భార్య సావిత్రమ్మగా మృదుల నటించారు. అతులిత, సుమన్ ముఖ్య పాత్రల్ని పోషించారు. సీహెచ్ ఫణి నిర్మాత. పాట ప్రయాణం... అంటూ రూపొందించిన ఈ చిత్రాన్ని ఇప్పటికే ఘంటసాల అభిమానుల కోరిక మేరకు పలు దేశాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆయా దేశాల్లో భారతీయుల్ని తీవ్ర భావోద్వేగానికి గురి చేసిన ఈ చిత్రాన్ని ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని నిర్ణయించినట్టు సినీ వర్గాలు తెలిపాయి. "ఘంటసాల అమరగానాన్నీ, ఆయన అసామాన్య జీవితాన్ని మరోసారి గుర్తు చేసేలా రూపొందించిన చిత్రమిది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువ చేయాలన్నదే మా లక్ష్యం. ఈ నెల 5న హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహిస్తామ"ని చిత్ర వర్గాలు తెలిపాయి. సుబ్బరాయ శర్మ, జేకే భారవి, సుమన్‌శెట్టి, అనంత్, సాయికిరణ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సాలూరి వాసురావు, ఛాయాగ్రహణం: వేణు మురళీధర్.

సుకుమారి వినోదాలు



ఐశ్వర్య, తిరువీర్

తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఇటీవలే మొదలైన చిత్రానికి 'ఓ..! సుకుమారి' అనే పేరుని ఖరారు చేశారు. భరత్‌దర్శన్ దర్శకత్వంలో, గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. "కుటుంబ వినోదంతో రూపొందుతున్న చిత్రమిది. విజయవంతమైన 'ది గ్రేట్ ప్రి వెడ్డింగ్ షో' సినిమా తర్వాత తిరువీర్, 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత ఐశ్వర్య రాజేశ్ కలిసి నటిస్తున్న చిత్రమిది. కథకు తగ్గట్టుగా 'ఓ...సుకుమారి' అనే పేరుని ఖరారు చేశామ"ని తెలిపింది చిత్రబృందం. తెలుగుతోపాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ విడుదల కానున్న ఈ చిత్రంలో ఝాన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచిరాజు, కళ: తిరుమల ఎం.తిరుపతి, కూర్పు: శ్రీవరప్రసాద్, పాటలు: పూర్ణాచారి.

మిమ్మల్ని కిందకి లాగే ఏ అవకాశాన్ని వదిలిపెట్టరు!



అదితీ రావ్ హైదరీ

"రోజూ మిమ్మల్ని కిందకి లాగే వంద విషయాలు ఉంటాయి. కొందరు మిమ్మల్ని అట్టడుగు స్థాయికి పంపించే ఏ అవకాశాన్ని వదిలిపెట్టర"ని అంటోంది అందాల తార అదితీ రావ్ హైదరీ. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అదితి మాట్లాడుతూ.. "రణ్‌వీర్ సింగ్ ఓసారి "నువ్వు నీ కలను సాకారం చేసుకుంటున్నావు. అద్భుతమైన దర్శకులు మణిరత్నం సెట్స్ నుంచి సంజయ్ లీలా భన్సాలీ సెట్స్‌కి వెళ్లావ"ని ఏదో సందర్భంలో నాతో అన్నారు. ఆయనలా చెప్పినప్పుడు నాకు గర్వంగా అనిపించింది. కానీ కష్టపడి పనిచేయడం ద్వారానే ఇలాంటి అవకాశాలు వస్తాయి. ఈ విషయాన్ని కొందరు సులభం అనుకోవచ్చు. కానీ దీనికి చాలా కృషి అవసరమ"ని అంది. ఏ పాత్రలు ఉత్సాహపరుస్తాయనే ఓ ప్రశ్నకు.. "పాత్రల కంటే నిర్మాతలు, దర్శకులే నన్ను ఉత్సాహపరుస్తారు. ఎందుకంటే నేను ఎప్పుడూ దర్శకుడి బిడ్డనే. పాత్ర, కథ గురించి తెలుసుకోకుండా.. ఏం జరుగుతుందో తెలియని చీకటి గదిలోకి వెళ్తున్న చిన్న పిల్లాడిలా నేను ఉండాలనుకుంటున్నా. నేను ఎంచుకున్న పాత్రలో సీతాకోక చిలుకలా ఎగరడం ఇష్టం.. లేకపోతే ఆ పాత్ర నా కడుపులో ఏనుగులు తొక్కుతున్న అనుభూతినైనా కలిగించాలి. ఇలాంటి పాత్రల్ని చాలా ఆస్వాదిస్తాన"ని చెప్పుకొచ్చింది అదితి.

'తుడరుమ్' హిందీ రీమేక్‌లో అజయ్?



అజయ్ దేవగణ్

ఫ్యామిలీ డ్రామాగా రూపొంది.. మంచి విజయాన్ని అందుకున్న చిత్రం 'తుడరుమ్'. తరుణ్ మూర్తి తెరకెక్కించిన ఈ సినిమా ఇటీవలే విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడీ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయనున్నట్లు తెలిపారు దర్శకుడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. "తుడరుమ్' సినిమా తెలుగు, హిందీ రీమేక్‌ల కోసం చాలా మంది నన్ను సంప్రదిస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్‌లో దీనికి సంబంధించిన పనులు మొదలయ్యాయి. కానీ కొంచెం బిజీ షెడ్యూల్ కారణంగా ఆ ప్రాజెక్టులను వెంటనే కొనసాగించలేకపోతున్నాన"ని అన్నారు. హిందీ వెర్షన్‌లో ఏ హీరోను ఎంపిక చేయాలనుకుంటున్నారనే ప్రశ్నకు సమాధానంగా "అజయ్ దేవగణ్ చాలా కష్టపడతారు" అనే సమాధానం ఇచ్చారు. దీంతో 'తుడరుమ్' హిందీ రీమేక్‌లో అజయ్ భాగం కాబోతున్నట్లు ప్రేక్షకుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి.

జ్ఞాన దీపం.. సన్మార్గ దర్శనం

జీవులు ధర్మబద్ధంగా జీవించడానికి అవరోధం ఏర్పడినప్పుడు.. భగవంతుడు అవతార పురుషుడిగా ఉద్భవిస్తాడు. దుష్టులను శిక్షిస్తాడు. అలాగే నిత్య జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను అధిగమించడానికి, స్థిరచిత్తంతో ముందుకు సాగడానికి తోడ్పడేందుకు ఆ కరుణాంతరంగుడు సద్గురువుగా అవతరిస్తాడు. ధార్మికతను ప్రబోధిస్తాడు, మోక్షేచ్ఛ కలిగిస్తాడు. అలా అవతరించిన మహాత్ముడే దత్తాత్రేయుడు.

మార్గశిర పౌర్ణమి త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడి జయంతి. అత్రి మహాముని సతీమణి అయిన అనసూయకు త్రిమూర్తులు ఇచ్చిన మాటను అనుసరించి ఆవిడ గర్భం నుంచి దత్తుడు ఉద్భవించాడు. దత్తుని జన్మదిన విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎక్కువమంది మార్గశిర పౌర్ణమినాడే పండుగ చేసుకుంటారు. 'స్మృతి కౌస్తుభం', 'మార్కండేయ పురాణం' దత్తుని గురించి అనేక విషయాలను తెలియజేస్తున్నాయి.

నారదముని తన భక్తి ప్రపత్తులతో విష్ణుమూర్తిని ప్రసన్నం చేసుకున్నాడు. మెచ్చిన విష్ణువు వరం కోరుకోమనగా.. సత్యరూపం దర్శింపచేయమని అడిగాడు నారదుడు. అప్పుడు 'బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఒకటిగా చేయగలిగితే నీ కోరిక తీరుస్తాను' అన్నాడు విష్ణుమూర్తి. వెంటనే నారదుడు భూలోకానికి బయల్దేరాడు. తన ప్రయత్నంలో భాగంగా అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్లాడు. ఆ సమయంలో ముని ఆశ్రమంలో లేడు. ఆయన సతీమణి అనసూయ ఆతిథ్యమిచ్చింది. తర్వాత నారదుడు వైకుంఠం, కైలాసం, సత్యలోకాలకు వెళ్లినప్పుడు సందర్భవశాత్తూ అనసూయ పాతివ్రత్యం గురించి చెప్పాడు. అది విన్న త్రిమూర్తులు ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించాలనుకున్నారు.

భిక్షువుల రూపంలో అత్రి మహాముని ఆశ్రమానికి వచ్చారు. తమకు ఆకలిగా ఉందని, వివస్త్రగా భోజనం వడ్డిస్తే తింటామని చెప్పారు. ఆశ్చర్యపోయిన అనసూయ ఈ విషయం భర్తకు వర్తమానించింది. మహా జ్ఞాని అయిన అత్రిముని సంగతి గ్రహించాడు. భార్యకు మంత్రోదకం ఇచ్చి వారిపై చల్లమన్నాడు. అనసూయ వారిపై మంత్రజలం చిలకరించగానే.. ఆ ముగ్గురూ ఆరు నెలల పసిబాలురుగా మారిపోయారు. అప్పుడు అనసూయ వారికి స్తన్యమిచ్చి సంతృప్తిపరిచింది. అప్పుడే ఆశ్రమానికి వచ్చిన నారదుడు త్రిమూర్తులు శిశువులుగా మారిపోవడం చూశాడు. ఆ విషయాన్ని వారి సతీమణులకు తెలియజేశాడు. వాళ్లు నారదుని వెంట ఆశ్రమానికి వచ్చారు. బాలురు క్రీడించడం చూశారు. ఆ ముగ్గురూ తమ భర్తలేనని గ్రహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను తమకు అప్పజెప్పమని అత్రిమునిని ప్రార్థించారు.

వరం కోరిన మునిపత్ని

అత్రిముని అనుజ్ఞతో ఆయన పత్ని అనసూయ.. బాలుర మీద మంత్రోదకం చల్లగానే వారు తిరిగి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా మారారు. అనసూయ పాతివ్రత్యానికి మెచ్చిన త్రిమూర్తులు ఆమెను వరం కోరుకోమన్నారు. దానికి అత్రి, అనసూయ దంపతులు త్రిమూర్తులే తమకు పుత్రుడిగా జన్మిస్తే సంతోషిస్తామని చెప్పారు. వారి ఆశీర్వాదం ఫలించి.. ఆ దంపతులకు మూడు తలలు, ఆరు చేతులతో పుత్రుడు జన్మించాడు. అతడే దత్తాత్రేయుడు. మధ్య శిరస్సు విష్ణువుది, కుడి శిరస్సు శివునిది, ఎడమ శిరస్సు బ్రహ్మది. దత్తుడి దేహంలో కుడి భాగం గురువు. ఎడమ భాగం భగవంతుడు. దత్తాత్రేయుని ఆరు చేతుల్లో- మంత్రాలకు ఆధారమైన జపమాల, సకల శాస్త్రాలకూ నిలయమైన డమరుకం, జ్ఞాన తేజస్సును ప్రసాదించే చక్రం, కమండలం, త్రిశూలం, శంఖం ఉంటాయి.

భగవంతుడు ఒక్కడే!

కలియుగానికి ముందు దత్తాత్రేయస్వామికి పదహారు అవతారాలు ఉన్నాయని వాసుదేవానంద సరస్వతీ స్వామి దత్తపురాణంలో వర్ణించాడు. దత్తుని ఉద్భవ గాథలు వివిధ రకాలుగా ప్రచారంలో ఉన్నాయి. వేద కాలంలో ఇంద్రాది దేవతలకు ప్రాధాన్యత ఉండేది. పురాణ కాలం నాటికి మూర్తిత్రయం ఏర్పడింది. ఈ ముగ్గురు మూర్తులూ భిన్నులు కాదు.. భగవంతుడు ఒక్కడే అనే వేద ప్రమాణాన్ని నిరూపించేందుకే దత్తోద్భవం జరిగింది- అంటారు ఆధ్యాత్మికవేత్తలు.

దత్తుని పాదముద్రలు

దత్తాత్రేయుడు సత్యాన్వేషణ చేసేందుకు చిన్న వయసులోనే ఇల్లు వదిలి వెళ్లాడు. ఉత్తర కర్ణాటకలో గానుగాపూర్‌గా వ్యవహరిస్తున్న పట్టణం దత్తునికి జ్ఞానోదయం కలిగిన ప్రాంతమని చెబుతారు. గుజరాత్‌లోని గిరినార్ పర్వత శిఖరంపై దత్తుని పాదముద్రలు నేటికీ దర్శనమిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

ఆ స్వామి అవతారాలే!

దత్తునికి గోవులన్నా, శునకాలన్నా మిక్కిలి ప్రేమ. వేద కాలంలో శునకాలను అదృష్ట చిహ్నాంగా భావించేవారు. దత్తుని వెంటనున్న నాలుగు శునకాలు నాలుగు వేదాలను ప్రతిబింబిస్తాయి. దత్త సంప్రదాయంలో శ్రీపాద వల్లభులు, నృసింహ సరస్వతి, అక్కల్కోటస్వామి, శ్రీ వాసుదేవానంద సరస్వతి, కృష్ణ సరస్వతి, తదితర యోగులను దత్తాత్రేయుని అవతారాలుగానే భావిస్తారు.



మేడిచెట్టు కింద కొలువయ్యాడు

దత్తాత్రేయుడు మేడిచెట్టు (ఔదుంబర వృక్షం) మొదట్లో ఉండటానికి ఇష్టపడతాడన్నది పురాణ వచనం. అందువల్లే ఈ చెట్టును భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ చెట్టు కింద కూర్చుని..

అనసూయాత్రి సంభూత దత్తాత్రేయ మహామతే
సర్వదేవాధిదేవ త్వం మమ చిత్తం స్థిరీకురు
సర్వ మంగళ మాంగళ్య సర్వాధివ్యాధి భేషజ
సర్వసంకట హరిం త్వం మమ చిత్తం స్థిరీకురు
సర్వ పాప క్షయకరః తాప దైన్య నివారణః
యోగీశ్వరః ప్రభుః స త్వం మమ చిత్తం స్థిరీకురు

అంటూ దత్తాత్రేయుని స్తుతిస్తే ఆధ్యాత్మిక ఫలితాలు ఉంటాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. యమదండనం అంటే యముడి దండాలు లేదా మరణానికి సంబంధించిన సమయం. అలాంటి విపత్తును సైతం తుడుముట్టిస్తాడని నమ్మి దత్తాత్రేయుని పూజిస్తారు.


సర్వ జీవులను ఉద్ధరించడమే అవతార లక్ష్యంగల దత్తాత్రేయుని మహిమను 'సూత్ర పారాయణ' గ్రంథంలో వర్ణించారు. సంసారసాగరంలో చిక్కుకోకుండా దైవిక గుణాలతో ఆదరించడం అవతార లక్ష్యం. ఆ స్వామి ఆదుకు ప్రబల నిదర్శనం. ఒక్క మాటలో చెప్పాలంటే.. గురువుల్లో ఉత్తమ గురువు; ఆది, మధ్యం, అంతం లేని మహా అవతార దత్తాత్రేయుడు. ఆ స్వామి జ్ఞాన దీపమై సన్మార్గాన్ని దర్శింపచేస్తాడు.

– గంటి ఉషాబాల

క్రీస్తువాణి

సమస్యలు.. పరిష్కారం..

దేవుడు అసాధ్యం అనుకున్న వాటిని సుసాధ్యం చేస్తాడు. మనం చేయలేని పనుల విషయమై దైవాన్ని ప్రార్థించాలి. ఆయన వల్ల అవి నెరవేరతాయని బలంగా విశ్వసించాలి. ఆ పనిలో విజయం చేకూరినప్పుడు ఆయనను మహిమ పరచాలి. దేవునిపై విశ్వాసం కోల్పోవడం, ఆయన మీద తిరుగుబాటు ప్రకటించడం సరికాదు. జీవితం ఒడుదొడుకుల పాలైనప్పుడు మహిమగల ప్రభువు హస్తాలకు సమస్యలను అప్పగించాలి. సందేహం లేని మనసుతో దేవుడిమీదే భారం మోపినప్పుడు ఎంత క్లిష్టమైన అంశాలైనా తేలిగ్గా పరిష్కృతమవుతాయి. ఉదాహరణకు.. ఒకసారి పొలంలో పంటను మిడతలు, పసరు పురుగులు తినేసినప్పుడు.. రైతులకు ఆ నష్టం మొత్తాన్ని తిరిగిస్తానని (యోవేలు 2:25) వాగ్దానం చేశాడు ప్రభువు. అన్నట్టుగానే ఆ నష్టాన్ని భర్తీ చేశాడు.



మరో సందర్భంలో.. ఓ ప్రభుత్వాధికారి ప్రభువు వద్దకు వచ్చి తన కుమార్తెను రక్షించమని ప్రార్థించాడు. ఏసు తన శిష్యులతో కలిసి అధికారి ఇంటికి వెళ్లాడు. ఆయన అడుగుపెట్టేసరికి ఇంటి నిండా అతడి బంధుమిత్రులున్నారు. ఆమె చనిపోయిందని విలపిస్తున్నారు. ఏసు వారిని దాటుకుంటూ లోనికి వెళ్లి 'ఆమె నిద్రిస్తోందే కానీ చనిపోలేదు' అన్నాడు. ఏసు మాటలు విని అక్కడున్న వారంతా ఆయనను అపహాస్యం చేశారు. అధికారి జనసమూహాన్ని అక్కణ్ణించి పంపించేశాడు. ఏసు ఆమెపై చెయ్యి ఉంచి ప్రార్థించాడు. ఆ బాలిక నిద్ర నుంచి మేల్కొన్నట్టుగా లేచింది. ఆ విషయం శరవేగంగా పరిసర ప్రాంతాల్లో వ్యాపించింది. అందరూ ఆశ్చర్యపోయారు. దైవాన్ని హృదయపూర్వకంగా నమ్మితే.. అద్భుతాలు జరుగుతాయని రుజువయ్యింది. తనకు అసాధ్యమైన పని అంటూ ఏమీ లేదని (యిర్మియా 32:27) స్వయంగా దేవాధిదేవుడే తెలియజేశాడు. ఇక మనకెందుకు సందేహం?!

సత్కార్యాలతో అల్లాహ్ ప్రసన్నత

ఇస్లాం సందేశం



మనం చేసే మంచి పనులు ఇహలోకంలోనూ, మరణానంతర జీవితంలోనూ కూడా చక్కటి ప్రతిఫలాలను అందిస్తాయి. అల్లాహ్‌ను సంతోషపెట్టేలా చేసే ఆరాధన, సేవా కార్యక్రమాలతో దైవ ప్రసన్నతను పొందగలగటం, ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నత హోదా వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని ఇస్లాం ధర్మం వివరిస్తోంది. మంచి పనులు స్థూలంగా రెండు రకాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా అల్లాహ్‌తో సాన్నిహిత్యం పెరుగుతుంది. ప్రాపంచిక సత్కార్యాలతో శ్రేయస్కర జీవితాన్ని గడపవచ్చు.


ఇస్లాం ధర్మానికి మూలస్తంభాలైన విశ్వాసం, ప్రార్థన, దానధర్మాలు (జకాత్), రంజాన్ మాసంలో ఉపవాసం, మక్కా యాత్ర (హజ్).. ఈ ఐదింటినీ ప్రతి ముస్లిం తప్పక ఆచరించాలి. పేదలు, అనాథలను ఆదుకోవాలి. రోగులు, వృద్ధులకు సాయం అందించాలి. కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగులతో దయతో మెలగాలి. అందరినీ చిరునవ్వుతో పలకరించాలి. అవసరమైనప్పుడు నిజాయతీగా సలహాలు ఇవ్వాలి. అనవసర వాదనలకు దూరంగా ఉండాలి. శాంతి సామరస్యాలను పెంపొందించేలా వివాదాల్లో మధ్యవర్తిత్వం వహించాలి. ఇతరులు చేసిన సత్కార్యాలను ప్రశంసించాలి. ఇలాంటి సాధారణ పనులు కూడా దైవానికి చేరువ చేస్తాయని, కష్టాలను తొలగిస్తాయని, ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ప్రతిఫలాలను అందిస్తాయని ధర్మ గ్రంథాలు పేర్కొంటున్నాయి. వీటితోపాటుగా వ్యక్తిగతంగా నీతి, నిజాయితీలతో వ్యవహరించాలి. చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలి. కష్ట సమయాల్లో సహనంతో ఉండాలి. నలుగురు నడిచే మార్గంలో ఏవైనా ఆటంకాలుంటే తొలగించాలని సూచిస్తున్నాయి.

దైవం పట్ల కృతజ్ఞత, విధేయత చూపటానికి, ఆయన ప్రసన్నతను పొందటానికి మనం చేసే మంచి పనులు ఒక మార్గం. ఎవరైతే విశ్వాసులుగా ఉంటూ సత్కార్యాలు చేపడతారో వారికి గొప్ప ప్రతిఫలాలు అందుతాయి, స్వర్గప్రాప్తి కలుగుతుంది- అన్నది అల్లాహ్ వాగ్దానం. అవి నరకాగ్నిని దూరం చేస్తాయి. 'మంచి పనులు పాప కార్యాలను తుడిచేస్తాయి' అని దివ్య ఖురాన్ పేర్కొంటోంది. విశ్వాసం, సహనంతో చేపట్టే సత్కార్యాలతో పాపాలు తొలగిపోతాయి. దైవం వద్ద విశ్వాసి స్థాయిని పెంచుతాయి. ఆధ్యాత్మిక శుద్ధికి దారితీస్తాయి. మనం చేసే ప్రతి మంచి పనితో పది నుంచి ఏడు వందల రెట్లు లేదా అంతకంటే ఎక్కువ ప్రతిఫలం చేకూరుతుంది.

సత్కార్యాలు చేసేవారు అధిక ఆశీర్వాదాలకు పాత్రులవుతారు. ఇతరులకు సాయం అందించేవారికి అల్లాహ్ నుంచి దీర్ఘాయుష్షు అనే వరం లభిస్తుంది. సామాజిక పురోభివృద్ధి సాకారమవుతుంది. మన ప్రార్థనలు ఫలించటానికి, విపత్తులు తొలగిపోవటానికి మంచి పనులు దోహదం చేస్తాయి. వృద్ధులను ఆదరించటం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించటం వంటి దయామయమైన చర్యలు శాంతియుతమైన, ప్రేమపూర్వక సమాజ నిర్మాణానికి ఉపకరిస్తాయి. అన్నిటినీ మించి కష్టకాలంలో దైవ అనుగ్రహం పొందటానికి ధర్మబద్ధమైన జీవనాన్ని మించిన మార్గం లేదు.

ఇచ్చిందే వస్తుంది!

మనకున్న అనేక ఆధ్యాత్మిక సాధనల్లో ధ్యానం ఉత్కృష్టమైంది. ధ్యాన ప్రక్రియ ద్వారా అనేక సత్ఫలితాలు అతి తక్కువ కాలంలోనే ప్రాప్తిస్తాయి. ఇది ఎందరో అనుభవపూర్వకంగా గ్రహించిన సంగతి. ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి.. ఒకరోజు ఓ వ్యక్తి రమణ మహర్షి వద్దకు వచ్చి.. 'స్వామీ, మా పక్కింటి పెద్దమనిషి తమ శునకాన్ని బయట ఆవరణలో చెట్టుకు కట్టేసి పొరుగూరు వెళ్లాడు. ఆ కుక్క అరుపులకు నాకు తెల్లవార్లూ నిద్ర కరువవుతోంది. ధ్యానం చేస్తుంటే కూడా మనసు లగ్నం కావడంలేదు. అది నిరంతరం మొరుగుతూనే ఉంటోంది' అంటూ ఫిర్యాదులా చెప్పాడు. దానికి రమణ మహర్షి ఓ క్షణం చిరునవ్వు చిందించి 'కుక్క మొరుగుడు లెక్కలోది కాదు, నీ మనసులోంచి వచ్చిన కల్లోలశబ్దమే పెద్దది. అంటే నీ ధ్యాసంతా ఆ ధ్వనిమీదే కేంద్రీకృతమైంది. శునకం గురించి విపరీతంగా ఆలోచిస్తున్నావే గానీ శ్వాసపై దృష్టి లేదు. ధ్యానం అంటే పరిసరాలను విస్మరించి నీ అంతరంగంలో ఏం జరుగుతున్నదో గమనించడం. నువ్వు అలాంటి స్థితిలో గనుక ఉంటే.. చుట్టుపక్కల నుంచి శబ్దాలు వచ్చినా.. అవి నీ లోనికి ప్రవేశించవు, నిన్ను ఇబ్బంది పెట్టవు. ధ్యానమే కాదు నిద్ర విషయం చూసినా.. నీకు చుట్టుపక్కల శబ్దాలు వినిపించినప్పటికీ వాటితో సంబంధం లేకుండా ఉండగలగాలి. అలాంటి స్థితిలోకి వెళ్లగలిగితే.. అలౌకిక స్థితి. అప్పుడిక నీకు గాఢనిద్ర పడుతుంది. మన చుట్టూ ఇబ్బందిపెట్టే శబ్దాలూ వ్యక్తులూ ఉన్నప్పటికీ.. వాటిని ఎంతమాత్రం పట్టించుకోకుండా ఏకాగ్రతతో శ్వాసను గమనించడమే ధ్యానం. కానీ నువ్వు ధ్యాన ప్రక్రియ కంటే పరధ్యాన ప్రక్రియ అవలంబించావు. కనుకనే నిద్ర కరవైంది, ధ్యానసాధన చేయలేకపోయావు. పట్టుదల, ఏకాగ్రత, కృషి ఉంటేనే ఏ దీక్షయినా సాధించగలవు. అప్పుడే అత్యున్నత శిఖరాలకు చేరగలవు, ప్రశాంతత పొందగలవు. మన జీవనకాలం అతి స్వల్పం. ఈ కొద్ది కాలంలో అభియోగాలు, ఆరోపణలు, అసూయ, ఆందోళన, స్వార్థం, ఈర్ష్యలతో కాలాన్ని వ్యర్థం చేసుకోకూడదు. అలా చేస్తే.. సమయం ఇంకా కుదించుకుని, మరింత సూక్ష్మమైపోతుంది' అన్నారు.



రమణమహర్షి అలా వివరించడంతో ఆ వ్యక్తి తన తప్పు తెలుసుకున్నాడు. జ్ఞానోదయం కలిగినట్లయింది. మనసు పక్కదారులు పట్టకుండా సాధన చేశాడు. ధ్యానంలో నిమగ్నమయ్యాడు. ఎలాంటి సందర్భంలోనైనా, సన్నివేశంలోనైనా స్థిరంగా, స్థిమితంగా ఉండాలని ఈ ఉదంతం తెలియజేస్తుంది. పక్కింటి వ్యక్తి తప్పని పరిస్థితిలో శునకాన్ని వదిలేసి వెళ్లాడని సరిపెట్టుకోవచ్చును. లేదా కాలభైరవుని వాహనమైన శునకంపట్ల వాత్సల్యాన్ని ప్రకటించవచ్చు. ప్రతి ప్రాణిలో దైవాన్ని చూడగలిగితే ఇక కోపోద్వేగాలకు చోటే లేదు. అనుక్షణం ప్రేమ, దయ, కారుణ్యం చూపుతుంటే అనంత ఆనందం మన సొంతమవుతుంది. మనం ఏది ఇస్తే.. విశ్వం నుంచి అదే కానుకగా తిరిగొస్తుందని అర్థం చేసుకుని ఆ ప్రకారం నడుచుకోవాలి.

– కె.వి.వి.సత్య ప్రసాద్

కొండంత దేవుడికి భక్తితో..

దేవుని మెడలో అలంకరించిన దండ భక్తి భావనను చాటితే.. భక్తుని మెడలో పూసల సరం నియమనిష్ఠలకు సంకేతం. చేతిలోని జపమాల మంత్ర సంఖ్యను తెలియజేస్తూనే ఏకాగ్రతను పెంచుతుంది. వివిధ దేవుళ్లకు భిన్నమైన పూజా రీతులు, రకరకాల నైవేద్యాలు ఉన్నట్టే.. దైవానికి సమర్పించే దండల్లోనూ అనేక రీతులున్నాయి.

ఏ దేవుడికైనా పూలహారం సమర్పించడం సాధారణం. అయితే.. ఒక్కో దైవానికి ఒక్కో విశిష్ట అలంకరణ ఆనవాయితీగా ఉంది. శివుని మెడలో రుద్రాక్షమాల, విష్ణువు మెడలో కౌస్తుభహారం, కృష్ణుడి కంఠసీమలో వైజయంతీ మాల ఉంటాయి. అయ్యప్ప మణిమాలతో దర్శనమిస్తాడు. సరస్వతీదేవి అక్షమాలను, పార్వతీదేవి పూసల పేరును, లక్ష్మీదేవి కాసులపేరును ధరించి కనిపిస్తారు. దేవునికి ధూపం, దీపం, నైవేద్యం, నీరాజనం తదితర పదహారు రకాల సేవలతో కూడిన షోడశోపచార పూజ చేస్తారు. అనంతరం పూలమాలలతో అలంకరిస్తారు. వాటిలో భిన్న పుష్పాలు, ఆకృతులు ఉంటాయి. తిరుమలలో వేంకటేశ్వరస్వామికి అలంకరించే పూలమాలలు ప్రత్యేకం. వివిధ సేవలలో వేర్వేరు కొలతలతో పూల దండలను అలంకరిస్తారు. వాటిలో శిఖామణి దండ, సాలిగ్రామ మాల, కంఠసరి, వక్షస్థల లక్ష్మి, శంఖుచక్రం, కఠారిసరం, తావళములు, తిరువడి దండలు మొదలైన రకాలున్నాయి.

దండకు మాల, హారం, సరం, పేరు.. అనేవి పర్యాయ పదాలు. అన్నిటినీ ఒకే అర్థంలో వాడకూడదు. అల్లిక, తయారీ, వినియోగించే తీరును బట్టి స్పష్టమైన తేడాలున్నాయి. దారాన్ని చేతితో మెలికలు తిప్పుతూ పూలను అల్లితే అది మాల. సూదితో దారానికి గుచ్చితే దండ. పూసలను దారంలో కూర్చితే సరం. వెండి బంగారాలతో తయారుచేస్తే అది హారం.

రుద్రాక్ష, తులసి, తామర, కరుంగలి, చందన పూసలతో రూపొందించే సరాలు, తావళాలు ఆధ్యాత్మికతను పెంచి పోషిస్తాయని పౌరాణిక కథలు తెలియజేస్తున్నాయి. మాలలను ధరించడం వల్ల ఆధ్యాత్మిక వృద్ధి కలుగుతుంది, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. అమంగళ దోషాలు, దృష్టి సోకడం నుంచి రక్షణ కలుగుతుంది. ఒత్తిడి, భయం, ఆందోళన తగ్గుతాయి. మానసిక స్థైర్యం పెరుగుతుంది. సూక్ష్మ దృష్టి అలవడుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది.

వినాయకుడికి ప్రీతికరమైంది చందన పూసల హారం. దీన్ని ధరిస్తే మానసిక శాంతి, సానుకూలశక్తి పెంపొందుతాయి. పరమశివుడికి ప్రీతికరమైనవి రుద్రాక్షలు. ఆయన కళ్ల నుంచి వెలువడిన అశ్రువులే రుద్రాక్షలు. వాటిని ధరించడం వల్ల ధర్మబద్ధత, ఆధ్యాత్మిక ప్రగతి, నిర్మోహం కలుగుతాయి.

తామరపువ్వులకు దిగువ భాగాన కాయల్లోని విత్తనాలు గట్టి పూసల్లా ఉంటాయి. వీటిని ధరిస్తే జ్ఞానసిద్ధి కలుగుతుంది. అంతరంగశోధన వృద్ధిచెందుతుంది. ఈ గింజల్లోని ఔషధ గుణాల వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక స్థైర్యం చేకూరుతాయి.

నల్లచేవమాను కర్రతో తయారయ్యే కరుంగలి మాలలు సుబ్రహ్మణ్య స్వామికి ప్రియమైనవని చెబుతారు. ఆ స్వామి అనుగ్రహం కోసం కరుంగలి మాలలు ధరిస్తారు. ముదిరిన తులసి మొక్కలతో రూపొందే తులసి పూసల మాలలను విష్ణు భక్తులు మెడలో ధరించడానికి, జపం చేయడానికి వినియోగిస్తారు.

అయ్యప్ప దీక్షాధారులు రుద్రాక్ష, తులసి మాలలను ధరిస్తారు. దీక్షను మాల ధారణ అంటారు. అంటే కఠినమైన వ్రతాచరణ నియమాలతో ఆధ్యాత్మిక ప్రయాణం మొదలైందని సూచించడం. స్వాతి కార్తెలో కురిసే వాన చినుకులు- ముత్యపు చిప్పల్లో చేరి.. ముత్యాలుగా రూపొందుతాయి. ఇవి చంద్రుడికి ఇష్టమైనవి.



ముత్యాలను ధరిస్తే చూపరులకు చెడు ఆలోచనలు కలగకుండా రక్షణ కలుగుతుందని పెద్దలు చెబుతారు. ముత్యాలతో మానసిక ప్రశాంతత, ఆయురారోగ్యాలు కలుగుతాయని, ప్రతికూల ఆలోచనలు తొలగి, ఏకాగ్రచిత్తం అలవడుతుందని విశ్వసిస్తారు. పెళ్లయిన స్త్రీలు ధరించే నల్లపూసలు శుభసూచకమని, పరుల దృష్టి సోకదని విశ్వసిస్తారు.

పగడాలను ధరించడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని, మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. పగడాలు శ్రేష్ఠమని, వాటిని ధరించడం వల్ల ఆపదలు, అనారోగ్యాలు తొలగుతాయని జ్యోతిష శాస్త్రం పేర్కొంది. ఆవేశం, ఆందోళన, వ్యాకులచిత్తం లాంటి బాధలను అరికట్టి సమతుల్యతను పెంపొందిస్తాయి పగడాలు.

జపమాల.. మేరువు: దైవనామాన్ని స్మరించేటప్పుడు.. జప సంఖ్యను లెక్కించడానికి ఉపయోగించే పూసల సరాలను తావళం, జపమాల అంటారు. ఇది ప్రశాంతత కలిగిస్తుంది. ఏకాగ్రత పెంచుతుంది. 54 లేదా 108 పూసలతో పాటు లెక్కలోకి రాని మరో అదనపు పూస ఉంటుంది. దీన్ని 'మేరువు' అంటారు. గుండ్రంగా తిప్పుతూ జప సంఖ్యను తెలుసుకోవడానికి తోడ్పడుతుందీ మేరువు.

పత్ర మాలికలు: దైవారాధనలో పత్రాలకూ ప్రాముఖ్యత ఉంది. తులసి, మరువం, దవనం, తమలపాకు.. ఇలా వివిధ రకాలైన ఆకులతో మాలలల్లి సమర్పిస్తారు. తులసి దళాలతో అల్లిన మాలలు విష్ణుమూర్తికి ప్రీతికరమైనవని పురాణ కథలు తెలియజేస్తున్నాయి. 'ఆముక్తమాల్యద' కావ్యానికి ఆ పేరు రావడానికి కారణం తులసి మాలలే. తాను ధరించి విడిచినది- అనేది అర్థం. తండ్రి అల్లిన తులసి మాలలను శ్రీరంగనాథునికి అలంకరించకముందే గోదాదేవి తాను ధరించి తర్వాత స్వామికి సమర్పించేది.

తమలపాకుల దండలతో ఆంజనేయస్వామిని అర్చిస్తారు. మరువం, దవనం, వంటి సుగంధ పత్రాలతోను మాలలల్లి భగవంతుని సేవలో ఉపయోగిస్తారు. ఇవే కాకుండా యాలకులు లాంటి సుగంధ ద్రవ్యాలతోనూ 'సరం' కూర్చి ఆరాధిస్తారు.

– అయ్యగారి శ్రీనివాసరావు

శ్లోకామృతం



న స్నాన మాచరేత్ భుక్త్వా నాతురో న మహానిశిః
న వాసోభి స్సహాజస్రం నా విజ్ఞాతే జలాశయే

భోజనం చేసిన తర్వాత, జ్వరం వచ్చినప్పుడు, అర్ధరాత్రి వేళ స్నానం చేయకూడదు. కట్టుబట్టలతో స్నానమాచరించకూడదు. అలాగే తెలియని జలాశయాల్లో జలకమాడకూడదు. ఇవన్నీ ప్రమాదకరమని అంతరార్థం.

విరక్తో విషయద్వేష్టా రాగీ విషయ లోలుపః
గ్రహమోక్ష విహీనస్తు న విరక్తో న రాగవాన్


ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి లేని వ్యక్తిని 'విరాగి' అంటారు. విషయ వాంఛలు గల వ్యక్తిని 'రాగి' అంటారు. నిజానికి ప్రపంచంలో మనకు కనిపించేవన్నీ మిథ్య అని తెలుసుకుని.. దేని మీదా అనురక్తి గానీ వ్యతిరేకత గానీ లేకుండా ఉండాలి. అలా జాగృతుడైన వ్యక్తి 'రాగి', 'విరాగి' అనే రెండు కోవలకూ చెందక 'జ్ఞాని' అనిపించుకుంటాడు- అనేది 'అష్టావక్ర గీత'లోని ఈ శ్లోకానికి అర్థం.

మహిమలకు ఆస్కారం లేదు..

ఒకసారి బుద్ధభగవానుడి వద్దకు ఆయన శిష్యుడు సునక్షత్రకుడు వచ్చాడు. 'తథాగతా! తమరు నాకు ఇంతవరకూ ఎటువంటి మహిమలూ, అద్భుతశక్తులూ నేర్పలేదు. నేను పేరుకు మీ శిష్యుణ్ణే కానీ.. నాకూ, సామాన్య ప్రజలకూ ఎంతమాత్రం తేడా కనిపించడం లేదు. ఇది నాకు నచ్చలేదు. ఇక మీదట నేను మీ శిష్యుడిగా కొనసాగదలచలేదు. మీరు అనుమతి ఇస్తే నేను ఇక్కణ్ణించి వెళ్లిపోవాలనుకుంటున్నాను' అన్నాడు స్థిరమైన స్వరంతో.

'సునక్షత్రకా! నిన్ను శిష్యుడిగా చేరమని నేను కోరలేదు. నీకు మహిమలూ, అద్భుతాలూ నేర్పుతానని నేనెన్నడూ వాగ్దానం చేయలేదు. నువ్వే స్వచ్ఛందంగా వచ్చి శిష్యుడిగా చేరావు. కాబట్టి ఈ విషయంలో నీకు నా అనుమతి అవసరం లేదు. అయితే నువ్వు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నీ అవివేకం బయటపడింది. ఎందుకంటే ఒకప్పుడు నువ్వు అందరి ఎదుటా నన్నెంతగానో ప్రశంసించావు. ఎన్నోసార్లు బౌద్ధధర్మాన్ని కీర్తించావు, భిక్షువులను అభినందించావు. అటువంటి నువ్వు ఇప్పుడు బౌద్ధధర్మాన్ని తప్పుపడుతున్నావు. అందువల్ల బౌద్ధధర్మానికి వచ్చే నష్టం ఏమీ లేదు, అది నీకే హానికరం. ఎలాగంటే, నువ్వు నా దగ్గర శీలవంతమైన జీవనం గడపలేక ఇక్కణ్ణించి వెళ్లిపోయావని లోకం పరిగణిస్తుంది. బౌద్ధ నియమ నిబంధనలను అనుసరించడంలో నువ్వు విఫలమయ్యావని ప్రజలు భావిస్తారు. ధార్మిక జీవనానికి కట్టుబడి ఉండలేక పతనమయ్యావనే నింద వస్తుంది నీకు' అన్నాడు. సునక్షత్రకుడికి తన తొందరపాటుతనం తెలిసొచ్చింది. క్షమించమని అడిగి.. తల వంచుకుని అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

మర్నాడు బుద్ధభగవానుడు అనుప్రియపట్టణానికి వెళ్లాడు. అక్కణ్ణించి సమీపంలోనే ఉన్న భార్గవుని ఆశ్రమాన్ని సందర్శించాడు. ఆ సందర్భంలో బుద్ధుడు- తనకూ సునక్షత్రకుడికీ మధ్య జరిగిన సంభాషణ గురించి భార్గవుడితో పంచుకున్నాడు. శిష్యుడి ఆలోచన సవ్యంగా లేనప్పటికీ బుద్ధుడి సమాధానం విని తన తప్పును గ్రహించినందుకు సంతోషించాడు భార్గవుడు. బౌద్ధం ధర్మమే ఇరుసుగా మనుగడ సాగిస్తుంది. మహిమలూ శక్తులకు ఆస్కారం లేదు. ఎవరికి వారు ధర్మబద్ధంగా నడచుకుంటే.. లోకం సవ్యంగా సాగుతుంది- అన్నది బుద్ధుని విశ్వాసం. అదే బోధించాడాయన. తాను మార్గదాతనే గానీ మోక్షదాతను కానని బుద్ధుడు ఆదిలోనే చెప్పాడు.




మార్‌క్రమ్ 110

వేదిక మారినా భారత బ్యాటర్లు జోరు తగ్గలేదు. విరాట్ కోహ్లి మళ్లీ సెంచరీ కొట్టాడు. రుతురాజ్ సైతం శతకం అందుకున్నాడు. రాహుల్ మరోసారి మెరుపులు మెరిపించాడు. రాంచిలో కంటే 9 పరుగులు ఎక్కువే చేసింది టీమ్‌ఇండియా. కానీ ఏం లాభం? అనుకూలించని పిచ్‌పై బౌలర్లు మరోసారి నిరాశపరచగా.. ఫీల్డింగ్ వైఫల్యం కూడా తోడవడంతో ఈసారి భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలి వన్డేలో 349 స్కోరు చేసి కూడా అతి కష్టం మీద గెలిచిన టీమ్‌ఇండియా.. ఈసారి 358 పరుగులను కూడా కాపాడుకోలేకపోయింది. మార్‌క్రమ్, బ్రెవిస్, బ్రీజ్కే మెరుపులతో దక్షిణాఫ్రికా రెండో వన్డేలో గెలిచి, సిరీస్ ఫలితాన్ని వైజాగ్‌కు మళ్లించింది.

- కోహ్లి, రుతురాజ్ శతకాలు వృథా
- చెలరేగిన మార్‌క్రమ్, బ్రెవిస్, బ్రీజ్కే
- రెండో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం

358.. సరిపోలేదు

84 కోహ్లి అంతర్జాతీయ శతకాల సంఖ్య. వన్డేల్లో అతడికిది 53వ సెంచరీ.

రాయ్‌పుర్

తొలి వన్డేలో పోరాడి ఓడిన దక్షిణాఫ్రికా.. రెండో వన్డేలో విజయం సాధించింది. రాయ్‌పుర్‌లో బుధవారం ఆ జట్టు 4 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. విరాట్ కోహ్లి (102; 93 బంతుల్లో 7×4, 2×6) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సెంచరీ చేయడం, రుతురాజ్ గైక్వాడ్ (105; 83 బంతుల్లో 12×4, 2×6) వన్డేల్లో తొలి శతకాన్నందుకోవడం, కెప్టెన్ కేఎల్ రాహుల్ (66 నాటౌట్; 43 బంతుల్లో 6×4, 2×6) కూడా జోరు కొనసాగించడంతో మొదట భారత్ 5 వికెట్లకు 358 పరుగులు చేసింది. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మార్‌క్రమ్ (110; 98 బంతుల్లో 10×4, 4×6) శతకానికి.. డెవాల్డ్ బ్రెవిస్ (54; 34 బంతుల్లో 1×4 5×6), మాథ్యూ బ్రీజ్కే (68; 64 బంతుల్లో 5×4) అర్ధసెంచరీలు తోడవడంతో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కార్బిన్ బోష్ (29 నాటౌట్; 15 బంతుల్లో 4×4) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అర్ష్‌దీప్ (2/54) మినహా భారత బౌలర్లు తేలిపోయారు. నిర్ణయాత్మక మూడో వన్డే శనివారం వైజాగ్‌లో జరుగుతుంది.

రెచ్చిపోయిన మార్‌క్రమ్: తొలి వన్డేలో 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పటికీ.. 350 లక్ష్యానికి చేరువగా వెళ్లింది సఫారీ జట్టు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ మార్‌క్రమ్ బలమైన పునాది వేయడంతో ఆ జట్టు ఛేదన తేలికైపోయింది. డికాక్ (8) త్వరగా ఔటైనప్పటికీ.. మార్‌క్రమ్ చెలరేగిపోయాడు. పేసర్లు స్పిన్నర్లు అని తేడా లేకుండా భారత బౌలర్లను అతను అలవోకగా ఎదుర్కొన్నాడు. ఫోర్లు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 53 పరుగులపై ఉండగా మార్‌క్రమ్ క్యాచ్‌ను బౌండరీ వద్ద యశస్వి జైస్వాల్ వదిలేయడంతో భారత్ భారీ మూల్యమే చెల్లించుకుంది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ పేలవం. ఫీల్డర్ల తప్పిదాలతో 30కి పైగా అదనపు పరుగులు వచ్చాయి. కెప్టెన్ బవుమా (46; 48 బంతుల్లో 3×4, 1×6) నుంచి మార్‌క్రమ్‌కు చక్కటి సహకారం అందడంతో 20 ఓవర్లకు 118/1తో దక్షిణాఫ్రికా పటిష్ట స్థితిలో నిలిచింది. రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యం (101) నెలకొల్పాక తర్వాతి ఓవర్లో బవుమా ఔటయ్యాడు. అయినా దక్షిణాఫ్రికాకు ఇబ్బంది లేకపోయింది. గత మ్యాచ్‌లో అర్ధసెంచరీ సాధించిన బ్రీజ్కే.. జోరు కొనసాగిస్తూ, మార్‌క్రమ్‌కు అండగా నిలవడంతో లక్ష్యం దిశగా ఆ జట్టు దూసుకెళ్లింది. 88 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన మార్‌క్రమ్ 30వ ఓవర్ (హర్షిత్ రాణా) చివరి బంతికి ఔటయ్యాడు. అప్పటికి స్కోరు 197/3. ఈ దశలో చకచకా రెండు వికెట్లు తీస్తే మ్యాచ్ భారత్ చేతికి వచ్చేదే. కానీ బ్రీజ్కే, బ్రెవిస్ ఆ అవకాశం ఇవ్వలేదు. ఓ ఎండ్‌లో బ్రీజ్కే నిలకడగా ఆడుతుంటే.. క్రీజులో నిలదొక్కుకున్నాక బ్రెవిస్ తనదైన శైలిలో సిక్సర్లతో రెచ్చిపోయాడు. 10కి పైగా ఉన్న సాధించాల్సిన రన్‌రేట్‌ను అతనే అదుపులోకి తెచ్చాడు. అతను 5 బంతుల్లో 3 సిక్సర్లు బాదడంతో సమీకరణం 58 బంతుల్లో 70తో తేలికైపోయింది. ఈ దశలో బ్రెవిస్‌ను కుల్‌దీప్ ఔట్ చేసినా.. తర్వాత బ్రీజ్కే, యాన్సెన్ (2) స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. జోర్జి (17) తొడకండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినా.. భారత్ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది. తొలి వన్డేలో జట్టును గెలిపించడానికి విఫలయత్నం చేసిన కార్బిన్ బోష్.. ఈసారి దక్షిణాఫ్రికాను గెలిపించే మైదానాన్ని వీడాడు.

కోహ్లి జోరు.. రుతురాజ్ దూకుడు: ఇంతకుముందు రాయ్‌పుర్‌లో జరిగిన ఏకైక వన్డేలో న్యూజిలాండ్ కేవలం 108 పరుగులకే కుప్పకూలింది. బుధవారం మ్యాచ్‌కు కూడా పిచ్ బౌలర్లకు అనుకూలంగా ఉండొచ్చన అంచనాలుండగా.. అందుకు భిన్నంగా స్పందించింది ఇక్కడి వికెట్. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్లను త్వరగానే కోల్పోయినా.. కోహ్లి, రుతురాజ్, కేఎల్ రాహుల్‌ల జోరుతో మరోసారి భారీ స్కోరు సాధించింది. అయితే ఉన్నంతసేపు యశస్వి, రోహిత్ ఆత్మవిశ్వాసంతో ఆడారు. చకచకా మూడు ఫోర్లు కొట్టి ఊపుమీద కనిపించిన రోహిత్ (14)ను అయిదో ఓవర్లో బర్గర్ ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు తొలి వికెట్ అందించాడు. కాసేపటికే యశస్వి (22; 38 బంతుల్లో 2×4, 1×6)ను యాన్సెన్ పెవిలియన్ చేర్చాడు. 10 ఓవర్లలోపే భారత్ ఓపెనర్లను కోల్పోయినప్పటికీ.. స్కోరు 60 దాటిపోయింది. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను కోహ్లి, రుతురాజ్ నడిపించారు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన కోహ్లి ఆ ఊపును కొనసాగించగా.. రాంచిలో 8 పరుగులకే ఔటైన రుతురాజ్ ఈసారి నిలిచి తీరాలనే పట్టుదలతో ఆడాడు. ఎంగిడి బౌలింగ్‌లో పుల్ షాట్ సిక్సర్‌తో విరాట్ తన పరుగుల ఖాతాను తెరవడం విశేషం. ఆ తర్వాత అతను ఆచితూచి షాట్లు ఆడాడు. రుతురాజ్ సైతం సమయోచితంగా బ్యాటింగ్ చేశాడు. ఇద్దరూ చక్కగా స్ట్రైక్ రొటేట్ చేస్తూ.. వీలు చిక్కినపుడల్లా షాట్లు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వికెట్ల మధ్య ఈ ఇద్దరూ పరుగులు తీసిన తీరు అమోఘం. 37 ఏళ్లు పూర్తయినప్పటికీ.. కుర్రాడైన రుతురాజ్‌ను మించి వేగం చూపించాడు కోహ్లి. గత మ్యాచ్‌లో మాదిరి అతడి ఇన్నింగ్స్‌లో బౌండరీలు ఎక్కువ లేవు. 7 ఫోర్లు, 2 సిక్సర్లు బాదాడు. 102 పరుగుల తన ఇన్నింగ్స్‌లో 45 సింగిల్స్ ఉండడం విశేషం. స్ట్రెయిట్ బ్యాట్‌తో చక్కటి కవర్ డ్రైవ్‌లు ఆడిన కోహ్లి.. కొన్ని లాఫ్టెడ్ షాట్లతోనూ ఆకట్టుకున్నాడు. మరోవైపు రుతురాజ్.. వికెట్‌కు నలువైపులా షాట్లు కొట్టాడు. యాన్సెన్ బౌలింగ్‌లో అతను ఫైన్ లెగ్‌లో కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్. అతడి డ్రైవ్‌లు కూడా ఆకట్టుకున్నాయి. కోహ్లి కంటే ఆలస్యంగా క్రీజులో వచ్చినప్పటికీ.. అతనే ముందు అర్ధశతకం (52 బంతుల్లో) పూర్తి చేశాడు. ఈ మార్కును అందుకున్నాక అతను చెలరేగిపోయాడు. ఇంకో 25 బంతుల్లోనే శతకాన్ని చేరుకున్నాడు. తర్వాత వెంటనే ఔటైపోయాడు. దీంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి 195 పరుగుల వద్ద తెరపడింది. 47 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన కోహ్లి.. 90 బంతుల్లో సెంచరీ మార్కును అందుకున్నాడు. కాసేపటికే అతనూ ఔటైపోయాడు. కెప్టెన్ రాహుల్ గత మ్యాచ్‌లో మాదిరే చివరి ఓవర్లలో చెలరేగి ఆడి అర్ధశతకాన్నందుకున్నాడు. జడేజా (24 నాటౌట్) అండతో స్కోరును 350 దాటించాడు.


రుతురాజ్ 105

1 రుతురాజ్‌కు వన్డేల్లో ఇదే తొలి సెంచరీ. అతడికిది ఎనిమిదో వన్డే. రుతురాజ్ టీ20ల్లో ఇప్పటికే ఓ శతకం సాధించాడు.


కోహ్లి 102

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) బోష్ (బి) యాన్సెన్ 22; రోహిత్ (సి) డికాక్ (బి) బర్గర్ 14; కోహ్లి (సి) మార్‌క్రమ్ (బి) ఎంగిడి 102; రుతురాజ్ (సి) డోర్జి (బి) యాన్సెన్ 105; రాహుల్ నాటౌట్ 66; సుందర్ రనౌట్ 1; జడేజా 24 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 24 **మొత్తం:** (50 ఓవర్లలో 5 వికెట్లకు) **358; వికెట్ల పతనం:** 1-40, 2-62, 3-257, 4-284, 5-289; **బౌలింగ్:** బర్గర్ 6.1-0-43-1; ఎంగిడి 10-1-51-1; యాన్సెన్ 10-0-63-2; కేశవ్ 10-0-70-0; బోష్ 8-0-79-0; మార్‌క్రమ్ 5.5-0-48-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 110; డికాక్ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 8; బవుమా (సి) హర్షిత్ (బి) ప్రసిద్ధ్ 46; బ్రీజ్కే ఎల్బీ (బి) ప్రసిద్ధ్ 68; బ్రెవిస్ (సి) యశస్వి (బి) కుల్‌దీప్ 54; జోర్జి రిటైర్డ్ హర్ట్ 17; యాన్సెన్ (సి) రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 2; బోష్ నాటౌట్ 29; కేశవ్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (49.2 ఓవర్లలో 6 వికెట్లకు) **362; వికెట్ల పతనం:** 1-26, 2-127, 3-197, 4-289, 5-317, 6-322; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-0-54-2; హర్షిత్ రాణా 10-0-70-1; ప్రసిద్ధ్ 8.2-0-85-2; సుందర్ 4-0-28-0; జడేజా 7-0-41-0; కుల్‌దీప్ 10-0-78-1

359 ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఛేదించిన పరుగులు. భారత్‌లో ఇది అయిదో అత్యధిక వన్డే ఛేదన. మొత్తంగా ఈ ఫార్మాట్లో 13వది.


బౌండరీ వద్ద తిలక్ వర్మ అద్భుత ఫీల్డింగ్ విన్యాసం. మార్‌క్రమ్ క్యాచ్ అందుకున్న అతడు బౌండరీ ఆవల పడే సమయంలో బంతిని మైదానంలోకి విసిరాడు.

టాస్.. నంబర్ 20

వన్డేల్లో టాస్‌లు ఓడిపోవడంలో టీమ్‌ఇండియా రికార్డు.. భవిష్యత్తులో కూడా ఇంకెవ్వరూ అందుకోలేని స్థాయికి వెళ్తోంది. కెప్టెన్లు మారుతున్నా.. ఈ విషయంలో ఫలితం మాత్రం మారడం లేదు. బుధవారం నాటి మ్యాచ్‌తో కలిపి వన్డేల్లో వరుసగా భారత్ టాస్ కోల్పోవడం 20వ సారి కావడం విశేషం. చివరగా 2023 వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచింది. ఆ తర్వాత ఇప్పటిదాకా ఈ ఫార్మాట్లో టీమ్‌ఇండియాకు టాస్ కలిసి రాలేదు. వరుసగా టాస్‌లు కోల్పోవడంలో గత రికార్డు నెదర్లాండ్స్ పేరిట ఉంది. ఆ జట్టు 2011-13 మధ్య వరుసగా 11 టాస్‌లు ఓడి రికార్డు నెలకొల్పింది. రోహిత్ సారథ్యంలో భారత్ ఈ రికార్డును బద్దలు కొట్టింది. రెండు నెలల కిందట ఆస్ట్రేలియా పర్యటనకు రోహిత్ స్థానంలో శుభ్‌మన్ గిల్ కెప్టెన్ అయ్యాడు. ఆ సిరీస్‌లోనూ టాస్‌ల పరాజయ పరంపర ఆగలేదు. గాయం కారణంగా శుభ్‌మన్ ప్రస్తుత సిరీస్‌కు దూరం కాగా.. కేఎల్ రాహుల్ జట్టును నడిపిస్తున్నాడు. అతను కూడా తొలి రెండు వన్డేల్లో టాస్ గెలవలేకపోయాడు.

ఓవల్ ఇన్విన్సిబుల్స్ ఇక ఎంఐ లండన్

లండన్: ద హండ్రెడ్ ఫ్రాంఛైజీ ఓవల్ ఇన్విన్సిబుల్‌ను ఇకపై ఎంఐ (ముంబయి ఇండియన్స్) లండన్‌గా పిలుస్తారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, సర్రే కౌంటీ క్రికెట్ క్లబ్ బుధవారం తమ భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఫ్రాంఛైజీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 49 శాతం కొనుగోలు చేసింది. మిగతా 51 శాతం వాటా సర్రేది. "ఒప్పందంలో భాగంగా 2026 నుంచి ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్లను ఇకపై ఎంఐ లండన్‌గా పిలుస్తారు" అని సర్రే, రిలయన్స్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఐపీఎల్ ఫ్రాంఛైజీ ..ముంబయి ఇండియన్స్‌కు రిలయన్స్ యజమాని అన్న సంగతి తెలిసిందే.


కోహ్లి @ 4

దుబాయ్: అద్భుత ఫామ్‌లో ఉన్న భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఒక ర్యాంకు మెరుగై నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అగ్రశ్రేణి బ్యాటర్ రోహిత్‌శర్మ నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ 5, శ్రేయస్ అయ్యర్ 9, కేఎల్ రాహుల్ 14వ స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ 6, రవీంద్ర జడేజా 14, మహ్మద్ సిరాజ్ 16వ ర్యాంకుల్లో నిలిచారు.

హాకీలో భారత్‌కు ఓటమి

శాంటియాగో: మహిళల హాకీ జూనియర్ ప్రపంచకప్‌లో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. బుధవారం 1-3తో జర్మనీ చేతిలో పరాజయంపాలైంది. హినా బనో భారత జట్టు తరపున ఏకైక గోల్ చేసింది. లీనా (5వ నిమిషం), అనిక (52వ), మార్టినా (59వ) జర్మనీని గెలిపించారు. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్.. నమీబియాను ఓడించింది.

క్రికెట్‌కు మోహిత్ శర్మ గుడ్‌బై


మోహిత్ శర్మ

దిల్లీ: భారత వెటరన్ మీడియం పేసర్ మోహిత్ శర్మ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అన్ని రకాల క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు బుధవారం ప్రకటించాడు. 37 ఏళ్ల మోహిత్.. టీమ్ ఇండియా తరఫున 26 వన్డేలు, 8 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 31 వికెట్లు, టీ20ల్లో 8 వికెట్లు పడగొట్టాడు. 2015 వన్డే ప్రపంచకప్‌లో పోటీపడ్డ భారత జట్టులో మోహిత్ సభ్యుడు. ఐపీఎల్‌లో అతడు చెన్నై, పంజాబ్, దిల్లీ క్యాపిటల్స్, గుజరాత్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 120 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 134 వికెట్లు చేజిక్కించుకున్నాడు.


జెర్సీని ఆవిష్కరిస్తున్న తిలక్ వర్మ, రోహిత్ శర్మ

టీ20 ప్రపంచకప్‌లో ఈ జెర్సీతో...

రాయ్‌పుర్: వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు జెర్సీని సిద్ధం చేశారు. ఇక్కడ బుధవారం దక్షిణాఫ్రికాతో రెండో వన్డే సందర్భంగా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తిలక్ వర్మ జెర్సీని ఆవిష్కరించారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగుతుంది. పాకిస్థాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియాతో పాటు భారత్ గ్రూప్ 'ఏ'లో ఉంది. ఫిబ్రవరి 7న అమెరికాతో పోరుతో టీమ్‌ఇండియా టైటిల్ వేట మొదలవుతుంది.


గిల్

దక్షిణాఫ్రికాతో టీ20లకు భారత జట్టు ఎంపిక

గిల్, హార్దిక్ వచ్చేశారు..

రాయ్‌పుర్: టీ20ల్లో టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టులోకి వచ్చాడు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా పునరాగమనం చేశాడు. గాయాల నుంచి కోలుకున్న ఈ ఆటగాళ్లకు దక్షిణాఫ్రికాతో జరగబోయే అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో చోటు లభించింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు సందర్భంగా గాయపడ్డ గిల్.. ఆ సిరీస్‌తో పాటు, వన్డే సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. మెడ గాయం నుంచి కోలుకున్న అతడు ఇప్పుడు టీ20 జట్టు వైస్‌కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. అయితే అతడు తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సివుంటుందని బీసీసీఐ తెలిపింది. మరోవైపు ముస్తాక్ అలీ ట్రోఫీలో మ్యాచ్ ఆడడం ద్వారా హార్దిక్ ఇప్పటికే తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. గాయం వల్ల 2025 ఆసియాకప్ ఫైనల్లో ఆడలేకపోయిన హార్దిక్.. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనకు కూడా దూరమయ్యాడు. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ బుధవారం జట్టును ఎంపిక చేసింది. దక్షిణాఫ్రికాతో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఈ నెల 9న కటక్‌లో ఆరంభమవుతుంది. రెండో టీ20 11న చండీగఢ్‌లో జరుగుతుంది. తర్వాతి మ్యాచ్‌లకు ధర్మశాల (డిసెంబరు 14), లఖ్‌నవూ (17), అహ్మదాబాద్ (19) ఆతిథ్యమిస్తాయి.

భారత టీ20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజు శాంసన్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, కుల్‌దీప్, హర్షిత్, వాషింగ్టన్ సుందర్.

ఇంగ్లాండ్.. పుంజుకుంటుందా?

ఆస్ట్రేలియాతో యాషెస్ రెండో టెస్టు నేటి నుంచే

ఉ.9.30 నుంచి


స్టోక్స్

బ్రిస్బేన్: పెద్దగా అంచనాల్లేకుండా అయిదు టెస్టుల యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లింది ఇంగ్లాండ్. బౌలర్ల జోరుతో రెండు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో.. మూడు ఇన్నింగ్స్‌లు అయ్యే వరకు ఆ జట్టుకు మెరుగైన అవకాశాలే కనిపించాయి. కానీ నాలుగో ఇన్నింగ్స్‌లో ట్రావిస్ హెడ్ మెరుపు ఇన్నింగ్స్‌తో అంతా మారిపోయింది. ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పలేదు. యాషెస్‌ను పర్యాటక జట్టు ఓటమితో ఆరంభిస్తే పుంజుకోవడం చాలా కష్టమే. మరి బ్రిస్బేన్ వేదికగా గురువారం ఆరంభమయ్యే రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఎలా ఆడుతుందో చూడాలి. గులాబి బంతితో జరిగే డే/నైట్ టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియానే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌లోనూ స్టీవ్ స్మితే ఆసీస్‌ను నడిపించనున్నాడు. గాయపడ్డ ఖవాజా స్థానంలో జోష్ ఇంగ్లిష్ తుది జట్టులోకి వస్తాడు. మరోవైపు ఇంగ్లాండ్.. గాయంతో మ్యాచ్‌కు దూరమైన మార్క్ వుడ్ స్థానంలో ఆల్‌రౌండర్ విల్ జాక్స్‌ను ఆడించనుంది.


ఇషా సింగ్

షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్స్‌కు ఇషా

దోహా: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ బరిలో దిగనుంది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో సత్తాచాటి సీజన్‌ను ఘనంగా ముగించాలని ఇషా భావిస్తోంది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతకాల విజేత మను బాకర్ సహా 14 మంది అత్యుత్తమ భారత షూటర్లు ఈ పోటీల్లో తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. పురుషుల విభాగంలో సామ్రాట్ రాణా, వరుణ్ తోమర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్), రుద్రాంక్ష్ పాటిల్, అర్జున్ బబుతా (10 మీ ఎయిర్ రైఫిల్), అనీష్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ (25 మీ ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), ఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్ (50 మీ రైఫిల్ 3 పొజిషన్), జొరావర్ సంధూ (ట్రాప్).. మహిళల్లో సురుచి సింగ్, మను బాకర్, ఇషా సింగ్ (10 మీ ఎయిర్ పిస్టల్), ఇలవెనిల్ వలరివన్ (10 మీ ఎయిర్ రైఫిల్), మను బాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్, ఇషా సింగ్ (25 మీ పిస్టల్), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీ రైఫిల్ 3 పొజిషన్)లు భారత్ తరఫున బరిలో ఉన్నారు. ప్రతి విభాగంలో ప్రపంచంలోని టాప్-12 క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటారు.


అర్జున్


ఆనంద్‌ను ఓడించిన అర్జున్

జెరూసలెం: భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి జెరూసలెం మాస్టర్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఫైనల్లో అతడు చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌పై విజయం సాధించాడు. తొలుత రెండు ర్యాపిడ్ గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాత మొదటి బ్లిట్జ్ గేమ్‌లో ఆనంద్‌పై అర్జున్ నెగ్గాడు. రెండో బ్లిట్జ్ గేమ్ డ్రాగా ముగియడంతో పోరులో అర్జున్ విజేతగా నిలిచాడు.

హర్షిత్‌కు ఐసీసీ మందలింపు

దుబాయ్: దక్షిణాఫ్రికాతో మొదటి వన్డేలో దుందుడుకు ప్రవర్తనకు గాను భారత పేసర్ హర్షిత్ రాణాపై ఐసీసీ చర్యలకు ఉపక్రమించింది. రాణాను మందలించిన ఐసీసీ.. అతనికి ఒక అయోగ్యత పాయింటును కేటాయించింది. ఆదివారం రాంచీలో జరిగిన ఈ మ్యాచ్‌లో డివాల్డ్ బ్రెవిస్‌ను ఔట్ చేసిన రాణా అతనికి డ్రెస్సింగ్ రూమ్ చూపిస్తున్నట్లుగా సంజ్ఞ చేశాడు. ఆటగాళ్ల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు గాను అతనిపై ఐసీసీ చర్యలు తీసుకుంది.

అందుకే హరేంద్ర రాజీనామా


హరేంద్ర సింగ్

దిల్లీ: భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ ఆకస్మిక రాజీనామా వెనుక కారణాలు వెలుగులోకి వస్తున్నాయి. హరేంద్ర కాలం చెల్లిన వ్యూహాలు. . నియంతృత్వ వ్యవహార శైలిపై క్రీడాకారిణుల వరుస ఫిర్యాదులు అతని రాజీనామాకు దారితీసినట్లు తెలుస్తోంది. 2024 ఏప్రిల్‌లో చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన హరేంద్ర.. సోమవారం తన పదవికి రాజీనామా చేశాడు. అతడి నియంతృత్వ వైఖరి, శిక్షణ పద్ధతులు, క్షీణిస్తున్న జట్టు ప్రదర్శన గురించి హాకీ ఇండియా, సాయ్ టాప్స్, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు క్రీడాకారిణులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై స్పందించిన క్రీడా శాఖ.. తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా హాకీ ఇండియాను ఆదేశించింది. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, కార్యదర్శి భోలానాథ్ సింగ్ స్వయంగా బెంగళూరులోని శిక్షణ శిబిరంలో క్రీడాకారిణులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. అందరూ ప్రతికూలమైన అభిప్రాయాలు వెల్లడించడంతో హరేంద్ర రాజీనామా అనివార్యమైంది.

కివీస్‌కు ఆధిక్యం


డఫీ

క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్): వెస్టిండీస్‌తో తొలి టెస్టులో న్యూజిలాండ్‌కు ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 231/9తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ మరో మూడు బంతులాడి అదే స్కోరు వద్ద ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ తడబడింది. జాకబ్ డఫీ (5/34), మ్యాట్ హెన్రీ (3/43), జాక్ ఫౌక్స్ (2/32) దెబ్బకు విండీస్ 75.4 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది. తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (52; 169 బంతుల్లో 3×4), షై హోప్ (56; 107 బంతుల్లో 4×4) అర్ధ సెంచరీలతో రాణించారు. 64 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్ బుధవారం ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 32 పరుగులు సాధించింది. ప్రస్తుతం కివీస్ ఖాతాలో 96 పరుగులు ఉండగా.. కెప్టెన్ టామ్ లేథమ్ (14 బ్యాటింగ్), డెవాన్ కాన్వే (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ ఎకానమీ

1. ఆర్థిక మాంద్యంతో ఏర్పడే నిరుద్యోగితను ఎలా పిలుస్తారు?
   1) అల్ప ఉద్యోగిత 2) చక్రీయ నిరుద్యోగిత
   3) వ్యవస్థాపరమైన నిరుద్యోగిత
   4) రుతుసంబంధ నిరుద్యోగిత
2. వెనుకబడిన ప్రాంతాల్లో 120 రోజుల్లో ఉపాధి పెంచే జవహర్ రోజ్‌గార్ యోజన (జేఆర్‌వై)ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   1) 1986 2) 1975 3) 1989 4) 2000
3. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్ఆర్ఈపీ)ని ఏ పంచవర్ష ప్రణాళికలో అమలుచేశారు?
   1) 6వ 2) 7వ 3) 8వ 4) 9వ
4. ఎంజీఎన్ఆర్ఈజీఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఎంత శాతం సామగ్రి ఖర్చును భరిస్తుంది?
   1) 100% 2) 75% 3) 50% 4) 25%
5. భారతదేశంలో నిరుద్యోగ గణాంకాలను కింది ఏ ఏజెన్సీ అందిస్తుంది?
   1) జాతీయ నమూనా సర్వే సంస్థ
   2) డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్
   3) భారతదేశ జనాభా లెక్కల నివేదికలు
   4) పైవన్నీ
6. 'ఉదీయమాన్ స్వనిర్భర్ కర్మసంస్థాన్ ప్రకల్ప్ (యూఎస్‌కేపీ)' పేరిట స్వయం ఉపాధి పథకాన్ని ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది?
   1) తెలంగాణ 2) మహారాష్ట్ర
   3) రాజస్థాన్ 4) పశ్చిమ బెంగాల్

సమాధానాలు: 1-2, 2-3, 3-1, 4-2, 5-4, 6-4.

ఓజోన్ సంరక్షణకు సంకల్పం!

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

సూర్యుడి నుంచి వచ్చే హానికర రేడియేషన్‌ను అడ్డుకుంటూ భూమిపై జీవాన్ని ఓజోన్ పొర రక్షిస్తోంది. మానవ కార్యకలాపాలతో విడుదలయ్యే హాలోకార్బన్‌లు తదితర రసాయనాలు ట్రోపో ఆవరణంలోని ఆ పొరను ఛిద్రం చేస్తున్నాయి. పర్యావరణానికి కవచం లాంటి ఓజోన్ పొరను కాపాడటానికి కుదిరిన అంతర్జాతీయ ఒప్పందమే మాంట్రియల్ ప్రొటోకాల్. దీని అమలుకు ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపై నిలవడంతో అత్యంత విజయవంతమైన పర్యావరణ ఒప్పందంగా నిలిచింది. దాని పూర్వాపరాలు, అందులోని ముఖ్య నిబంధనలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి, దశలవారీగా నిర్దేశించుకుంటున్న లక్ష్యాలు, జరుగుతున్న సవరణల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒప్పందం అమలులో భారతదేశానికి ఉన్న నిబద్ధత, ఉద్గారాల తగ్గింపునకు అమలు చేస్తున్న కార్యక్రమాలనూ తెలుసుకోవాలి.

మాంట్రియల్ ప్రొటోకాల్

మాంట్రియల్ ప్రొటోకాల్ అనేది ఓజోన్‌ను క్షీణింపజేసే పదార్థాల ఉత్పత్తి, వినియోగం, ఉద్గారాలను నియంత్రించే బహుళ - పార్శ్వ ఒప్పందం. అంతర్జాతీయ పర్యావరణ సదస్సులు, ప్రొటోకాల్‌లో ఒక ముఖ్యమైన భాగం. 1987లో దీనిపై ప్రపంచ దేశాలు సంతకం చేయగా, 1989లో అమల్లోకి వచ్చింది. ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, ఏరోసోల్ డబ్బాల్లో ఉపయోగించే రసాయన పదార్థాలు ఓజోన్ పొరకు హాని కలిగిస్తున్నాయని 1970 చివరి నాటికి శాస్త్రవేత్తలు నిరూపించగలిగారు. అంటార్కిటికాపై ఓజోన్ పొరలో 1985లో భారీ రంధ్రాన్ని కనుక్కున్నారు. ఈ రంధ్రం వల్లే ప్రమాదకర స్థాయిలో అతినీలలోహిత రేడియేషన్ భూ ఉపరి తలాన్ని చేరుతోంది.



1987లో మాంట్రియల్‌లో జరిగిన సమావేశంలో వివిధ దేశాల ప్రతినిధులు

మాంట్రియల్‌ప్రొటోకాల్ దశల వారీగా, కాలపరిమితితో ఓజోన్ క్షీణింపజేసే పదార్థాల (ఓడీఎస్) వాడకాన్ని తగ్గిస్తుంది. ఇది అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలకు వేర్వేరు కాలపట్టికలను నిర్దేశిస్తుంది. 197 దేశాలు ఆమోదించాయి. ఇది ప్రపంచంలో ప్రతి దేశం ఆమోదించిన మొదటి ఐరాస ఒప్పందం.


మాంట్రియల్ ప్రొటోకాల్ నిబంధనలు

- ఆర్టికల్ 2: నియంత్రణ చర్యలు
- ఆర్టికల్ 3: నియంత్రణ స్థాయుల లెక్కింపు
- ఆర్టికల్ 4: పార్టీలు కాని వారితో వాణిజ్యంపై నియంత్రణ
- ఆర్టికల్ 5: అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రత్యేక పరిస్థితి
- ఆర్టికల్ 7: డేటా రిపోర్టింగ్
- ఆర్టికల్ 8: పాటించకపోవడం
- ఆర్టికల్ 10: సాంకేతిక సహాయం

నియంత్రించే ఓడీఎస్‌ల జాబితా



- అనుబంధం ఎ: సీఎఫ్‌సీలు, హాలోన్‌లు
- అనుబంధం బి: ఇతర పూర్తి హాలోజెనేటెడ్ సీఎఫ్‌సీలు, కార్బన్ టెట్రాక్లోరైడ్, మిథైల్ క్లోరోఫామ్
- అనుబంధం సి: హెచ్‌సీఎఫ్‌సీలు
- అనుబంధం ఇ: మిథైల్ బ్రోమైడ్
- అనుబంధం ఎఫ్: హెచ్ఎఫ్‌సీలు



- ◆ శీతాకాలంలో అంటార్కిటికా ప్రాంతంలో ప్రత్యేక మేఘాలు ఏర్పడతాయి. ఇవి క్లోరిన్ నైట్రేట్ జలవిశ్లేషణకు ఉపరితలాన్ని అందించి హైపోక్లోరస్ ఆమ్లాన్ని ఏర్పరుస్తాయి. క్లోరిన్ నైట్రేట్ కూడా హైడ్రోజన్ క్లోరైడ్‌తో చర్య జరిపి పరమాణు క్లోరిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. వసంతకాలంలో సూర్యకాంతి అంటార్కిటికాలోకి ప్రవేశించి మేఘాలను విచ్ఛిన్నం చేస్తుంది. దాంతో హైపోక్లోరస్ ఆమ్లం, క్లోరైడ్‌ల కాంతి విశ్లేషణ జరుగుతుంది. ఫలితంగా క్లోరిన్ రాడికల్స్ ఏర్పడతాయి. ఈ చర్య ఓజోన్ పొర క్షీణతను ప్రారంభిస్తుంది.

బహుళపక్ష నిధి మాంట్రియల్ ప్రొటోకాల్ అమలు కోసం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రొటోకాల్ నిబంధనను పాటించడంలో సహాయపడడానికి 1991లో బహుళపక్ష నిధి ఏర్పాటు చేశారు. ఇది ప్రొటోకాల్ నిబంధనల్లోని ఆర్టికల్ 10 కింద ఉంది. వార్షిక తలసరి వినియోగం, ఓడీఎస్‌ల ఉత్పత్తి 0.3 కిలోల కంటే తక్కువగా ఉన్న అభివృద్ధి చెందుతున్న సభ్యదేశాలకు ఇది ఆర్థిక, సాంకేతిక ప్రొటోకాల్. 1992లో మాంట్రియల్ ప్రొటోకాల్‌పై భారత్ సంతకం చేసింది. ఇందులో ఆర్టికల్ 5 కిందకు భారత్ వస్తుంది. ఓడీఎస్‌లను దశలవారీగా తొలగించడానికి, నాన్ ఓడీఎస్ సాంకేతికతకు మారడానికి చేస్తున్న ప్రయత్నాల్లో బహుళపక్ష నిధి నుంచి సహాయం పొందడానికి భారతదేశానికి అర్హత ఉంది. ప్రొటోకాల్ నియంత్రణలో ఉన్న 20 పదార్థాల్లో 7 పదార్థాలను భారత్ ప్రధానంగా తయారుచేసి ఉపయోగించింది. వీటిలో సీఎఫ్‌సీ-11, సీఎఫ్‌సీ-113, సీఎఫ్‌సీ-12, హాలోన్-1301, హాలోన్-1211, కార్బన్ టెట్రాక్లోరైడ్, మిథైల్ బ్రోమైడ్, మిథైల్ క్లోరోఫామ్ ఉన్నాయి.

ఒప్పందం విజయాలు

మాంట్రియల్ ప్రొటోకాల్ పూర్తి, స్థిరమైన అమలుతో ఈ శతాబ్దం మధ్య నాటికి ఓజోన్ పొర కోలుకుంటుందని అంచనా వేశారు. ఈ ఒప్పందం లేకపోతే ప్రస్తుత స్థాయులతో పోలిస్తే 2050 నాటికి ఓజోన్ క్షీణత పది రెట్లు పెరిగి ఉండేది. ఫలితంగా మెలనోమా, ఇతర చర్మ క్యాన్సర్లు, కంటిశుక్లం తదితర కేసులు అదనంగా లక్ష్యాల్లో నమోదయ్యేవి. ఉదాహరణకు మాంట్రియల్ ప్రొటోకాల్ 2030 నాటికి ఏటా 20 లక్షల మందిని చర్మ క్యాన్సర్ నుంచి కాపాడుతుందని అంచనా. 1990 స్థాయులతో పోలిస్తే ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 98% ఓడీఎస్‌ను ఈ ప్రొటోకాల్ అరికట్టింది. ఓడీఎస్ పదార్థాల్లో ఎక్కువ భాగం శక్తిమంతమైన గ్రీన్‌హౌస్ వాయువులే. అంటే మాంట్రియల్ ప్రొటోకాల్ ప్రపంచ వాతావరణ వ్యవస్థ రక్షణకు గణనీయంగా దోహదం చేస్తోంది. 'కిగాలీ సవరణ' ప్రకారం మాంట్రియల్ ప్రొటోకాల్ కింద హెచ్ఎఫ్‌సీల వాడకాన్ని పరిమితం చేసే చర్యలు 105 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నిరోధిస్తాయని భావిస్తున్నారు.

గ్రీన్‌హౌస్ వాయువులు 2100 నాటికి ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ వరకు నియంత్రించడానికి మాంట్రియల్ ప్రొటోకాల్ సహాయపడుతుందని భావిస్తున్నారు. ప్యారిస్ ఒప్పందం లక్ష్యాలు సాధించడానికి కూడా ఇది దోహదపడింది. ఈ కారకాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే అన్ని కాలాల్లో అత్యంత విజయవంతమైన పర్యావరణ ఒప్పందాల్లో ఒకటిగా నిలుస్తుంది. అంతర్జాతీయ సహకారంతో అత్యుత్తమ స్థాయిలో ఏం సాధించగలమో చెప్పడానికి ఇదో స్ఫూర్తిదాయక ఉదాహరణ.

వేసవిలో నైట్రోజన్ డయాక్సైడ్, మీథేన్, క్లోరిన్ మోనాక్సైడ్‌లు క్లోరిన్ పరమాణువులతో చర్య జరపడంతో క్లోరిన్ కుచించుకుపోయి ఓజోన్ క్షీణతను నివారిస్తుంది.

భారత్ విజయాలు

- ❒ మాంట్రియల్ ప్రొటోకాల్ భాగస్వామిగా 1992, జూన్ నుంచి భారతదేశం కొనసాగుతోంది.
- ❒ ఒప్పందానికి అనుగుణంగా క్లోరోఫ్లోరో కార్బన్లు, కార్బన్ టెట్రాక్లోరైడ్, హాలోన్స్, మిథైల్ బ్రోమైడ్, మిథైల్ క్లోరోఫాంలను భారత్ దశలవారీగా తొలగించింది.
- ❒ ప్రస్తుతం మాంట్రియల్ ప్రొటోకాల్ వేగవంతమైన షెడ్యూల్ ప్రకారం హైడ్రోక్లోరోఫ్లోరో కార్బన్‌లను దశలవారీగా తొలగిస్తున్నారు.
- ❒ హైడ్రోక్లోరోఫ్లోరో కార్బన్స్ ఫేజ్ అవుట్ మేనేజ్‌మెంట్ ప్లాన్ స్టేజ్-1ను 2012 నుంచి 2016 వరకు విజయవంతంగా అమలు చేయగా 2017 నుంచి స్టేజ్ - 2 అమలులో ఉంది.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

జూనియర్ ఇంటర్ గణితం — సమితులు

ఫైనల్ పరీక్షలు - 2026 ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1) A = {1,2, 3, 4, 5, 6} అయితే కింది ఖాళీలో సముచితమైన సంకేతం ∈ లేదా ∉ తో పూరించండి.
   i) 5 — A ii) 8 — A iii) O — A iv) 4 — A

సాధన: i) $5 \in A$ ii) $8 \notin A$ iii) $O \notin A$ iv) $4 \in A$

2. కింది సమితులను సమితి నిర్మిత రూపంలో రాయండి.
   i) {2, 4, 8, 16, 32} ii) {5, 25, 125, 625}

సాధన: i) $\{x : x = 2^n, n \in N, 1 \le n \le 5\}$
ii) $\{x : x = 5^n, n \in N, 1 \le n \le 4\}$

3. కింది సమితుల మూలకాల జాబితాను రాయండి.
   i) $B = \left\{x : x, \text{ ఒక పూర్ణాంకం}, -\frac{1}{2} < x < \frac{9}{2}\right\}$
   ii) $C = \{x : x, \text{ ఒక పూర్ణాంకం}, x^2 \le 4\}$

సాధన: $B = \{0, 1, 2, 3, 4\}$
$C = \{-2, -1, 0, 1, 2\}$

4. కింది సమితుల జత సమానమా? కారణాలు తెలపండి.
   $A = \{2, 3\}$, $B = \{x : x$ అనేది $x^2 + 5x + 6 = 0$ యొక్క ఒక సాధన$\}$

సాధన: $A = \{2, 3\}$, $B = \{-2, -3\}$ $\therefore A \neq B$

5. కింద ఇచ్చిన సమితుల నుంచి, సమాన సమితులను ఎంపిక చేయండి.
   $A = \{2, 4, 8, 12\}$ $B = \{1, 2, 3, 4\}$
   $C = \{4, 8, 12, 14\}$ $D = \{3, 1, 4, 2\}$
   $E = \{-1, 1\}$ $F = \{0, a\}$ $G = \{1, -1\}$ $H = \{0, 1\}$

సాధన: B = D, E = G

6. కింది సమితుల యొక్క అన్ని ఉప సమితులను రాయండి.
   i) {a} ii) {a, b}

సాధన: i) ϕ, {a} ii) ϕ, {a}, {b}, {a, b}

7. కిందివాటిని అంతరాలుగా రాయండి.
   i) $\{x : x \in R, -4 < x \le 6\}$ ii) $\{x : x \in R, -12 < x < -10\}$

సాధన: i) (– 4, 6] ii) (–12, –10)

8. కింది అంతరాలను సమితి నిర్మిత రూపంలో రాయండి.
   i) (–3, 0) ii) [6, 12]

సాధన: i) $\{x : x \in R, -3 < x < 0\}$ ii) $\{x : x \in R, 6 \le x \le 12\}$

9. x = { a, b, c, d}, y= {f, b, d, g} అయితే i) x – y ii) y – x iii) x ∩ y లను కనుక్కోండి.

సాధన: i) x – y = {a, c}
ii) y – x = {f, g}
iii) x ∩ y = {b, d}

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: యు. ప్రసన్నకుమార్

దేశంలో ఉత్తమ నగరం బెంగళూరు!

భారతీయులకు కల్పించిన వీసారహిత ప్రవేశాన్ని పలువురు అక్రమ రవాణాదారులు దుర్వినియోగం చేస్తుండటంతో ఇరాన్ ఆ వెసులుబాటును నిలిపివేసింది. మిస్ యూనివర్స్ పోటీల నిర్వహణ తీరుపై బహిరంగంగా నిరసన తెలిపిన పోటీదారే ఆ పోటీల్లో విజేతగా నిలిచింది. అణు దాడిని కూడా తట్టుకునే విధంగా చైనా ఒక కృత్రిమ దీవిని నిర్మిస్తోంది. దేశంలో వరి, గోధుమ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరింది. సైబర్ మోసాలను ఎదుర్కొనే సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్న రాష్ట్రంగా గోవా నిలిచింది. ఈ విధంగా సమకాలీన వార్తాంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, సైనిక రంగ కార్యక్రమాలు, క్రీడల విశేషాలు, వార్తల్లో నిలిచిన వ్యక్తులు, వారి ఘనతలు, ముఖ్యమైన నివేదికలు, సర్వేల వివరాలు, సదస్సుల నిర్ణయాలను తెలుసుకుంటూ ఉండాలి.



బెంగళూరు నగరం

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో సరైంది.
   ఎ) మిస్ యూనివర్స్ 2025 పోటీలు థాయ్‌లాండ్‌లో జరిగాయి.
   బి) 2025 మిస్ యూనివర్స్ విజేత ఫాతిమా బాష్.
   సి) ఫాతిమా బాష్ ఖతర్ దేశానికి చెందినవారు.
   డి) 2024 మిస్ యూనివర్స్ విజేత డెన్మార్క్‌కి చెందిన విక్టోరియా కెజార్ హెల్విగ్.
   ఇ) తొలి రన్నర్ ప్రవీణార్ సింగ్ (థాయ్‌లాండ్), రెండో రన్నర్ స్టిఫానీ అబాసలీ (వెనుజువెలా)
   1) ఎ, బి, సి, డి, ఇ 2) ఎ, బి, డి, ఇ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి, ఇ



నోట్: ● ఫాతిమా బాష్ మెక్సికోకు చెందినవారు.
● భారత్ నుంచి ఈ పోటీల్లో మణికా విశ్వకర్మ పాల్గొన్నారు.
● ఈ పోటీల న్యాయనిర్ణేతల్లో బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఉన్నారు. ● 2025 మిస్‌వరల్డ్ - ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ (థాయ్‌లాండ్)

2. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటారు?
   1) నవంబరు 26 2) నవంబరు 19
   3) నవంబరు 25 3) నవంబరు 16
3. ఏ రాష్ట్రంలోని చాంగ్లాంగ్ జిల్లా విజోయ్‌నగర్ ప్రాంతంలో హోయా జాతికి చెందిన కొత్తరకం 'హోయా దవోడియా సీన్'ను పరిశోధకులు కనుక్కొన్నారు?
   1) సిక్కిం
   2) అస్సాం
   3) అరుణాచల్ ప్రదేశ్
   4) మిజోరం



4. మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్ 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ప్రారంభించిన కొత్త లైన్ నంబరు?
   1) 14490 2) 14990
   3) 19940 4) 14440
5. 2025, నవంబరులో యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) కీర్తి సురేష్ 2) రష్మిక
   3) శ్రీలీల 4) తమన్నా
6. కిందివాటిలో సరైంది.
   ఎ) మొదటి బ్లైండ్ ఉమెన్స్ టీ-20 వరల్డ్‌కప్ విజేత - భారత్
   బి) మొదటి బ్లైండ్ ఉమెన్స్ టీ-20 వరల్డ్‌కప్ ఇండియా, శ్రీలంకలో జరిగింది.
   సి) మొదటి బ్లైండ్ ఉమెన్స్ టీ-20 వరల్డ్‌కప్ రన్నర్ - నేపాల్
   డి) మొదటి బ్లైండ్ ఉమెన్స్ టీ-20 వరల్డ్‌కప్ టైటిల్ స్పాన్సర్ - ఎస్‌బీఐ
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
7. కిందివాటిలో సరైంది.
   ఎ) 2వ ఉమెన్స్ కబడ్డీ వరల్డ్‌కప్ 2025 బంగ్లాదేశ్‌లో జరిగింది.
   బి) 2వ ఉమెన్స్ కబడ్డీ వరల్డ్‌కప్ విజేత - ఇండియా.
   సి) 2వ ఉమెన్స్ కబడ్డీ వరల్డ్‌కప్ రన్నర్ - తైవాన్
   డి) 2012లో జరిగిన మొదటి ఉమెన్స్ కబడ్డీ వరల్డ్ కప్ విజేత - ఇండియా
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి డి
   3) బి, సి 4) ఎ, సి, డి
8. కిందివాటిలో సరైంది.



   ఎ) భారత్ - నేపాల్ మధ్య ద్వైపాక్షిక సైనిక విన్యాసాల పేరు - సూర్యకిరణ్.
   బి) 19వ ఎడిషన్ సూర్యకిరణ్ విన్యాసాలు ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్‌లో (నవంబరు 25 నుంచి డిసెంబరు 8) వరకు జరుగుతున్నాయి.
   సి) సూర్యకిరణ్ విన్యాసాలు 2011లో ప్రారంభమయ్యాయి.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
9. ఇటీవల మరణించిన బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు ఏ సంవత్సరంలో పద్మభూషణ్ అవార్డు లభించింది?
   1) 2012 2) 2008 3) 2009 4) 2011
10. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) జస్టిస్ లావు నాగేశ్వరరావు
    2) జస్టిస్ గవాయ్
    3) జస్టిస్ సూర్యకాంత్ 4) జస్టిస్ విక్రమ్‌నాథ్
11. ఇటీవల వార్తల్లో ఉన్న 'మౌంట్ సెమెరు' అగ్నిపర్వతం ఏ దేశంలో బద్దలైంది?
    1) దక్షిణాఫ్రికా
    2) ఇథియోపియా
    3) ఇండోనేసియా
    4) కొలంబియా



నోట్: ఇథియోపియాలో 'హేలిగుబ్బ' అగ్నిపర్వతం 12,000 సంవత్సరాల తర్వాత ఇటీవల బద్దలైంది.

12. కిందివాటిలో సరైంది.
    ఎ) ఆస్ట్రేలియా-కెనడా-ఇండియా టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఏసీఐటీఐ) భాగస్వామ్యాన్ని ప్రారంభించాయి.
    బి) ఏసీఐటీఐ ప్రాథమిక లక్ష్యం-సురక్షితమైన, సుస్థిరమైన, నికరసున్నా ఉద్గారాల భవిష్యత్‌ను సాధించడానికి కావాల్సిన సాంకేతికతపై కలిసి పనిచేయడం.
    సి) 2025 నవంబరు 22న ఈ మూడు దేశాల మధ్య ఏసీఐటీఐ భాగస్వామ్యం ప్రారంభమైంది.
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

కరెంట్ అఫైర్స్

13. ఇటీవల జీఐ ట్యాగ్ పొందిన బిగుల్, జరి పోశాక్ ఏ రాష్ట్రానికి చెందినవి?
    1) ఉత్తరాఖండ్ 2) మధ్యప్రదేశ్
    3) ఉత్తర్‌ప్రదేశ్ 4) కేరళ

నోట్: ● మీరట్ బిగుల్, మథుర జరీ పోశాక్‌కు ఇటీవల జీఐ ట్యాగ్ లభించింది. ● అరుణాచల్ దావోకు (కళ) ఇటీవల జీఐ హోదా లభించింది. ● గుజరాత్ అంబాజీ పాలరాయికి జీఐ హోదా లభించింది.

14. 'మంగ్సిర్ బగ్వాల్' ఏ రాష్ట్ర పండగ?
    1) రాజస్థాన్
    2) అస్సాం
    3) ఉత్తరాఖండ్
    4) అరుణాచల్‌ప్రదేశ్



నోట్: ● హార్న్‌బిల్ ఫెస్టివల్ నాగాలాండ్‌లో జరుగుతుంది.

15. డేవిస్ కప్‌లో ఇటీవల వరుసగా మూడోసారి ఛాంపియన్‌గా నిలిచిన దేశం?
    1) స్పెయిన్ 2) ఫ్రాన్స్ 3) జర్మనీ 4) ఇటలీ

నోట్: ● ఇటలీ 1976, 2023, 2024, 2025లో 4 సార్లు డేవిస్ కప్ (టెన్నిస్) నెగ్గింది.

16. అణ్వస్త్ర దాడిని తట్టుకునేలా తేలియాడే కృత్రిమ దీవిని నిర్మిస్తున్న దేశం?
    1) రష్యా 2) అమెరికా
    3) చైనా 4) జపాన్
17. ఇటీవల ఫిఫా వరల్డ్‌కప్‌కి అర్హత సాధించిన చిన్న దేశం?
    1) క్యూరసావ్ 2) ఫిజీ 3) నౌరు 4) తువాలు
18. ప్రపంచంలోని ఉత్తమ నగరాల సూచిక 2026లో భారత్ నుంచి మొదటి స్థానంలో ఉన్న నగరం?
    1) దిల్లీ 2) హైదరాబాద్ 3) బెంగళూరు 4) చెన్నై

నోట్: ● లండన్, న్యూయార్క్, పారిస్, టోక్యో, మాడ్రిడ్‌లు వరుసగా తొలి అయిదు స్థానాల్లో ఉన్నాయి. ● ప్రపంచవ్యాప్తంగా బెంగళూరు 29వ స్థానంలో ఉంది. ● ముంబయి 40, దిల్లీ 54వ స్థానాల్లో నిలిచాయి. ● హైదరాబాద్ 80వ స్థానంలో ఉంది

19. 2026 టీ–20 పురుషుల ప్రపంచకప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) సచిన్ 2) విరాట్ కోహ్లీ
    3) ఎం.ఎస్.ధోని 4) రోహిత్‌శర్మ

నోట్: 2026లో టీ-20 వరల్డ్‌కప్ ఇండియా, శ్రీలంకలో జరుగుతుంది.

20. గ్లోబల్ కమిట్‌మెంట్ టు డెవలప్‌మెంట్ ఇండెక్స్ 2025లో ఇండియా ర్యాంక్ ఎంత?
    1) 39 2) 36 3) 42 4) 16

నోట్: స్వీడన్, జర్మనీ, నార్వే వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.


21. డబ్ల్యూహెచ్‌ఓ ఏ దేశాన్ని ఇటీవల పోలియో రహిత దేశంగా ప్రకటించింది (2025 నవంబరు 19న)?
    1) జింబాబ్వే 2) జాంబియా
    3) ఈజిప్టు 4) ఇండోనేసియా
22. కిందివాటిలో సరైంది.
    ఎ) భారతదేశం ఇటీవల (2024-25) రికార్డు స్థాయిలో 357.73 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని చేరుకుంది.
    బి) వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో 150.18 మి. టన్నులకు చేరుకుంది.
    సి) గోధుమ ఉత్పత్తి రికార్డు స్థాయిలో 117.94 మి. టన్నులకు చేరుకుంది.
    డి) నూనెగింజల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 42.99 మి. టన్నులకు చేరుకుంది.
    1) ఎ, బి 2) బి, సి, డి
    3) ఎ, బి, సి, డి 4) సి, డి
23. దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సు నవంబరు 19–21 వరకు ఎక్కడ జరిగింది?
    1) రాజస్థాన్ - జైపుర్ 2) గుజరాత్ - సూరత్
    3) కేరళ - కొచ్చి
    4) తమిళనాడు (కోయంబత్తూరు)



24. భారతదేశంలో మొదటి ప్రపంచ టెన్నిస్ లీగ్ డిసెంబరు 17 నుంచి 20 వరకు ఎక్కడ జరగనుంది?
    1) దిల్లీ 2) ముంబయి
    3) బెంగళూరు 4) చెన్నై

నోట్: 10వ గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్, వరల్డ్ ట్రేడ్ ఎగ్జిబిషన్ ముంబయిలో జరిగింది.

25. ఇటీవల భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని నిలిపివేసిన దేశం ఏది?
    1) ఇరాక్ 2) ఇరాన్
    3) ఖతర్ 4) యూఏఈ
26. భారతదేశంలో 100% సైబర్ మోసాలకు ప్రతిస్పందన వ్యవస్థను కలిగి ఉన్న మొదటి రాష్ట్రం?
    1) కేరళ 2) గోవా
    3) కర్ణాటక 4) మహారాష్ట్ర
27. ప్రపంచ బాక్సింగ్ అధ్యక్షుడిగా నియమితులైన జెన్నాడి గోలోవ్కిన్ ఏ దేశానికి చెందినవారు?
    1) కజకిస్థాన్ 2) చైనా
    3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్



28. 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం' ఏ రోజున జరుపుకుంటారు?
    1) జనవరి 26 2) జనవరి 29
    3) నవంబరు 16
    4) నవంబరు 26



రచయిత: బి.ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-2, 2-3, 3-3, 4-1, 5-1, 6-3, 7-2, 8-4, 9-1, 10-4, 11-3, 12-3, 13-3, 14-3, 15-4, 16-3, 17-1, 18-3, 19-4, 20-2, 21-4, 22-3, 23-4, 24-3, 25-2, 26-2, 27-1, 28-4.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

ప్రతి నీటి బొట్టూ ఒడిసిపట్టు.. ఉత్పాదకత పెరిగేట్టు!



వ్యవసాయానికి నీటి సదుపాయం కల్పించడాన్ని నీటిపారుదల అంటారు. దీని వల్ల పంట ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల తలెత్తే సమస్యలు ఎదుర్కోవాలంటే ఇరిగేషన్ వ్యవస్థను బలపరుచుకోవాలి. మనది ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం. ఈ రంగం స్థిరంగా, వృద్ధి పథంలో సాగాలంటే సమగ్ర నీటిపారుదల అవసరం. అందుకే స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, దేశవ్యాప్తంగా బహుళార్థసాధక ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి దాన్ని వ్యవసాయానికి అందించేలా వివిధ పథకాలను రూపొందించింది.

భారత ఆర్థిక సమస్యలు - నీటిపారుదల

1950-51లో స్థూల పంట భూమిలో స్థూల నీటిపారుదల ఉన్న భూమి 17% మాత్రమే. 2020-21 నాటికి 53 శాతానికి పెరిగింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ ప్రకారం, 2022-23 వచ్చేసరికి భారతదేశ స్థూల నీటిపారుదల విస్తీర్ణం 122.3 మిలియన్ హెక్టార్లు. మొత్తం భూభాగంలో దాదాపు 55.8శాతానికి సాగు నీరు అందుతోంది.

నీటిపారుదల ప్రాజెక్టులు

1950-51లో నిర్మాణానికి అయ్యే వ్యయం ఆధారంగా ప్రాజెక్టులను మూడు రకాలుగా విభజించారు. అవి:

1. చిన్నతరహా ప్రాజెక్టు: రూ.10 లక్షల కంటే తక్కువ వ్యయం
2. మధ్యతరహా ప్రాజెక్టు: రూ.10 లక్షల నుంచి రూ.5 కోట్ల మధ్య వ్యయం
3. భారీ ప్రాజెక్టు: రూ.5 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో నిర్మించే ప్రాజెక్టులు.

❖ భారత ప్రణాళికా సంఘం 1971-72 నుంచి నీటిపారుదల పథకాలను భూమి విస్తీర్ణం ఆధారంగా 3 రకాలుగా విభజించింది. అవి:

1. చిన్నతరహా ప్రాజెక్టు: 2,000 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణానికి నీటిపారుదల కల్పించే ప్రాజెక్టు.
2. మధ్యతరహా ప్రాజెక్టు: 2,000 హెక్టార్ల నుంచి 10,000 హెక్టార్ల మధ్య నీటిపారుదల కల్పించే ప్రాజెక్టు.
3. భారీ ప్రాజెక్టు: 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ భూమికి నీటిపారుదల అందించే ప్రాజెక్టు.

❖ మొదటి పంచవర్ష ప్రణాళికలో నీటిపారుదల, వరదల నివారణకు రూ.442 కోట్లు కేటాయించగా, 12వ ప్రణాళిక నాటికి అది రూ.4,22,000 కోట్లకు చేరింది. ఇది మొత్తం ప్రణాళికా కేటాయింపులో 5.5%. ❖ ప్రణాళికల్లో నీటిపారుదలకు సంబంధించి ఎక్కువ భాగం భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకే వెళ్లాయి. ఉదా: భాక్రానంగల్ (పంజాబ్), బియాస్ (పంజాబ్, హరియాణా), హీరాకుడ్ (ఒడిశా), దామోదర్ లోయ (బిహార్, పశ్చిమ బెంగాల్), నాగార్జునసాగర్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).

నీటిపారుదల ఆవశ్యకత

వ్యవసాయ రంగంలో ఉత్పత్తి ప్రక్రియను సాగించాలంటే మౌలిక వసతులు లేదా అవస్థాపన సౌకర్యాలు ఆవశ్యకమని రోజన్‌స్టీన్ రోడాన్, రాగ్నర్ నర్క్స్ లాంటి ఆర్థికవేత్తలు ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో ముఖ్యమైంది నీరు.

- వ్యవసాయానికి ఆధారమైన నీరు ప్రధానంగా వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. దేశంలో పంట ఉత్పత్తిని నిర్ణయించేది ఎక్కువగా రుతుపవనాలే.. అవి ఆలస్యమైనా, ఆగిపోయినా వ్యవసాయం విఫలం అవుతుంది. అందుకే భారత వ్యవసాయాన్ని రుతుపవనాలతో ఆడే జూదంగా అభివర్ణిస్తారు.
- వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యం చాలా అవసరం. దీని ద్వారా ఎక్కువ పంటలు పండించవచ్చు.
- రుతుపవన ఆధారిత సేద్యాన్ని తగ్గించడంలో, కరవులను నివారించడంలో, పంట ఉత్పాదకత పెంచడంలో నీటిపారుదల కీలకంగా పనిచేస్తోంది.
- కాలువలు, చెరువులతో పాటు గొట్టపు బావులను కూడా నీటిపారుదలకు ముఖ్యమైన ఆధారంగా చెప్పొచ్చు.

నీటిపారుదల పథకాలు

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై): 2015లో ప్రారంభమైంది. పొలాలకు నీటి వసతిని పెంపొందించడం, నీటి పారుదల కింద సాగు భూమి విస్తీర్ణాన్ని పెంచడం, భూగర్భ జలాలను అధికం చేయడం, సాగునీటి వినియోగాన్ని మెరుగుపరచడం, సుస్థిర నీటి సంరక్షణ పద్ధతులను అందించడం, వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం దీని లక్ష్యాలు.

◆ 2021-22 నుంచి 2025-26 కాలానికి పీఎంకేఎస్‌వై అమలుకు కేంద్రం 2021 డిసెంబరులో ఆమోదం తెలిపింది.

◆ పీఎంకేఎస్‌వైకి చెందిన వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్‌ను భూ రికార్డుల నిర్వహణ విభాగం అమలు చేయగా.. వ్యవసాయం, రైతు సంక్షేమ విభాగం 'పర్ డ్రాప్ - మోర్ క్రాప్ (పీడీఎంసీ)'ని అమలు చేస్తోంది నీటిపారుదల ప్రాజెక్టుల అమల్లో ఉన్న ప్రధాన సమస్యల్లో భూ సమీకరణ ఒకటి. భూగర్భ పైపులైన్ల ద్వారా దాదాపు 55,290 కి.మీ. మేర పంపిణీ వ్యవస్థ నిర్మాణం చేపట్టారు. తద్వారా సుమారు 76,594 హెక్టార్ల భూ సమీకరణ అవసరం లేకుండాపోయింది. ◆ ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్, హర్ ఖేత్ కో పానీ (హెచ్‌కేకేపీ) లాంటి కార్యక్రమాలు ప్రస్తుతం పీఎంకేఎస్‌వైలో ఉప పథకాలుగా ఉన్నాయి. హెచ్‌కేకేపీలో నాలుగు ఉప పథకాలు ఉన్నాయి. అవి: 1. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్, 2. సర్ఫేస్ మైనర్ ఇరిగేషన్, 3. రిపేర్, రెనోవేషన్, రీస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) ఆఫ్ వాటర్ బాడీస్, 4. భూగర్భ జలాల అభివృద్ధి



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

మోడ్రనైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ (ఎం-సీఏడీడబ్ల్యూఎం): ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన గల కేంద్ర కేబినెట్ 2025, ఏప్రిల్ 1న ఈ కార్యక్రమాన్ని ఆమోదించింది. దీన్ని ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకంలో ఉపపథకంగా చేర్చారు. ఎం-సీఏడీడబ్ల్యూఎంకు 2025-26 కాలానికి మొదటి విడతగా రూ.1600 కోట్లు కేటాయించారు.

◆ నీటిపారుదల నెట్‌వర్క్‌ను ఆధునికీకరించడం ఎం-సీఏడీడబ్ల్యూఎం ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం ఇప్పటికే ఉన్న కాలువలు లేదా ఇతర వనరుల నుంచి ఏర్పాటు చేసిన క్లస్టర్లలో నీటిని సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజక పథకం.

కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఏడీపీ): 1974-75లో కేంద్రం దీన్ని ప్రారంభించింది. నిరుపయోగంగా ఉన్న నీటిపారుదల సామర్థ్యాన్ని వాడుకోవడమే దీని లక్ష్యం.

◆ భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు ప్రాంతాల్లో నీటిపారుదల సామర్థ్యాన్ని సమగ్రంగా వినియోగించుకోవడమే దీని ఉద్దేశం.

◆ పదో ప్రణాళికా కాలంలో 2004లో దీన్ని పునర్ వ్యవస్థీకరించి 'కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్'గా మార్చారు.

సూక్ష్మ సేద్యం: ఈ పథకాన్ని 2006, జనవరిలో ప్రారంభించారు. పంటకు తగిన పరిమాణంలో నీటిని తరచుగా మొక్కలకు అందేలా చేసే విధానమే సూక్ష్మ నీటిపారుదల.

◆ తుంపర సేద్యం, బిందు సేద్యం ద్వారా నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం దీని ఉద్దేశం.

Word of the Day 850

Felicitous

Telugu meaning: తగిన, సరైన

English meaning: The word felicitous (ఫెలిసిటస్) is an adjective that describes something wellchosen, appropriate, or pleasingly expressed.

Synonyms: Apt, Suitable; ***Antonyms:*** Awkward, Inept

Usage: **1.** The speaker's felicitous choice of words made the complex topic easy for the audience to understand.

2. Her felicitous timing in raising the issue helped the team resolve the conflict smoothly.

Current Affairs



The Defence Research and Development Organisation (DRDO) has successfully conducted a high-speed rocket-sled test of a fighter aircraft escape system at the Rail Track Rocket Sled (RTRS) facility of the Terminal Ballistics Research Laboratory, Chandigarh on 2 December 2025. The test validated canopy severance, ejection sequencing, and complete aircrew recovery.

The 14th edition of EKUVERIN, the joint military exercise involving the Indian Army and the Maldives National Defence Force (MNDF), began in Thiruvananthapuram on 2 December 2025. The exercise concludes on 15 December 2025. The Indian Army contingent of 45 personnel from Southern Command is participating alongside an equivalent strength of the Maldivian contingent.

The Director General of the Indo-Tibetan Border Police (ITBP), Praveen Kumar, took on additional charge of the Border Security Force (BSF) Director General following the retirement of the incumbent Daljit Singh Chawdhary.

- Chawdhary is a 1990-batch IPS officer of the Uttar Pradesh cadre, handed over the responsibilities to Kumar, a 1993-batch officer of the West Bengal cadre, at a BSF camp in Chhattisgarh's Raipur.

The Atal Pension Yojana (APY) has crossed 8.34 crore enrolments, according to data shared in the Lok Sabha on 1 December 2025. Women constitute 48% of the total subscribers, reflecting significant participation from female beneficiaries across the country.

- Launched on 9 May 2015, APY aims to build a universal social security system for citizens, particularly workers in the unorganised sector.

India's total installed power generation capacity has reached 5.05 lakh megawatt as of October 2025. Minister of State for Power Shripad Yesso Naik said this in the Rajya Sabha on 1 December 2025. He stated that the Government has undertaken several steps and initiatives to promote and accelerate renewable energy capacity in the country, in line with its commitment to achieving 500 Gigawatt of non-fossil energy capacity by 2030.

For more Current Affairs: **Scan QR code**

నావికాదళ దినోత్సవం

డిసెంబరు 4
చరిత్రలో ఈనాడు

భారత సాయుధ దళాల్లో నావికా విభాగం ఒకటి. దేశాన్ని సురక్షితంగా ఉంచడంలో, మన తీర ప్రాంతాలను కాపాడటంలో, శత్రుమూకల కారణంగా సముద్రంలో తలెత్తే సంక్షోభాలను ఎదుర్కోవడంలో భారత నావికా దళం కీలక పాత్ర పోషిస్తోంది. ఇది సాధించిన విజయాలు, దేశ రక్షణలో అంకితభావంతో అందించే సేవలను గౌరవించే లక్ష్యంతో ఏటా డిసెంబరు 4న 'నావికాదళ దినోత్సవం'గా (Navy Day) నిర్వహిస్తారు. జాతీయ భద్రతను కాపాడటం, అంతర్జాతీయ సంబంధాలు - సహకారాన్ని పెంపొందించడం, స్థిరమైన సముద్ర వాతావరణాన్ని ప్రోత్సహించడంలో నావికాదళ పాత్రను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ముఖ్య విషయాలు

భారత నావికాదళ ప్రాథమిక లక్ష్యం దేశ సముద్ర సరిహద్దులను కాపాడటం. యుద్ధం, శాంతి సమయాల్లో భారతదేశ భూభాగం, సముద్ర ప్రయోజనాలకు ఏదైనా ముప్పు కలిగినప్పుడు లేదా దురాక్రమణ ఎదురైనప్పుడు ఇది వాటిని నిరోధిస్తుంది. ఇతర సాయుధ దళాలైన వైమానిక, సైన్యంతో కలిసి పనిచేస్తుంది.

- ఇతర దేశాల నావికా దళాలతో ఉమ్మడి విన్యాసాలు, మానవతా కార్యక్రమాలు, విపత్తు నిర్వహణ సహాయ చర్యల్లో పాల్గొనడం ద్వారా ఆయా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను ప్రోత్సహిస్తుంది.

చారిత్రక నేపథ్యం


1971 డిసెంబరు 3న భారత్ - పాకిస్థాన్ యుద్ధం ప్రారంభమైంది. పాకిస్థాన్ చెర నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించడమే లక్ష్యంగా ఇది జరిగింది. భారత వైమానిక స్థావరాలపై పాకిస్థాన్ ఊహించని దాడి చేసింది. దీనికి ప్రతిగా మన నావికాదళం డిసెంబరు 4న ఆపరేషన్ ట్రైడెంట్ (Trident)ను ప్రారంభించింది. కరాచీలోని నావికా ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి జరిపింది.

- ఆపరేషన్ ట్రైడెంట్ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబరు 4న మన దేశంలో నావికాదళ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1972 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని జరుపుతున్నారు.

భారత నావికా దళ నినాదం ఏమిటి? భారత నావికాదళ పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు? గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

బాల కార్మిక వ్యవస్థ



ఇంట్లో తల్లిదండ్రులకు సహాయపడితే కూడా బాలకార్మికులు అవుతారా? తల్లిదండ్రులతోపాటు సొంత పొలంలో పనిచేస్తే బాలకార్మికులవుతారా? అసలు బాలకార్మిక వ్యవస్థ అంటే ఏంటి? దీనివల్ల బాలలు, సమాజంపై పడుతున్న ప్రభావమేంటి? ఈ సమస్య తీవ్రత ఎంత? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?

బాలలు, బాలకార్మికులు

జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. యునిసెఫ్ ప్రకారం 18 ఏళ్ల లోపున్నవారు కొన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే వారిని బాలకార్మికులుగా పరిగణిస్తారు.

✦ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల హక్కుల సంప్రదాయం (యునైటెడ్ నేషన్స్ చైల్డ్ రైట్స్ కన్వెన్షన్) ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారు ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లయితే బాలకార్మికులుగా పరిగణిస్తారు.

✦ ఓటు హక్కు ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారంతా బాలలు అవుతారు.

బాలకార్మిక వ్యవస్థ – తీవ్రత:

2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశం మొత్తం మీద 14 ఏళ్ల లోపు వయసున్న బాలకార్మికుల సంఖ్య 43,53,247 (2001 జనాభా లెక్కల ప్రకారం చూస్తే 1,26,66,377 మంది ఉన్నారు).

చిన్నాచితక పనుల్లో ఉన్న బాలకార్మికులు, ఎంతలోపు వయసు ఉన్నవారు పని చేయడానికి అనర్హులు, బాలకార్మికులు అధికంగా ఉన్న రంగాలు, బాలకార్మిక వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు రాజ్యాంగం తీసుకుంటున్న చర్యలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

25,487 Jobs in SSC

Staff Selection Commission (SSC) has released a notification for the recruitment of Constable (GD), Rifleman (GD) posts in Central Armed Police Forces (CAPFs), Secretariat Security Force (SSF), and Assam Rifles (AR). The total no. of posts is 25,487. The application fee is Rs.100. Eligible candidates can apply online before 31st December 2025.

Specialist Cadre Officer Posts

State Bank of India (SBI) Mumbai is inviting applications for the recruitment of Specialist Cadre Officer (SCO) posts in various departments on a contractual basis. The total no. of posts is 996. The application fee is Rs.750. The last date for receipt of online applications is 23 December 2025.

Senior Resident Jobs

Employees' State Insurance Corporation Jammu (ESIC) is conducting interviews for the Full Time Specialist and Senior Resident posts on a contractual basis. The total no. of posts is 27. The application fee is Rs.250. Eligible candidates can apply online before 16 December 2025.

Did You Apply..?

Today (December 4) is the last date for the following Jobs

☛ KVS – NVS Recruitment Notification 2025 - 14,967 Teaching and Non-Teaching posts.

☛ Project Associate - I posts at NIT Calicut. ***Eligibility:*** Degree, PG.

☛ 3,058 Undergraduate Jobs in Indian Railways. ***Eligibility:*** Intermediate.

For more information and other notifications - scan QR code

Bank Exams
Reasoning

Analysis of Statement

Directions (Qs. 1 - 10): *Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a 'strong' argument.*

Choose Your Answer

(A) if only Argument I is strong.
(B) if only Argument II is strong.
(C) if either I or II is strong.
(D) if neither I nor II is strong.
(E) if both I and II are strong.

1. Statement: Computerization in offices is a must to provide efficient services to the citizens.

Arguments:
I. Yes, because the work is done quickly and time is not wasted.
II. No, it will generate more unemployment.

2. Statement: Should there be a complete ban on opening up of new management educational institutions?

Arguments:
I. Yes, there are more institutions then required and there is no need to open up new institutions.
II. No, we need more professional managers in coming days because the future scenario will be very competitive.

3. Statement: Should private organizations be allowed to carry on security related research activities?

Arguments:
I. No, private organizations are easily vulnerable to our enemies and therefore, they should not be permitted to carry on such researches.
II. Yes, the Government has not sufficient resources to carry on such researches and the private organizations would manage necessary resources.

4. Statement: Should there be recruitment in banks on the basis of past academic performance rather than through competitive examinations?

Arguments:
I. Yes, it will be beneficial for those candidates who are unable to bear the expenses of competitive examinations.
II. No, the past academic performance cannot be made the basic of recruitment because there is no uniformity in the assessment by the universities.

5. Statement: Should individuals/ Institutes having treasures of national significance like Nobel prizes be handed over to central government for their safe custody?

Arguments:
I. Yes, the individuals or institutions do not have enough resources to protect them.
II. No, these are the property of the individuals/ institutions who win them and should be in their custody?

6. Statement: Should 'education' be brought under the control of the central government like defence?

Arguments:
I. No, education is a state subject and it should remain with the state.
II. Yes, this is the only way to establish uniformity in growth of education across the states.

7. Statement: Should import duty on all the electronic goods be dispensed with?

Arguments:
I. No, this will considerably reduce the income of government and will adversely affect the development activities.
II. No, the local manufactures will not be able to compete with the foreign manufacturers who are technologically far superior.

8. Statement: Should there be reservation of jobs in the organization in the private sector also as in the public sector undertakings in India?

Arguments: I. Yes, this will help reduce the gap between the affluent and downtrodden in India.
II. No, the private sector does not get any government assistance and therefore they should not be saddled with such policies.

9. Statement: Should the opinion polls predicting outcome of elections before the elections be banned in India?

Arguments: I. Yes, this may affect the voter's mind and may affect the outcome.
II. No, such polls are conducted all over the world.

10. Statement: Should there be only public system of transport in all the big cities in India?

Arguments: I. Yes, this will avoid creating confusion in people's mind for selection of their mode of transport.
II. No, people should be given enough choices for their mode of transport.

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

వీధుల్లో చెత్త పడేస్తే వీనుల 'విందే'!



నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రత్యేక ప్రచార విధానాన్ని ప్రారంభించింది. వీధుల్లో చెత్త పారబోసేవారిని గుర్తించి జరిమానా విధించడం దీని ఉద్దేశం. అలా చెత్త పారబోసినవారి ఇంటి ముందు కార్పొరేషన్ సిబ్బంది వాలిపోయి డోలు వాయిస్తారు. పారిశుద్ధ్య పాటలు పాడుతారు. "వీధిలో చెత్త పడేస్తున్నారా? కాస్త నవ్వండి. మిమ్మల్ని కెమెరా చూస్తోంది" అని నినాదాలు చేస్తారు. ఆ చెత్తను ఓ కవరులోకి ఎత్తి సంబంధిత గృహస్థులకు అందజేసి అక్కడికక్కడే చలాను జారీ చేస్తారు. ఈ ప్రక్రియను వీడియో తీసి తమ అధికారిక సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే యోచనలోనూ కార్పొరేషన్ ఉంది. చండీగఢ్‌ను పరిశుభ్రంగా ఉంచడం పౌర బాధ్యత మాత్రమే కాదు, చట్టపరమైన విధి అని మున్సిపల్ కమిషనర్ అమిత్ కుమార్ తెలిపారు. 'అయామ్ చండీగఢ్' అనే మొబైల్ యాప్‌ను కూడా ప్రవేశపెట్టిన అధికారులు ఓ వాట్సప్ నంబరు ఇచ్చారు. వీధుల్లో చెత్త పడేస్తున్నవారి ఫొటోలు, వీడియోలు తీసి ఈ నంబరుకు ఎవరైనా పంపవచ్చు. వాస్తవమని తేలితే ఫిర్యాదికి రూ.250 నగదు బహుమతి అందజేస్తున్నారు.

'13' నంబరు నోట్ల సేకరణ.. హాబీ వెనుక దాతృత్వ కోణం



చండీగఢ్ వ్యాపారవేత్త బచీతర్ సింగ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వెనుక ఓ ఆసక్తికర కోణం ఉంది. అమ్మమ్మ బోధనలు ఆయన జీవితాన్ని తీర్చిదిద్దాయి. ఆమె తరచూ గురునానక్ 'తేరా హీ తేరా' (సర్వం నీదే) సందేశాన్ని గుర్తు చేసేది. తేరా అంటే '13' సంఖ్య, 'నీది' అనే అర్థం వస్తుంది. సర్వం భగవంతునికి చెందుతుందని అనేందుకు దీన్ని ఉపయోగిస్తారు. అందుకే 13 నంబరు ఉన్న నోట్లను సేకరించి, వాటిని దాతృత్వ కార్యక్రమాలకు బచీతర్ వినియోగిస్తున్నారు. ఈయన కుటుంబం దేశ విభజన సమయంలో ప్రస్తుత పాకిస్థాన్‌లోని మర్దాన్ నుంచి వచ్చి చండీగఢ్‌లో స్థిరపడింది. రంజిత్ మోటార్స్ పేరిట వ్యాపారం నడుపుతున్న బచీతర్ మొదట్లో సంపాదనలో పదో వంతును సమాజసేవ కోసం విరాళంగా ఇచ్చే సిక్కు సంప్రదాయమైన 'దస్‌వంధ్'ను ఆచరించేవారు. గత ఇరవై ఏళ్లుగా '13' సంఖ్య ఉన్న కరెన్సీ నోట్లను సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్న తన ఇద్దరు కుమార్తెలు ఈ నోట్ల సేకరణలో సహకరిస్తున్నారని బచీతర్ తెలిపారు.

క్షణం వీడరు.. మలమూ వదలరు!

- పుతిన్ చుట్టూ పటిష్ఠ భద్రతా వలయం



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం భారత్‌కు చేరుకుంటున్నారు. ఆయన పర్యటన కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అయితే మన దేశంలో ఉన్నా.. పుతిన్ చుట్టూ రష్యా భద్రతా సిబ్బంది ఎప్పుడూ మోహరించి ఉంటారు. పటిష్ఠ రక్షణ వలయాన్ని వారు ఏర్పాటు చేస్తారు. రష్యా అధ్యక్షుడి భారత పర్యటన నేపథ్యంలో ఆయన భద్రతకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలివీ..

మలం సేకరించి..

పుతిన్ విదేశాల్లో పర్యటిస్తున్నప్పుడు ఆయన మలాన్ని భద్రతా సిబ్బంది ప్రత్యేక సూట్‌కేస్‌లో సేకరిస్తారు. దాన్ని భద్రంగా రష్యాకు తరలిస్తారు. అధ్యక్షుడి ఆరోగ్య పరిస్థితిని విదేశీ నిఘా సంస్థలు విశ్లేషించకుండా నివారించేందుకే ఇలా చేస్తారు. పుతిన్‌తో బాడీగార్డులు అనుక్షణం ఉంటారు. ఆయన బాత్‌రూంకు వెళ్లినాసరే!

35 ఏళ్లకే బాడీగార్డుల రిటైర్మెంట్

పుతిన్‌కు బాడీగార్డులను చాలా జాగ్రత్తగా ఎంపిక చేస్తారు. ఇందుకోసం అనేక పరీక్షలు నిర్వహిస్తారు. వారి ఎత్తు 5.8 నుంచి 6.2 అడుగుల మధ్య, బరువు 75-90 కిలోల మధ్య ఉండాలి. విదేశీ భాషలు మాట్లాడగలగాలి. ఎంపికైనవారికి కఠోర శిక్షణ ఇస్తారు. 35 ఏళ్ల వయసులోనే వారు రిటైర్ అవ్వాల్సి ఉంటుంది. పుతిన్‌కు ఎక్కువ చేరువగా వస్తే.. ఎంతటి ఉన్నత స్థాయి నేతలనైనాసరే వారు అడ్డుకుంటుంటారు.

బాడీ డబుల్స్ వినియోగం

పుతిన్ అప్పుడప్పుడూ.. ముఖ్యంగా బహిరంగ కార్యక్రమాల్లో, ముప్పు ఎక్కువ ఉండే పరిస్థితుల్లో బాడీ డబుల్స్ (అచ్చం తనలాగే ఉండే వేరే వ్యక్తులు)ను వినియోగిస్తుంటారు. ఆయన కనీసం ముగ్గురు బాడీ డబుల్స్‌ను వాడుతున్నారని ఉక్రెయిన్ మిలిటరీ అధిపతి మేజర్ జనరల్ కిరిల్ బుదనోవ్ ఓసారి పేర్కొన్నారు. అచ్చం పుతిన్‌లా కనిపించేందుకు వారికి ప్లాస్టిక్ సర్జరీ చేయించారని అన్నారు.

4 టైర్లూ పంక్చరైనా..



పుతిన్ విదేశీ పర్యటనల్లోనూ రష్యాకు చెందిన ఎన్ఏఎంఐ ఇన్‌స్టిట్యూట్, ఆరస్ మోటార్స్ డిజైన్ చేసిన ఆరస్ సెనాత్ అనే ప్రభుత్వ కారులోనే ప్రయాణిస్తారు. అది బుల్లెట్ ప్రూఫ్ వాహనం. గ్రెనేడ్ దాడులు, అగ్నిప్రమాదాలను తట్టుకోగలదు. అత్యవసర సమయాల్లో ఆక్సిజన్‌ను సరఫరా చేసే సదుపాయం కారులో ఉంటుంది. మొత్తం నాలుగు టైర్లూ పంక్చరైనా వాహనం ప్రయాణించగలదు. గంటకు 249 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు.

వ్యక్తిగత ప్రయోగశాల

పుతిన్ తీసుకునే ఆహారంలో విషపదార్థాలేమైనా కలిశాయో గుర్తించేందుకు విదేశాల్లో ఆయన వెంట వ్యక్తిగత ప్రయోగశాల ఎప్పుడూ ఉంటుంది. విదేశాల్లో హోటల్ స్టాఫ్ సేవలను ఆయన వాడుకోరు. ఆయన కోసం రష్యా నుంచే చెఫ్‌లు, హౌస్‌కీపింగ్ సిబ్బంది వస్తారు. పుతిన్ బస చేసే స్థలాన్ని నెల రోజుల ముందే భద్రతా సిబ్బంది అత్యాధునిక సాధనాలతో తనిఖీ చేస్తారు. ఆయన చెఫ్‌లూ.. సుశిక్షిత సైనిక సిబ్బందే.

విమానంలో జిమ్.. బార్..

పుతిన్ ఇల్యూషిన్ ఐఎల్-96-300 పీయూ విమానంలో ప్రయాణిస్తారు. దాన్ని 'ఫ్లైయింగ్ ఫ్లూటాన్'గా పిలుస్తారు. అందులో జిమ్, బార్, వైద్య కేంద్రం వంటి సదుపాయాలు ఉంటాయి. ఈ విమానం 262 మందిని మోసుకెళ్లగలదు. ఆగకుండా 11 వేల కిలోమీటర్లు దూసుకెళ్లగలదు. అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు పుతిన్ వెంట ఎల్లప్పుడూ బ్యాకప్ జెట్ ఉంటుంది.

- నేషనల్ డెస్క్

19 దేశాల వలసలు, గ్రీన్‌కార్డుల దరఖాస్తుల నిలిపివేత



వాషింగ్టన్: ఇప్పటికే ప్రయాణ నిషేధం, ఆంక్షలు విధించిన 19 దేశాలకు చెందినవారి వలసలు, గ్రీన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియను అమెరికా ప్రభుత్వం నిలిపేసింది. అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం వెబ్‌సైట్‌లో మంగళవారం ఈ పాలసీ మెమోను ప్రచురించింది. శ్వేతసౌధంవద్ద ఇటీవల నేషనల్ గార్డులపై అఫ్గాన్ అమెరికన్ కాల్పులు జరిపిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కాల్పుల ఘటనతో వలస విధానాలను సమూలంగా మార్చాలని గతంలోనే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వలస సేవల దరఖాస్తులను నిలిపేసిన దేశాల్లో అఫ్గానిస్థాన్, మయన్మార్, చాద్, ద రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వెటోరియల్ గినీ, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్, బురుండీ, క్యూబా, లావోస్, సియర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనెజువెలా ఉన్నాయి.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కల్యాణం శివ శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కల్యాణం శివ శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'టెట్'పై కేంద్ర మంత్రికి ఎమ్మెల్సీ గాదె వినతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2010కి ముందు నియమితులైన టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ దిల్లీలో బుధవారం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు వినతిపత్రం సమర్పించారు. విద్యా హక్కు చట్టానికి సవరణ చేయాలని కోరినట్లు ఎమ్మెల్సీ ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో అధికారికంగా సమావేశం ఏర్పాటు చేసి, నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అమరావతిపై దాడి.. రాష్ట్రాభివృద్ధిపై చేసినట్లే పరిగణించాలి

మాజీ మంత్రి దేవినేని ఉమా

ఈనాడు, అమరావతి : ప్రజా రాజధాని అమరావతిపై వైకాపా, దాని అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం రాష్ట్రాభివృద్ధి, యువత భవితపై చేస్తున్న దాడిగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ దాష్టీకాలకు 272 మంది అమరావతి రైతుల గుండెలు ఆగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "రాష్ట్ర భవిష్యత్తు కోసం భూములిచ్చిన రైతులపై కేసులు పెట్టించారు. బూటు కాళ్లతో తన్నించారు. ఇప్పటికీ అమరావతిపై అదే అక్కసు వెళ్లగక్కుతున్నారు" అని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

మూలపేట పోర్టు నిర్మాణ పనులకు గడువు పెంపు

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లా మూలపేట దగ్గర నిర్మాణంలో ఉన్న పోర్టును పూర్తి చేసేందుకు 2026 నవంబరు వరకు గడువు పొడిగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన కాలానికి ఎలాంటి అదనపు ఖర్చును క్లెయిమ్ చేసేందుకు గుత్తేదారు సంస్థకు అవకాశం లేదని పేర్కొంది. రూ.2,949.70 కోట్ల అంచనాలతో పోర్టు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వంతో విశ్వ సముద్ర పోర్ట్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నిర్మాణాన్ని ప్రారంభించినప్పటి నుంచి 30 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఈ ప్రకారం 2025 అక్టోబరు 17తో గడువు ముగిసింది. బ్రేక్ వాటర్స్, డ్రెడ్జింగ్, బెర్తులు, ఆన్‌షోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, భవనాలు, బాహ్య రోడ్లు, రైల్ కనెక్టివిటీ, నీరు, విద్యుత్ సరఫరా వంటి భారీ పనులు నిర్వహించాల్సిన దృష్ట్యా గడువు పొడిగించాలని సంస్థ ప్రభుత్వాన్ని కోరింది.

దృఢ సంకల్పానికి ఏ వైకల్యమూ అడ్డు కాదు: జగన్

ఈనాడు, అమరావతి: ఆత్మ విశ్వాసానికి, దృఢ సంకల్పానికి ఏ వైకల్యమూ అడ్డుకాబోదని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. 'పట్టుదలతో సవాళ్లను అధిగమిస్తూ, ప్రతి రంగంలోనూ నూతన శిఖరాలను అధిరోహిస్తున్న విభిన్న ప్రతిభావంతులందరికీ ప్రపంచ దివ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు' అని బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో వ్యవస్థ ఛిద్రం: సీపీఐ

ఈనాడు, అమరావతి: విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగిస్తే సామాజిక వ్యవస్థ ఛిద్రమవుతుందని, భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. "ప్రధాని మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగాన్ని అప్పనంగా కట్టబెట్టేందుకు పావులు కదుపుతోంది. మరోపక్క కూటమి ప్రభుత్వం కేంద్రానికి తామేమీ తీసిపోమన్నట్లు విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు ఇచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయకుండా.. మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యా రంగం ఎలా అభివృద్ధి చెందుతుందో పాలకులే చెప్పాలి" అని విమర్శించారు.

ఒక సీజన్‌కు ఒక ఎకరాతో ఆరంభించండి

- ప్రకృతి సేద్యంపై రైతులకు ప్రధాని మోదీ పిలుపు
- బహుళ ప్రయోజనాలున్నాయని వెల్లడి



దిల్లీ: భూసారాన్ని దెబ్బతీయడంతో పాటు విపరీతమైన ఖర్చులకు కారణమవుతున్న రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధారపడే వ్యవసాయాన్ని క్రమంగా వీడి ప్రకృతి సేద్యానికి మళ్లాలని రైతులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఒక సీజన్‌కు ఒక ఎకరాతో ప్రకృతి సేద్యాన్ని ప్రారంభించాలని, తద్వారా రాబడి పొందుతూ ఆత్మవిశ్వాసం పెరిగే కొద్దీ దానిని విస్తరించుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి సేద్యం వల్ల దీర్ఘకాలంలో బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. భూమి సారవంతం కావడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు సమకూరుతాయని సామాజిక మాధ్యమం 'లింక్డిన్'లో బుధవారం పెట్టిన పోస్టు ద్వారా వివరించారు. గత నెలలో కోయంబత్తూరులో నిర్వహించిన 'దక్షిణ భారత ప్రకృతి సేద్యం సదస్సు-2025'కు రైతుల ఆహ్వానించగా వెళ్లినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రకృతి సేద్యం ద్వారా సాధిస్తున్న విజయాలు తననెంతో విస్మయపరిచాయని పేర్కొన్నారు. వ్యవసాయదారులతో పాటు శాస్త్రవేత్తలు, విద్యాధికులు, వృత్తి నిపుణులు, కార్పొరేట్ ఉద్యోగాలు వదిలి వచ్చిన వ్యక్తులు కూడా ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారని తన దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా వివిధ రకాల ఆహార ధాన్యాలు పండించడం, అంతర పంటలుగా కూరగాయలు, వివిధ రకాల పండ్ల మొక్కల సాగు, వీటికి అనుబంధంగా పాడి పశువులు, చేపల పెంపకం తదితరాలను చేపట్టి విజయపథంలో కొనసాగుతున్నారని తెలిపారు. సంప్రదాయ పంటల విత్తనాల పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలనూ ప్రధాని మోదీ ప్రశంసించారు. వివిధ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మలచుకుంటున్నారని తెలిపారు. సంప్రదాయ సాగు పద్ధతులకు ఆధునిక శాస్త్రవిజ్ఞానం జత కలుస్తుందని, ప్రభుత్వ మద్దతు కూడా ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం ఇస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

రెడ్ కార్పెట్‌పై చాయ్‌వాలాగా మోదీ!

కాంగ్రెస్ ఏఐ వీడియోతో రాజకీయ దుమారం

ఇంటర్నెట్‌డెస్క్: పార్లమెంటు శీతాకాల సమావేశాల వేళ ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ పెట్టిన ఓ వీడియో రాజకీయ దుమారం రేపుతోంది. ప్రధాని మోదీ చాయ్ వాలా అంటూ కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా సృష్టించిన వీడియోను కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాగిణి నాయక్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్టు చేశారు.

ఇది ఎవరు సృష్టించారంటూ క్యాప్షన్ ఇచ్చారు. వీడియోలో నీలం రంగు కోట్, నలుపు ప్యాంట్ ధరించిన ప్రధాని మోదీ ఓ చేతిలో టీ కెటిల్, మరో చేతిలో టీ కప్పులు పట్టుకుని రెడ్ కార్పెట్‌పై చాయ్ అమ్ముతున్నట్లుగా ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల్ కాగా.. భాజపా తీవ్రంగా స్పందించింది. ప్రధాని వ్యక్తిత్వాన్ని అవమానిస్తున్నారని మండిపడింది. ఆ పార్టీ నాయకుడు షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ...వెనుకబడిన వర్గం నుంచి వచ్చిన ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ సహించలేకపోతుందని విమర్శించారు. ఆయన కుటుంబ నేపథ్యాన్ని కాంగ్రెస్ నేతలు పదేపదే ఎగతాళి చేస్తున్నారని ధ్వజమెత్తారు.

స్వచ్ఛతా రోబో



జపాన్ రాజధాని టోక్యోలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ రోబో ప్రదర్శనలో చీపురుతో శుభ్రం చేస్తూ ఆకట్టుకున్న ఓ మర మనిషి

బంగ్లాదేశ్ నుంచి గర్భిణి, 8 ఏళ్ల కుమార్తెను దేశంలోకి అనుమతించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: కొన్ని నెలల క్రితం కేంద్రం బంగ్లాదేశీయులుగా ప్రకటించి ఆ దేశంలోకి పంపేసిన సునాలీ ఖాతూన్ అనే గర్భిణిని, ఆమె 8 ఏళ్ల కుమార్తెను దేశంలోకి అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వారికి సహకారం అందించడంతో పాటు ఉచితంగా ప్రసవం చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి బుధవారం సూచించింది. సునాలీ తండ్రి నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో ఆశ్రయం పొందడానికి అవకాశం కల్పించింది. దిల్లీలో గత రెండు దశాబ్దాలుగా దినసరి కూలీలుగా పని చేస్తున్న కుటుంబాలను అదుపులోకి తీసుకుని బంగ్లాదేశీయులుగా ముద్ర వేశారని, వెంటనే ఆ దేశంలోకి అక్రమంగా పంపేశారని సునాలీ తండ్రి తరఫు న్యాయవాదులు కపిల్ సిబల్, సంజయ్ హెగ్డేలు కోర్టుకు నివేదించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. తాము వారిని మానవతా కోణంలోనే అనుమతిస్తామని.. ఆ కుటుంబంపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వారు బంగ్లాదేశీయులన్న తమ వాదనలో ఎలాంటి మార్పూ లేదని నివేదించారు. బంగ్లాదేశ్‌లోకి సునాలీ కుటుంబం తరలింపు అక్రమమని పేర్కొంటూ సెప్టెంబరు 26న కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతానికి వీరిని మానవతా దృక్పథం ఆధారంగానే అనుమతిస్తున్నామని.. తదుపరి వాదనలను ఈ నెల 10న వింటామని చెబుతూ సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది.

నవజాత శిశువుకు రక్షణగా వీధి కుక్కలు

కోల్‌కతా: చిన్నారులపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న సమయంలో, అప్పుడే పుట్టిన నవజాత శిశువుకు వీధి కుక్కలు అండగా నిలిచిన సంఘటన పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని రైల్వేవర్కర్స్ కాలనీలో అప్పుడే పుట్టిన పసికందును తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. దుప్పటిలో చుట్టి ఉన్న ఆ పసికందు చుట్టూ వీధి కుక్కలు చేరి.. ఉదయం వరకు రక్షణగా నిలిచాయి. పసికందును వదిలేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీజేఐ ధర్మాసనం ముందు మహిళా న్యాయవాది గడబిడ

- కోర్టు బయటకు తీసుకెళ్లిన మహిళా ఎస్కార్టు సిబ్బంది

దిల్లీ: సుప్రీంకోర్టులో బుధవారం ఓ మహిళా న్యాయవాది ప్రవర్తించిన తీరుతో కొద్ది సమయం పాటు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. విచారణ జాబితాలో లేని ఓ కేసును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కె.సింగ్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం ముందు మౌఖికంగా ప్రస్తావించడానికి ఆమె ప్రయత్నించారు. తొలుత పిటిషన్ దాఖలు చేయాలని, ఆ తర్వాత పద్ధతి ప్రకారం ఆ కేసును ధర్మాసనం ముందుకు తీసుకురావాలని సీజేఐ సూచించినా ఆ మహిళా న్యాయవాది వినలేదు. ఆమెకు సహకరించాలని మరో న్యాయవాదిని కోరారు. అయినప్పటికీ ఆ మహిళా న్యాయవాది కోర్టు నుంచి వెళ్లేందుకు నిరాకరించారు. తాను ముంబయిలో ఉన్న సమయంలో దిల్లీలోని అతిథి గృహంలో తన స్నేహితురాలు హత్యకు గురైందని, ఆ కేసును నమోదు చేసుకోవడానికి నిరాకరించిన పోలీసు అధికారికే ఇప్పుడు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారంటూ ఫిర్యాదు చేయబోయారు. జాబితాలో ఉన్న మరో కేసును ధర్మాసనం విచారణకు చేపట్టినప్పటికీ మహిళా న్యాయవాది వెనక్కి తగ్గలేదు. 'తీవ్ర దుఃఖంలో ఉన్నాను. ఈ కేసును ధర్మాసనానికి వివరించాల్సిందే'నంటూ పట్టుబట్టారు. మహిళా ఎస్కార్టు సిబ్బంది వచ్చి ఆమెను బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా 'తాకవద్దు' అంటూ కసిరారు. కోర్టు మర్యాదకు భంగం కలిగించరాదని, న్యాయవాదిగా నిబంధనలు పాటించాలని జస్టిస్ భుయాన్ హితవుపలికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు మహిళా ఎస్కార్టు సిబ్బంది ఆమెను కోర్టుహాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారాలకు స్వల్ప అంతరాయం కలిగింది.

శ్రీలంకకు భారత్ మరింత సాయం



శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు

- మొబైల్ ఆసుపత్రి, 73 మంది వైద్యుల తరలింపు

కొలంబో: దిత్వా తుపాను ప్రభావంతో అల్లాడుతున్న శ్రీలంకకు భారత్ మరింత సాయాన్ని తరలించింది. ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసరంగా వైద్య సాయాన్ని అందించేందుకు తాత్కాలిక పారా మొబైల్ ఆసుపత్రి, వైద్య సిబ్బందిని కొలంబోకు తరలించినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో చాలా వరకు మౌలిక సదుపాయాలు కూలిపోయి శ్రీలంక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే భారత వైమానిక దళం(ఐఏఎఫ్)కు చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానంలో పారా వైద్య ఆసుపత్రిని, పరికరాలను, 73 మంది వైద్య సిబ్బందిని ఆగ్రా నుంచి కొలంబోకు తరలించినట్లుగా అధికారులు తెలిపారు. మంగళవారం నాటికి వరదల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 465కు చేరుకుంది. మరో 366 మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

నిలకడగా శ్రమిస్తేనే విజయం

- యువ న్యాయవాదులకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హితవు

దిల్లీ: సహనంతో కష్టపడడం ద్వారానే విశ్వసనీయతను, సొంత గుర్తింపును సాధించగలరని యువ న్యాయవాదులకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఏ రంగంలోనైనా వృద్ధి చెందటానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. 'న్యాయవ్యవస్థలో మహిళా సాధికారత: బలం, పోరాటం, విజయం' అనే అంశంపై దిల్లీలో బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సీజేఐ ప్రసంగించారు. 'కుటుంబంలో న్యాయవాద వృత్తిని చేపట్టిన తొలి తరం వారికి ప్రారంభంలో వృత్తిపరంగా అంతా అస్తవ్యస్తంగానే ఉంటుంది. సలహాలు, సూచనలు ఇచ్చే వారుండరు. వ్యవస్థ అంతా కొత్తగా, ఏమీ తెలియనట్లుగా ఉంటుంది' అని తన స్వీయ అనుభవాన్ని వివరించారు. సొంత గుర్తింపు తెచ్చుకోవటానికి కొంత సమయం పడుతుంది. నిబద్ధత, సహనం, శ్రమించే తత్వం యువన్యాయవాదులకు అవసరమని తెలిపారు. జస్టిస్ బి.వి.నాగరత్న మాట్లాడుతూ...న్యాయవాద వృత్తిని చేపట్టినప్పుడు తాను పడిన కష్టాలను వివరించారు. ఈ రంగంలోని మహిళలకు కుటుంబ మద్దతు సంపూర్ణంగా లభిస్తేనే విజయం సాధించగలరని చెప్పారు. సంస్థాగతమైన చేయూత ఉంటేనే వారు ఈ వృత్తిలో నిలదొక్కుకోగలరని వివరించారు. కోర్టు మిత్రులు(అమికస్ క్యూరీ)గా నియమించడం ద్వారా న్యాయస్థానాలు, కేసులు అప్పగించడం ద్వారా సీనియర్ న్యాయవాదులు తోడ్పాటునందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని న్యాయాధికారుల మొత్తం పోస్టుల్లో 30శాతం మహిళలకు కేటాయించాలని జస్టిస్ బి.వి.నాగరత్న అభిప్రాయపడ్డారు.

హిందీ తెలియనందున ఒంటరిగా ఉండాలని దక్షిణ భారతీయులు భావించరు

తమకు హిందీ భాష తెలియనందున ఒంటరిగానే మిగిలిపోవాలని దక్షిణ భారతీయులు కోరుకోరని జస్టిస్ బి.వి.నాగరత్న పేర్కొన్నారు. సువిశాలమైన భారత దేశంలో ప్రతి ఒక్కరూ వారి వారి సొంత భాషలకే పరిమితమై ఉండరాదని ఆమె సూచించారు. సాధ్యమైన వరకూ అన్య భాషలనూ నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇతర భాషల పట్ల సానుకూలతతో ఉండాలని తెలిపారు.



దుస్తులకు మెరుగులద్దుతున్న నది

ఈటీవీ భారత్: దుస్తులపై బాగ్ (బాగిన్) ప్రింట్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరుంది. అయితే ఈ ప్రింట్‌కు అద్దిన రంగులను మరింత మెరుగుపరిచి మెరిసేలా చేస్తోంది.. మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఉన్న బాగిన్ నది. ఈ నది ఉన్న ప్రాంతంలోని బాగిన్ గ్రామంలో పలువురు బాగ్ ప్రింట్‌లద్దిన దుస్తులను తయారు చేస్తుంటారు. రంగులద్దాక వారు ఆ దుస్తులను బాగిన్ నదిలో శుభ్రపరుస్తారు. ఆ నదిలో ఉండే కాల్షియం, జింక్‌లు ఆ దుస్తుల రంగులను మరింత మెరుగుపరిచి మెరిసేలా చేస్తున్నాయి. మరింత మెత్తగానూ మారుస్తున్నాయి. ఇదంతా ప్రకృతి సిద్ధంగా జరిగే ప్రక్రియ. దుస్తుల తయారీ, రంగులద్దడం, ప్రింట్లు వేయడం, ఉతకడం.. ఇలా ప్రతి దశలోనూ బాగిన్ నది నీరు ఉపకరిస్తోంది.


స్వావలంబనే.. జాతీయ భద్రతకు కీలకం: రాష్ట్రపతి

తిరువనంతపురం: స్వావలంబన.. జాతీయ భద్రతను బలోపేతం చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. నేవీ డే సంబరాల్లో భాగంగా కేరళలోని షణ్ముగం బీచ్‌లో జరిగిన నౌకాదళ విన్యాసాల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. భారత నావికాదళ యుద్ధ సామర్థ్యాన్ని కొనియాడారు. "వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతను నౌకాదళం అభివృద్ధి చేస్తుందన్న విశ్వాసం నాకు ఉంది. అదే సమయంలో సమష్టిగా మనందరం మన సముద్రాలను పరిరక్షించడానికి అంకితభావంతో పనిచేయాలి" అని ఆమె ఉద్ఘాటించారు. భారత మహా సముద్ర ప్రాంతం (ఐఓఆర్).. వ్యూహాత్మకంగా అత్యంత కీలక ప్రాంతమని తెలిపారు. 2047కల్లా వికసిత్ భారత్‌గా దేశం అభివృద్ధి చెందాలంటే సముద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి అన్నారు. ఈ విన్యాసాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్ సహా 19 భారీ యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి, 32 యుద్ధవిమానాలు, నిఘా విమానాలు పాల్గొన్నాయి.

రాష్ట్రపతి భవన్‌లో ఆకట్టుకుంటున్న దివ్యాంగుల 'మిట్టీ కేఫ్'

ఈటీవీ భారత్: రాష్ట్రపతి భవన్‌లో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన 'మిట్టీ (మట్టి) కేఫ్' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో పని చేసే క్యాషియర్లు, షెఫ్‌లు, వెయిటర్లు దివ్యాంగులు కావడం విశేషం. వారు చిరునవ్వుతో అందించే సేవలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ కేఫ్‌ను అందరూ సందర్శించి ప్రోత్సహించాలని ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు సూచించారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఈ కేఫ్‌ను ఈటీవీ భారత్ సందర్శించగా ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఈ మిట్టీ కేఫ్‌ల శ్రేణిని 2017లో బెంగళూరుకు చెందిన అలీనా ఆలం.. హుబ్బళ్లిలో ప్రారంభించారు. అందులో కేవలం దివ్యాంగులనే సిబ్బందిగా నియమించారు. అది విజయవంతం కావడంతో దేశమంతా విస్తరించారు. ప్రస్తుతం 40 కేఫ్‌లు సేవలందిస్తున్నాయి. వెయ్యి మంది శారీరక, మానసిక దివ్యాంగులు ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రపతి భవన్ మిట్టీ కేఫ్ 2024 జూన్‌లో ప్రారంభమైంది. 26 మంది దివ్యాంగులు.. క్యాష్ కౌంటర్ నుంచి కిచెన్‌దాకా సేవలు, క్లీనింగ్ వంటి అన్ని పనులూ చూసుకుంటున్నారు.





ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా బుధవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లోని సంవిధాన్ సదన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, కేంద్రమంత్రులు కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్‌వాల్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీ తదితరులు

పీపీపీ విధానంలో రెండేళ్లలోనే వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో రెండేళ్లలోనే ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం పూర్తిచేస్తామని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తెలిపారు. పీపీపీ విధానంలో భవనాలు, రిజర్వేషన్లు పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు అన్యాయం చేసేలా జగన్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెదేపా విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల సవరణకు మార్చి 31 వరకు అవకాశం

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లోని రికార్డులను సవరించే అధికారాన్ని మండల, డిప్యూటీ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2లకు కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ అవకాశం కల్పించింది. అపార్ ఐడీ కోసం విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రికార్డుల్లో మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇంటి పేరు, విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ వివరాలు ఆధార్‌తో సరిపోలకపోవడంతో అపార్ ఐడీ కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు పాఠశాల రికార్డులను సవరించేందుకు ఎంఈఓ, డిప్యూటీ ఈఓ, హెచ్‌ఎంలకు పాఠశాల విద్యాశాఖ అధికారం కల్పించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంఈఓ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, ఎయిడెడ్, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు డిప్యూటీ డీఈఓలకు ఈ అధికారాలు కల్పించారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్‌కు నిపుణుల ఎంపిక

ఈనాడు, అమరావతి: ప్రమాదకర రసాయనాలతో కూడిన కర్మాగారాల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించేందుకు నిపుణుల ఎంప్యానెల్‌మెంట్‌కు అనుమతిస్తూ కార్మికశాఖ కార్యదర్శి శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. థర్డ్ పార్టీ ఆడిట్ల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు, ప్రమాణీకరించేందుకు యంత్రాంగం లేనందున అధికారిక ఎంప్యానెల్‌మెంట్ అవసరం ఉందని డైరెక్టర్ ప్రతిపాదించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదకర రసాయనాలతో కూడిన కర్మాగారాలు 311 ఉన్నాయి.

జూనియర్ లెక్చరర్ల ఉద్యోగ నియామక ఫలితాల విడుదల

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ బుధవారం రాత్రి విడుదల చేసింది. మొత్తం 47 ఖాళీలకుగాను 39 మంది ప్రాథమికంగా ఎంపికయ్యారు. ఈ నెల 16, 17 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. పూర్తి వివరాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

ఏపీ నుంచి 116 కిసాన్ రైళ్ల ద్వారా 34,196 టన్నుల పంట ఉత్పత్తుల రవాణా

ఈనాడు, దిల్లీ: కిసాన్ రైల్ పథకాన్ని 2020 ఆగస్టు 7న ప్రారంభించినప్పటినుంచి ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్ నుంచి 116 సర్వీసుల ద్వారా 34,196 టన్నుల పంట ఉత్పత్తులను రవాణా చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రం నుంచి అస్సాం, బిహార్, పశ్చిమబెంగాల్, దిల్లీ, త్రిపురలకు అరటి, మామిడి, ఖర్జూరంతోపాటు మరికొన్ని పంట ఉత్పత్తులు రవాణా చేసినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు నడిపిన 2,364 కిసాన్ రైళ్ల ద్వారా 7.9 లక్షల టన్నులు రవాణా చేసినట్లు చెప్పారు. ఈ రైలు సేవల ద్వారా రూ.318.68 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

89% సామర్థ్యంతో ఉన్న ఏపీ జైళ్లు: బండి సంజయ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ జైళ్లు ప్రస్తుతం 89.33% సామర్థ్యంతో ఉన్నట్లు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆయన రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ఈ విషయాన్ని వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 జైళ్లలో 8,831 మంది ఖైదీలను ఉంచడానికి వీలుండగా ప్రస్తుతం అక్కడ 7,889 మంది ఉన్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న 1,332 జైళ్లలో 4,39,119 మందికిగాను 5,30,333 (120.77%) మంది ఉన్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్ జైళ్లు 150%, మధ్యప్రదేశ్ జైళ్లు 152%, మహారాష్ట్ర జైళ్లు 155% సామర్థ్యంతో కిక్కిరిసినట్లు చెప్పారు.

మంగళగిరి ఎయిమ్స్ పాలకమండలిలో కొత్త సభ్యుల నియామకం

ఈనాడు, దిల్లీ: మంగళగిరి ఎయిమ్స్ పాలకమండలికి పలువురు కొత్త సభ్యులను నియమిస్తూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా నియమితులైన వారిలో తిరుపతి స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, దిల్లీ ఎయిమ్స్ పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సందీప్ అగర్వాల్, పుదుచ్చేరి జిప్‌మర్ అనస్థీషియాలజీ, క్రిటికల్ కేర్ ప్రొఫెసర్ పంకజ్ కుందర, చండీగఢ్ పీజీఐఎంఈఆర్ నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

'ఉపాధి'లో తిర'కాసు'!

- క్రమంగా తగ్గుతున్న పరిపాలన నిధులు
- వేతనాలు, ఇతర ఖర్చులకు నెలకు రూ.6 కోట్ల అదనపు భారం!
- గుది బండగా మారిన వైకాపా ప్రభుత్వ నియామకాలు

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన నియామకాలతో సిబ్బందికి వేతనాల చెల్లింపు కూటమి ప్రభుత్వానికి గుదిబండగా మారుతోంది. పథకానికి కేంద్రం నుంచి వస్తున్న పరిపాలన నిధులు క్రమంగా తగ్గుతుండటం నేపథ్యంలో సమస్య మరింత సంక్లిష్టమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో నెలకు రూ.6 కోట్లకుపైగా అదనపు భారం తప్పదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో వివిధ కేటగిరీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల మందికిపైగా సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి వేతనాల చెల్లింపులు, ఇతరత్రా నిర్వహణకు నెలకు రూ. 35 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఏడాదికి రూ.420 కోట్లు అవసరమవుతోంది. శ్రామికుల ద్వారా ఏడాదికి 21 కోట్ల పని దినాలు వినియోగించుకుంటే కనీస వేతనం, మెటీరియల్ నిధుల మొత్తంపై 5.5% అడ్మిన్ కాస్ట్ కింద ఏడాదికి రూ. 513 కోట్లు కేంద్రం కేటాయిస్తుంది. వీటిని కూడా సరిగా విడుదల చేయడం లేదు. గత ఏడాది (2024-25) రూ. 295 కోట్లే ఇచ్చారు.

పని దినాల్లో 3.50 కోట్లు కోత

✦ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకంలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రత్యేకించి దొంగ మస్టర్ల కట్టడికి తాజాగా శ్రామికుల ఈకేవైసీ తీసుకోవడంతోపాటు వాటిని ఆధార్‌కు అనుసంధానించారు. వైకాపా ప్రభుత్వంలో దొంగ మస్టర్లు భారీగా చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా రాష్ట్రానికి 2025-26లో పని దినాలు కేంద్రం తక్కువ కేటాయించింది. రెండు విడతల్లో ఇప్పటివరకు 18 కోట్లే ఇచ్చింది. గత ఏడాది కంటే 3.50 కోట్లు తక్కువ. రెండు విడతల్లో గతంలో ఏడాదికి 25 కోట్లకుపైగా కేటాయించిన సందర్భాలున్నాయి. గత రెండేళ్లుగా కేంద్రం పనిదినాలు తగ్గిస్తోంది.

✦ ఈ ఏడాది పరిమితం చేసిన 18 కోట్ల పని దినాలకు వేతనాలు, వాటిపై 2/3% మెటీరియల్ నిధుల మొత్తంపై మెటీరియల్ కాస్ట్ కింద రూ.442 కోట్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది కూడా కేంద్రం పూర్తిగా విడుదల చేస్తుందా? గత ఏడాదిలా తగ్గించి ఇస్తుందా అనేది చూడాలి. రూ.350 కోట్లు వచ్చినా రాష్ట్రానికి భారమవుతుంది. ఆ విధంగా చూసినా సిబ్బంది జీతాలకు, వాహనాల అద్దెలు, డ్వామా కార్యాలయాల నిర్వహణ, విద్యుత్తు ఛార్జీలు, ఇతరత్రా ఖర్చులకు అదనంగా రూ.70 కోట్లు అవసరమవుతోంది.

పరిమితికి మించి నియామకాలు

✦ ఉపాధి పథకంలో క్షేత్ర సహాయకులు (రోజ్‌గార్ సేవక్), సీనియర్ మేట్‌ల నియామకం వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులున్నాయి. రాష్ట్రంలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితి. వీరితోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు, సహాయక ప్రాజెక్టు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు ...ఇలా పలువురిని ఏర్పాటు చేశారు. పని దినాలు ఎక్కువగా వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో వివిధ కేటగిరీల్లో సిబ్బందిని నియమించారు. 5 వేలతో మొదలైన వీరి సంఖ్య క్రమంగా 19 వేలకు చేరుకుంది. వైకాపా ప్రభుత్వంలో పాత వాళ్లను తప్పించేసి వారి స్థానంలో ఆ పార్టీ కార్యకర్తలను నియమించేశారు. అవసరానికి మించి వీరికి చోటు కల్పించారు. ఒక పద్ధతి లేకుండా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులపై పలువురిని అధికారులు నియమించారు. కొన్ని మండల కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురు నుంచి నలుగురు ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

దివ్యాంగుల విజయాలు స్ఫూర్తిదాయకం

- క్రికెటర్ కరుణకుమారి చూపిన ప్రతిభే ఇందుకు నిదర్శనం: సీఎం

ఈనాడు, అమరావతి: ఆత్మవిశ్వాసంతో ఎవరికీ తీసిపోమంటూ దివ్యాంగులు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు కొనియాడారు. అంధుల మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో మన్యం ప్రాంతానికి చెందిన కరుణకుమారి చూపిన ప్రతిభే ఇందుకు నిదర్శనమని అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "దివ్యాంగుల సమస్యలపై అవగాహన పెంపొందించాలి.. వారి గౌరవం, హక్కులు, శ్రేయస్సు కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఏటా దివ్యాంగుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. దివ్యాంగుల పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచి భరోసా కల్పించాం. వారు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు, ఇతరులతో సమానంగా జీవించే హక్కును, భద్రతను, గౌరవాన్ని అందుకునేలా అండగా నిలబడేందుకు ప్రతిజ్ఞ తీసుకుందాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

దివ్యాంగులకు తొలి నుంచి తెదేపా అండగా నిలుస్తోంది: మంత్రి లోకేశ్

దివ్యాంగులకు తొలి నుంచి తెదేపా అండగా నిలుస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

లీజుల్లో ఏటా రెండు సార్లు డ్రోన్ సర్వే

- బల్లికురవలోని గ్రానైట్ లీజులో ప్రయోగాత్మక పరిశీలన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని గనుల లీజు ప్రాంతాల్లో ఏటా కనీసం రెండు సార్లు డ్రోన్ సర్వే నిర్వహించి, ఎంత మేరకు ఖనిజ తవ్వకాలు జరిగాయనే అంచనా వేసే విధానాన్ని గనులశాఖ అమలు చేయనుంది. బెంగళూరుకు చెందిన ఎయిరో సంస్థ డ్రోన్ సర్వే బాగా చేస్తున్నట్లు గుర్తించిన గనులశాఖ అధికారులు.. దాని ద్వారా ప్రయోగాత్మకంగా బాపట్ల జిల్లా బల్లికురవలోని ఓ గ్రానైట్ లీజులో డ్రోన్ సర్వే జరిపించారు. తొలుత జులై 30న డ్రోన్ సర్వే చేయగా, మళ్లీ నవంబరు 7న మరోసారి సర్వే చేశారు. ఇందులో ఆ రెండు తేదీలకు మధ్యకాలంలో ఎంత మేరకు తవ్వకాలు జరిపారనేది స్పష్టంగా బయటపడింది. దీంతో ఆ లీజులో తవ్వకాలు జరిపిన మేరకు సీనరేజి ఫీజు చెల్లిస్తున్నారా? లేదా అనేది లెక్కలు తీసి పరిశీలిస్తున్నారు. ఈ డ్రోన్ సర్వే విధానం విజయవంతమైనట్లు తేలడంతో అన్ని లీజుల్లో దీనిని అమలు చేయాలని భావిస్తున్నారు. దీనిపై గనులశాఖ త్వరలో మార్గదర్శకాలు జారీచేయనుంది.

●డ్రోన్‌సర్వే అనంతరం..కృత్రిమ మేధ ద్వారా ఆయా లీజుల్లో ఎంత మేరకు తవ్వకాలు జరిపారనే అంచనా వేయనున్నారు. దీనిపై కూడా కసరత్తు చేస్తున్నారు.

ఏపీ లోక్‌భవన్‌లో నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల అవతరణ వేడుకలు

ఈనాడు, అమరావతి: నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల అవతరణ వేడుకలను బుధవారం విజయవాడలోని ఏపీ లోక్‌భవన్‌లో నిర్వహించారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొని మాట్లాడారు. 'పచ్చని కొండలు, దట్టమైన అడవులు, అద్భుతమైన లోయలతో నిండిన నాగాలాండ్ పండుగలకు ప్రసిద్ధి. అక్కడ ప్రతి గిరిజన తెగకూ వారి సొంత పండగలు, ఆచారాలున్నాయి' అని తెలిపారు. 'సంవత్సరంలో మూడుసార్లు నిర్వహించుకునే రంగురంగుల బీహు పండగ.., ఆధ్యాత్మిక అనుభవాల అద్భుత భూమి అస్సాం 'అని పేర్కొన్నారు. మొదటగా నాగాలాండ్, అస్సాం గవర్నర్లు అజయ్‌కుమార్ భల్లా, లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యల వీడియో సందేశాలను ప్రదర్శించారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో చదువుకుంటున్న అస్సాం, నాగాలాండ్‌లకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేటెడ్ ఛైర్‌పర్సన్స్

ఈనాడు, అమరావతి: జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ)ల సమావేశాలకు ఆ జిల్లాలోని నామినేటెడ్ ఛైర్‌పర్సన్స్ అందరినీ ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అభివృద్ధి కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండు నెలలకోసారి డీఆర్‌సీ సమావేశాలు విధిగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించింది.

రోనాల్డ్ రాస్ తెలంగాణకు కేటాయింపుపై స్టే

క్యాట్ ఉత్తర్వులను నిలిపివేసిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రాస్‌ను తెలంగాణకు కేటాయించాలంటూ ఏప్రిల్ 9న కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ బుధవారం తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేటాయింపులకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని రోనాల్డ్ రాస్‌ను ఆదేశించింది. ఆయనను తెలంగాణకు కేటాయించాలంటూ క్యాట్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ కేంద్రం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ పి.నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. రోనాల్డ్ రాస్ పరస్పర బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. గడువు ముగిసిన తరువాత దాఖలు చేయడంతోపాటు తనకు బదులుగా ప్రతిపాదించిన అధికారినీ కేంద్రం ఏపీకి కేటాయించిందన్నారు. ఆలిండియా సర్వీసు అధికారుల కేటాయింపులపై పలువురు కోర్టును ఆశ్రయించడంతో వారి వాదనలను విని తాజాగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఖండేల్కర్ కమిటీని నియమించి, దాని సిఫారసుల మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులపై క్యాట్, హైకోర్టులు ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించడంతో వారు ఆయా రాష్ట్రాల్లో విధుల్లో చేరారన్నారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. 2010కి చెందిన జె.నివాస్, హెచ్.భారతిల సీనియారిటీని లెక్కించడంలో జరిగిన పొరపాటు వల్ల 2006 బ్యాచ్‌కు చెందిన రోనాల్డ్ రాస్ పరస్పర బదిలీ అవకాశాన్ని కోల్పోయారన్నారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇస్తూ, కేంద్రం పిటిషన్‌లో పూర్తి వివరాలతో 4 వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని రోనాల్డ్ రాస్‌ను ఆదేశించింది. దీనిపై 2 వారాల్లో రిప్లయ్ కౌంటర్ దాఖలు చేయాలంటూ కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన తితిదే ఛైర్మన్

ఈనాడు, హైదరాబాద్: లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. త్రిపురలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలని తితిదే ఛైర్మన్‌ను గవర్నర్ కోరినట్లు తెలిసింది. తిరుమల దర్శనానికి గవర్నర్ కార్యాలయం నుంచి పంపించే అధికారిక లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు సమాచారం. దీనిపై సానుకూలంగా స్పందించిన తితిదే ఛైర్మన్.. బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించినట్లు తెలిసింది.

✦ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో బుధవారం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో తితిదే ఆధ్వర్యంలో చేపట్టిన పలు దేవాలయాల నిర్మాణాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ దేవాలయాల అభివృద్ధికి తితిదే నుంచి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ తితిదే ఛైర్మన్‌ను కోరారు.



టాంపరింగ్ కాటాలు, చిప్‌లు, మదర్‌బోర్డులను చూపిస్తున్న సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్

ఎలక్ట్రానిక్ కాటాల టాంపరింగ్ సూత్రధారుల అరెస్టు

తల్లాడ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో రైతులను మోసగించేందుకు పత్తి కొనుగోలుకు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను రిమోట్‌తో నియంత్రించేలా ప్రత్యేక చిప్‌లను మదర్‌బోర్డులో అమర్చుతున్న ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా తల్లాడ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. 'హైదరాబాద్ బాచుపల్లికి చెందిన ఒగిలిశెట్టి శంకర్, జంపాల కోటేశ్వరరావులు కాటాలను టాంపరింగ్ చేసి విక్రయిస్తున్నారు. వీరు అహ్మదాబాద్ నుంచి ప్రత్యేక చిప్‌లను తెప్పించుకొని కాటాలోని మదర్‌బోర్డులో అమర్చుతారు. దానికి రిమోట్ అనుసంధానమై ఉండేలా ఏర్పాటు చేసి వ్యాపారులకు విక్రయిస్తారు. అక్రమ వ్యాపారులు పత్తి కొనుగోలు సమయంలో రిమోట్‌ను వినియోగించి తూకం తక్కువగా చూపించి రైతులను మోసగిస్తారు. నిందితుల నుంచి పోలీసులు 5 మదర్‌బోర్డులు, 4 చిప్‌లు, 2 కాటాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశాం. నిందితులను అరెస్టు చేసి మధిర కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు' అని ఏసీపీ తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తల్లాడ ఎస్సై వెంకటకృష్ణను, పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఐ బొమ్మ రవి కస్టడీకి పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: ఐ బొమ్మ రవిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని సైబర్‌క్రైమ్ పోలీసులు బుధవారం హైదరాబాద్ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాలుగు కేసుల్లో ఏడు రోజుల చొప్పున కస్టడీ కోరారు. పరిశీలించిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని రవి తరఫు న్యాయవాదిని ఆదేశించింది.

సహజ ప్రసవాలు పెంచేలా వైద్యులకు శిక్షణ

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సహజ ప్రసవాలు పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే గైనకాలజిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ నెల 10 నుంచి ఆరు నెలలపాటు నిర్దేశిత తేదీల్లో వీటిని నిర్వహిస్తామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెకండరీ, బోధనాసుపత్రుల్లో పనిచేసే 370 మంది గైనకాలజిస్టులకు గుంటూరు, ఒంగోలు, విశాఖ, కాకినాడ, తిరుపతి నగరాల్లో రెండు దశల్లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలు యూనిసెఫ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సాయంతో నిర్వహిస్తామని వెల్లడించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా ఇప్పటికే ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు వీరపాండియన్ వెల్లడించారు. తొలి బ్యాచ్‌లో శిక్షణ పొందిన 60 మంది స్టాఫ్ నర్సులు పనిచేసే ఆసుపత్రుల్లో గతంతో పోలిస్తే సిజేరియన్లు తొమ్మిది శాతం వరకు తగ్గాయని తెలిపారు.

ఇళయరాజా పాటల వ్యవహారంలో 'మైత్రీ' పిటిషన్ కొట్టివేత

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో సంగీత దర్శకుడు ఇళయరాజా పాటలను ఉపయోగించేందుకు విధించిన మధ్యంతర స్టే ఎత్తివేయాలని మైత్రీ మూవీ మేకర్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. అజిత్ కుమార్ నటించిన ఈ సినిమాలో తన అనుమతి లేకుండా 3 పాటలను ఉపయోగించినట్లు ఇళయరాజా తరపున హైకోర్టులో కేసు దాఖలైంది. దీనిపై గతంలో విచారణ జరిపిన హైకోర్టు.. పాటలను ఉపయోగించడంపై మధ్యంతర స్టే విధించింది. ఈ స్టే ఎత్తివేయాలని మైత్రీ మూవీ మేకర్స్ అప్పీల్ చేసింది. ఈ కేసు విచారించిన జస్టిస్ సెంథిల్‌కుమార్.. మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాల్లేవని తెలిపి, పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పాటలను మార్చడాన్ని, అనుమతి లేకుండా ఉపయోగించడాన్ని అడ్డుకునేందుకు ఇళయరాజాకు హక్కు ఉందని తెలిపారు. ప్రధాన కేసుపై విచారణ జనవరి ఆరుకు వాయిదా వేశారు.

వైకాపా నాయకుల మద్దతుతో శ్మశానం ఆక్రమణ

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: స్థానిక వైకాపా నాయకుల మద్దతుతో శ్మశానం స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి, అతడికి సహకరిస్తున్న స్థానిక తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా పరిగి మండలం వన్నంపల్లికి చెందిన రామాంజనేయరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. గత వైకాపా ప్రభుత్వంలో తన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన సుబ్బరాజు కోరారు. తన ఇంటిని ఆక్రమించుకోవాలని చూస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన సత్యసూర్యకుమారి ఫిర్యాదు చేశారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్



మచిలీపట్నం-రేపల్లె డీపీఆర్ తయారీ

- మరో నాలుగు కొత్తలైన్లవి కూడా
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



లోక్‌సభలో మాట్లాడుతున్న అశ్వినీ వైష్ణవ్

ఈనాడు, దిల్లీ: మచిలీపట్నం-రేపల్లె మధ్య 45.30 కిలోమీటర్ల కొత్త లైన్ నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకోసం క్షేత్రస్థాయి సర్వే మొదలుపెట్టినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. "దివిసీమ, అవనిగడ్డ ప్రజల దీర్ఘకాల డిమాండ్ అయిన ఈ లైన్ నిర్మాణం ఎప్పటిలోగా పూర్తిచేస్తారు. 2026-27 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును పెడుతున్నారా? లేదా?" అని బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా రైల్వే మంత్రి పై విషయాన్ని వెల్లడించారు. "రేపల్లె- మచిలీపట్నం రైల్వేలైన్ చాలా ముఖ్యమైంది. ఈ ప్రాజెక్టుకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుతం డీపీఆర్ తయారవుతోంది. దీనికితోడు మచిలీపట్నం-నర్సాపురం మధ్య 74 కిలోమీటర్లు, రేపల్లె-బాపట్ల మధ్య 46 కిలోమీటర్ల కొత్తలైన్లు, గూడూరు-విజయవాడ మధ్య 293 కిలోమీటర్ల నాలుగో లైన్, 49 కిలోమీటర్ల పొడవైన విజయవాడ బైపాస్ లైన్(ఇందుపల్లి-దుగ్గిరాల)లకు డీపీఆర్‌ల తయారీకి అవసరమైన సర్వే చేపట్టడానికి అనుమతులు మంజూరు చేశాం. విజయవాడ-తెనాలి మధ్య మూడో లైన్ నిర్మాణం జరుగుతోంది. గుడివాడ-దుగ్గిరాల మధ్య లైన్ నిర్మాణంపై ప్రస్తుతం సర్వే జరుగుతోంది. గుడివాడ-భీమవరం-నర్సాపురం డబ్లింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైల్వే బడ్జెట్ రూ.886 కోట్లు ఉంటే ఇప్పుడు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే రూ.9,417 కోట్ల బడ్జెట్ ఇచ్చాం. 2009-14 మధ్య కాలంలో 363 కిలోమీటర్ల ట్రాకులు కొత్తగా అందుబాటులోకి వస్తే 2014-25 మధ్యకాలంలో 1,582 కిలోమీటర్ల ట్రాక్‌లు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 నాటి లెక్కల ప్రకారం రాష్ట్రంలో 12 కొత్తలైన్లు, 27 డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. 4,498 కిలోమీటర్ల పొడవైన ఈ పనులకోసం ప్రభుత్వం రూ. 70,231 కోట్లు ఖర్చుపెడుతోంది. గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ పరిధిలో (పూర్తిగా, పాక్షికంగా) 15 కొత్తలైన్లు, 49 డబ్లింగ్ పనుల కోసం 64 సర్వేలు చేపట్టాం. వీటి మొత్తం పొడవు 6,967 కిలోమీటర్లు" అని వివరించారు.

కేంద్ర మంత్రి చెప్పిన ప్రకారం రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు

క్రమ సంఖ్య	ప్రాజెక్టు పేరు	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
1.	కోటిపల్లి-నర్సాపురం కొత్త లైన్ (57 కిమీ)	2,120
2.	నడికుడి-శ్రీకాళహస్తి కొత్త లైన్ (309 కిమీ)	3,122
3.	రాయదుర్గం-కల్యాణదుర్గం-తుమకూరు కొత్త లైన్ (207 కిమీ)	2,496
4.	మారికుప్పం-కుప్పం కొత్త లైన్ (24 కిమీ)	297
5.	ములుగూరు-పాలసముద్రం కొత్త లైన్ (18 కిమీ)	342
6.	మల్కనగిరి-భద్రాచలం-పాండురంగాపురం కొత్త లైన్ (174 కిమీ)	3,592
7.	ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు కొత్త లైన్ (57 కిమీ)	2,047
8.	కొత్తవలస-కోరాపుట్ డబ్లింగ్ (189 కిమీ)	2,500
9.	విజయవాడ-గూడూరు 3వ లైన్ (287 కిమీ)	6,509
10.	గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ (401 కిమీ)	4,306
11.	పెనుకొండ-ధర్మవరం డబ్లింగ్ (42 కిమీ)	308
12.	గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ (29 కిమీ)	352
13.	దువ్వాడ-సింహాచలం నార్త్ 3, 4వ లైన్ (21కిమీ)	356
14.	కొత్తవలస-విజయనగరం 4వ లైన్ (35 కిమీ)	493
15.	గూడూరు-రేణిగుంట 3వ లైన్ (83 కిమీ)	877
16.	నెర్గుండి-పలాస-విజయనగరం 3వ లైన్ (385 కిమీ)	4,963

పల్నాడు ఎంపీ ప్రశ్న... గుంటూరు మంత్రి సమాధానం

లోక్‌సభలో ఆసక్తికర దృశ్యం




పెమ్మసాని చంద్రశేఖర్



లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: లోక్‌సభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. తెదేపా తరపున పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నిస్తే... గుంటూరు లోక్‌సభ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇవ్వడమే ఇందుకు కారణం. తొలుత లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తన లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని గిరిజన గ్రామాలకు 4జీ నెట్‌వర్క్ ఎప్పుడు అనుసంధానం చేస్తారని ప్రశ్నించారు. "నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పల్నాడు జిల్లాల్లో గిరిజనులు చాలా మంది ఉన్నారు. బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో ఎస్టీ జనాభాతోపాటు, పీవీటీజీ ఆవాసప్రాంతాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో 4జీ నెట్‌వర్క్ ఏర్పాటుకోసం భూమి కేటాయించినా ఇంతవరకూ ఆ సౌకర్యం అందుబాటులోకి తేలేదు. ఈ పీవీటీజీ ప్రాంతాలకు 4జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవడానికి నిర్దిష్టగడువు ఏమైనా ఉందా?" అని అడిగారు. అందుకు పెమ్మసాని చంద్రశేఖర్ బదులిస్తూ.. "నెట్‌వర్క్‌లేని ప్రాంతాల్లో 27వేల 4జీ నెట్‌వర్క్ టవర్లు ఏర్పాటుచేయాలని మేం నిర్ణయించాం. ఈ ప్రాంతాలు మారుమూల ఉండడంతోపాటు, పర్యావరణ, అటవీ అనుమతుల సమస్యలుకూడా ఉన్నాయి. అందువల్ల ఇలాంటి ప్రాంతాల్లో ఉన్న వాస్తవ సమస్య గురించి తెలుసుకోవడానికి నేను ప్రతి ఎంపీకి లేఖలు రాశాను. దీని ద్వారా స్థానిక ఎంపీ, బీఎస్ఎన్ఎల్ కలిసి పనిచేసి నెట్‌వర్క్ ఏర్పాటును వేగవంతం చేయడానికి వీలవుతుంది. ఏ గ్రామంలో ఏ సమస్య ఉందో కచ్చితంగా చెప్పడం కష్టం. అయినప్పటికీ మేం వాటన్నింటినీ పరిష్కరించి వేగంగా నెట్‌వర్క్ ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తాం. పల్నాడు నా సొంత ప్రాంతం. ఆ ప్రాంతం కోసం పనిచేయడం నాకెంతో సంతోషం" అని వెల్లడించారు.

తెలుగు రాజ్యాంగ ప్రతిని శ్రీకృష్ణదేవరాయలుకు అందించిన ఓంబిర్లా



ఓం బిర్లా నుంచి రాజ్యాంగం తెలుగు ప్రతిని అందుకుంటున్న శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: తెలుగులో ముద్రించిన రాజ్యాంగ ప్రతిని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా బుధవారం తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలుకు అందజేశారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఉన్న భారతీయ భాషల్లో రాజ్యాంగ ప్రతులను ముద్రించిన నేపథ్యంలో అందులో తెలుగు ప్రతిని తెలుగుదేశం పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటరీపార్టీ నాయకుడికి అందజేశారు. దీనిపై ఎంపీ లావు సంతోషం వ్యక్తంచేశారు. లోక్‌సభ స్పీకర్ నుంచి ఈప్రతిని అందుకోవడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇది కేవలం సాధారణ క్షణమేకాదు. తెలుగువారి ఆత్మగౌరవం, సాధికారతకోసం అలుపెరుగని కృషిచేసిన తెదేపా వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు ఆదర్శాలను ఇది ప్రతిధ్వనిస్తుంది" అని పేర్కొన్నారు.

3వ పీఆర్‌సీ అమలు చేయాలి: తెదేపా ఎంపీ బస్తిపాటి

ఈనాడు, దిల్లీ: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 3వ పీఆర్‌సీ అమలు చేయాలని కర్నూలు తెదేపా ఎంపీ బస్తిపాటి నాగరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే విధంగా పింఛను అమలు చేయాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఆర్థికంగా, ఉద్యోగ భద్రతపరంగా న్యాయం చేయడం అన్నది విధానపర విషయమే కాకుండా దేశసేవను గౌరవించడం కిందికి వస్తుందన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.